www.andhrajyothy.com
# ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



మంచిరేవులలో చిక్కిన చిరుత

ట్రెక్ పార్కు నుంచి జూపార్కుకు తరలింపు 10

శుక్రవారం | 1-8-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 124 | వరంగల్


Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం; తిథి: అష్టమి పూర్తి; నక్షత్రం: స్వాతి తె3.40 తదుపరి విశాఖ; వర్జ్యం: ఉ.6.59-8.47; దుర్ముహూర్తం: ఉ.8.31-9.22, మ.12.47-1.38; అమృతఘడియలు: సా.5.46-7.34; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 5.58; సూర్యాస్తమయం: 6.44

# 3 నెలల్లోగా తేల్చండి

## 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపుపై నిర్ణయం తీసుకోండి

- ఫిరాయింపులతో ప్రజాస్వామ్యానికి నష్టం
- స్పీకర్ వ్యవస్థ సమర్థంగా అడ్డుకుంటోందా?
- ఈ విషయాన్ని పార్లమెంటు సమీక్షించాలి
- న్యాయసమీక్షకు లోబడే స్పీకర్ నిర్ణయాధికారం
- అనర్హత పిటిషన్లు సమర్పించి ఏడు నెలలైనా.. స్పీకర్ నోటీసులివ్వకపోవటం ఏమిటి?
- హైకోర్టు సింగిల్ జడ్జి తీర్పులో జోక్యం డివిజన్ బెంచ్ తప్పిదం: సుప్రీంకోర్టు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసులో వెలువడిన తీర్పు
- హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పు కొట్టివేత
- సుప్రీంకోర్టే నిర్ణయం తీసుకోవాలన్న బీఆర్ఎస్ అభ్యర్థనను తోసిపుచ్చిన బెంచ్
- ఎమ్మెల్యేల అనర్హతపై నిర్ణయం తీసుకునే అధికారం స్పీకర్‌దేనని వెల్లడి

జస్టిస్ బీఆర్ గవాయ్

### న్యాయ సలహా తీసుకుంటాం!

10 మంది ఎమ్మెల్యేలకు ఇప్పటికే నోటీసులిచ్చాం

సమాధానం ఇవ్వడానికి కొంత సమయం కోరారు

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

న్యూఢిల్లీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పార్టీ ఫిరాయించిన 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై సాధ్యమైనంత త్వరగా లేదా మూడు నెలల్లోపు స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అనర్హత పిటిషన్‌లో పేర్కొన్న ఎమ్మెల్యేలు ఎవరూ విచారణను ఆలస్యం చేయడానికి అనుమతించకూడదని, ఎవరైనా ఆ దిశగా ప్రయత్నిస్తే తీవ్రంగా పరిగణించాలని స్పీకర్‌కు సూచించింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం గురువారం తీర్పును వెలువరించింది. రాజకీయ ఫిరాయింపులు అనేవి జాతీయస్థాయిలో చర్చనీయాంశం అవుతున్నాయని, వాటిని నిలువరించకపోతే ప్రజాస్వామ్యానికే అవి నష్టం తేగలవని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలని తాము స్పీకర్‌కు ఆదేశాలు జారీ చేయలేకపోతే, రాజ్యాంగంలోని పదో షెడ్యూల్

మిగతా 13వ పేజీలో...

### ఉప ఎన్నికలొస్తాయి సిద్ధం కండి

- పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపు.. సుప్రీం తీర్పుపై హర్షం
- కాంగ్రెస్ రాజకీయానికి తీర్పు చెంపపెట్టని వ్యాఖ్య
- ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరతారా రాహుల్?: హరీశ్‌రావు

13

### బీఆర్ఎస్‌కు చెంపపెట్టు

- నిర్ణయాధికారం స్పీకర్‌దేనని సుప్రీం చెప్పింది
- కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి
- ఫిరాయింపులపై మాట్లాడే అర్హత హరీశ్‌రావు, కేటీఆర్‌కు లేదు: ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

### సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

13



కాళేశ్వరంపై విచారణ నివేదికను రాహుల్ బొజ్జాకు అందిస్తున్న జస్టిస్ పీసీ ఘోష్

> విచారణలో నా పాత్ర ముగిసింది. ప్రభుత్వం నిర్దేశించిన విధివిధానాలకు లోబడి నివేదికను సిద్ధం చేశాం. విచారణతో ముడిపడిన అంశాల కోసం మళ్లీ హైదరాబాద్‌కు రాలేను. నివేదిక ప్రకారం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందా? లేదా? అనేది నాకు తెలియదు.
>
> - విలేకరులతో ఇష్టాగోష్ఠిలో జస్టిస్ పినాకి చంద్రఘోష్

# వేళ్లన్నీ కేసీఆర్‌వైపే!


## వ్యవస్థలను నిర్వీర్యం చేయడం వల్లే 'మేడిగడ్డ' కుంగింది

- ఎలాంటి పరీక్షల్లేకుండానే నిర్మాణ స్థలాల ఎంపిక.. బ్యారేజీల్లో నీటి నిల్వ నిర్ణయమూ కేసీఆర్‌దే
- ప్రభుత్వానికి జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక!.. 650కి పైగా పేజీలతో రూపొందించిన కమిషన్
- నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శికి 2 కాపీలు అందజేత.. నేడు సీఎంకు అందజేయనున్న మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుకు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌నే కాళేశ్వరం కమిషన్ నివేదిక తప్పుబట్టిందా!? అప్పట్లో ప్రభుత్వాధినేతగా వ్యవస్థలన్నిటినీ గుప్పిట్లో పెట్టుకుని.. ఏ విభాగాన్నీ సమర్థంగా పని చేయనివ్వకుండా నిర్వీర్యం చేయడం వల్లే మేడిగడ్డ బ్యారేజీ కుంగిందని తేల్చిందా!? అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు విఫలం కావడానికీ ఇదే కారణమని అభిప్రాయ పడిందా!? ఈ ప్రశ్నలకు 'ఔను' అనే అంటున్నాయి అత్యంత విశ్వసనీయ వర్గాలు. అప్పట్లో ప్రభుత్వంలో కీలక స్థానాల్లో ఉన్న నాయకులు కూడా ఈ వైఫల్యాలకు కారకులుగా కమిషన్ నిర్ధారించినట్లు వివరించాయి. కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై విచారణ జరిపిన జస్టిస్ పినాకీ చంద్ర ఘోష్ కమిషన్ గురువారం ప్రభుత్వానికి తన నివేదికను అందజేసింది. బూర్గుల రామకృష్ణారావు భవన్‌లోని కమిషన్ కార్యాలయంలో నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జాకు జస్టిస్ ఘోష్ నివేదికను అందజేశారు. నివేదిక 650 పేజీలకు పైగా ఉంది. రెండు కాపీలను సీల్డ్ కవర్లలో అప్పగించారు. బ్యారేజీలు కట్టడానికి ముందు భూమి ఏ విధంగా ఉంది? బ్యారేజీల నిర్మాణానికి అనుకూలమా? కాదా? అనే అంశాలపై భూభౌతిక, సాంకేతిక పరీక్షలు చేయాల్సి ఉండగా.. అలాంటివేమీ చేయకుండానే బ్యారేజీల స్థలాలను ఎంపిక చేశారని కమిషన్ తప్పుపట్టినట్లు తెలిసింది. మేడిగడ్డపై నిర్ణయం తీసుకున్నాక అక్కడ బ్యారేజీ కట్టడానికి

మిగతా 10వ పేజీలో...

# భారత్, రష్యా.. మృత ఆర్థిక వ్యవస్థలు



- ఇరు దేశాలూ కలిసి మరింత దిగజార్చుకుంటాయి
- అమెరికాకు భారత్ మిత్రదేశమే.. కానీ.. వాణిజ్య విధానాలు సమస్యగా మారాయి
- మరోసారి నోరుపారేసుకున్న ట్రంప్
- ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థ భారత్‌దే: పీయూష్ గోయల్
- ట్రంప్ చెప్పింది వాస్తవమే.. ఆర్థిక వ్యవస్థను ప్రధాని మోదీ 'చంపేశారు': రాహుల్‌గాంధీ
- ట్రంప్ 'డెడ్ హ్యాండ్'ను గుర్తుచేసుకోవాలి.. రష్యా మాజీ అధ్యక్షుడు మెద్వెదేవ్ పరోక్ష హెచ్చరిక

వాషింగ్టన్, జూలై 31: భారత్, రష్యాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి నోరుపారేసుకున్నారు. ఇరుదేశాల మధ్య వాణిజ్యాన్ని తప్పుపడుతూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. భారత్, రష్యాలవి చేవచచ్చిన ఆర్థిక వ్యవస్థ (డెడ్ ఎకానమీ)లుగా అభివర్ణించారు. ఇరుదేశాలూ కలిసి ఆర్థిక వ్యవస్థలను మరింత దిగజార్చుకుంటాయని వ్యాఖ్యానించారు. రష్యాతో భారీగా వాణిజ్య సంబంధాల నేపథ్యంలో భారత్‌పై 25శాతం సుంకాలతోపాటు జరిమానాలు విధిస్తున్నట్టుగా ప్రకటించిన ట్రంప్.. కొన్ని గంటల్లోనే ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం గమనార్హం. దీనికి సంబంధించి ఆయన గురువారం తన సొంత సోషల్ మీడియా 'ట్రుత్'లో పోస్టు పెట్టారు. "రష్యాతో భారత్ ఎలాంటి సంబంధాలు కొనసాగిస్తున్నదో నాకు అనవసరం. ఆ దేశాలు వాళ్ల మృత ఆర్థిక వ్యవస్థలను మరింతగా దిగజార్చుకోవచ్చు. భారత్‌తో మేం చాలా తక్కువ వాణిజ్యం చేస్తున్నాం. ప్రపంచంలోనే అతిఎక్కువగా భారత్ టారిఫ్‌లు ఉన్నాయి. రష్యాతో యూఎస్‌ఏ దాదాపుగా ఎలాంటి వాణిజ్యం చేయడం లేదు. దాన్ని అలాగే

మిగతా 2వ పేజీలో...

### పాక్‌తో అమెరికా చమురు ఒప్పందం

- చమురు నిల్వలపై కలిసి పనిచేస్తాం
- వాణిజ్య ఒప్పందాన్ని ప్రకటించిన ట్రంప్
- భవిష్యత్తులో భారత్‌కు.. పాక్ చమురు విక్రయించవచ్చని జోస్యం
- ఇది చరిత్రాత్మక ఒప్పందం అంటూ పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ పోస్టులు
- అమెరికా ఊహ ఆసక్తిని కలిగిస్తోంది
- వ్యంగ్యాస్త్రాలు సంధించిన శశిథరూర్

2

### మాలేగావ్ పేలుళ్ల కేసు.. ఏడుగురు నిందితులూ నిర్దోషులే

- వారికి వ్యతిరేకంగా నమ్మదగ్గ సాక్ష్యాల్లేవు
- పేలుళ్లకు వాడిన బైక్ ప్రజ్ఞాదేనని నిరూపించలేకపోయారు
- ఈ కేసులో.. 'ఉపా' వర్తించదు
- ముంబై ప్రత్యేక కోర్టు జడ్జి ఏకే లహోటీ
- ఈ విజయం మా ఒక్కరిదే కాదు.. కాషాయ విజయం కూడా: ప్రజ్ఞా సింగ్
- 'కాషాయ ఉగ్రవాదం' అన్న కాంగ్రెస్ నేతలు ఇప్పుడు క్షమాపణ చెప్పాలి: బీజేపీ
- ముంబై రైలు పేలుళ్ల నిందితుల విడుదలపై స్టే కోరిన కేంద్రం ఈ కేసులో ఏం చేస్తుంది?: అసదుద్దీన్

2

## కేంద్రం మెడలు వంచైనా '42 శాతం' సాధిస్తాం



కాంగ్రెస్ జనహిత పాదయాత్రలో మహేశ్‌గౌడ్, మీనాక్షి, మధుయాష్కీ, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

- కామారెడ్డి డిక్లరేషన్ మేరకు బీసీ రిజర్వేషన్ల హామీని నిలబెట్టుకుంటాం
- దేశానికి దశ, దిశ రాహులే: మహేశ్‌గౌడ్
- స్థానిక ఎన్నికల్లో పార్టీ ఆమోదించిన అభ్యర్థులకు మద్దతివ్వండి: మీనాక్షి
- బీసీ రిజర్వేషన్ల పోరాటానికి బీజేపీ, బీఆర్ఎస్ కలిసి రావాలి: శ్రీధర్‌బాబు
- పరిగిలో జనహిత పాదయాత్ర ప్రారంభం

వికారాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/పరిగి: కేంద్రం మెడలు వంచైనా బీసీలకు 42% రిజర్వేషన్లు సాధిస్తామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో పార్టీ ప్రకటించిన మేరకు బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించడం ద్వారా ఇచ్చిన హామీని నెరవేర్చి తీరుతామని స్పష్టం చేశారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన 'కాంగ్రెస్ జనహిత పాదయాత్ర' కార్యక్రమానికి

మిగతా 12వ పేజీలో...



భీమదేవరపల్లిలో ఇందిరమ్మ పథకం కింద నిర్మాణమైన ఇల్లు

## పదిలంగా అల్లుకున్న 'ఇందిరమ్మ ఇల్లు' చూడే!

- హనుమకొండ భీమదేవరపల్లిలో గృహప్రవేశం చేసిన దంపతులు
- 440 చదరపు అడుగుల్లో నిర్మాణం
- 'ఇందిరమ్మ'లో పూర్తయిన రెండో ఇల్లు
- సిరిసిల్ల జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ ఫొటోతో ఇంటిగడప కార్యక్రమం

14



శృతి-జలంధర్‌రెడ్డి

### సముద్రంలో కలిసే వృథాజలాలు వాడుకుంటే

## తప్పేంటి?

- తెలంగాణకు వచ్చే నష్టం ఏముంది?
- బనకచర్ల ప్రాజెక్టులో తప్పు ఎక్కడుంది?
- మేం తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోలేదు
- ప్రాంతీయ విద్వేషాలు రేపేందుకు కుట్ర
- బనకచర్ల ప్రాజెక్టుపై ఏపీ మంత్రి లోకేశ్
- లిక్కర్ కుంభకోణంలో దొరికిన డబ్బుల లెక్క జగన్‌కు బాగా తెలుసని వ్యాఖ్య



అమరావతి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సముద్రంలోకి వృధాగా వెళ్లే వరద జలాలనే తాము బనకచర్ల కోసం వాడుతామని, అందులో తప్పేముందని ఏపీ మంత్రి నారా లోకేశ్ ప్రశ్నించారు. తెలంగాణను దాటేసి దిగువన సముద్రంలో కలిసిపోయే గోదావరి జలాలను వాడుకుంటే ఆ రాష్ట్రానికి వచ్చే నష్టమేమిటని సందేహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన ఉండవల్లిలో మీడియాతో మాట్లాడారు. తెలంగాణ కాళేశ్వరం ప్రాజెక్టు కట్టినప్పుడు ఏపీ అభ్యంతరం వ్యక్తం చేయలేదని, ఎప్పుడూ తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోలేదని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు

మిగతా 3వ పేజీలో...



### నైరుతి ద్వితీయార్థంలో మంచి వర్షాలు

- ఆగస్టులో సాధారణ వర్షపాతం: ఐఎండీ
- సీజన్ తొలి 2నెలల్లో దేశంలో 6.5% ఎక్కువ

**రేపు కిసాన్ సమ్మాన్ నిధుల జమ** 2

20వ విడత కింద 20,500 కోట్లు విడుదల

### ప్రమాణ స్వీకారం చేసిన హైకోర్టు అదనపు జడ్జిలు 14



అదనపు న్యాయమూర్తులు రామకృష్ణారెడ్డి, చలపతిరావు, మొహియుద్దీన్, ప్రవీణ్‌కుమార్‌లతో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏకే సింగ్



### ఊపిరి తీస్తున్న పొగాకు

- ధూమపానంతో పెరుగుతున్న ఊపిరితిత్తుల క్యాన్సర్లు
- 90% లంగ్ క్యాన్సర్ కేసులకు అదే కారణం
- ఎంఎన్‌జేలో గత ఏడాది వెయ్యి మందికి చికిత్స
- బాధితుల్లో 80% పురుషులు.. 20% మంది స్త్రీలు
- ప్యాసివ్ స్మోకింగ్‌తోనూ మహమ్మారి బారిన..
- నేడు అంతర్జాతీయ ఊపిరితిత్తుల క్యాన్సర్ దినం

14



### సరికొత్త బ్లడ్ గ్రూప్ 'క్రిబ్'

- ప్రపంచంలోనే మొట్టమొదటి సారిగా కర్ణాటక మహిళలో గుర్తింపు
- అత్యంత అరుదైన గ్రూపు
- 10 నెలల పరిశోధన అనంతరం ప్రకటన

2





జగన్మోహన్ రావు

### హెచ్‌సీఏ అధ్యక్షుడిపై సస్పెన్షన్ వేటు

- కార్యదర్శి, కోశాధికారిపైన కూడా..
- అపెక్స్ కౌన్సిల్ భేటీలో నిర్ణయం

13

# పీఎంకేఎస్‌వైకు మరో రూ.4600 కోట్లు!

## దేశవ్యాప్తంగా 50 ఆహార వికిరణ కేంద్రాలు, 100 ఆహార తనిఖీ ల్యాబ్‌ల ఏర్పాటుకు వినియోగం

- జాతీయ సహకార అభివృద్ధి సంస్థకు రూ.2 వేల కోట్లు
- కేంద్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయాలు

న్యూఢిల్లీ, జూలై 31: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రధాన మంత్రి కిసాన్ సంపద యోజన (పీఎంకేఎస్‌వై)కు బడ్జెట్ కేటాయింపులు పెంచింది. ఆహారశుద్ధి రంగం కోసం ప్రవేశపెట్టిన ఈ పథకానికి రూ.1920 కోట్లు కేటాయించగా.. ప్రస్తుతం దాన్ని రూ.6520 కోట్లకు పెంచింది. పెంచిన రూ.4600 కోట్లను ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే మంజూరు చేయాలని గురువారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది. పీఎంకేఎస్‌వైకు పెంచిన నిధులను 50 బహుళ ఉత్పత్తుల ఆహార వికిరణ కేంద్రాలు, 100 ఆహార పదార్థాలను పరీక్షించే ల్యాబ్‌ల ఏర్పాటుకు వినియోగించనున్నట్లు క్యాబినెట్ సమావేశం అనంతరం కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ విలేకరులకు తెలిపారు. 50 ఆహార వికిరణ కేంద్రాల ఏర్పాటు ద్వారా దేశంలో ఏటా వివిధ రకాల ఆహార ఉత్పత్తుల నిల్వ/సంరక్షణ సామర్థ్యం 20-30 లక్షల టన్నుల మేర పెరగనుందన్నారు. దేశవ్యాప్తంగా ప్రైవేటు రంగంలో ఎన్ఏబీఎల్ గుర్తింపుతో 100 ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేసే ల్యాబ్‌లను ఏర్పాటు చేయడం ద్వారా అత్యాధునిక పరికరాలతో ఆహార నమూనాలను పరీక్షించవచ్చని తెలిపారు. జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ)కు రూ.2 వేల కోట్ల ఆర్థిక సాయం చేసేందుకు కూడా క్యాబినెట్ ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు.

### రేపు పీఎం కిసాన్ నిధుల జమ

న్యూఢిల్లీ, జూలై 31: ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద శనివారం (ఆగస్టు 2న) రైతుల ఖాతాల్లో సొమ్ము జమ కానుంది. కేంద్రం అమలు చేస్తున్న ఈ పథకం కోసం 20వ విడత నిధుల కింద రూ.20,500 కోట్లు విడుదలయ్యాయి. దీని ద్వారా 9.7 కోట్ల మంది రైతులకు లబ్ధి కలగనుంది. ఆ రోజున వారాణసిలో జరిగే కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ నగదును రైతుల ఖాతాలకు బదిలీ చేయనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ బుధవారం ఉన్నత స్థాయి సమీక్ష జరిపారు. రైతుల ఖాతాకు ఏటా రూ.6,000 చొప్పున మూడు వాయిదాల్లో జమ అవుతుందని ఆయన తెలిపారు.

### లోకం తీరు

భారీ చమురు నిల్వల వెలికితీత కోసం పాక్‌తో ట్రంప్ ఒప్పందం




## పాక్‌తో అమెరికా చమురు ఒప్పందం

- చమురు నిల్వలపై కలిసి పనిచేస్తాం
- వాణిజ్య ఒప్పందాన్ని ప్రకటించిన డొనాల్డ్ ట్రంప్

న్యూయార్క్/ఇస్లామాబాద్, జూలై 31: పాకిస్థాన్‌తో చమురు నిల్వలపై వాణిజ్య ఒప్పందం కుదిరిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. చమురు నిల్వల పెంపునకు ఇరు దేశాలు కలిసి పనిచేస్తాయని, భవిష్యత్‌లో భారత్‌కు పాకిస్థాన్ చమురు విక్రయించవచ్చని జోస్యం చెప్పారు. భారత్‌పై 25% సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించిన కొన్ని గంటల్లోనే ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం..! పాక్‌తో వాణిజ్య ఒప్పందం గురించి ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్‌లో పోస్టులు పెట్టారు. పాకిస్థాన్‌తో ముడి చమురు నిల్వల వెలికితీతకు ఒక మంచి ఆయిల్ కంపెనీని ఎంచుకునే ప్రక్రియలో ఉన్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో భారత్‌కు కూడా చమురు విక్రయించేంతగా అపారమైన నిల్వలు పాక్ వద్ద ఉంటాయని వ్యాఖ్యానించారు. మరోవైపు పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కూడా ఈ ఒప్పందంపై సోషల్ మీడియాలో స్పందించారు. ఈ సందర్భంగా అమెరికా అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లో ఇరు దేశాల భాగస్వామ్యం మరింత బలంగా కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. రేడియో పాకిస్థాన్ కూడా ఈ ఒప్పందంపై ప్రముఖంగా కథనాలను ప్రసారం చేసింది. ఈ ఒప్పందం కోసం వాషింగ్టన్‌లో జరిగిన సమావేశంలో పాక్ ఆర్థిక మంత్రి ఔరంగజేబు, అమెరికా వాణిజ్య కార్యదర్శి హోవర్డ్ లూట్నిక్, వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రియర్ పాల్గొన్నట్లు తెలిపింది. కాగా, పాక్‌తో అమెరికా కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందంలో తమ ప్రాంతంలోని చమురు క్షేత్రాల అన్వేషణ అంశాన్ని చేర్చడం పట్ల బలూచీ జాతీయవాదులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను పాక్ ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్ తప్పుదోవ పట్టించినట్లు కనిపిస్తోందని బలూచ్ జాతీయవాద నాయకుడు మీర్ యార్ బలూచ్ 'ఎక్స్'లో వ్యాఖ్యానించారు. చమురు నిల్వలు పాక్‌లోని పంజాబ్‌లో లేవని, పాక్ ఆక్రమిత బలూచ్ భూభాగంలో ఉన్నాయని ఆయన తెలిపారు.

### శశిథరూర్ వ్యంగ్యాస్త్రాలు

పాకిస్థాన్‌తో చమురు ఒప్పందంపై ట్రంప్ చేసిన ప్రకటనపై కాంగ్రెస్ నేత శశిథరూర్ వ్యంగ్యంగా స్పందించారు. "పాకిస్థాన్‌లో చమురు కనిపిస్తుందని అమెరికా ఊహించుకోవడం ఆసక్తిని కలిగిస్తోంది. ఈ ఒప్పందంపై వాళ్లకు(అమెరికా-పాక్) శుభాకాంక్షలు! పాకిస్థాన్‌లో చమురు ఉందని నేనైతే వినలేదు. కానీ, వెతికే హక్కు అమెరికాకు ఉంది" అని ఆయన వ్యాఖ్యానించారు. ట్రంప్ భారత్‌ను ఉద్దేశించి చేసిన 'మృత ఆర్థిక వ్యవస్థలు' అనే వ్యాఖ్యను ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. అమెరికా సుంకాలు చిన్న విషయమేమి కాదని.. ఆ దేశంతో భారత్ వాణిజ్యాన్ని తుడిచిపెట్టే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు.

# భారత్, రష్యాలవి మృత ఆర్థిక వ్యవస్థలు

(మొదటిపేజీ తరువాయి)



ఉంచేద్దాం. తనను తాను ఇంకా అధ్యక్షుడినేమో అనుకుంటున్న రష్యా మాజీ విఫల అధ్యక్షుడు మెద్వెదేవ్ నోటిని అదుపులో ఉంచుకోవాలి. ఆయన ప్రమాదకర అంశంలో కల్పించుకుంటున్నారు.." అని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికాకు భారత్ మిత్రదేశమే అయినా.. భారత వాణిజ్య విధానాలు సమస్యగా మారాయని వ్యాఖ్యానించారు. ఉక్రెయిన్‌ను అంతం చేయకుండా రష్యాను నిలువరించాలని అంతా భావిస్తుంటే.. భారత్ మాత్రం రష్యా నుంచి చమురు, ఆయుధాలు కొనుగోలు చేసిందని ఆరోపించారు.

### వాణిజ్య ఒప్పందంపై ఒత్తిడి పెంచేందుకే!

భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందానికి సంబంధించి కొన్ని నెలలుగా చర్చలు సాగుతున్నాయి. ఇప్పటికే భారత బృందాలు పలుమార్లు వాషింగ్టన్‌కు వెళ్లి చర్చలు జరిపాయి. వ్యవసాయ, పాడి ఉత్పత్తులు సహా కొన్ని అంశాలపై పీటముడి కొనసాగుతోంది. ఆగస్టు 25న అమెరికా వాణిజ్య చర్చల బృందం భారత్‌కు రానుంది. ఈ క్రమంలో అమెరికా అనుకూల అంశాలతో ఒప్పందం కుదుర్చుకునే దిశగా ఒత్తిడి పెంచేందుకు ట్రంప్ ప్రయత్నిస్తున్నారని.. 25 శాతం సుంకాలు, జరిమానాల విధింపు, 'మృత ఆర్థిక వ్యవస్థలు' వంటి వ్యాఖ్యలు అందులో భాగమేనని నిపుణులు పేర్కొంటున్నారు.

### వేగంగా అభివృద్ధి చెందుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థ భారత్‌దే..

'భారత్‌ది మృత ఆర్థిక వ్యవస్థ' అంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ స్పందించారు. ప్రపంచంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ భారత్‌దేనని, కొన్నేళ్లలో ప్రపంచంలోనే మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదగనుందని స్పష్టం చేశారు. ప్రపంచ ఆర్థిక సంస్థలు, వ్యవస్థలు ఇప్పుడు భారత్‌వైపే చూస్తున్నాయని చెప్పారు. అమెరికా సుంకాలు, వాణిజ్య ఒప్పందం అంశానికి సంబంధించి భారత్ తన ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరిస్తుందని ఆయన పార్లమెంటు ఉభయ సభల్లో గురువారం ప్రకటించారు. అమెరికా సుంకాల ప్రభావం, తీసుకోవాల్సిన చర్యలపై వాణిజ్య సంస్థలు, ఎగుమతిదారులు, ఇతర భాగస్వాములతో కేంద్ర వాణిజ్య శాఖ చర్చలు జరుపుతోందన్నారు.

### రాహుల్ వ్యాఖ్యలు దేశాన్ని అవమానించడమే: బీజేపీ

ట్రంప్ వ్యాఖ్యలను రాహుల్ గాంధీ సమర్థించడం దేశ ప్రజలను అవమానించడమేనని బీజేపీ మండిపడింది. "రాహుల్ గాంధీ పూర్తిగా దిగజారిపోయారు. ట్రంప్ వ్యాఖ్యలను ఆయన సమర్థించడం 140 కోట్ల మంది దేశ ప్రజలను అవమానించడమే. నిజానికి చనిపోయినది ఆర్థిక వ్యవస్థ కాదు.. రాహుల్ ఘన వారసత్వం, ఆయనపై ప్రజల నమ్మకం చనిపోయాయి" అని బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాలవీయ విమర్శించారు. రాహుల్ గాంధీకి భారత వ్యతిరేక మనస్తత్వం అలవడిపోయిందని బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ విమర్శించారు.

### ఆరు భారత కంపెనీలపై అమెరికా ఆంక్షలు

ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న ఇరాన్‌తో వాణిజ్య కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయంటూ ఆరు భారతీయ కంపెనీలు సహా 20 సంస్థలపై అమెరికా తాజాగా ఆంక్షలు విధించింది. ఇరాన్ నుంచి పెట్రోలియం ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్న ఈ కంపెనీలేవీ.. అమెరికాతో, అమెరికన్ సంస్థలతో ఎలాంటి లావాదేవీలు విధించడానికి వీల్లేదని పేర్కొంది. ఈ జాబితాలో భారత్‌కు చెందిన కంచన్ పాలిమర్స్, ఆల్కెమికల్ సొల్యూషన్స్, రమ్నిక్‌లాల్ ఎస్ గొసాలియా అండ్ కంపెనీ, జుపిటర్ డై కెమ్ ప్రైవేట్ లిమిటెడ్, గ్లోబల్ ఇండస్ట్రియల్ కెమికల్స్, పెర్సిస్టెన్స్ పెట్రోకెమ్ సంస్థలు ఉన్నాయి.

### ట్రంప్ 'డెడ్ హ్యాండ్'ను గుర్తు చేసుకోవాలి: మెద్వెదేవ్

'భారత్, రష్యా మృత ఆర్థిక వ్యవస్థలు', 'ప్రమాదకర అంశంలోకి వస్తున్నారు' అంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై రష్యా మాజీ అధ్యక్షుడు దిమిత్రి మెద్వెదేవ్ మండిపడ్డారు. "ట్రంప్‌కు చాలా ఇష్టమైన రక్తపిశాచాల (జాంబీ)ల సినిమాలు ఆయనను ఇంకా భయపెడుతున్నట్లు ఉన్నాయి. ట్రంప్ 'వాకింగ్ డెడ్' వంటి సినిమాలతోపాటు భయంకరమైన 'డెడ్ హ్యాండ్'ను కూడా గుర్తుకు తెచ్చుకోవాలి" అని మెద్వెదేవ్ పేర్కొన్నారు. 'డెడ్ హ్యాండ్' అనేది ప్రచ్ఛన్న యుద్ధకాలం నాటి ఆటోమేటిక్ అణ్వస్త్ర నియంత్రణ వ్యవస్థ. దేశానికి చెందిన కీలక నేతలు అంతా చనిపోయినా కూడా శత్రుదేశంపై అణ్వస్త్రాలను ప్రయోగించి నాశనం చేస్తుందని చెబుతారు. అప్పట్లో సోవియట్ యూనియన్ 'డెడ్ హ్యాండ్'ను సిద్ధం చేసిందనే ప్రచారం సాగింది. ఇప్పుడు మెద్వెదేవ్ 'డెడ్ హ్యాండ్'ను ప్రస్తావించడం ద్వారా అవసరమైతే అణు దాడికి కూడా సిద్ధమనే హెచ్చరికలు చేశారని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## ట్రంప్ చెప్పింది వాస్తవమే..

- దేశ ఆర్థిక వ్యవస్థ 'చనిపోయిందని' అందరికీ తెలుసు!: రాహుల్‌గాంధీ



బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం మన దేశ ఆర్థిక, రక్షణ వ్యవస్థలను, విదేశాంగ విధానాన్ని నాశనం చేసిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. అదానీకి సాయం చేసేందుకే భారత ఆర్థిక వ్యవస్థను నాశనం చేశారని, దేశాన్ని పాతాళానికి తీసుకెళ్తున్నారని విమర్శించారు. పార్లమెంటు ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడారు. "అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పినది వాస్తవమే. భారత ఆర్థిక వ్యవస్థ నిర్వీర్యమైపోయిందని ప్రధాన మంత్రికి, ఆర్థిక మంత్రికి తప్ప అందరికీ తెలుసు. ట్రంప్ ఈ వాస్తవం చెప్పినందుకు ధన్యవాదాలు. మన విదేశాంగ విధానం అద్భుతమంటూ విదేశాంగ మంత్రి ప్రసంగాలు చేస్తుంటారు. మరోవైపు అమెరికా మన దేశాన్ని కించపర్చేలా మాట్లాడుతుంది. చైనా కూడా అలాగే చేస్తుంది. పహల్గాం ఉగ్రదాడికి వ్యతిరేకంగా ప్రపంచ దేశాలకు ప్రతినిధి బృందాలను పంపుతారు. కానీ ఒక్కదేశమూ పాకిస్థాన్‌ను తప్పుపట్టదు. దేశాన్ని ఇలా ఎలా నడిపిస్తున్నారు. వీళ్లకు అసలు దేశాన్ని పాలించడమే రాదు" అని రాహుల్ వ్యాఖ్యానించారు. ట్రంప్ చెప్పినట్టుగా మోదీ ఆడుతున్నారని విమర్శించారు. అనంతరం 'ఎక్స్'లో పోస్టు పెడుతూ.. "భారత ఆర్థిక వ్యవస్థ చనిపోయిందని, మోదీయే చంపేశారని ఆరోపించారు. కాగా యుద్ధాన్ని ఆపాలంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై స్పందించకుండా పార్లమెంటులో మోదీ మౌనవ్రతం పాటించారని.. ఇప్పుడు మృత ఆర్థిక వ్యవస్థ అంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపైనా మౌనంగానే ఉంటారా? అని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు.

# మాలేగావ్ పేలుళ్ల కేసు.. ఏడుగురు నిందితులూ నిర్దోషులే



ప్రజ్ఞా ఠాకూర్



సమీర్ కులకర్ణి, మేజర్ రమేశ్ ఉపాధ్యాయ (రిటైర్డ్), ప్రసాద్ పురోహిత్



అజయ్ రహీర్కర్ సుధాకర్ చతుర్వేది సుధాకర్ ద్వివేది

ముంబై, హైదరాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పదిహేడేళ్లనాటి మాలేగావ్ పేలుళ్ల కేసుపై ముంబై ప్రత్యేక కోర్టు గురువారం తీర్పునిచ్చింది. బీజేపీ మాజీ ఎంపీ ప్రజ్ఞా సింగ్ ఠాకూర్, లెఫ్టినెంట్ కర్నల్ ప్రసాద్ పురోహిత్ సహా ఈ కేసులో నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏడుగురినీ నిర్దోషులుగా ప్రకటించింది. వారికి వ్యతిరేకంగా ఈ కేసులో ఎలాంటి బలమైన, నమ్మదగ్గ సాక్ష్యాలేవీ లేవని కోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది. పేలుళ్లకు ఉపయోగించిన బైక్ ప్రజ్ఞా ఠాకూర్‌దేనని, ఆ బైక్ ఆమె పేరిటే రిజిస్టర్ అయ్యిందని నిరూపించడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని... ఆ బైక్‌పైనే బాంబు పెట్టి పేల్చారన్న విషయాన్ని నిర్ధారించలేకపోయిందని.. కేవలం అనుమానంతో ఎవరినీ దోషులుగా ప్రకటించలేమని వ్యాఖ్యానించింది. ఉగ్రవాదానికి మతం లేదని.. ఈ కేసును విచారించిన ప్రత్యేక జడ్జి ఏకే లహోటీ పేర్కొన్నారు. ఈ కేసు దర్యాప్తులో పలు లోపాలు ఉన్నాయన్న ఆయన.. నిందితులపై ఆరోపణలు పూర్తిగా నిరూపించలేకపోయినందున వారికి బెనిఫిట్ ఆఫ్ డౌట్ ఇవ్వడం సముచితమని అభిప్రాయపడ్డారు. అంతేకాదు.. ఈ కేసులో ఉపా (చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం) నిబంధనలు వర్తించవని తేల్చిచెప్పారు. ఈ పేలుళ్లలో చనిపోయిన ఆరుగురి కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున.. గాయపడ్డ 101 మందికి రూ.50 వేల చొప్పున పరిహారం చెల్లించాల్సిందిగా ఆదేశించారు. ఈ తీర్పు వినగానే.. ఏడుగురు నిందితుల (ప్రజ్ఞా ఠాకూర్, ప్రసాద్ పురోహిత్, మేజర్ రమేశ్ ఉపాధ్యాయ (రిటైర్డ్), అజయ్ రహీర్కర్, సుధాకర్ ద్వివేది, సుధాకర్ చతుర్వేది, సమీర్ కులకర్ణి) ముఖాలపై చిరునవ్వు మెరిసింది. ఈ తీర్పు పట్ల వారంతా హర్షం వ్యక్తం చేశారు. తీర్పు ఇచ్చిన న్యాయమూర్తికి, తమ న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇది కేవలం తమ విజయం మాత్రమే కాదని.. కాషాయ విజయం అని ప్రజ్ఞా ఠాకూర్ వ్యాఖ్యానించారు. ఈ కేసు కారణంగా తన జీవితం 17 సంవత్సరాలుగా నాశనమైందని.. కాషాయ ధ్వజాన్ని అవమానించడానికి ప్రయత్నించినవారిని దేవుడు శిక్షిస్తాడని అన్నారు. బీజేపీ సైతం కోర్టు తీర్పును స్వాగతించింది. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు.. నాటి గుజరాత్ ముఖ్యమంత్రి మోదీ ఎదుగుదలను అడ్డుకోవడానికి, ముస్లిం ఓటర్లను బుజ్జగించడానికి 'హిందూ ఉగ్రవాదం' అనే సిద్ధాంతాన్ని తెరపైకి తెచ్చిందని దుయ్యబట్టింది. కాషాయ ఉగ్రవాదం ఎప్పుడూ లేదని.. ఎప్పటికీ ఉండబోదని బీజేపీ సీనియర్ నేత, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ అన్నారు. కాషాయ ఉగ్రవాదం అంటూ విష ప్రచారం చేసి సనాతన ధర్మాన్ని అప్రతిష్ఠపాలు చేసిన కాంగ్రెస్ సీనియర్ నేతలు సోనియా, రాహుల్ తదితరులు ఇప్పుడు హిందువులకు క్షమాపణ చెప్పాలని బీజేపీ ఐటీ విభాగాధిపతి అమిత్ మాలవీయ డిమాండ్ చేశారు. 'కాషాయ ఉగ్రవాదం' అనే మాటను విస్తృతంగా ప్రచారం చేసిన కాంగ్రెస్ ఇప్పటికైనా క్షమాపణ చెప్పాలని శివసేన ఎంపీ శ్రీకాంత్ షిండే వ్యాఖ్యానించారు. ఇక.. ఉగ్రవాదాన్ని ఏ మతంతోనూ ముడిపెట్టకూడదని.. ఏ మతమూ హింసను ప్రోత్సహించదని కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ అన్నారు. కాగా.. కోర్టు తీర్పును రాష్ట్ర సర్కారు ఉన్నత న్యాయస్థానంలో సవాల్ చేయాలని మహారాష్ట్రకు చెందిన ఎంఐఎం నేత ఇంతియాజ్ జలీల్ డిమాండ్ చేశారు. ఆ పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ.. ఈ కేసులో కోర్టు తీర్పు తమకు తీవ్ర నిరాశ కలిగించిందని వ్యాఖ్యానించారు. మతాన్ని లక్ష్యంగా చేసుకుని జరిగిన దాడి కేసు దర్యాప్తులో, ప్రాసిక్యూషన్‌లో ఉదాసీనత ప్రదర్శించడం వల్లే నిందితులు నిర్దోషులుగా విడుదలయ్యారని పేర్కొన్నారు. ముంబై ట్రైన్ బ్లాస్ కేసులో నిందితుల విడుదలపై తక్షణమే స్టే కోరిన మహారాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఇప్పుడు ఎందుకు మౌనం వహిస్తున్నాయని ఆయన నిలదీశారు.

### ఇదీ కేసు నేపథ్యం..

2008 సెప్టెంబరు 29న.. మహారాష్ట్రలోని మాలేగావ్‌లో రెండుచోట్ల జరిగిన పేలుళ్లలో ఆరుగురు ప్రాణాలు కోల్పోగా, 100 మందికి పైగా గాయపడిన సంగతి తెలిసిందే. తొలుత మహారాష్ట్ర యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ ఈ కేసు దర్యాప్తును చేపట్టింది. ప్రజ్ఞాఠాకూర్ సహా 16 మందిని నిందితులుగా పేర్కొంటూ ఎంకోకా (మహారాష్ట్ర కంట్రోల్ ఆఫ్ ఆర్గనైజ్డ్ క్రైమ్ యాక్ట్) కింద అభియోగాలు నమోదు చేసింది. 2011లో ఈ కేసు దర్యాప్తు ఎన్ఐఏ చేతికి వచ్చింది. ఈ కేసులో సాక్షులందరినీ విచారించిన ఎన్ఐఏ.. ప్రజ్ఞా ఠాకూర్ సహా మరికొందరికి 2016లో క్లీన్‌చిట్ ఇచ్చింది. అయితే, అదే ఎన్ఐఏ యూటర్న్ తీసుకుని ప్రజ్ఞాఠాకూర్ సహా ఈ కేసులో ఏడుగురు నిందితులకూ ఉరిశిక్ష విధించాలని ఈ ఏడాది ఏప్రిల్‌లో కోర్టుకు విజ్ఞప్తి చేసింది. కానీ, కోర్టు ఆ విజ్ఞప్తిని తోసిపుచ్చి.. ఆ ఏడుగురినీ నిర్దోషులుగా ప్రకటించింది. దర్యాప్తు సంస్థలు మారడమే కాదు.. 17 ఏళ్లపాటు సుదీర్ఘంగా కొనసాగిన ఈ కేసుపై ఐదుగురు జడ్జిలు విచారణ జరపడం గమనార్హం.

## నగదు డిపాజిట్ చేయించి బెయిల్ ఇవ్వకూడదు

- నిందితుడి హామీని నమ్మకూడదు
- న్యాయస్థానాలకు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, జూలై 31: నిందితుడు ఇచ్చిన హామీని పరిగణనలోకి తీసుకొని బెయిల్ మంజూరు చేయకూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నగదు డిపాజిట్‌గా తీసుకొని బెయిల్ ఇవ్వకూడదని పేర్కొంది. కేవలం కేసులోని విషయం ఆధారంగానే ఇవ్వాల్సి ఉంటుందని తెలిపింది. ఈ మేరకు జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం తీర్పు చెప్పింది. ఈ తీర్పును అన్ని హైకోర్టులు, ట్రయల్ కోర్టులకు పంపించాలని రిజిస్ట్రీని ఆదేశించింది. రూ.1.6 కోట్లను దుర్వినియోగం చేశారన్న కేసులో గజానన్ దత్తాత్రేయ గోరే అనే వ్యక్తి బెయిల్ కోసం బాంబే హైకోర్టును ఆశ్రయించాడు. రూ.25 లక్షలను డిపాజిట్ చేస్తానని అతడు హామీ ఇవ్వడంతో బెయిల్ మంజూరు చేసింది. విడుదలయిన తరువాత అతడు ఆ సొమ్మును డిపాజిట్ చేయకపోవడంతో హైకోర్టు బెయిల్‌ను రద్దు చేసింది. దీన్ని సవాలు చేస్తూ అతడు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. విచారణ జరిపిన ధర్మాసనం హైకోర్టు నిర్ణయాన్ని సమర్థించింది.

### యూపీలో మత మార్పిళ్ల కోసం చెన్నై నుంచి నగదు

- ఓ పాస్టర్ ఖాతాలో భారీగా జమ

చెన్నై, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లో గ్రామీణ ప్రజలను మతం మార్పించేందుకు తమిళనాడులోని చెన్నై నుంచి భారీగా నగదు పంపినట్లు ఆ రాష్ట్ర పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. యూపీలోని లఖింపూర్ ఖేరీ ప్రాంతంలో కుగ్రామాలకు చెందిన నిరుపేదలను బలవంతంగా క్రైస్తవ మతంలోకి మార్చారనే ఆరోపణలపై మతపెద్ద (పాస్టర్) వినోద్‌పాల్ సింగ్, ఆయన భార్య జ్యోతి, సహాయకులు అనంతరామ్, శుభకరన్, రమిత్‌లను పోలీసులు ఇటీవల అరెస్టు చేశారు. వినోద్‌పాల్ సింగ్‌ను విచారించగా.. పేదలను మతం మార్చేందుకు, క్రైస్తవ సభలు జరిపేందుకు అతని బ్యాంకు ఖాతాల్లో చెన్నై నుంచి భారీ ఎత్తున నగదు జమ అయినట్లు తేలింది.

## నైరుతి ద్వితీయార్ధంలో మంచి వర్షాలు

- ఆగస్టులో సాధారణ వర్షపాతం: ఐఎండీ అంచనా

విశాఖపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల సీజన్‌లో తొలి రెండు నెలలు ముగిశాయి. శుక్రవారం నుంచి ద్వితీయార్ధం (ఆగస్టు, సెప్టెంబరు) ప్రారంభంకానుంది. ఈ భాగంలో దేశంలోని అనేక ప్రాంతాల్లో సాధారణంకంటే ఎక్కువ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది. ఈశాన్య రాష్ట్రాలు, కేరళ, కర్ణాటక, ఏపీలోని ఉత్తర కోస్తాలోని పలు ప్రాంతాలు, బిహార్‌లో ఎక్కువ ప్రాంతం, ఒడిశా, ఝార్ఖండ్, పశ్చిమబెంగాల్‌లో కొన్నిచోట్ల సాధారణంకంటే తక్కువ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఆగస్టు, సెప్టెంబరుల్లో దేశవ్యాప్తంగా 422.8 మి.మీ. వర్షపాతం కురవాల్సి ఉండగా, దీర్ఘకాలిక సగటులో 106శాతం కంటే ఎక్కువగా పడతాయని తెలిపింది. ఆగస్టులో దేశంలో 254.9 మి.మీ. వర్షపాతం కురవాలి. ఈ నెలలో సాధారణ వర్షపాతం (దీర్ఘకాల సగటుకంటే 94నుంచి 106%) కురుస్తుందని గురువారం ఐఎండీ పేర్కొంది. అయితే కేరళ, కర్ణాటకలో అనేక ప్రాంతాలు, ఉత్తర తెలంగాణ, ఉత్తర కోస్తా, విదర్భ, మధ్య మహారాష్ట్ర, మరట్వాడ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లో అనేక ప్రాంతాలు, బిహార్, ఈశాన్య భారతం, కశ్మీర్‌లోని కొన్ని ప్రాంతాల్లో వర్షాభావం కొనసాగుతుందని వివరించింది. జూన్, జూలైల్లో దేశంలో 445.8 మి.మీ.కు గాను 474.3 మి.మీ. (సాధారణం కంటే 6.5%ఎక్కువ)వర్షపాతం నమోదైంది. ప్రస్తుతం ఉన్న తటస్థ పరిస్థితులు అక్టోబరు వరకూ కొనసాగుతాయని, నైరుతి సీజన్ ముగిశాక బలహీన లానినా పరిస్థితులు ఏర్పడవచ్చని ఐఎండీ పేర్కొంది.

### రోహింగ్యాలు శరణార్థులా? చొరబాటుదార్లా?

- తేల్చాల్సిన ప్రధాన సమస్య ఇదే: సుప్రీంకోర్టు వ్యాఖ్య

న్యూఢిల్లీ, జూలై 31: రోహింగ్యాలు శరణార్థులా? లేదంటే దేశంలో అక్రమంగా ప్రవేశించిన చొరబాటుదార్లా అన్నదే ప్రధాన సమస్య అని, దీన్ని మొదట తేల్చాల్సి ఉందని గురువారం సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఇది తేలితే ఇతర సమస్యలను పరిష్కరించడం తేలికవుతుందని తెలిపింది. దేశంలోని రోహింగ్యాలపై దాఖలైన పలు పిటిషన్లపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. మయన్మార్, బంగ్లాదేశ్‌ల నుంచి వచ్చిన రోహింగ్యాలను శరణార్థులుగా ప్రకటించవచ్చా? ఒకవేళ అలాంటి గుర్తింపు ఇస్తే వారికి కలిగే హక్కులు, సౌకర్యాలు, రక్షణలు ఏమిటని ప్రశ్నించింది. ఒకవేళ అక్రమ చొరబాటుదార్లుగా గుర్తిస్తే వారిని తిప్పిపంపడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు సమర్థనీయమేనా అని అడిగింది. అక్రమ చొరబాటుదార్లే అయితే వారిని చిరకాలంపాటు నిర్బంధంలో ఉంచవచ్చా? బెయిల్‌పై విడుదల చేస్తే ఎలాంటి షరతులు విధించాలి? అన్న ప్రశ్నలు తలెత్తుతాయని తెలిపింది. ఈ సమస్యల ఆధారంగా చేసుకొని దాఖలైన పిటిషన్లను మూడు వర్గాలుగా విభజించి ప్రతి బుధవారం విచారణ జరపనున్నట్లు పేర్కొంది.

### ధర్మస్థలలో ఆరో చోట కనిపించిన అస్థిపంజరం

బెంగళూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని ధర్మస్థలలో మృతదేహాల ఆనవాళ్ల కోసం సిట్ జరుపుతున్న తవ్వకాల్లో మూడో రోజు ఓ అస్థిపంజరం బయటపడింది. ధర్మస్థలలో వందలాది మృతదేహాలను పూడ్చినట్లు నమోదైన కేసు దర్యాప్తులో భాగంగా ఈ తవ్వకాలు జరుగుతున్నాయి. తొలి రెండు రోజులు ఐదు ప్రాంతాల్లో జరిపిన తవ్వకాల్లో మృతదేహాల ఆనవాళ్లేమీ లభించలేదు. మూడో రోజు గురువారం నేత్రావతి నది సమీపంలోని అటవీ ప్రాంతంలో సిట్ అధికారులు, దక్షిణ కన్నడ జిల్లా పోలీసులు, రెవెన్యూ, ఇతర శాఖల అధికారుల సమక్షంలో తవ్వకాలు కొనసాగాయి. మాజీ పౌర కార్మికుడు చూపించిన ఆరో ప్రాంతంలో అస్థిపంజరం లభించింది. కొన్ని ఎముకలు, పగిలినట్లు ఉన్న పుర్రె బయటపడ్డాయి. ఫోరెన్సిక్ నిపుణుల బృందాలు అక్కడే ఉంటూ పర్యవేక్షిస్తున్నాయి. అస్థిపంజరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని నిర్ణయించారు. అది పురుషుడిదని ప్రాథమికంగా గుర్తించారు. ఎస్పీ జితేంద్రకుమార్ దయా, పుత్తూరు ఏసీపీ స్టెల్లావర్గీస్ తవ్వకాలను పర్యవేక్షించారు. అస్థిపంజరం లభించిందనే సమాచారం తెలియగానే సిట్ కార్యాలయం నుంచి చీఫ్ ప్రణవ్ మొహంతీ, డీఐజీ ఎంఎన్ అనుచేత్ ఆ ప్రాంతానికి వచ్చారు.

## ఎస్ఐఆర్‌పై చర్చించాల్సిందే

- కొనసాగిన ప్రతిపక్షాల ఆందోళనలు
- పార్లమెంటు ఉభయసభల వాయిదా

న్యూఢిల్లీ, జూలై 31: బిహార్‌లో ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సవరణ(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్- ఎస్ఐఆర్)పై చర్చకు పట్టుబడుతూ విపక్షాలు చేపట్టిన ఆందోళనలతో పార్లమెంట్ ఉభయసభలు గురువారం స్తంభించిపోయాయి. పలుమార్లు వాయిదాలు పడుతూ కొనసాగిన సభలు ఎలాంటి చర్చలు లేకుండానే శుక్రవారానికి వాయిదా పడ్డాయి. ఇస్రో, నాసా సంయుక్తంగా నైసార్ ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టడంతో ఆయా శాస్త్రవేత్తలకు పార్లమెంట్ ఉభయసభలు శుభాకాంక్షలు తెలియజేశాయి. మరోపక్క, రాజ్యసభలోనూ తీవ్ర గందరగోళం కొనసాగింది. ఎస్ఐఆర్ అంశంతోపాటు ఆపరేషన్ సిందూర్‌పై ప్రధాని మోదీ రాజ్యసభకు బదులివ్వలేదంటూ ప్రతిపక్ష పార్టీలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేశాయి. నినాదాలతో సభను హోరెత్తించాయి. ప్రధాని మోదీ సభకు వచ్చి మాట్లాడాలని పట్టుబట్టాయి. ఆందోళనలు కొనసాగుతుండడంతో రాజ్యసభను కూడా శుక్రవారానికి వాయిదా వేశారు.

## సరికొత్త బ్లడ్ గ్రూప్ 'క్రిబ్'

- ప్రపంచంలోనే మొట్టమొదటి సారిగా కర్ణాటక మహిళలో గుర్తింపు



బెంగళూరు, జూలై 31: ప్రపంచంలో ఇంతకు ముందెన్నడూ లేని ప్రత్యేక బ్లడ్ గ్రూప్‌ను కర్ణాటకకు చెందిన ఓ మహిళలో గుర్తించారు. ఈ గ్రూప్‌నకు శాస్త్రవేత్తలు సీఆర్ఐబీ (క్రిబ్) అని నామకరణం చేశారు. భారత్, బ్రిటన్‌లకు చెంది న శాస్త్రవేత్తలు పది నెలల సుదీర్ఘ పరిశోధన అనంతరం అత్యంత అరుదైన ఈ బ్లడ్ గ్రూప్‌ను ఆవిష్కరించారు. ఇప్పటి వరకు ఈ తరహా బ్లడ్ గ్రూప్ ఈ మహిళలో మాత్రమే ఉందని పేర్కొన్నారు. 38 ఏళ్ల మహిళ గుండె సంబంధిత వ్యాధితో గతేడాది కోలారులోని ఆర్ఎల్ జాలప్ప ఆస్పత్రిలో చేరారు. ఆమెకు శస్త్రచికిత్స చేయాలని వైద్యులు నిర్ణయించారు. ఆమెది ఓ-పాజిటివ్ వర్గానికి చెందిన రక్తం కావడంతో శస్త్రచికిత్సకు రక్తమార్పిడి కోసం శాంపిళ్లను పరీక్షించారు. అయితే డాక్టర్లను ఆశ్చర్యపరుస్తూ అన్ని శాంపిళ్లలో రియాక్షన్ వచ్చింది. పేషెంట్ కుటుంబంలోని 20 మంది శాంపిళ్ల ప్రయత్నించినా ఏదీ మ్యాచ్ కాలేదు. ఆమె రక్తంలో గుర్తు తెలియని, గతంలో ఎన్నడూ చూడని యాంటిజెన్ ఉండటం వల్ల ఇలా జరుగుతోందని గుర్తించారు. చివరకు రక్తమార్పిడి చేయకుండానే శస్త్రచికిత్స పూర్తి చేశారు. అయితే ఆమె రక్తనమూనాలను బ్రిటన్‌లోని బ్రిస్టల్‌లో ఉన్న అంతర్జాతీయ బ్లడ్ గ్రూప్ రిఫరెన్స్ ల్యాబొరేటరీకి పంపారు. అక్కడ 10 నెలల పరిశోధన అనంతరం క్రోమర్ వ్యవస్థలో సరికొత్త యాంటిజెన్‌ను గుర్తించారు. దీంతో ఈ బ్లడ్ గ్రూప్‌నకు సీఆర్ఐబీగా నామకరణం చేశారు. సీఆర్ అంటే క్రోమర్ అని, ఐబీ అంటే ఇండియా బెంగళూరు అని అర్థం వచ్చేటట్లుగా పేరు పెట్టారు. ఈ రక్తవర్గం ప్రపంచంలోనే మొట్టమొదటిగా ప్రకటించారు. కాగా, ఐఎస్‌బీటీ మార్గదర్శకాల ప్రకారం కూడా ఆమెను మొట్టమొదటి క్రిబ్ బ్లడ్ గ్రూప్ ఉన్న వ్యక్తిగా ప్రకటించారు.

# కమిషన్ రిపోర్టును ప్రభుత్వం అటకెక్కిస్తే ఏంచేస్తారు?

» నాగారం భూములపై పిటిషనర్‌కు హైకోర్టు ప్రశ్న.. తీర్పు రిజర్వ్

హైదరాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం సర్వే నంబర్లు 181, 182, 194, 195లోని వివాదాస్పద భూముల వ్యవహారంపై విచారణ కమిషన్‌ను నియమించేలా ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేయాలని దాఖలైన పిటిషన్‌లో హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది. రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై రికార్డులు మార్చి పలువురు ఐఏఎ్‌సలు, ఐపీఎ‌స్‌లు నాగారంలో భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని.. దీనిపై విచారణ కమిషన్ వేసేలా ఆదేశించాలని వడిత్య రాములు, అక్రమాలపై చర్యలు తీసుకోవాలని బీర్ల మల్లేశ్ వేర్వే రు పిటిషన్లు వేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్లపై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. పిటిషనర్ రాములు తరఫున న్యాయవాది విజయలక్ష్మి వాదిస్తూ.. హైప్రొఫైల్ బ్యూరోక్రాట్లు ఉన్న ఈ వ్యవహారంపై విచారణ కమిషన్‌ను వేస్తే గానీ నిజానిజాలు బటయకు రావన్నారు. స్పందించిన ధర్మాసనం.. 'హైప్రొఫైల్ అధికారులు ఉన్నారంటున్నారు. వీరే ప్రభుత్వంలో ఉంటారు కదా? ఎంక్వైరీ కమిషన్ ఇచ్చే నివేదికపై చర్యలు తీసుకోకుండా.. ప్రభుత్వం అటక మీద పెడితే ఏం చేస్తారు?'అని ప్రశ్నించింది. విచారణ కమిషన్ వేయాలని దాఖలైన పిటిషన్‌లో తీర్పు రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించింది. బీర్ల మల్లేశ్ పిటిషన్‌లో దాఖలైన ఐదు మధ్యంతర అప్లికేషన్లపైనా తీర్పును రిజర్వు చేస్తున్నట్లు స్పష్టంచేసింది. బీర్లమల్లేశ్ దాఖలు చేసిన ప్రధాన పిటిషన్‌ను పెండింగ్‌లో ఉంచింది.

రేపట్నుంచి ప్రధానోపాధ్యాయుల

# పదోన్నతుల ప్రక్రియ షురూ

» 10 రోజుల్లో ముగించేలా షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల్లోని గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీల పదోన్నతుల ప్రక్రియ శనివారం నుంచి ప్రారంభంకానుంది. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ గురువారం ప్రకటించారు. ఆగస్టు 2న వెబ్‌సైట్‌లో ఖాళీల ప్రకటన, 3న అభ్యంతరాల స్వీకరణ, 4, 5 తేదీల్లో స్కూల్ అసిస్టెంట్ల సీనియార్టీ జాబితా, 6న ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులకు స్కూల్ అసిస్టెంట్ల వెబ్ ఆప్షన్ల స్వీకరణ, 7న పదోన్నతుల ఉత్తర్వుల జారీ ఉంటుంది. ఆతర్వాత ఖాళీల వివరాల ప్రకటన, అభ్యంతరాల స్వీకరణ, తుది జాబితాను ఆగస్టు 8,9 తేదీల్లో ప్రదర్శిస్తారు. స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుకోసం ఎస్జీటీల వెబ్ ఆప్షన్ల స్వీకరణ ఆగస్టు 10న ఉంటుంది. 11న పదోన్నతుల ఉత్తర్వులు జారీ చేస్తారు. మొత్తం ప్రక్రియ ఆగస్టు 2న ప్రారంభించి 11న ముగించాలని నవీన్ విద్యాశాఖాధికారులను ఆదేశించారు.

వైద్యం వికటించి

# గర్భిణి మృతి

» నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేటలో ఘటన

అచ్చంపేట టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వైద్యం వికటించి గర్భిణి మృతి చెందిన ఘటన నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేటలో చోటు చేసుకుంది. ఆమె మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. మృతురాలి బంధువుల కథనం మేరకు.. ఉప్పునుంతలలోని అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన శ్రావణి (19) ప్రతీ నెల వైద్య పరీక్షల కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లేది. ఈ నెల కూడా అక్కడకు వెళ్లగా.. ప్రసవానికి ఇంకా 10 రోజులు ఉందని వైద్యులు చెప్పారు. కాగా, శ్రావణి బుధవారం వైద్య పరీక్షల కోసం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లింది. ఆసుపత్రి సిబ్బంది వెంటనే ఆపరేషన్ చేయాలని పట్టుబట్టారని మృతురాలి బంధువులు ఆరోపించారు. శస్త్ర చికిత్స అనంతరం మగ బిడ్డకు జన్మనిచ్చింది. అయితే తీవ్రమైన రక్తస్రావం కావడంతో మెరుగైన వైద్యం కోసం నాగర్‌కర్నూల్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించగా.. అక్కడకు వెళ్లారు. పరిస్థితి విషమించిందని హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని వైద్యులు చెప్పారు. అయితే హైదరాబాద్ వెళ్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందిందని బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్ భాస్కర్ తెలిపారు.

# వృథాజలాలు వాడుకుంటే తప్పేంటి?

(మొదటి పేజీ తరువాయి)

అనుమతులు తీసుకునే కట్టారా, కాళేశ్వరం ప్రాజెకును స్టడీ చేసే కట్టారా అని నిలదీశారు. కానీ బనకచర్ల ప్రాజెక్టుపై అనవసర రాద్ధాంతం చేస్తూ.. ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆరోపించారు. 'తెలంగాణ నుంచి జలాలను ఎత్తిపోసి బనకచర్లకు వాడుకోవడం లేదు కదా, కాళేశ్వరం ప్రాజెక్టుకు చిల్లు పెట్టి తోడేయడం లేదుకదా' అని నిలదీశారు. వరద జలాలపై అధ్యయనం లేదని ఎవరన్నారని ప్రశ్నించారు. ఏటా ఎన్ని జలాలు సముద్రంలో కలుస్తున్నాయో లెక్కలు లేవా అని లోకేశ్ ప్రశ్నించారు. ఒకవేళ ఏ ఏడాదైనా వరదలు రాకపోతే మిగులు జలాలను వాడకోబోమని చెప్పారు. బనకచర్ల ప్రాజెక్టులో తప్పు ఎక్కడుందని ప్రశ్నించారు. ఎవరో కొందరు నిపుణులు అభ్యంతరాలు రేపుతున్నారని అనుకుంటే ప్రాజెక్టులు కట్టే పరిస్థితే ఉండదన్నారు. రాయలసీమకు నీళ్లివ్వగలిగేవాళ్లమే కాదని స్పష్టం చేశారు. కృష్ణా జలాలను ఎత్తిపోసి ప్రాజెక్టులను నింపుతున్నామని, ఏటా భారీగా జలాలు సముద్రంలోకి వెళ్తుంటే సద్వినియోగం చేసే



ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు.

### సింగపూర్ నుంచి ఏపీకి రూ.45 వేల కోట్ల పెట్టుబడులు

ఏపీ సీఎం చంద్రబాబు నేతృత్వంలో సింగపూర్ పర్యటన విజయవంతమైందని.. వచ్చే ఐదేళ్లలో ఆ దేశ ప్రభుత్వ కంపెనీల నుంచి రూ.45వేల కోట్ల పెట్టుబడులు రానున్నాయని లోకేశ్ తెలిపారు. చంద్రబాబు 26 సమావేశాల్లో, తాను 19సమావేశాల్లో పాల్గొన్నామని.. టువాస్ పోర్టు, జురాంగ్ పెట్రో కెమికల్స్ సంస్థలతోపాటు ఐటీ ఎలక్ట్రానిక్స్, రియల్ ఎస్టేట్, క్రీడల కంపెనీలతో భేటీ అయ్యామని చెప్పారు. గతంలో జగన్ హయాంలో జరిగిన తప్పులను సరిచేసేందుకు సింగపూర్ పర్యటనలో ప్రయత్నించామన్నారు. ఏపీకి గత పదేళ్లలో వచ్చిన పెట్టుబడుల కంటే గడిచిన 14 నెలల్లో వచ్చిన పెట్టుబడులే ఎక్కువని చెప్పారు. రాష్ట్రంలో వైఎస్ జగన్ నేరపూరిత రాజకీయాలు చేస్తున్నారని లోకేశ్ మండిపడ్డారు. లిక్కర్ కుంభకోణంలో పెద్దఎత్తున డబ్బు పట్టుబడటంపై మీడియా వేసిన ప్రశ్నలకు లోకేశ్ స్పందిస్తూ.. అందులో ఎంత సొమ్ము చేతులు మారిందో, ఏపెట్టెలో ఎంత డబ్బుందో జగన్‌కు బాగా తెలుసని పేర్కొన్నారు. లిక్కర్ కుంభకోణంలో చెక్కులద్వారా నగదు పంపిణీ జరిగినట్టు ఆధారాలున్నాయని చెప్పారు. లిక్కర్ కంపెనీ 400కోట్లతో బంగారం కొనడం దేశంలోనే మొదటిసారన్నారు. పీఎల్ఆర్ కంపెనీకి అదాన్ డిస్టిలరీ నుంచి డబ్బులు వెళ్లాయని చెప్పారు. ఒక నిర్మాణ కంపెనీకి, లిక్కర్ కంపెనీకి ఏ సంబంధంతో ఆర్థిక లావాదేవీలు జరిగాయో వెల్లడించాలన్నారు. ఆ డబ్బంతా పీఎల్ఆర్ నుంచి జగన్‌కు వెళ్లిందని లోకేశ్ ఆరోపించారు. జగన్ ఒక వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లి ముగ్గురి మరణానికి కారకులయ్యారని విమర్శించారు.



## అగ్గిపెట్టెలో పట్టే 'ఆపరేషన్ సిందూర్' శాలువా

సిరిసిల్ల నేత కళాకారుడు నల్ల విజయ్ మరో అద్భుతాన్ని ఆవిష్కరించారు. రెండు గ్రాముల బంగారంతో తయారు చేసిన జరీని ఉపయోగించి "ఆపరేషన్ సిందూర్" థీమ్‌తో కూడిన శాలువాను రూపొందించారు. రెండు మీటర్ల పొడవు, మీటరు వెడల్పు ఉన్న శాలువాను ఓ అగ్గిపెట్టెలో పట్టేలా రూపొందించడం మరో ప్రత్యేకత. ఈ నెల 7న చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ శాలువాను ప్రధాని మోదీకి పంపించనున్నట్లు విజయ్ తెలిపారు.

- ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల

బహిరంగ మార్కెట్లో

# క్వింటాలు బియ్యం రూ.2,250

» 'భారత్ బ్రాండ్' పేరుతో అమ్మకాలకు కేంద్రం నిర్ణయం

హైదరాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): దేశంలో బియ్యం ధరల నియంత్రణ, నిల్వల సమతుల్యత కోసం కేంద్ర ప్రభుత్వం బహిరంగ మార్కెట్ విక్రయ పథకం (ఓఎంఎంఎస్) కింద వివిధ వర్గాలకు బియ్యం అమ్మేందుకు భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) వద్ద ఉన్న 202.5 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయింపులు చేసింది. ఈ మేరకు కేంద్ర మంత్రివర్గ ఆమోదంతో ఆహార, ప్రజాపంపిణీ మంత్రిత్వశాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. 'భారత్ బ్రాండ్' పేరుతో ఈ బియ్యం అమ్మేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. క్వింటాలు బియ్యానికి రూ.2,250 ధర నిర్ణయించింది. ఇక కేటాయింపుల విషయానికివస్తే.. ప్రైవేటు పార్టీలు, సహకార సంఘాలు, సహకార సమాఖ్యలకు ఈ-టెండర్ విధానంలో విక్రయించటానికి 25 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయించింది. 25 శాతం నూకలతో ఈ బియ్యం విక్రయిస్తారు. 10శాతం నూకలతో ఉన్న 50 లక్షల మెట్రిక్ టన్నుల కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను ప్రైవేటు సంస్థలకు, రైస్‌మిల్లింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పథకం కింద ఉత్పత్తి చేసిన 7.5 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రైవేటు పార్టీలకు ఈ-వేలం ద్వారా విక్రయిస్తారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వాలు, అనుబంధ సంస్థలకు టెండర్లతో సంబంధంలేకుండా నేరుగా విక్రయించాలని నిర్ణయించారు. వీటికి ఇప్పటివరకు విక్రయించిన బియ్యంతో కలిపి ఈ ఏడాది అక్టోబరు 31 వరకు 36 లక్షల మెట్రిక్ టన్నులు, కమ్యూనిటీ కిచెన్లకు నవంబరు ఒకటో తేదీ నుంచి 2026 జూన్ 30 తేదీ వరకు 32 లక్షల టన్నుల బియ్యాన్ని కేంద్రం విక్రయించనుంది. ఇథనాల్ ఉత్పత్తికి ఈ ఏడాది అక్టోబరు 31 వరకు 52 లక్షల మెట్రిక్ టన్నులు, నవంబరు ఒకటో తేదీ నుంచి 2026 జూన్ 30 తేదీ వరకు మరో 52 లక్షల టన్నుల బియ్యాన్ని కేంద్రం విక్రయించనుంది. నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్, కేంద్రియ భండార్ లాంటి సహకారసంస్థలు తమ రిటైల్ దుకాణాలు, మొబైల్ వ్యాన్లు, ఈ- కామర్స్, పెద్ద రిటైల్ చైన్ సిస్టమ్ ద్వారా 'భారత్ బ్రాండ్' పేరుతో బియ్యం విక్రయించవచ్చని కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వీటికి బియ్యం కేటాయింపుల వివరాలను త్వరలో వెల్లడించనున్నారు.

## ఇంటర్ ప్రవేశాల గడువు 20 వరకు పొడిగింపు

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, గురుకులాల్లో ఇంటర్ ప్రవేశాల గడువును పొడిగించారు. పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదలైనందున ప్రవేశాల దరఖాస్తును ఆగస్టు 20వ తేదీ వరకు పొడిగించినట్టు ఇంటర్ విద్య కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. ఆ తర్వాత పొడిగింపు ఉండదన్నారు. ఇంటర్ బోర్డు గుర్తింపు ఉన్న కాలేజీల్లోనే చేరాలని విద్యార్థులు, తల్లిదండ్రులకు సూచించారు. అనుమతి ఉన్న కాలేజీల వివరాలు అధికారిక వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచామన్నారు.

# ఆ పిల్లల పట్టుదల ఫలించింది

## గద్వాల జిల్లా పుల్లూరు గురుకులానికి కదలివచ్చిన కలెక్టర్

- డిప్యూటీ వార్డెన్, సూపర్‌వైజర్ సస్పెన్షన్
- ప్రిన్సిపల్ సహా ముగ్గురికి మెమోలు జారీ
- హాస్టల్ భవన యజమాని పైనా చర్యలకు ఆదేశం
- సమస్యలన్నీ పరిష్కరిస్తానని విద్యార్థులకు హామీ



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

అలంపూరు చౌరస్తా, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఆ విద్యార్థులు సాధించారు. తామెదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం కోసం కలెక్టర్ కార్యాలయానికి పాదయాత్రగా వెళ్లేందుకు రోడ్డెక్కిన ఆ పిల్లల పట్టుదల ఫలించింది. ఆ చిన్నారుల వద్దకే కలెక్టర్ వచ్చారు. వారితో మాట్లాడారు. అన్ని సమస్యలనూ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. తాగేందుకు సరైన నీళ్లు లేవని, అన్నంలో పురుగులొస్తున్నాయని, మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామంటూ చాన్నాళ్లుగా చెబుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం పుల్లూరు గ్రామ శివారు అలంపూర్ చౌరస్తాలోని బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు బుధవారం గద్వాల కలెక్టర్ కార్యాలయం వైపు పాదయాత్రగా కదలడం సంచలనమైన సంగతి తెలిసిందే. గురువారం కలెక్టర్ బీఎం సంతోష్ ఆ గురుకులానికి వచ్చారు. డైనింగ్ హాల్‌ను, మరమ్మతుల నెపంతో భవన యజమాని మూసివేయించిన మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ ప్రత్యేకంగా మాట్లాడారు. వారు ఏయే సమస్యలు ఎదుర్కొంటున్నారనేది అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా, గురుకులాన్ని కలెక్టర్ పరిశీలించిన తర్వాత విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు డిప్యూటీ వార్డెన్ రజిత, సూపర్‌వైజర్ నవీన్‌ను అధికారులు సస్పెండ్ చేశారు. ప్రిన్సిపల్ రామకృష్ణ, వార్డెన్, హౌస్‌మాస్టర్‌కు మెమోలు జారీచేసినట్లు వెల్లడించారు. విద్యార్థులను భవన యజమాని బెదిరిస్తున్నాడని విచారణలో తేలడంతో ఆయనపై కేసు నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రస్తుతం మూసిఉన్న మరుగుదొడ్లను తెరిచి వాడుకోవాలని, నెలలోపు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లను నిర్మిస్తామని ఆయన చెప్పారు. మెనూ ప్రకారమే పిల్లలకు భోజనం పెట్టాలని, నాణ్యతలేని బియ్యం వెంటనే వెనక్కి పంపి మంచి బియ్యం తెప్పించుకోవాలని ప్రిన్సిపల్‌ను ఆదేశించారు. చెడిపోయిన ఆర్వోను బాగుచేయించే దాకా బయట నుంచి మినరల్ వాటర్ తెప్పించాలని సూచించారు. అనంతరం కలుగొట్ల కేజీబీవీ పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు.

# శ్రీశైలానికి పోటెత్తుతున్న వరద

- ఎగువ నుంచి ప్రాజెక్టులోకి 3.17లక్షల క్యూసెక్కుల రాక
- నాగార్జున సాగర్‌కు 2.82 లక్షల క్యూసెక్కుల పైనే వరద
- ఆల్మట్టి నుంచి పులిచింతల దాకా అన్నీ ఫుల్

హైదరాబాద్/గద్వాల/నాగార్జునసాగర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కృష్ణా బేసిన్‌లోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులకు వరద పోటెత్తుతోంది. శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువ నుంచి 3.17 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా.. 3.18 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి నీటి మట్టం 885 అడుగులు (215.80 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 882.70 అడుగుల (202.96టీఎంసీల) మేర నీరు ఉంది. కృష్ణా బేసిన్‌లో ఆల్మట్టి నుంచి పులిచింతల దాకా ప్రాజెక్టులన్నీ నిండుకుండల్లా మారాయి. ఆల్మట్టి ప్రాజెక్టుకు 1.52లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా... ఔట్‌ఫ్లో 1.40లక్షల క్యూసెక్కులుగా ఉంది. నారాయణపూర్ ప్రాజెక్టుకు 1.35లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంటే.. ఔట్‌ఫ్లో 1.08లక్షల క్యూసెక్కులుగా రికార్డయింది. జూరాలకు 2.01లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా..జలవిద్యుదుత్పత్తి, గేట్లు ఎత్తడం ద్వారా 2.08 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలిపెడుతున్నారు. తుంగభద్రకు 40వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. 32వేల క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు 2.82లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 2.43లక్షల క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉంది. పులిచింతలకు 2.14 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా... 2.04లక్షల క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 590అడుగులు (312.04 టీఎంసీలు)కాగా, ప్రస్తుతం 585.10 అడుగులు(297.7టీఎంసీల) మేర నీరు ఉంది. మరి కొన్ని రోజులపాటు వరద కొనసాగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు గోదావరి బేసిన్‌లోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 55 వేల క్యూసెక్కుల వరద చేరుతోంది. జలాశయం పూర్తిస్థాయి సామర్థ్యం 90.31 టీఎంసీలు కాగా... ప్రస్తుతం 37.63 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

# మాలేగావ్ మిథ్య...!

ఆ ఆరుగురినీ ఎవరు చంపారు? సమాధానం దొరకని ప్రశ్న ఇది. మాలేగావ్ పేలుళ్ళ ఘటనకు సంబంధించి నేషనల్ ఇన్వెస్టిగేటివ్ ఏజెన్సీ (ఎన్ఐఏ)కోర్టు గురువారం వెలువరించిన తీర్పు ఊహకు అందనిదేమీ కాదు. బీజేపీ నాయకురాలు, మాజీ ఎంపీ ప్రజ్ఞాఠాకూర్, లెఫ్టినెంట్ కల్నల్ ప్రసాద్ పురోహిత్ సహా మొత్తం ఏడుగురు నిందితులనూ న్యాయస్థానం నిర్దోషులుగా వదిలేసింది. బెనిఫిట్ ఆఫ్ డౌట్ తప్ప, ఎలాంటి బలమైన ఆధారాలు లేవు అని తేల్చేసింది న్యాయస్థానం. తీర్పు ఇలా ఉన్నప్పుడు, న్యాయస్థానం ప్రకటించిన నష్ట పరిహారం మృతుల కుటుంబాలకు ఉపశమనాన్ని ఇచ్చే అవకాశం లేదు.

రంజాన్ మాసంలో, ప్రార్థనలు జరుగుతున్న ఒక మసీదుముందు పేలుడు సంభవించి ఆరుగురు మరణానికీ, వందకుపైగా గాయపడటానికి కారకులెవ్వరూ లేరనీ, ఎవరూ బాధ్యులు కారనీ చివరకు ఇలా తేలిందన్నమాట. పేలుడుకు వినియోగించిన మోటార్‌బైక్ ప్రజ్ఞాఠాకూర్‌కు చెందినదేనని అనడానికి ఆధారాలు లేవన్నారు న్యాయమూర్తి. ఆ వాహనానికి అమర్చిన బాంబువల్లే పేలుడు సంభవించిందని కూడా నిరూపించలేకపోయారట. కల్నల్ పురోహిత్ కశ్మీర్‌నుంచి మిలటరీ గ్రేడ్ ఆర్డీఎక్స్ తెచ్చి, తానే బాంబు తయారుచేశారనీ చెప్పలేమట. ఈయనకు మరోనిందితుడు డబ్బు సమకూర్చిపెట్టినప్పటికీ, ఈ ఘాతుకం కోసమే ఆ ఆర్థికసాయం జరిగిందని ప్రాసిక్యూషన్ నిరూపించలేకపోయిందట. చివరకు, నిందితులంతా కలసిపన్నిన కుట్ర సిద్ధాంతాన్నే న్యాయస్థానం ఆమోదించనప్పుడు తీర్పు ఇలా ఉండడంలో ఆశ్చర్యమేమీ లేదు.

మొదట్లో ఈ కేసు దర్యాప్తు చేపట్టిన మహారాష్ట్ర యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) తన చార్జిషీటులో అభినవ భారత్ వ్యవస్థాపకులైన ప్రజ్ఞాఠాకూర్, కల్నల్ పురోహిత్ కుట్రను వివరిస్తూ, తీవ్ర ఆరోపణలే చేసింది. ఏటీఎస్‌నుంచి ఈ కేసు చేతిలోకి తీసుకున్న ఎన్ఐఏ ఐదేళ్ళపాటు నిందితులెవ్వరికీ వీసమెత్తు మినహాయింపులు దక్కనివ్వలేదు. కానీ, 2016లో అనుబంధ చార్జిషీటుదాఖలు చేస్తూ, తగిన ఆధారాలు లేనందున ప్రజ్ఞాఠాకూర్ మీద ఆరోపణలు ఉపసంహరించుకోవడమే కాక, నిందితులమీద మహారాష్ట్ర కంట్రోల్ ఆఫ్ ఆర్గనైజ్డ్ క్రైమ్ యాక్ట్ (ఎంసీఓసీఏ) ఎత్తివేయాలని సూచించింది. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అవినాష్ రసాల్‌కు తెలియకుండా పైనుంచి వచ్చిన ఆదేశాలమేరకు ఎన్ఐఏ ఈ పని చేసిందని అప్పట్లో వార్తలు వచ్చాయి. దీనికి ఇంకాముందే, ఈ కేసులో నిందితులపట్ల మెతకగా, సానుభూతితో వ్యవహరించమంటూ తనను ఎన్ఐఏ ఒత్తిడిచేస్తున్నదని ఆరోపిస్తూ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రోహిణీ సాలియన్ పక్కకు తప్పుకున్నారు.

ఈ కేసు వల్లనే పదిహేడేళ్ళపాటు తన జీవితం నాశనమైందనీ, తనను క్షోభ పెట్టినవారందరినీ దేవుడు శిక్షిస్తాడని ప్రజ్ఞాఠాకూర్ ఇప్పుడు శాపాలు పెడుతున్నారు. కానీ, ఈ కేసును ఏటీఎస్ నుంచి ఎన్ఐఏ స్వాధీనం చేసుకున్నాక ఆమెకు చాలా ఉపశమనాలు దక్కాయి. ఆమెను వదిలేయమని ఎన్ఐఏ కోరినప్పటికీ, గతంలో ఏటీఎస్ ఇచ్చిన ఆధారాలమేరకు ఎన్ఐఏ కోర్టు ఇంతవరకూ విచారణలో కొనసాగించడమే ఈ ఆగ్రహానికి కారణం కావచ్చు. ఇందుకు ప్రధాన కారకుడు, మాలేగావ్ కుట్రను శోధించి, ఛేదించిన హేమంత్ కర్కరేను ఆమె గతంలోనే శపించారు. ఆమెమీద ఒకపక్క ఇంకా కేసు ఉండగానే, 2019లోక్‌సభ ఎన్నికల్లో భోపాల్‌నుంచి బీజేపీ ఆమెను నిలబెడితే, తన శాపం వల్లనే ముంబై ఉగ్రదాడిలో పాక్ టెర్రరిస్టుల చేతుల్లో కర్కరే హతమైపోయారని ఎన్నికల ప్రచారసభలో వ్యాఖ్యానించారు ఆమె.

ఏటీఎస్ సేకరించిన సాక్ష్యాలూ, వాంగ్మూలాలు శుద్ధతప్పని అంటూ ఎన్ఐఏ మళ్ళీ అంతా కొత్తగా ఆరంభించినప్పుడే ఈ తీర్పుకు పునాది పడింది. మళ్ళీ రికార్డుచేసినప్పుడు 164మంది వాంగ్మూలాలు గతానికి భిన్నంగా మారిపోయాయి. ఈ తరహా మారణకాండలకు సంబంధించిన కేసుల్లో దర్యాప్తులూ విచారణలూ సుదీర్ఘకాలం సాగి, తీర్పులు చివరకు ఇలా తేలిపోవడం విషాదం. రెండుదశాబ్దాల నాటి ముంబై రైలు పేలుళ్ళకేసులో నిందితులుగా ఉన్న 12మందిని బాంబే హైకోర్టు ఇటీవల నిర్దోషులుగా ప్రకటిస్తే, అదేరోజున మహారాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించి స్టే సాధించింది. మాలేగావ్ కేసులోనూ ఇదేరీతిలో పై కోర్టుకు అప్పీలుకు వెడతారా, లేక నిందితుల మతాలూ మా అభిమతాలూ ఇక్కడ పూర్తిగా వేరు అంటారా?.. అంతా తెలిసికూడా కొందరు మేధావులు అమాయకంగా వేస్తున్న ప్రశ్న ఇది.

# కులం.. బలం.. ఇంధనమై కాంగ్రెస్ పయనం!

కాంగ్రెస్ పార్టీ భవిత గురించి ఇప్పటికే చాలా విశ్లేషణలు వచ్చాయి. ఆశల కంటే వాటిల్లో నిరాశలే ఎక్కువ! 1989 నుంచి 2014 వరకూ దేశ రాజకీయాలను నిశితంగా పరిశీలించిన వారిలో ఎక్కువమంది ఒక పార్టీ స్వంత ఆధిక్యతతో కేంద్రంలో సమీప భవిష్యత్తులో అధికారంలోకి వచ్చే అవకాశం లేదని భావించారు. దేశంలో సంకీర్ణ రాజకీయాల యుగం మొదలైందనీ, నిజమైన సమాఖ్య స్థాపనకూ, రాష్ట్రాలతో సంప్రదింపులతో కూడిన విధానాలకు అది దోహదం చేస్తుందనీ ఊహించారు. 2014 వచ్చేసరికి పరిస్థితి మారిపోయింది. పదేళ్లపాటు బీజేపీకి సంపూర్ణ ఆధిక్యత లభించింది. కిందటి ఎన్నికల్లో ఆ ఆధిక్యతకు మళ్లీ గండిపడింది. అయినా ఎన్డీయే కూటమిగా బీజేపీ అధికారాన్ని దక్కించుకుంది. ప్రస్తుతానికి కూటమిలో లుకలుకలు లేవు. బీజేపీదే సర్వాధికారం అన్నట్టుగా పాలన సాగుతోంది. హిందీ భాషపై రేగిన వివాదంలో కానీ, జమిలి ఎన్నికల విషయంలో కానీ ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు బీజేపీని పూర్తిగా సమర్థిస్తూ మాట్లాడుతున్నాయి.

2024 లోక్‌సభ ఎన్నికల్లో గెలుపుకోసం కాంగ్రెస్ చాలా గట్టిగా ప్రయత్నించింది. ముఖ్యంగా కులగణనను చేపట్టి విద్య, ఉద్యోగాలు, పదవుల్లో కులాల జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు పెంచుతామని వాగ్దానం (జిత్నీ ఆబాదీ ఉత్నా హక్) చేసింది. ప్రధాని మోదీ కోరినట్లుగా 400 లోక్‌సభ స్థానాల్లో బీజేపీని గెలిపిస్తే రాజ్యాంగాన్ని సవరించి మొత్తం రిజర్వేషన్లనే రద్దుచేస్తారని ఉధృతంగా ప్రచారమూ చేసింది. అయినా కాంగ్రెస్ 100 మార్క్‌ను దాటలేదు. కులగణన, రిజర్వేషన్ల పెంపు అస్త్రాన్ని కాంగ్రెస్ గరిష్ఠ స్థాయిలో ఉపయోగించింది. నిజానికి భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్ గాంధీ కులగణనకు కొంత ఊపును తీసుకొచ్చారు. వెనుకబడిన కులాలను (బీసీలు) రాజకీయంగా ఆకర్షించటానికి కాంగ్రెస్ పార్టీకి ఒక బ్రహ్మాస్త్రం లభించిన భావన సైతం అప్పుడు నెలకొంది. ఎంతో కీలకమైన లోక్‌సభ ఎన్నికల్లోనూ, అంతకు కొద్దిగా ముందూ వెనుకా జరిగిన మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, హర్యానా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఆ అస్త్రం ఆశించిన ఫలితాలను సాధించిపెట్టలేదు. కర్ణాటక, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ గెలుపులో కులగణన అంశం ప్రభావం దాదాపుగా లేదనే చెప్పొచ్చు.

సామాజిక, ఆర్థిక మార్పులు వేగంగా వస్తున్న నేపథ్యంలో కులగణన-రిజర్వేషన్ల నినాదంపై ఆధారపడి వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ విజయం సాధించగలదా? అన్నదే ఆ పార్టీ ముందున్న కీలక సవాల్‌గా మారింది. కులాల లెక్కలు తీయటం కష్టం కాదు. ప్రతి కులంలోనూ ఒక కుటుంబం సామాజిక ఆర్థిక పరిస్థితిని మదింపువేసి, ఉన్నది ఉన్నట్లు తెలుసుకోవటమే కష్టం. బీసీల్లోనే కాదు.. ఎస్సీ, ఎస్టీల్లో కూడా ఆర్థిక అంతరాలను పరిగణనలోకి తీసుకుని రిజర్వేషన్ల విధానాల్లో మార్పులు తీసుకు రావటం సవాళ్లతో కూడుకున్న పని. వివిధ కులాల్లో సంపన్న శ్రేణులను గుర్తించాలని అనేక సందర్భాల్లో కోర్టులు చెబుతున్న విషయాన్ని విస్మరించలేని పరిస్థితులే ఉన్నాయి. కులాల్లోని పేద, మధ్య, ధనిక వర్గాలను పరిగణనలోకి తీసుకుని కొత్త విధానాలు రూపొందించకపోతే ఎస్సీ, ఎస్టీ, బీసీల్లో కూడా నాలుగైదు కులాల ఆధిపత్యమే కొనసాగే ప్రమాదం ఉంటుంది. ఇప్పటికే ఆ తరహా ఆధిపత్య ఛాయలు స్పష్టంగా కనపడుతున్నాయి.

కులగణన సర్వే తీరు గురించి ఏ రాష్ట్ర ప్రభుత్వం ఎంత గొప్పగా చెప్పుకొన్నా దానికి పరిమితులు చాలానే ఉన్నాయి. బిహార్ అయినా, తెలంగాణ అయినా దీనికి మినహాయింపు కాదు. కులం, మతం గురించి ఉన్నది ఉన్నట్లుగా చెప్పేవారు ఆర్థిక పరిస్థితి వచ్చేటప్పటికి అర్ధసత్యాలే చెబుతారు. ఆస్తులు వెల్లడించటం స్వచ్ఛందం కాబట్టి రికార్డుల్లోకి ఎక్కినవి.. ముఖ్యంగా పట్టణ, నగర ప్రాంతాల్లో తక్కువగానే ఉంటాయి.




**బీసీ రిజర్వేషన్ల అంశం ఉత్తరప్రదేశ్, బిహార్‌లో మాత్రమే రాజకీయాలను గణనీయంగా మార్చగలిగింది. మిగతా చోట్ల అంత ప్రభావం చూపలేదు. 2010 నాటికి ఆ రెండు రాష్ట్రాల్లోనూ పరిస్థితి మారిపోయింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌కు ఆ రిజర్వేషన్ల ఆధారంగా రాజకీయాలు నడపటం కత్తిమీద సామే! ఇందులో తేడావస్తే ఒక అస్త్రం నిర్వీర్యమైపోతుంది. కాంగ్రెస్‌లో సైద్ధాంతిక శూన్యత ఏర్పడుతుంది! నెహ్రూ మార్గం నుంచి వైదొలగి రాంమనోహర్ లోహియా దారిలో నడుస్తున్న కాంగ్రెస్‌కు అప్పుడు మరో అన్వేషణ తప్పదు!**

ఇళ్లస్థలాలు, వాహనాలు, షేర్లు, మ్యూచువల్ ఫండ్స్, బంగారం లాంటివి ఆ కోవలోకే వస్తాయి. ఆస్తులు, సంపదలపై అసలు సమాచారం లేకుండా కులగణన వల్ల ఆశించిన ప్రయోజనం కలగదు. సర్వేల పరిమితులు రాజకీయ నాయకత్వాలకు స్పష్టంగా తెలుసు. రాజకీయాలు మాట్లాడనీయవు అంతే!

ఈ పరిమితులు ఎన్ని ఉన్నప్పటికీ తెలంగాణలో చేపట్టిన కులగణననూ, దాని ఆధారంగా పెంచిన రిజర్వేషన్లను ఒక నమూనాగా దేశం ముందుపెట్టి, వచ్చే సాధారణ ఎన్నికల్లో కొట్లాడాలని కాంగ్రెస్ పార్టీ గట్టి నిర్ణయం తీసుకుంది. తెలంగాణ సర్వే ఆదర్శ నమూనాగా నిలవాలంటే అందులో నమోదైన కీలక విషయాలు వెల్లడి కావాలి. ఇప్పటిదాకా ప్రభుత్వం వెల్లడించిన విషయాలు సాధారణమైనవి. పెద్దగా వివాదాస్పదం కానివి. కానీ వాటిల్లో కూడా ఒక విషయం వివాదాస్పదం అయింది. ముస్లింల్లోని 10.8 శాతం మందిని బీసీల జాబితాలో చూపించటమే దీనికి కారణం. బీసీ ఈ-కేటగిరిలో ఉన్న ముస్లిం కులాలను సర్వే సందర్భంగా ఆ కేటగిరీలోనే నమోదుచేసి లెక్కించారు. హిందూ బీసీల్లోని 46.25 శాతానికి దాన్ని కలిపి లెక్కించి మొత్తంగా బీసీల సంఖ్యను 56.30 శాతంగా తేల్చారు. బిహార్‌లోనూ అలాగే చేశారు. మండల్ కమిషన్ కూడా ముస్లింల్లోని వెనుకబడిన సమూహాలను బీసీలుగానే పరిగణించింది. ముస్లింల జనాభా 16.16 శాతం ఉంటే అందులో 8.40 శాతం మందిని బీసీలుగా లెక్క వేసింది. హిందూ బీసీలను 43.70 శాతంగా అంచనా కట్టింది. రెండు వర్గాల్లో కలిపి మొత్తంగా బీసీలు 52 శాతం ఉంటారని పేర్కొంటూ 27 శాతం రిజర్వేషన్లను సిఫార్సు చేసింది. మండల్ కమిషన్ సిఫార్సులపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో సైతం ముస్లింలను బీసీల్లో కలపటాన్ని తప్పుపట్టలేదు. దేశంలో ఎక్కడా లేనట్లుగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వమే కొత్తగా ముస్లింలను బీసీలుగా లెక్కించిందనే విమర్శ వాస్తవాల ముందు నిలబడదు. ముస్లింలకు సంబంధించి మరో వింత వాదన కూడా విపరీత ప్రచారాన్ని పొందుతోంది. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు కల్పించిన (ఈడబ్ల్యూఎస్) రిజర్వేషన్లలో ముస్లింలు లబ్ధిపొందుతున్నారు కాబట్టి.. మళ్లీ రాష్ట్ర బీసీ జాబితాలో వాళ్లను ఎందుకు చేర్చారన్న వాదన అలాంటిదే. ఈడబ్ల్యూఎస్ ద్వారా లబ్ధి పొందేవారు ఇప్పటికే అమల్లో ఉన్న రిజర్వేషన్ల పరిధిలో లేని వారై ఉండాలన్న నిబంధన స్పష్టంగా ఉంది. అందువల్ల రెండు కేటగిరీల్లో ముస్లింలకు రిజర్వేషన్లు కల్పిస్తున్నారన్న ప్రశ్నే ఉత్పన్నం కాదు.

సమగ్ర కులగణనలో లభ్యమైన వ్యక్తిగత సమాచారం ఇవ్వాలని ఎవరూ అడగటం లేదు. వ్యక్తుల సమాచార గోప్యతకు భంగం కలిగించే విషయాలను వెల్లడించాలనీ ఆశించటం లేదు. మరోవైపు సర్వే ఫలితాలను విశ్లేషించటానికి నియమించిన జస్టిస్ సుదర్శనరెడ్డి నేతృత్వంలోని నిపుణల కమిటీ సిఫార్సులు కూడా వచ్చేశాయి. వివిధ కులాల వెనుకబాటుతనాన్ని 42 అంశాల ఆధారంగా నిర్ధారించి నిర్దిష్ట నివారణా చర్యలనూ కమిషన్ సూచించి ఉండొచ్చు. ప్రభుత్వ విధానాలను అవి ప్రభావితమూ చేయొచ్చు. కానీ కులగణనలో తేలిన అసలు సమాచార వెల్లడికీ నిపుణుల కమిటీ సిఫార్సులకూ సంబంధం లేదు. సమాచారాన్ని వెల్లడించకపోవటం వల్ల ప్రభుత్వం ఏదో దాస్తోందన్న అభిప్రాయమే తప్ప లాభం ఏమీ ఉండదు. మండల్ కమిషన్ బీసీలకు 27 శాతం రిజర్వేషన్లను సిఫార్సు చేయటానికి ప్రాతిపదికగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో వారెంత శాతం ఉన్నారో స్పష్టంగా పేర్కొంది. మొత్తం ఉద్యోగుల్లో 12.55% మంది బీసీలు మాత్రమే ఉన్నారని తేల్చింది. హోదాల వారీగా లెక్కలనూ ఇచ్చింది. అప్పటికే సుప్రీంకోర్టు నిర్దేశించిన 50% (రిజర్వేషన్ల) పరిమితిని దృష్టిలో ఉంచుకుని 27 శాతం రిజర్వేషన్లను సిఫార్సు చేసింది.

బీసీలకు ఉద్యోగ, విద్య, రాజకీయ రిజర్వేషన్లను 42% పెంచటానికి ఉద్దేశించిన రెండు బిల్లులను తెలంగాణ శాసనసభ ఆమోదించింది. వాటిని రాజ్యాంగం 9వ షెడ్యూలులో చేర్చడానికి రాష్ట్రపతికీ పంపారు. కానీ ఇప్పటికీ ఉద్యోగుల్లో బీసీలు ఎంతమంది ఉన్నారో తెలిపే సమాచారం లేదు. ఇంజనీరింగు, వైద్య కాలేజీల్లో వాళ్లకు ప్రాతినిధ్యం ఎంతో వెల్లడి కావటం లేదు. నిజానికి వీటిని వెల్లడించినప్పటికీ కులగణనకు సంపూర్ణ సార్థకత రాదు. ప్రతికులానికి చెందిన వారు ఉద్యోగ, విద్య, రాజకీయ పదవుల్లో ఎంతమంది ఉన్నారో వెల్లడించగలగాలి. 134 బీసీ కులాల జనాభా కూడా విడివిడిగా ఎంతమంది ఉన్నారో తెలపగలగాలి. రాష్ట్రంలో కాంగ్రెస్ ఎన్నికల వాగ్దానం ప్రకారమే బీసీ రిజర్వేషన్లను 42 శాతంగా నిర్ధారించారు. కానీ ఆ వర్గాల జనాభా 56% ఉన్నారని లెక్కలు చెబుతున్నప్పుడు రిజర్వేషన్లు 42 శాతానికే ఎందుకు ఆగాయన్న ప్రశ్నా తలెత్తుతుంది. బీసీ కమిషన్ కూడా 42% సరిపోతుందనీ చెబితే అందుకు శాస్త్రీయ ప్రాతిపదికా వెల్లడి కావాలి. 'జిత్నీ ఆబాదీ ఉత్నా హక్' విధానమైనప్పుడు 42 శాతానికి తర్కమేమిటో తెలపాల్సి వస్తుంది.



▪ రాహుల్ కుమార్

తెలంగాణ నమూనాతో దేశ ప్రజలను ఆకర్షించాలంటే దానిపై చర్చను వచ్చే ఎన్నికల వరకూ కాంగ్రెస్ రాజకీయంగా సజీవంగా ఉంచగలగాలి. బహుశా అందుకనే 42 శాతం రిజర్వేషన్లు కల్పించే చట్టాలను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో ప్రవేశపెట్టే విధంగా బీజేపీ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావటానికి ఢిల్లీ కేంద్రంగా కార్యాచరణకు పదును పెడుతోంది. జంతర్ మంతర్ వద్ద ధర్నా, రాష్ట్రపతితో భేటీ అందులో భాగాలే. ఇక కులగణన, రిజర్వేషన్ల పెంపు ఆధారంగా కాంగ్రెస్‌కు ప్రజాభిమానం పెరిగే ఏ అవకాశాన్నీ బీజేపీ తేలికగా తీసుకోవటం లేదు. కులాలవారీ జనాభాగణనకు ఆదేశాలు జారీచేయటమే దానికి నిదర్శనం. కిందటి లోక్‌సభ ఎన్నికల ప్రణాళికలో కులగణన గురించి బీజేపీ ఒక్క మాటను కూడా ప్రస్తావించలేదు. కనీసం కాంగ్రెస్‌పై, ఆ విషయమై విమర్శ కూడా లేకుండా అందులో జాగ్రత్తలు తీసుకుంది.

**తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఎన్నికల వాగ్దానం ప్రకారమే బీసీ రిజర్వేషన్లను 42 శాతంగా నిర్ధారించారు. కానీ ఆ వర్గాల జనాభా 56% ఉన్నారని లెక్కలు చెబుతున్నప్పుడు రిజర్వేషన్లు 42 శాతానికే ఎందుకు ఆగాయన్న ప్రశ్నా తలెత్తుతుంది. బీసీ కమిషన్ కూడా 42% సరిపోతుందని చెబితే అందుకు శాస్త్రీయ ప్రాతిపదికా వెల్లడి కావాలి. 'జిత్నీ ఆబాదీ ఉత్నా హక్' విధానమైనప్పుడు 42 శాతానికి తర్కమేమిటో తెలపాల్సి వస్తుంది.**

అసెంబ్లీలు ఎన్ని చట్టాలు చేసినా సుప్రీంకోర్టు కుల ఆధారిత రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని ఎత్తివేస్తే తప్ప అడుగులు ముందుకు పడవు. మండల్ సిఫార్సుల సందర్భంగా ఇచ్చిన తీర్పును తోసిపుచ్చే అధికారం పార్లమెంటుకు ఉంటుంది. కానీ అంతవరకే చేయగలదు. న్యాయసమీక్ష పేరిట సుప్రీంకోర్టు దాన్ని కొట్టివేస్తే పరిస్థితి మళ్లీ మొదటికి వస్తుంది. ఈడబ్ల్యూఎస్ తీర్పు సందర్భంగా 50% రిజర్వేషన్ల పరిమితిని సుప్రీంకోర్టు తొలగించిందని రాజకీయంగా వాదించొచ్చు. కుల ఆధారిత రిజర్వేషన్లకు 50% పరిమితి యథాతథంగా కొనసాగుతుందని ఈడబ్ల్యూఎస్ తీర్పులో స్పష్టంగా ఉంది. బీసీ రిజర్వేషన్ల అంశం ఉత్తరప్రదేశ్, బిహార్‌లో మాత్రమే రాజకీయాలను గణనీయంగా మార్చగలిగింది. మిగతా చోట్ల అంత ప్రభావం చూపలేదు. 2010 నాటికి ఆ రెండు రాష్ట్రాల్లోనూ పరిస్థితి మారిపోయింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌కు ఆ రిజర్వేషన్ల ఆధారంగా రాజకీయాలు నడపటం కత్తిమీద సామే! ఇందులో తేడావస్తే ఒక అస్త్రం నిర్వీర్యమైపోతుంది. కాంగ్రెస్‌లో సైద్ధాంతిక శూన్యత ఏర్పడుతుంది! నెహ్రూ మార్గం నుంచి వైదొలగి రాంమనోహర్ లోహియా దారిలో నడుస్తున్న కాంగ్రెస్‌కు అప్పుడు మరో అన్వేషణ తప్పదు!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

# దళిత సాహిత్య వైతాళికుడు

ఆధిపత్య వర్గాల ధోరణి బహుజనులను విద్యకు దూరం చేయడంతో దేశ స్వాతంత్ర్యానికి పూర్వం, ఆ తరువాత ఎంతో మంది అక్షర జ్ఞానానికి దూరమయ్యారు. అయినా, జ్యోతిబా ఫూలే, బి.ఆర్. అంబేడ్కర్ వంటి ఎందరో మహనీయులు విద్యావంతులుగా మారి సమాజానికి వెలుగులు పంచారు. వీరిలో అన్నాభావు సాఠె ఒకరు. అందరిలా బడికి వెళ్లి చదువుకునే అవకాశం లేకపోయినా, జీవితమనే పాఠశాలలో విద్యార్థిగా చేరి 'విద్యా జ్ఞానం అన్ని సమస్యలకు దివ్య ఔషధం' అనే ముక్తా సాల్వె మాటలను ప్రేరణగా తీసుకుని, అక్షర జ్ఞానియై సాహిత్య సమ్రాట్‌గా ప్రసిద్ధిచెందారు. దేశ విదేశీయులతో 'అన్నా' అని పిలుపునందుకున్న మొదటి భారతీయుడు అన్నాభావు సాఠె.

ఆయన అసలు పేరు 'తుకారాం భావురావ్ సాఠె'. మహారాష్ట్ర, వాటేగావ్ గ్రామంలో ఉన్న మాంగ్ వాడాలో 1920 ఆగస్టు 1న జన్మించారు. అన్నా చిన్నప్పుడు అభంగ్స్ (భక్తి పాటలు)ను లయబద్ధంగా పాడేవారు. వంశపారంపర్యంగా బంధువులు నిర్వహించే 'తమాషా' ప్రదర్శనలలో చురుకుగా పాల్గొని, జానపద వాయిద్యాలు వాయించడం, పాటలు పాడటం నేర్చుకున్నారు. కత్తి, ఈటె, బాకు, దాండ్ పట్టా, కర్రసాము యుద్ధ కళను తమాషాలకు జోడించి, బహుళ ప్రాచుర్యంలోకి తీసుకురావడంలో విశేషకృషి చేశారు.



పదేళ్ళ వయస్సులో స్వాతంత్ర్యోద్యమంలో కూడా పాల్గొన్నాడు.

బతుకుతెరువు కోసం కుటుంబం బొంబాయికి వలస వచ్చినపుడు ఒక సినిమా థియేటర్‌లో డోర్ కీపర్‌గా పని చేయడం అన్నా జీవితాన్ని మార్చేసింది. సినిమాల ప్రభావంతో దుకాణాలు, హోటళ్లు, సినిమా పోస్టర్లపై ఉన్న అక్షరాలను చదవడానికి యత్నిస్తూ చదవడం, రాయడం నేర్చుకున్నారు. మొదట్లో విలేకరిగా పనిచేస్తూ స్వీయ అనుభవాలు, నిజ ఘటనల ఆధారంగా కథలు రాసేవారు. సాంస్కృతిక చైతన్యం ద్వారా స్వాతంత్ర్యోద్యమంలో సామాన్య ప్రజలను భాగస్వాములను చేసేందుకు 1943లో ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ ఏర్పాటులో ముఖ్యపాత్ర వహించిన అన్నా, తన ఇద్దరు సహచరులతో 1944లో 'రెడ్ ఫ్లాగ్ కల్చరల్ స్క్వాడ్' అనే కొత్త తమాషా బృందాన్ని ఏర్పాటు చేసి, హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. తన పాటలు, మాటలతో ప్రజలను ఉర్రూతలూగించడంతో, ప్రజలు ఆయనను 'లోక్ షాహిర్' అని పిలిచేవారు. కొంతకాలం తర్వాత ప్రభుత్వం తమాషాలను నిషేధించింది. లాల్ బావతా కళాపథక్ కోసం రాసిన నాటకాలను 'లావని' (మహారాష్ట్రలో ప్రసిద్ధిగాంచిన సంగీత నృత్య ప్రదర్శన), 'పోవాడా' (జానపద పాటలు) రూపంలోకి మార్చారు.

రష్యా విప్లవం విజయగాథను వివరిస్తూ 'స్టాలిన్ గ్రాడ్' నాటకాన్ని రాయగా, అది రష్యన్ భాషలోకి అనువాదమైంది. అన్నా 1961లో రష్యాను సందర్శించారు. ఆ ప్రయాణ అనుభవాలను 'మాజా రష్యా చా ప్రవాస్' రూపంలో గ్రంథస్థం చేసిన మొదటి వ్యక్తిగా ఆశ్రితవర్గాల నుంచి చరిత్రకెక్కారు. తన జీవితకాలంలో నవలలు, చిన్న కథల సంకలనాలు, నాటకాలు వంటి 100కు పైగా రచనలు చేశారు. ఇవి రష్యన్, ఫ్రెంచ్, జర్మన్, చెక్, ఇంగ్లీష్, స్పానిష్ మొదలైన 27 అంతర్జాతీయ భాషల్లోకి అనువాదమై, ఆయన కీర్తిప్రతిష్ఠలు విదేశాలలో కూడా ప్రజ్వరిల్లాయి.

బాబాసాహెబ్ భావజాలం వైపు మొగ్గు చూపి, బడుగు బలహీన కార్మిక వర్గాలను చైతన్యపరిచే రచనలు చేశారు. 'ఫకీరా' నవలను బాబాసాహెబ్‌కు అంకితం చేశారు అన్నా. రష్యాలో సినిమా నటుడు రాజ్‌కపూర్‌తో పాటు విపరీతమైన అభిమానులు కలిగిన మరొక భారతీయుడు అన్నా భావు సాఠె అని తెలుసుకొని అప్పటి భారత ప్రధాని నెహ్రూ ఆశ్చర్యానికి గురయ్యారు. 1958లో బొంబాయిలో తన అధ్యక్షతన నిర్వహించిన 'మొదటి దళిత సాహిత్య సమ్మేళనం' ప్రారంభ ప్రసంగంలో "ఈ భూమి శేష్‌నాగ్ అని పిలిచే పాము తలపై కాకుండా దళిత, బహుజన వర్గాల శ్రమ శక్తి మీద సమతుల్యతతో నిలిచివుంది" అని ప్రకటించారు. అన్నాభావు రచించిన అనేక నవలలు, కథల ఆధారంగా అనేక చలన చిత్రాలు నిర్మించారు, ఇంకా నిర్మిస్తూనే ఉన్నారు.

రష్యాలో అన్నా పేరుమీద స్కాలర్‌షిప్ ఇవ్వడం మామూలు విషయం కాదు. కవి, రచయిత, విలేకరి, కార్మికుడు, నటుడు, దర్శకుడు, స్క్రీన్‌ప్లే రచయిత ఇలా బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన అన్నా సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఆయన జ్ఞాపకార్థం పోస్టల్ స్టాంప్ విడుదల చేసింది. మహారాష్ట్ర ప్రభుత్వం వివిధ కట్టడాలకు, సంస్థలకు ఆయన పేరు పెట్టి గౌరవించింది. ఇటీవల మహాత్మా గాంధీ మెమోరియల్ విశ్వ విద్యాలయం మరణానంతరం అన్నా భావు సాఠెకు 'డాక్టరేట్'ను ప్రదానం చేసింది. రష్యా రాజధాని 'మాస్కో'లో అన్నా విగ్రహాన్ని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.

పాఠశాలలో విద్యాభ్యాసం చేయకుండానే తన రచనల ద్వారా గ్రామీణ వ్యవస్థ, బడుగు బలహీన, మహిళా, కార్మిక వర్గాల స్థితిని కళ్ళకు కట్టినట్టు బహిర్గతం చేసి ప్రపంచ దృష్టిని ఆకర్షించారు. దళిత సాహిత్య పితామహుడిగా, సాహిత్య సమ్రాట్‌గా ప్రసిద్ధి చెందిన అన్నాకు 'భారతరత్న' ఇవ్వాలని ఆయన అభిమానులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. అలాగే అధికారికంగా ఆయన జయంతిని జరపాలని కోరుతున్నారు.

• గాయక్వాడ్ తులసీదాస్ మాంగ్
మాంగ్ సమాజ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు

# 'చరిత్ర'తో నరేంద్ర మోదీ పోటీ!



▪ రాజ్‌దీప్ సర్దేశాయి

**దీపశిఖ**

**భారత్ భావనపై ప్రభావశీల నెహ్రూవియన్ ఏకస్వామ్యాన్ని బద్దలు గొట్టేందుకు నెహ్రూ కీర్తికాయాన్ని కూల్చివేయాల్సిన అవసరం మోదీకి ఉన్నది. అందుకు ఏకైక మార్గం విదేశాంగ విధానం నుంచి దేశీయ వ్యవహారాల దాకా నెహ్రూ తీసుకున్న ప్రతి నిర్ణయాన్ని తీవ్రంగా విమర్శించడమే. వ్యక్తిగా, పాలకుడుగా నెహ్రూ లోపాలను ఎత్తి చూపడం ద్వారా చరిత్రలో ఆయన సమున్నత స్థానాన్ని తక్కువ స్థాయికి కుదించివేయడమే ప్రధాని మోదీ ప్రధానలక్ష్యంగా ఉన్నది.**

నరేంద్ర మోదీ సదా ఒక పరిపూర్ణ ప్రదర్శనకారుడు. ఆయనకు ఒక వేదిక, ఒక మైక్ ఇవ్వండి. ఆయన ఉపన్యాసానికి సభికులు మంత్రముగ్ధులైపోతారు. మోదీ మాటలకు తరచు కరతాళ ధ్వనులు మిన్నంటుతాయి. ఆయన సభలలో సాధారణంగా కనిపించే దృశ్యమిది. ఈ వారం లోక్‌సభలో ప్రధాని మోదీ 102 నిమిషాల పాటు ప్రసంగించారు. కాంగ్రెస్‌పై కఠోర విమర్శలు గుప్పించారు. తన పాలనా ఘనతను చాటుకోవడం, కాంగ్రెస్‌పై దాడిచేయడం ఆయన ఎంతగానో ఇష్టపడే, ఆనందించే విషయాలు. లోక్‌సభలో ఆయన ప్రసంగం కొంచెం ఎక్కువగానే సాగింది. అయితే పార్లమెంటులో మోదీ ప్రసంగించడం చాలా చాలా అరుదు గనుక ఆయన సుదీర్ఘ ప్రసంగం పట్ల ఎవరూ అసంతృప్తి చెందలేదు. ఆపరేషన్ సిందూర్ సందర్భంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరును తీవ్రంగా ఆక్షేపించిన వారిపై మోదీ నిర్దయగా తీవ్ర విమర్శలు చేశారు. విశేషమేమిటంటే ఆయన ప్రసంగంలో, సమస్త భారతీయులకు సుపరిచితమైన ఒక పేరు పదే పదే ప్రస్తావితమయింది. తన కంటే ముందు ప్రధానమంత్రిగా ఉన్న వారిలో ఒకరైన జవహర్ లాల్ నెహ్రూ గురించి మొత్తం 14 సార్లు పేర్కొన్నారు. ప్రతిసారీ దేశ పాలకుడుగా నెహ్రూ 'అపరాధాల'ను మోదీ ప్రస్తావించారు. మోదీ మనసులో నెహ్రూ పట్ల వ్యతిరేకత అంతగా ఎందుకు గూడుకట్టుకుపోయింది? ఆయన ఆలోచనలు నిరంతరం నెహ్రూ పట్ల ఒక తిరస్కారభావంతో ఎందుకు నిమగ్నమవుతున్నాయి? ఇందుకు కారణాలేమిటో చూద్దాం.

నెహ్రూ 1964లో కీర్తిశేషుడు అయ్యారు. మోదీ నవ యవ్వనంలో ఉన్న కాలమది. నెహ్రూ తరవాత, మోదీతో సహా 13 మంది భారత ప్రధానమంత్రి పదవిని అధిష్ఠించారు. ఇందిరాగాంధీ హయాంలో మోదీ రాజకీయాలలోకి వచ్చారు. 1975లో విద్యార్థి క్రియాశీలిగా ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాటంలో పాల్గొనడం ద్వారా మోదీ రాజకీయ జీవితం ప్రారంభమయింది. ఏ ఒక్క ప్రధానమంత్రి వల్లనైనా మోదీ నష్టపోవడం జరిగి ఉంటే ఆ ప్రధాని ఇందిరే కావచ్చు. ఎందుకంటే మోదీతో సహా వందలాది రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కార్యకర్తలను ఆమె అరెస్ట్ చేయించారు. అయినా ప్రధాని మోదీ హేళనకు గురయ్యే గత ప్రధానమంత్రులలో ఇందిర చాలా అరుదుగా ప్రస్తావితమవుతారు. ఆయన ఎప్పుడూ అపహసించేది జవహర్ లాల్ నెహ్రూనే.

తొలుత ఒక విషయాన్ని నొక్కి వక్కాణించవలసి ఉన్నది. నెహ్రూ నిస్సందేహంగా నికార్సయిన లౌకికవాది. దేశ ప్రధానమంత్రిగా జాతి జీవనంలో లౌకిక విలువలు వర్ధిల్లేందుకు ఆయన అంకిత భావంతో కృషి చేశారు. భారత్ ఎట్టి పరిస్థితులలోను ఒక 'హిందూ రాష్ట్ర' లేదా ఒక 'హిందూ పాకిస్థాన్'గా పరిణమించకూడదని నెహ్రూ మనఃపూర్వకంగా విశ్వసించారు, ఆకాంక్షించారు. ఈ కారణంగానే ఆయన తరచు హిందుత్వ శక్తులతో ఘర్షించేవారు. భారతీయ సమాజంలో వారి ప్రభావాన్ని తగ్గించేందుకు, సామాజికంగా బహిష్కరించేందుకు ఆయన ఎన్నో విధాలుగా కృషి చేశారు. మహాత్మా గాంధీని హిందూ మత దురభిమాని ఒకడు హతమార్చడం నెహ్రూను కలచివేసింది. హిందూ మతతత్వ శక్తులను సవాల్ చేయాలని నెహ్రూ దృఢంగా సంకల్పించుకున్నారు. బహుళ మత సమాజంగా భారత్ వర్ధిల్లాలని ఆయన ప్రగాఢంగా ఆశించారు. హిందూ మతతత్వం తన రాజకీయ దృక్పథానికి పూర్తిగా విరుద్ధం గనుక ఆయన తుదకంటా దానిపై రాజీలేని పోరాటం చేశారు. మరి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌కు నెహ్రూ ప్రధాన 'శత్రువు' కావడంలో ఆశ్చర్యమేమీ లేదు సంఘీయులు ఆయన్ని సైద్ధాంతికంగాను, రాజకీయంగానూ తీవ్రంగా వ్యతిరేకించారు, విద్వేషించారు.



ఆరెస్సెస్ సైద్ధాంతిక శిక్షణతో జీవితంలోకి ప్రవేశించిన వ్యక్తి నరేంద్ర మోదీ. సంఘ్‌ను, ఇతర హిందుత్వ సంస్థల ప్రభావాన్ని కట్టడి చేసేందుకు ప్రయత్నించిన నెహ్రూను ఆయన సదా ఒక దుష్ట స్వభావుడుగానే చూశారు. మోదీ రాజకీయ విశ్వాసాలను మౌలికంగా ప్రభావితం చేసిన వ్యక్తి, సంఘ్‌కు సుదీర్ఘకాలం సర్ సంఘ్ చాలక్‌గా ఉన్న, గురూజీగా సుప్రసిద్ధుడు అయిన ఎమ్ఎస్ గోల్వాల్కర్. 1940 నుంచి 1973 దాకా సంఘ్ అధినేతగా ఉన్న గోల్వాల్కర్, నెహ్రూను తన ప్రధాన ప్రత్యర్థిగా పరిగణించారు. ప్రథమ ప్రధానమంత్రి పట్ల గోల్వాల్కర్‌కు అటువంటి అభిప్రాయం ఉన్నప్పుడు ఆయన ప్రచండ శిష్యుడైన మోదీ, నెహ్రూను వ్యతిరేకించడంలో ఎందుకు వెనుకబడి ఉంటారు?

నెహ్రూ పట్ల మోదీ తీవ్ర వ్యతిరేకతకు రెండో కారణం కాంగ్రెస్ పార్టీ తీరుతెన్నులే. నెహ్రూ మరణానంతరం కాంగ్రెస్ పార్టీ ఆయన్ని ఒక దైవాంశ సంభూతుడుగా ఆరాధించింది. స్వతంత్ర భారతదేశానికి నెహ్రూ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన నాయకుడు అన్న వాస్తవాన్ని అలక్ష్యం చేసింది. ప్రధానమంత్రిగా 17 ఏళ్ల పాలనలో నెహ్రూ సాఫల్య వైఫల్యాలపై నిష్పాక్షిక చర్చను ప్రోత్సహించలేదు. నెహ్రూ సామ్యవాద విధానాలపై విమర్శలను సహించలేదు. ఆయన అనుసరించిన కశ్మీర్, చైనా విధానాలు సరైనవే నని సమర్థించింది. భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత నెహ్రూ విధానాల ప్రభావాన్ని, చారిత్రక వారసత్వాన్ని రూపుమాపేందుకు అనేక విధాలుగా ప్రయత్నిస్తూ వస్తోంది.

ఇది మూడో వివాదాస్పద విషయాన్ని ప్రస్తావించడాన్ని అనివార్యం చేస్తుంది. దేశ రాజకీయాలలో నెహ్రూ – గాంధీ కుటుంబ ఆధిపత్యమే ఆ అంశం. నెహ్రూ అనంతర కాంగ్రెస్ పార్టీ ప్రస్థానం వంశ పారంపర్య రాజకీయాల ప్రాబల్యంతో ప్రధానంగా ప్రభావితమయింది. కాంగ్రెస్‌ను ఒక కుటుంబ జాగీరుగా మార్చి వేసింది ఇందిరాగాంధీయే అయినప్పటికీ 'వంశ పారంపర్య' రాజకీయాలకు ఆద్యుడుగా నెహ్రూను తప్పుపడుతున్నారు. ప్రధాన మంత్రి పదవిలో ఆయన వారసుడుగా లాల్ బహదూర్ శాస్త్రి ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికయ్యారన్న వాస్తవాన్ని నెహ్రూను విమర్శిస్తున్నవారు విస్మరిస్తున్నారు. 'నెహ్రూ వారసుల చర్యలు ఆయన పేరు ప్రతిష్ఠలకు తీరని నష్టాన్ని కలిగించాయని' చరిత్రకారుడు రామచంద్ర గుహ అన్నారు. ఇది పూర్తిగా నిజం.

నెహ్రూ పట్ల మోదీ వ్యతిరేకతకు కారణమైన మరో ప్రధాన విషయాన్ని పేర్కొంటాను. నరేంద్ర మోదీ అసాధారణంగా ఆకట్టుకునే వ్యక్తి అనడంలో ఎవరికీ రెండో అభిప్రాయం లేదు. మోదీ గత ఏడాది తనను తాను 'జైవికంగా జన్మించని అవతారపురుషుడు'గా అభివర్ణించుకున్నారు. అటువంటి తనకు, భారతదేశ మహోన్నత ప్రధానమంత్రిగా గుర్తింపు పొందాలన్న తన ఆకాంక్షకు మధ్య అడ్డుగా ఉన్న ఏకైక వ్యక్తి నెహ్రూయే అని మోదీ భావిస్తున్నారు. భారత ప్రధానమంత్రి పదవిలో సుదీర్ఘకాలం కొనసాగిన నేతగా మోదీ ఇటీవలే ఇందిరాగాంధీ రికార్డును అధిగమించారు. ఇప్పుడు తనకు, శాశ్వత ప్రభావదాయక గణాంక మైలురాయికి మధ్య నెహ్రూ మాత్రమే అడ్డుగా ఉన్నారు. అయితే ఇది కేవలం ఒక రికార్డు బద్దలుగొట్టే అంకెల క్రీడ కాదు. నెహ్రూవియన్ భారత్ భావనను పూర్తిగా విడనాడి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రబోధాల ప్రాతిపదికన ఒక 'కొత్త' భారతదేశాన్ని నిర్మిస్తున్న ప్రప్రథమ ప్రధానమంత్రిని తానేనన్న భావన తన అనుయాయుల మనసుల్లో సుస్థిరంగా నెలకొల్పేందుకు నెహ్రూపై తన దృష్టిని నిరంతరాయంగా కేంద్రీకరించవలసిన అవసరం మోదీకి ఉన్నది. ఒక పురాతన నాగరికత వైభవాన్ని, ప్రాచీన హిందూ మత గ్రంథాల స్ఫూర్తిని ఆరెస్సెస్ కీర్తిస్తుండగా వైజ్ఞానిక దృక్పథం, నవీన సాంకేతికతల ఆలంబనతో ఒక ఆధునిక సమాజాన్ని నిర్మించేందుకు నెహ్రూ కృషి చేశారు. భారత్ భావనపై ప్రభావశీల నెహ్రూవియన్ ఏకస్వామ్యాన్ని బద్దలు గొట్టేందుకు నెహ్రూ కీర్తికాయాన్ని కూల్చివేయాల్సిన అవసరం మోదీకి ఉన్నది. అందుకు ఏకైక మార్గం విదేశాంగ విధానం నుంచి దేశీయ వ్యవహారాల దాకా నెహ్రూ తీసుకున్న ప్రతి నిర్ణయాన్ని తీవ్రంగా విమర్శించడమే. వ్యక్తిగా, పాలకుడుగా నెహ్రూ లోపాలను ఎత్తి చూపడం ద్వారా చరిత్రలో ఆయన సమున్నత స్థానాన్ని తక్కువ స్థాయికి కుదించివేయడమే ప్రధాని మోదీ ప్రధానలక్ష్యంగా ఉన్నది. ఈ లక్ష్య సాధనలో మోదీ, ఆయన మద్దతుదారులు ఒక మౌలిక తప్పు చేస్తున్నారు: అర్ధ సత్యాలు, అబద్ధాలతో నెహ్రూ ఘనతను కళంకితం చేయడానికి ఎంతగా ప్రయత్నిస్తున్నారో అంతకంటే మరెంతో ఎక్కువగా ఆయన శతాధిక కోట్ల భారతీయుల మనసుల్లో సజీవంగా వెలుగొందుతున్నారు.

తాజా కలం: ఉన్నత పదవుల్లో ఉన్న నాయకులు 75 సంవత్సరాల వయస్సు వచ్చిన తరువాత విధిగా పదవీ బాధ్యతల నుంచి వైదొలగాలన్న సంచలనాత్మక ప్రతిపాదనపై ఇటీవల తీవ్ర చర్చ జరుగుతున్న సమయంలో 'పదవి నుంచి వైదొలిగే విషయాన్ని ప్రధాని మోదీ పరిశీలనలోకి తీసుకుంటారా?' అని బీజేపీ నాయకుడు ఒకరిని ప్రశ్నించాను. 'కనీసం 2031 దాకా మోదీ అటువంటి ఆలోచన చేయరు' అని ఆ నేత బదులిచ్చారు. కారణమేమిటని ప్రశ్నించగా 'భారత ప్రధానమంత్రిగా సుదీర్ఘకాలం కొనసాగడంలో నెహ్రూ రికార్డును మోదీ ఆ ఏడాది అధిగమిస్తారని' ఆ నాయకుడు వివరించారు.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)



బెలూన్‌లు ఎగురవేసి డ్యూటీ మీట్‌ను ప్రారంభిస్తున్న పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్ట్

### నైపుణ్యం, సామర్థ్యం పెంచేందుకే

# డ్యూటీ మీట్

- తెలంగాణ పోలీస్ వ్యవస్థ దేశంలోనే టాప్
- ఆల్ ఇండియా 69వ డ్యూటీ మీట్‌లో ప్రతిభ కనబర్చాలి
- అదనపు డీజీపీ, టీజీపీఏ డైరెక్టర్ అభిలాష బిస్ట్
- సాధనతోనే ఏదైనా సాధ్యం : అదనపు డీజీపీ మహేష్ భగవత్
- మామునూరు పీటీసీలో సందడిగా డ్యూటీ మీట్
- పాల్గొన్న 400 మంది పోలీసులు



మాట్లాడుతున్న అభిలాష బిస్ట్


వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో 2వ తెలంగాణ పోలీస్ డ్యూటీ మీట్-2025 పోటీలు గురువారం వరంగల్ జిల్లా మామునూరు పీటీసీలో ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. సుమారు 400 మంది పోలీసులు పాల్గొన్న ఈ పోటీలను తెలంగాణ పోలీస్ అకాడమీ (టీజీపీఏ) డైరెక్టర్ అభిలాష బిస్ట్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో పోలీసులు నైపుణ్యం సాధించేందుకు డ్యూటీ మీట్ శిక్షణ ఎంతో అవసరమని ఆమె పేర్కొన్నారు. మూడు రోజుల పాటు జరుగనున్న ఈ మీట్‌లో 25 విభాగాలలో పోలీసులు పోటీ పడుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు డీజీపీ మహేష్ భగవత్, సీఐడీ డీఐజీ నారాయణ నాయక్, సీపీ సన్‌ప్రీత్ సింగ్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

- మామునూరు (ఆంధ్రజ్యోతి)

7

## నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు

హనుమకొండ సిటీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ఈ నెల 1వ తేదీ నుంచి 7 వరకు నిర్వహించేందుకు మహిళా, శిశు సంక్షేమశాఖ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా సంక్షేమ అధికారి జయంతి తెలిపారు. ఈ సంవత్సరం థీమ్ 'తల్లిపాలకు ప్రాధాన్యం ఇవ్వండి'గా ప్రభుత్వం నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్పత్రుల సందర్శనతోపాటు తల్లులకు మద్దతు, కౌన్సెలింగ్, తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఇంటింటికి అంగన్‌వాడీ కౌన్సెలింగ్ పుస్తకాన్ని ఉపయోగించి ప్రతిరోజు హోమ్ విజిట్ చేయడం జరుగుతుందన్నారు.




### 'సంస్థాగతం'పై

# సన్నద్ధత ఏదీ?

### గులాబీ కమిటీలు వేయక మూడేళ్లు..

- అన్ని జిల్లాలకు అధ్యక్షులు మాత్రమే నియామకం
- ఉమ్మడి ఆరు జిల్లాల కమిటీలకు కార్యవర్గాలే లేవు
- ఏడాదిన్నరగా వరంగల్ జిల్లా బీఆర్‌ఎస్‌కు అధ్యక్షుడు కరువు
- నియోజకవర్గ ఇన్‌చార్జి పదవుల కోసమే నేతల కొట్లాట
- పార్టీ పదవులు క్యాడర్‌కు ఇవ్వడం లేదని శ్రేణుల్లో ఆందోళన
- స్థానిక ఎన్నికల నేపథ్యంలో కమిటీలు లేక నిరుత్సాహం
- అధిష్ఠానం దృష్టి సారించాలని కార్యకర్తల వేడుకోలు

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

సంస్థాగతంగా బలోపేతంపై బీఆర్‌ఎస్ పార్టీ దృష్టి పెట్టడం లేదని క్యాడర్‌లో అసంతృప్తి వ్యక్తం అవుతోంది. నియోజకవర్గాల్లో ఇన్‌చార్జి బాధ్యతల కోసం నేతలు కొట్లాడుకుంటున్నారే కానీ.. గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు పార్టీ కమిటీలను ఏర్పాటు చేసేందుకు దృష్టి పెట్టడం లేదనే ఆవేదనలో గులాబీ క్యాడర్ ఉంది. ఎప్పుడో మూడున్నరేళ్ల కిందట నియమించిన అధ్యక్షులే పార్టీని నడిపించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక ఏడాదిన్నర కిందట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ రాజీనామాతో ఏర్పడిన వరంగల్ జిల్లా అధ్యక్షపదవి ఖాళీలో ఇప్పటివరకు ఎవరినీ నియమించకపోవటంతో గులాబీ శ్రేణులు నిరాశలో ఉన్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్న నేపథ్యంలో పార్టీ కమిటీలు, అనుబంధ కమిటీలకు కార్యవర్గాలు లేకపోతే స్థానిక సమరాన్ని ఎదుర్కోవడం ఎలా అని క్యాడర్‌లో ఆందోళన నెలకొంది.

#### మూడున్నరేళ్లుగా పార్టీకి ఒకే ఒక్కడు

బీఆర్‌ఎస్‌కు మూడున్నరేళ్లుగా జిల్లా కార్యవర్గాలు లేవు. 2016 వరకు ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా తక్కళ్లపల్లి రవీందర్‌రావుతో పాటు కార్యవర్గం కూడా ఉంది. అయితే 2016 అక్టోబరు 11న ఉమ్మడి వరంగల్ జిల్లాను ఐదు కొత్త జిల్లాల ఏర్పాటు తరువాత కూడా కమిటీలను ఏర్పాటు చేయటంతో అధిష్ఠానం తాత్సారం చేసింది. రేపుమాపు అంటూ కాలం వెళ్లతీసింది. చిన్న జిల్లాలు ఏర్పాటు చేసిన తరువాత ఐదున్నరేళ్లకు 2022 జనవరి 26వ తేదీన నూతన కమిటీలను ఏర్పాటు చేశారు. అప్పటికే భూపాలపల్లి జిల్లా నుంచి కొత్తగా ములుగు కూడా జిల్లా కేంద్రంగా ఏర్పండింది. దీంతో ఆరు జిల్లాలకు బీఆర్‌ఎస్ అధ్యక్ష బాధ్యతలను ఎమ్మెల్యేలు, ఎంపీలు, జడ్పీ చైర్మన్‌లకే అప్పగించారు. వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా అరూరి రమేష్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా వినయ్‌భాస్కర్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షురాలిగా గండ్ర జ్యోతి, ములుగు జిల్లా అధ్యక్షుడిగా కుసుమ జగదీష్, జనగామ జిల్లా అధ్యక్షుడిగా సంపత్‌రెడ్డి, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షురాలిగా మాలోతు కవితలను నియమించారు. కేవలం జిల్లా అధ్యక్షులను మాత్రమే అధిష్ఠానం నియమించింది. ప్రధానకార్యదర్శులతో పాటు ఉపాధ్యక్షులు, సంయుక్తకార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, తదితర పదవులను ఎవరికీ కట్టబెట్టలేదు. వీటితోపాటు బీఆర్‌ఎస్ అనుబంధ సంఘాల కమిటీలు, మండల కమిటీలను కూడా ఏర్పాటు చేయలేదు. అనుబంధ సంఘాల కార్యవర్గాలు లేకపోవటంతో ఆ విభాగంలో పార్టీ క్యాడర్‌ను సమన్వయం చేసే అవకాశాలు లేకుండా పోయిందనే విమర్శలు ఉన్నాయి. మహిళ, రైతు, యువత, విద్యార్థి తదితర కమిటీలు లేకపోవటంతో గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి భారీగా నష్టంవాటిల్లిందనే వ్యాఖ్యలు వినబడుతున్నాయి. కేవలం జిల్లాలో అధ్యక్షులనే నియమించటంతో వారు ఏక్ నిరంజన్‌లుగా వ్యవహరించారు. మూడున్నరేళ్లుగా కార్యవర్గాలు లేకపోవటంతో కార్యవర్గ సమావేశాలు జరిగింది కూడా లేదు. అయితే ఉమ్మడి వరంగల్‌లోని ఆరు జిల్లాలకు పార్టీ కార్యాలయాలను మాత్రం నియమించారు. కార్యవర్గం లేకుండా కార్యాలయాలను నిర్మించటంతో అవి ఎందుకూ పనికిరాకుండా పోయాయనే విమర్శలు ఉన్నాయి. మరోవైపు గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేసిన వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షపదవికి గత ఏడాది మార్చి 17న రాజీనామా చేశారు. అప్పటి నుంచి వరంగల్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీకి ఆ ఒక్క ఏక్ నిరంజన్ కూడా లేకుండా పోయారు. అయితే 2023 జూన్ 11న ములుగు జిల్లా అధ్యక్షుడిగా ఉన్న కుసుమ జగదీష్ మృతిచెందటంతో రెండున్నర నెలల్లోనే 2023 ఆగస్టు 30న ఏటూరునాగారానికి చెందిన కె.లక్ష్మీనర్సింహరావును అధిష్ఠానం నియమించింది. కానీ, వరంగల్ జిల్లా విషయంలో పార్టీ అధ్యక్షుడిని నియమించేందుకు తాత్సారం చేయటం క్యాడర్‌లో అసంతృప్తి వ్యక్తం అవుతోంది.

#### స్థానికంలో నెగ్గేదెట్లా..?

గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమితో గులాబీ క్యాడర్ డీలా పడింది. ఆ తరువాత 2024 మే 13న జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్, మహబూబాబాద్ ఎంపీ స్థానాల్లో ఓటమి గులాబీ శ్రేణులను మరింత కుంగతీశాయి. వీటికి తోడు జూలై జరిగిన వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో పార్టీ అభ్యర్థి రాకేష్‌రెడ్డి ఓటమితో బీఆర్‌ఎస్ సైలెంట్ అయింది. వరుసగా మూడు ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో గులాబీ పార్టీ వరుస ఓటములు క్యాడర్‌లోనూ నిరుత్సాహం పెరిగింది. కీలకనేతలు కూడా కారు దిగి హస్తం గూటికి చేరటంతో మరికొంత ఆందోళనలో గులాబీ క్యాడర్ ఉంది. ఈ క్రమంలోనే స్థానిక ఎన్నికలపై ప్రభుత్వం కసరత్తు చేస్తుండటంతో గులాబీ శ్రేణుల్లో టెన్షన్ మొదలైంది. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయటంపై అధిష్ఠానం దృష్టిపెట్టడం లేదనే ఆవేదనలో కార్యకర్తలు ఉన్నారు. గ్రామస్థాయిలో అభ్యర్థులను నిలిపి ప్రచారంచేయటంతో పాటు గెలుపుకోసం వ్యూహరచన చేసే పార్టీ జిల్లా, మండల, గ్రామ అధ్యక్షులు లేకపోవటంపై క్యాడర్‌లో ఆందోళన వ్యక్తం అవుతోంది. ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీలు సంస్థాగతంగా పార్టీలను బలోపేతం చేసేందుకు

(మిగతా 8వ పేజీలో...)

## ఒడిస్సా యువతి కిడ్నాప్ కలకలం

- ధర్మారం రైల్వేగేటు వద్ద కారులో తీసుకెళ్లిన దుండగులు
- టెక్స్‌టైల్ పార్కులో పనిచేసే వస్తుండగా ఘటన
- నిందితులను పట్టుకునేందుకు పోలీసుల గాలింపు

6



## 'భద్రకాళి' ఈవోగా రామల సునీత

### దేవస్థానంలోని కార్యాలయంలో బాధ్యతల స్వీకరణ

వరంగల్ కల్చరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని చారిత్రక భద్రకాళి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా దేవాదాయ శాఖ వరంగల్ ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్ రామల సునీత నియమితులయ్యారు. ఈ మేరకు దేవాదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ సునీతను నియామకం చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. భద్రకాళి దేవస్థానం ఈవోగా విధులు నిర్వహిస్తున్న శేషు భారతి.. ఉద్యోగ విరమణ చేయడంతో ఆలయ నూతన ఈవోగా రామల సునీత నియామకం అయ్యారు. గురువారం సాయంత్రం ఆమె దేవాలయానికి చేరుకుని కార్యాలయంలో ఈవోగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. కాగా, గతంలో భద్రకాళి దేవస్థానం ఈవోగా ఐదేళ్లపాటు పాటు కొనసాగిన రామల సునీత.. నగరంలోని రామలింగేశ్వరాలయం, శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయానికి కూడా ఈవోగా బాధ్యతలు చేపట్టారు. దేవాదాయ శాఖ ఉమ్మడి వరంగల్ జిల్లా సహాయ కమిషనర్‌గా కొనసాగుతున్న సునీతను ప్రభుత్వం భద్రకాళి దేవస్థానం ఈవోగా నియమించింది. బాధ్యతలు చేపట్టిన అనంతరం అర్చకులు భద్రకాళి శేషు, ఆలయ సూపరింటెండెంట్ అద్దంకి విజయ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ కూచన హరినాథ్, దేవాలయ సిబ్బంది ఈవోకు శుభాకాంక్షలు తెలిపారు.

## ముల్కనూర్ సహకార సంఘాలు భేష్

- కలెక్టర్ స్నేహ శబరీష్ కితాబు
- ముల్కనూర్ మహిళా డెయిరీ సందర్శన



ముల్కనూర్ డెయిరీలో పాల ఉత్పత్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

భీమదేవరపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ముల్కనూర్ సహకార సంఘాలు భేష్‌గా ఉన్నాయని కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. గురువారం ముల్కనూర్ మహిళా డెయిరీ పాల నిర్వహణ, ముల్కనూర్ సహకార బ్యాంకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ముల్కనూర్ మహిళా డెయిరీని సందర్శించిన కలెక్టర్.. మహిళా సహకార డెయిరీ ఎప్పుడు ప్రారంభించారు..? ఎంత పెట్టుబడి? ఎలాంటి వనరులతో ప్రారంభించారని డెయిరీ జీఎం భాస్కర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో పాల సేకరణ ఎలా చేస్తారని, సేకరించిన పాల నాణ్యత ఎలా పరీక్షిస్తారని తెలుసుకున్నారు. రవాణా సదుపాయాలు, ప్రాసెసింగ్ ఏ విధంగా చేస్తుంటారని, రోజువారిగా ఎన్ని లీటర్ల పాల సేకరణ జరుగుతుందని ప్రశ్నించారు. మహిళా సంఘాల ప్రతినిధులకు ఎంత ప్రయోజనం కలుగుతుందని, ఎలాంటి పాల ఉత్పత్తులు తయారు చేస్తున్నారని, వాటి లాభాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డెయిరీ నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ వీక్షించారు. డెయిరీ పరిధిలోని గ్రామాల్లో సేకరించిన పాలను ఏ విధంగా శీతలీకరణ, పాల ప్యాకెట్ల తయారీని పరిశీలించారు. రవాణా వాహనాలను పరిశీలించారు. అనంతరం భీమదేవరపల్లి గ్రామంలోని పాల సేకరణ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సేకరణ కేంద్రం ద్వారా రోజుకు ఎన్ని లీటర్ల పాల నాణ్యతకు తీసుకుంటున్న పరీక్షలను అడిగి తెలుసుకున్నారు. పాడి రైతులకు బిల్లుల చెల్లింపు గురించి మహిళలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ముల్కనూర్ సహకార బ్యాంకును సందర్శించిన కలెక్టర్ అక్కడికి వచ్చిన రైతులతో మాట్లాడారు. బ్యాంకు ద్వారా ఎన్ని రకాల రుణాలు ఇస్తున్నారని, రికవరీ ఏ విధంగా ఉంటుందని తెలుసుకున్నారు. దాదాపుగా 32 రకాల రుణాలను రైతులకు అందిస్తున్నామని జీఎం రాంరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో మేన శ్రీను, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, తహసీల్దార్ రాజేష్, ఎంపీడీవో వీరేశం, డెయిరీ జీఎం భాస్కర్‌రెడ్డి, బ్యాంకు జీఎం రాంరెడ్డి, వెంకటేశ్వర్‌రావు, రాజమౌళి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



ముగింపు సభలో ప్రసంగిస్తున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి

### పెట్టుబడిదారులకు కమ్యూనిస్టులే

# ప్రత్యామ్నాయం

- దేశ సంపద కార్పొరేట్ శక్తులకే దాసోహం
- అంబానీ, అదానీల వద్దే కేంద్రీకృతం
- యుద్ధోన్మాదులు, మతోన్మాదులతోనే దేశానికి ప్రమాదకరం
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి

7

## అర్హులకే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు

- డబ్బులు వసూలు చేసిన వారిని వదిలిపెట్టం..
- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులకే కేటాయిస్తామని, ఇల్లు ఇస్తామని ఎవరైనా డబ్బులు తీసుకుంటే వదిలిపెట్టనని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మేయర్ గుండు సుధారాణి, ఇతర శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని కొందరు దళారులు పేద ప్రజల వద్ద డబ్బులు వసూలు చేసినట్లు తన దృష్టికి వచ్చిందని, వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇళ్లను మానవతా దృక్పథంతో, నిజమైన అర్హులకే ఇవ్వాలనే ప్రభుత్వ ఉద్దేశాన్ని కొందరు దిగజారుస్తున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల మధ్యలో పెరిగిన చెట్లను మున్సిపల్ సిబ్బందితో తొలగించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద ఎమ్మెల్యేలు నాయిని, నాగరాజు, మేయర్ సుధారాణి



వరంగల్ చింతల్‌లో మరుగుదొడ్లు పరిశీలిస్తున్న కమిషనర్

## మరుగుదొడ్ల నిర్వహణ పక్కాగా జరగాలి

- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్
- పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో మరుగుదొడ్ల పరిశీలన

వరంగల్ కార్పొరేషన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో మునిసిపల్ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న మరుగుదొడ్ల నిర్వహణ పక్కాగా జరగాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అధికారులకు సూచించారు. గురువారం వరంగల్ చింతల్, పుప్పాలగుట్ట, హనుమకొండ పబ్లిక్ గార్డెన్, ఏకశిల పార్కులలో ఉన్న మరుగుదొడ్ల నిర్వహణను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వంద రోజుల ప్రణాళికలో భాగంగా మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ బొమ్మన రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, శానిటరీ సూపర్‌వైజర్లు గోల్కొండ శ్రీను, పసునూరి భాస్కర్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.




# ఇక పంతుళ్ల హాజరు పక్కా..

### నేటి నుంచి ఉపాధ్యాయులకు ఫేస్ రికగ్నేషన్

- సమయపాలన కోసం సర్కారు ప్రత్యేక యాప్
- పాఠశాల ఆవరణలోనే పనిచేసే విధంగా రూపకల్పన
- 2023 సెప్టెంబరు నుంచే పాఠశాలల్లో విద్యార్థులకు ప్రారంభం
- గతేడాది సెప్టెంబర్ నుంచి ఆర్జేడీ, డీఈవో కార్యాలయాల్లో ప్రారంభం

6

## డ్రంకెన్ డ్రైవ్‌లో ఐదుగురికి జైలుశిక్ష

### 11 మందికి జరిమానా

మట్టెవాడ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన కేసుల్లో 11 మందికి వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అబ్బోజు వెంకటేష్ గురువారం రూ.11,800 జరిమానా, ఐదుగురు వాహనదారులకు జైలుశిక్ష విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కె.సుజాత తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపిన కేసుల్లో వరంగల్ జిల్లా గీసుగొండ మండలం మొగిలిచర్లకు చెందిన గనిపాక కిరణ్, సంగెంకు చెందిన ఈద వరుణ్‌లకు రెండు రోజుల జైలుశిక్ష, వరంగల్ పైడిపల్లికి చెందిన తిక్క స్వామి, బూజుగుండ్ల బాబు, వరంగల్ ఏసీ రెడ్డినగర్‌కు చెందిన శ్రీరాముల రమేశ్‌లకు మూడు రోజుల జైలుశిక్ష విధించారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన ఇద్దరికి రూ.1000 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ సుజాత పేర్కొన్నారు.

## వరంగల్ ప్రెస్‌క్లబ్ సభ్యులకు ఇన్సూరెన్స్

వడ్డెపల్లి, జూలై31 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ సభ్యులకు, వారి కుటుంబాలకు ఇన్సూరెన్స్ చేయించి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య అన్నారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో సభ్యులకు ఇన్సూరెన్స్ ప్రారంభించి ఫారాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రెస్ క్లబ్ సభ్యులు ఈ బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధి లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ బీమా పథకం జర్నలిస్టులకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు, వివిధ యూనియన్ల నాయకులు గాడిపెల్లి మధు, వల్లాల వెంకటరమణ, గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్, గడ్డం కేశవమూర్తి, కోరుకొప్పుల నరేందర్, కంకణాల సంతోష్, పెండెం వేణుమాధవ్, మట్టి దుర్గాప్రసాద్, మెండు రవీందర్, షఫీ, వేముల సదానందం, వీరగోని హరీష్ గౌడ్, గోకారపు శ్యామ్, వి.రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

## టీఎంఎంఎస్ ఉమ్మడి జిల్లా మహిళా అధ్యక్షురాలిగా ప్రసన్న



వడ్డెపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ ఎన్జీవోస్ కాలనీకి చెందిన ఇమ్మడి ప్రసన్న తెలంగాణ మాదిగ మహిళా సమాఖ్య(టీ ఎంఎంఎస్) వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షురాలుగా నియమితులయ్యారు. తెలంగాణ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇటుక రాజు మాదిగ ఆదేశం మేరకు రాష్ట్ర అధ్యక్షుడు సిరసనోళ్ల బాలరాజు మాదిగ గురువారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. టీఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుల సహకారంతో టీ ఎంఎంఎస్‌ను ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా విస్తృత పరిచి మాదిగ సమాజం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఇమ్మడి ప్రసన్న పేర్కొన్నారు.

## పాల్కూరికి స్మృతి వనం ఉపయోగంలోకి తేవాలి

● సోమనాథుడి విగ్రహం పాలతో శుద్ధి

● పరిసరాలను ఊడుస్తూ బీఆర్ఎస్ నిరసన



స్మృతి వనంలో ఊడుస్తూ నిరసన తెలుపుతున్న నాయకులు

పాలకుర్తి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కోట్లు ఖర్చు పెట్టి నిర్మించిన పాల్కూరికి సోమనాథుడు స్మృతి వనం పశువుల పాకల మారడంతో గురువారం బీఆర్ఎస్ నాయకులు విగ్రహాన్ని పాలతో శుద్ధి చేసి, ఆవరణను చీపుర్లతో ఊడుస్తూ నిరసన తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ ఆధ్వర్యంలో స్మృతి వనాన్ని పరిశీలించారు. నవీన్, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ బొబ్బాల అశోక్‌రెడ్డి మాజీ ఎంపీపీ నాగిరెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో రూ.కోటి వెచ్చించి తొలి తెలుగు విప్లవ కవి సోమనాథుడు పేరుతో స్మృతివనం నిర్మించారన్నారు. మాజీ మంత్రి దయాకర్‌రావు ప్రత్యేక శ్రద్ధతో పర్యాటకంగా అభివృద్ధి చేసి యువతను కవులుగా, రచయితలుగా ఎదగాలని భావిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్మృతివనాన్ని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో మాచెర్ల ఎల్లయ్య, ఎఫ్ఎస్‌సీఎస్ వైస్ చైర్మన్ కారుపోతుల వేణు, మామిండ్ల శోభన్, రవీంద్రాచారి, గణేష్, పాపారావు, రాజేశ్వర్‌రావు ఉన్నారు.



# ఇక పంతుళ్ల హాజరు పక్కా..

● నేటి నుంచి ఉపాధ్యాయులకు ఫేస్ రికగ్నేషన్

● సమయపాలన కోసం సర్కారు ప్రత్యేక యాప్

● పాఠశాల ఆవరణలోనే పనిచేసే విధంగా రూపకల్పన

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు శుక్రవారం నుంచి ఫేస్ రికగ్నేషన్‌తో హాజరు ప్రారంభం కానుంది. పాఠశాలల్లో పంతుళ్ల సమయపాలన పాటించే విధంగా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపడుతుంది. హాజరును వారే నేరుగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే విధంగా ఉపాధ్యాయులకు ఫేస్ రికగ్నేషన్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. సంబంధిత ఉపాధ్యాయుడి సెల్‌ఫోన్‌లోనే టీజీఎఫ్ఆర్ఎస్ అనే యాప్‌ను ఇన్‌స్టాల్ చేసి వారి హాజరును నేరుగా ఆన్‌లైన్‌లోనే పంపించేందుకు ఏర్పాట్లు చేసింది. 2023 సెప్టెంబర్ నుంచే పాఠశాలల్లోని విద్యార్థులకు ఇప్పటికే ఫేస్ రికగ్నేషన్ యాప్‌ను ఉపయోగించి విద్యార్థుల హాజరు శాతాన్ని నమోదు చేస్తుండగా, గతేడాది ఆర్జేడీ, డీఈవో కార్యాలయాల్లో ఈ యాప్ ద్వారా హాజరు ప్రారంభమైంది. సంబంధిత పాఠశాల ప్రాంగణం నుంచి మాత్రమే ఉపాధ్యాయులు వారి ఫేస్ రికగ్నేషన్‌ను సమర్పించాల్సి ఉంటుంది.

### ఫేస్ రికగ్నేషన్ యాప్ ఇలా..

రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖలోని ఉపాధ్యాయుల సమయపాలన కోసం కొత్తగా ప్రవేశపెట్టిన యాప్ టీజీఎఫ్ఆర్ఎస్ సంబంధిత ఉపాధ్యాయుడి స్మార్ట్ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేస్తారు. మొదటగా యాప్‌లో సంబంధిత ఉపాధ్యాయుడి వివరాలతో రిజిస్టర్ చేసుకొని లాగిన్ కావాల్సి ఉంటుంది. యాప్ ఇన్‌స్టాలేషన్ సమయంలోనే సంబంధిత స్కూల్ ఆవరణ లాంగిట్యూడ్, లాటిట్యూడ్‌లను టెక్నీషియన్ అప్‌లోడ్ చేస్తారు. ఒక్క సారి లాగిన్ అయిన తర్వాత యాప్ నిరంతరంగా వినియోగించవచ్చును. ఇక ఉపాధ్యాయుడు ఉదయం నిర్దేశిత సమయానికి కార్యాలయంలోనికి వచ్చిన తర్వాత యాప్‌ను ఓపెన్‌చేసి క్లాక్ ఇన్ అనే ఆప్షన్‌పై నొక్కితే సదరు ఉపాధ్యాయుడి వచ్చిన సమయం ఆన్‌లైన్‌లో సంబంధిత పర్యవేక్షణాధికారికి చేరుతుంది. అలాగే ఆఫీస్‌లో పనిసమయం ముగిసిన తర్వాత క్లాక్ అవుట్ అనే ఆప్షన్‌పై టచ్‌చేస్తే ఉపాధ్యాయుడి కార్యాలయాన్ని విడిచి వెళ్లే సమయాన్ని, పనిచేసిన గంటలను లెక్కించి తిరిగి సంబంధిత పర్యవేక్షణాధికారి ఆన్‌లైన్‌లో చేరుతుంది.

### సంబంధిత పాఠశాల ఆవరణలోనే..

టీజీఎఫ్ఆర్ఎస్ యాప్‌ను పకడ్బందీగానే తయారు చేసినట్లు తెలుస్తోంది. ఉపాధ్యాయుడు ఎవరైనా నిర్దేశిత సమయానికి స్కూల్‌కు రాకుండా ఇంటినుంచి గాని మరేదైనా ప్రదేశం నుంచి గానీ యాప్‌ను ఓపెన్ చేస్తే అది సంబంధిత స్కూల్ బయట ఉన్నారని సంక్షిప్త సందేశాన్ని ఇస్తుంది. ఉద్యోగులు తమ పాఠశాల ఆవరణలోకి వచ్చిన తర్వాతనే క్లాక్ ఇన్‌గానీ, క్లాక్ అవుట్ అనే ఆప్షన్లు యాప్‌లో పనిచేస్తాయి. స్కూల్ ఆవరణకు సంబంధించిన లాంగిట్యూడ్, లాటిట్యూట్‌డ్‌లను యాప్‌లో పొందుపరచడంతో సంబంధిత ఆవరణలో మాత్రమే ఆ యాప్ పనిచేస్తుంది.

### దశల వారీగా అమలు

విద్యాశాఖలోని అన్ని కార్యాలయాల్లో దశల వారీగా ఈ యాప్‌ను అమలు చేయనున్నారు. ఇప్పటికే పాఠశాలల్లో విద్యార్థుల హాజరును ఫేస్ రికగ్నేషన్ యాప్ ద్వారానే ఆన్‌లైన్‌లో పంపిస్తున్నారు. ఇది 2023 సెప్టెంబర్ నుంచి ప్రారంభమైంది. గతేడాది సెప్టెంబర్ నుంచి డీఈవో, ఆర్జేడీ, ఎంఈవో ఇతరత్రా కార్యాలయాల్లో టీజీఎఫ్ఆర్ఎస్ యాప్‌ను అమలు చేస్తున్నారు. ఇప్పుడు పాఠశాలల్లో ఈ విధానాన్ని ఉపాధ్యాయులు, సిబ్బందికి అమలు చేస్తున్నారు. కాగా, వరంగల్ పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ కార్యాలయంతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాల్లోని డీఈవో కార్యాలయాల్లో సైతం ఈ యాప్‌ను అమలు చేస్తున్నారు.

### ఫేస్ రికగ్నేషన్ అయితే చాలు..

టీజీఎఫ్ఆర్ఎస్ యాప్‌ను కొంతమంది ఉపాధ్యాయులు వారికి అనుగుణంగా వాడుకునేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. పాఠశాలకు వచ్చి రిజిస్టర్‌లో సంతకం చేసి బయటి పనులు చక్కదిద్దుకునే వారు ఈ యాప్‌ను తమకు అనుకూలంగా వాడుకునే ప్రమాదం లేకపోలేదు. ఉదయం క్లాక్ ఇన్ అయిన తర్వాత సదరు పంతులు స్కూల్‌ను వదిలిపెట్టి పోయేందుకు అవకాశం ఉంది. తిరిగి సాయంత్రం క్లాక్ అవుట్ సమయానికి స్కూల్‌కు వచ్చి క్లాక్ అవుట్ అయ్యేందుకు అవకాశం ఉంది. దీంతో ఈ యాప్‌ను సైతం కొంత మంది ఉపాధ్యాయులు వారికి అనుకూలంగా వాడుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇలాంటి వెసులుబాటు లేకుండా ఉపాధ్యాయులు ఆఫీస్‌కు వచ్చినప్పటి నుంచి సాయంత్రం వెళ్లేంత వరకు యాప్ పనిచేసే విధంగా రూపొందిస్తే బాగుండును అని కొంత మంది రెగ్యులర్‌గా స్కూళ్లకు వచ్చే ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు.

# మహిళా పోలీసులు సమర్థవంతంగా పనిచేయాలి

### ఉద్యోగ ప్రదేశాల్లో సవాళ్లను ఎదుర్కోవాలి

### అడిషనల్ డీజీపీ, పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ డీజీపీ, పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్

హనుమకొండ టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మహిళా పోలీసు అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా పనిచేయాలని, ఉద్యోగ ప్రదేశాల్లో సవాళ్లను అధిగమించాలని అడిషనల్ డీజీపీ, పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాషా బిస్త్ సూచించారు. గురువారం హనుమకొండ సుబేదారి పోలీసుస్టేషన్‌లో సుబేదారి సీఐ ఎం.రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో వరంగల్ సెంట్రల్ జోన్ పరిధిలోని మహిళా పోలీసు అధికారులతో ఇంటరాక్ట్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మహిళా పోలీసులు ఎదుర్కొంటున్న సమస్యలపై అడిషనల్ డీజీపీ అభిలాషా బిస్త్ మక్కువ చూపారు. ఉద్యోగ ప్రదేశాల్లో ఎదురయ్యే సవాళ్లు, పని ఒత్తిడి, ట్రాన్స్‌పోర్ట్, సెక్యూరిటీ, ప్రమోషన్ అవకాశాలకు సంబంధించి అంశాలపై అధికారులతో ప్రత్యక్షంగా చర్చించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీజీపీ మాట్లాడుతూ.. పోలీసు మహిళా సిబ్బంది పనితీరు మెరుగ్గా ఉందని కితాబిచ్చారు. మరింత సమర్థవంతంగా సేవలందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళా పోలీసులలో ఆత్మ విశ్వాసం పెంపొందించడమేగాక వారి సమస్యలను నేరుగా పరిష్కరించేందుకు ఒక మంచి వేదికగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీజీపీ షేక్ సలీమా, హనుమకొండ ఏసీపీ నర్సింగరావు, మామునూరు ఏసీపీ వెంకటేష్, కేయూ సీఐ రవికుమార్, మహిళా పీఎస్ సీఐ సువర్ణ, ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### మల్లన్న సేవలో టీజీపీఏ డైరెక్టర్

ఐనవోలు: ఐనవోలు మల్లికార్జునస్వామి వారి ఆలయ దర్శనం ఎంతో ఆధ్యాత్మిక చింతనను కలిగించిందని తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీ డైరెక్టర్ ఐపీఎస్ అభిలాష బిస్త్ ఆనందాన్ని వ్యక్తం చేశారు. మామునూరు పీటీసీలో జరుగుతున్న తెలంగాణ పోలీస్ డ్యూటీ మీట్‌లో పాల్గొనేందుకు వచ్చిన ఆమె గురువారం ఉదయం మల్లికార్జునస్వామి ఆలయాన్ని సందర్శించి అభిషేకం నిర్వహించి స్వామి వారిని దర్శించుకున్నారు. తొలుత ఆలయ అర్చకులు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంతరం తీర్థ ప్రసాదాలను అందించారు. మామునూర్ బెటాలియన్ కమాండెంట్ ప్రకాష్, మామునూరు ఏసీపీ వెంకటేష్, పర్వతగిరి సీఐ రాజగోపాల్, ఎస్సై పస్తం శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎవరో ఆ పెద్ద సారు?!

### కలకలం రేపిన ఆంధ్రజ్యోతి కథనం

### నీటి పారుదల శాఖలో చర్చనీయాంశం

హనుమకొండ టౌన్, 31 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నీటిపారుదల శాఖలో అక్రమాల వరద, వివిధ పనుల్లో రీఎస్టిమేషన్ టెండర్లలో అక్రమాలు, బిల్లులు చెల్లింపులు, బదిలీలు, పదోన్నతుల్లో ఉన్నతాధికారి వివాదాస్పద తీరుపై 'ఆంధ్రజ్యోతి' పత్రికలో గురువారం వచ్చిన కథనం చర్చనీయాంశంగా మారింది. 'ఆంధ్రజ్యోతి'లో అధికారిపై వచ్చిన కథనాలతో ఇప్పటికే ఈఎన్‌సీ నుంచి ఆరా తీస్తున్నారని తెలిసింది. నీటి పారుదల శాఖలో ఓ అధికారి టెండర్లు దక్కాలన్నా, పదోన్నతులు కల్పించాలన్నా చేతులు తడపాల్సిందేనని కాంట్రాక్టర్లు, కార్యాలయ అధికారులు చేసిన ఆరోపణలతో ఆ అధికారిపై విజిలెన్స్ అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. కాగా, ఆ పెద్ద సారు చేసిన అక్రమాలపై క్షేత్రస్థాయిలో విచారణ చేపడితే అవినీతి లీలలు మరింత బయట పడుతాయని ఆ శాఖ అధికారులు, సిబ్బంది చర్చించుకుంటున్నారు. ఇటీవల ఓ పెద్ద సారు రిటైర్మెంట్ ఫంక్షన్ కోసం డివిజన్ అధికారులు, కాంట్రాక్టర్లు వసూళ్లు చేస్తున్నారనే పత్రికలో రావడంతో కొన్ని డివిజన్లలో అధికారులు డబ్బులు ఇచ్చేందుకు వెనుకడుగు వేశారని తెలిసింది. కాంట్రాక్టర్లు సైతం డబ్బులు ఇవ్వడం లేదని చర్చించుకుంటున్నారు.



విద్యాశాఖ కార్యదర్శి నుంచి ప్రశంసలు పొందుతున్న డీఈవో వాసంతి

## పరాఖ్ నాస్‌లో జిల్లాకు ఉత్తమ స్థానం

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర విద్యాశాఖ, ఎన్సీఈఆర్టీ ఆధ్వర్యంలో చేపట్టిన పరాఖ్ నాస్ పరీక్షల్లో హనుమకొండ జిల్లా ఉత్తమ స్థానం సాధించింది. దీంతో బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన డీఈవోల మీటింగ్‌లో విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి యోగితారాణా, ముఖ్యమంత్రి సలహాదారు కేశవరావు డీఈవో వాసంతిని ప్రశంసించారు. పరాఖ్ సర్వే నిర్వహించిన 3, 6, 9 తరగతుల్లో అన్ని సబ్జెక్టుల్లో అగ్రస్థానం ఉదిత్ స్థాయిని సంపాదించిన జిల్లాల సరసన హనుమకొండ, జనగామ జిల్లాలు స్థానం సాధించడం విశేషం.

## విద్యాశాఖకు మంత్రిని నియమించాలి

### ఏబీఎస్ఎఫ్ విద్యార్థుల ఆందోళన

### సీఎం దిష్టిబొమ్మ దహనం

### అడ్డుకున్న పోలీసులు



సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విద్యార్థి నాయకులు

కేయూ క్యాంపస్ జూలై 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రిని కేటాయించాలని ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కేయూ మొదటి గేటు వద్ద విద్యార్థులు ఆందోళన చేపట్టారు. అక్కడ సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. విద్యాశాఖకు మంత్రిని కేటాయించాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈసందర్భంగా మంద నరేశ్ మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో సీఎం రేవంత్‌రెడ్డి విఫలమయ్యారని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు, స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం లేదన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలు ఫీజులు రాకపోవడంతో విద్యార్థుల సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. గురుకుల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదన్నారు.

విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నారని విమర్శించారు. ప్రైవేట్ సంస్థల్లో ఫీజుల జులుంను అడ్డుకోవాలని అన్నారు. విద్యార్థుల సమస్యలపై కాంగ్రెస్‌పై నిరసన దీక్షలు చేస్తామన్నారు. కాగా, సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న క్రమంలో పోలీసులు అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ నేతలు విజయ్, నందు, విష్ణు, పీటర్, శ్రీకాంత్, పవన్, అరవింద్, నవీన్, తరుణ్, గణేశ్, వంశీ, గోవింద్, సమ్మయ్య, సూర్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఒకరికి మూడేళ్ల జైలు శిక్ష

మహబూబాబాద్ క్రైం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని దంతాలపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో దాఖలైన తీవ్ర నేరమైన కేసుల ఘటనలో ఒకరికి జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ మహబూబాబాద్ సీనియర్ సివిల్ జడ్జి, అసిస్టెంట్ సేషన్ జడ్జి గురువారం తీర్పును వెల్లడించారు. దం తాలపల్లి మండలంలోని ఓ తీవ్రమైన కేసులో నిందితుడైన ఎరుకొండ నరే ష్‌పై అందిన ఫిర్యాదును అప్పటి విచారణ అధికారి ఎస్సై జగదీష్, ట్రేపిం గ్ అధికారి ఎస్సై పి.రాజు, లైజర్ అధికారి జీనత్ కోర్టులో దాఖలు చేసిన ఆధారాల ప్రకారం పీపీ వాదనలు జరిగాయి. అనంతరం ఐపీసీ సెక్షన్ 452, 307, 505 కింద నిందితునికి 3 సంవత్సరాల కఠిన కారాగాల శిక్షతో పాటు, రూ.5 వేలు జరిమానా విధిస్తూ సీనియర్ సివిల్ జడ్జి, అసిస్టెంట్ సేషన్ జడ్జి తీర్పును వెల్లడించారు. నిందితుడికి శిక్ష పడే లా కృషి చేసిన అధికారులను ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ అభినందించారు.

## ఒడిస్సా యువతి కిడ్నాప్ కలకలం

### ధర్మారం రైల్వేగేటు వద్ద కారులో తీసుకెళ్లిన దుండగులు

గీసుగొండ, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మారం వద్ద కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో పనిచేసేందుకు వచ్చిన ఒడిస్సా చెందిన యువతి కిడ్నాప్ అయిన ఘటన గురువారం కలకలం రేపింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో పనిచేసేందుకు ఛత్తీస్‌గఢ్, ఒడిస్సా, బిహార్ రాష్ట్రాలకు చెందిన కొంతమంది వచ్చారు. కాగా, ఇందులో 16వ డివిజన్ ధర్మారం వద్ద అద్దె ఇంట్లో నలుగురు యువతులు ఉంటూ రోజూ టెక్స్‌టైల్ పార్కులోని కైటెక్స్ కంపెనీకి వచ్చి పని చేస్తున్నారు. అయితే గురువారం పని ముగించుకొని కంపెనీ వాహనంలో ధర్మారం వద్ద దిగారు. అక్కడ వారు పానీపూరి తిని ఇంటికి పోయే సమయంలో సాయంత్రం 7గంటలకు అక్కడికి ఒక కారు వచ్చి ఆగింది. కారులోంచి దిగిన నలుగురు.. అక్కడ ఉన్న మాలిక్ అనే యువతిని బలవంతంగా కారులో తీసుకెళ్లారు. ఈ సమయంలో మిగిలిన వారు కారును అడ్డుకునే ప్రయత్నం చేస్తూ రాయి విసరగా కారు పాక్షికంగా దెబ్బతింది.

ఈ విషయాన్ని తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మాలిక్ స్నేహితురాళ్లను వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారి ఫిర్యాదు మేరకు సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులను పట్టుకునేందుకు గాలిస్తున్నట్లు సీఐ మహేందర్ తెలిపారు. అయితే కంపెనీ యజమాన్యం మరో వాహనంలో కిడ్నాప్ చేసిన కారును వెంబడించగా తప్పించుకొని పోయిందన్నారు. కాగా, మాలిక్‌కు వివాహం కాగా, భర్తతో గొడవపడి టెక్స్‌టైల్‌పార్కుకు వచ్చినట్లు తెలిసింది. భర్తకు సంబంధించిన వ్యక్తులే మాలిక్‌ను అపహరించుకు పోయినట్లు అనుమానిస్తున్నారు.

## చికిత్స పొందుతూ రైతు మృతి

### వైద్యుల నిర్లక్ష్యమంటూ బంధువుల ఆందోళన

### అనారోగ్య సమస్యలు, గుండెపోటు కారణమంటున్న వైద్యులు

### మృతుడిది యాదాద్రి భువనగిరి జిల్లా బసంతపురం



ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న ప్రభాకర్ కుటుంబ సభ్యులు

జనగామ రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): వైద్యుల నిర్లక్ష్యంతో రైతు మృతి చెందాడని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగిన ఘటన గురువారం జనగామ జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. బంధువులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.

యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం బసంతపురంనకు చెందిన మెండు ప్రభాకర్ రెడ్డి వ్యవసాయం చేసుకుంటూ, ట్రాక్టర్ కిరాయికి నడుపుతూ జీవిస్తున్నాడు. ఈనెల 27న పొలం దున్నుతుండగా విద్యుత్ తీగ తెగిపడడంతో షాకుకు గురై ట్రాక్టర్‌పై నుంచి కింద పడ్డాడు. ట్రాక్టర్ కేజీవీల్స్ రెండు కాళ్లపై నుంచి వెళ్లడంతో కుటుంబసభ్యులు జనగామ జిల్లా కేంద్రంలోని అజంతా ఆస్పత్రికి తరలించారు. ప్రభాకర్ కాలును పరిశీలించిన డాక్టర్ బాలాజీ ఇన్‌ఫెక్షన్ ఉందని, గాయం తగ్గు ముఖం పట్టే వరకు ఆపరేషన్ వాయిదా వేయాలని పేర్కొన్నారు. బుధవారం ప్రభాకర్‌ను ఇంటికి తీసుకొని వెళ్లాలని డాక్టర్ బాలాజీ తెలుపగా పరిస్థితి సీరియస్‌గా ఉంటే ఎలా తీసుకెళ్లాలని కుటుంబ సభ్యులు నిలదీశారు. దీంతో ఆస్పత్రిలోనే ఉంచగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. వైద్యుల నిర్లక్ష్యంతోనే ప్రభాకర్ మృతి చెందాడని ఆరోపిస్తూ ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. డాక్టర్ బాలాజీని వివరణ కోరగా పేషెంట్‌కు షుగర్, మోకాళ్ల వాపు, ఇతర సమస్యలతో బాధపడుతున్నాడని, అవి తగ్గుముఖం పట్టే వరకు ఆపరేషన్ వాయిదా వేసినట్లు తెలిపారు. అంతలోనే గుండెపోటు వచ్చి మృతి చెందాడని పేర్కొన్నాడు. ఇందులో తమ నిర్లక్ష్యం, వైద్యుల తప్పు ఏమీ లేదన్నారు.

## వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

| పంట | క్వింటా గరిష్ఠం | క్వింటా కనిష్ఠం |
|---|---|---|
| మక్కలు | 2151 | 1521 |
| పల్లికాయ (సూక) | 6200 | 3450 |
| పల్లికాయ (పచ్చిది) | 3820 | 1575 |
| కందులు | 5633 | 3022 |
| పెసళ్లు | 5752 | 3022 |
| పత్తి | 7625 | 5300 |
| పసుపు (కాడి) | 10333 | 9534 |
| పసుపు (గోల) | 10509 | 8700 |
| తేజ మిర్చి | 11500 | 8500 |
| తేజ ఏసీ | 13500 | 11500 |
| వండర్‌హాట్ | 10500 | 6000 |
| వండర్‌హాట్ ఏసీ | 15500 | 11500 |
| యూఎస్341ఏసీ | 13300 | 7000 |
| దీపిక | 9000 | 8000 |
| సింగిల్‌పట్టి ఏసీ | - | - |
| తాలు మిర్చి | 5000 | 3000 |

- వరంగల్ వ్యవసాయం

# 60ఏళ్లు దాటిన అన్నదాతలకు పెన్షన్

- రైతులకు వరంగా పీఎం కిసాన్ మాన్‌ధన్
- 18 నుంచి 40ఏళ్ల రైతులు అర్హులు.. రూ.55 నుంచి ప్రీమియం
- అదనంగా బీమా కంపెనీకి ప్రభుత్వం నగదు జమ

వర్ధన్నపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రధాన మంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజన పథకం రైతులకు వరంగా మారనుంది. రైతులు వృద్ధాప్యంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయం చేసుకున్న వారు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ మాన్‌ధన్ యోజన పథకాన్ని తీసుకువచ్చింది. వృద్ధాప్యంలోకి వచ్చాక చాలామంది రైతులకు ఎలాంటి ఆదాయ వనరులు ఉండవు.

ఈ నేపథ్యంలో వయస్సు పైబడిన చిన్న, సన్నకారు రైతులకు అండగా ఉండేందుకు కేంద్రం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద 60ఏళ్లు నిండాక రైతులకు ప్రతీ నెల రూ.9వేల చొప్పున పింఛన్ జీవితకాలం అందుతుంది. 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న రైతులు ఈ పథకంలో చేరేందుకు అర్హులు. భూరికార్డుల్లో తమ పేరు ఉండి రెండు హెక్టార్ల వరకు సాగు చేసేందకు వీలుగా భూమి ఉన్న వారు ఈ పథకం కింద పేర్లు నమోదు చేసుకోవచ్చు. ఎప్పుడు నమోదు చేసుకున్నా పెన్షన్ 60ఏళ్లు దాటాకే వస్తుంది. నేషనల్ స్కీం, ఈఎస్ఐ స్కీం, ఈపీఎఫ్‌వో పరిధిలో ఉన్నవారు ఎద్దైనా ఇతర చట్టబద్ధ సామాజిక భద్రతా పథకాల పరిధిలో ఉన్న వారు ఉన్నత ఆర్థికస్థితి కలిగిన వారు, ట్యాక్స్ పరిధిలో ఉన్నవారు ఏదైనా ఇతర చట్టబద్ధ సామాజిక భద్రత పథకాల పరిధిలో ఉన్నవారు, ఉన్నత ఆర్థిక స్థితి కలిగిన వారు, ట్యాక్స్ పేయర్లు ఈ పథకానికి అర్హులు కారు. ఈ పెన్షన్ అందేవరకు కొంత ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. పథకంలో చేరే వారి వయస్సును బట్టి ప్రీమియం ఉంటుంది. రైతు చెల్లించినంతే ప్రభుత్వం కూడా తన వంతుగా బీమా కంపెనీకి నగదు జమ చేస్తుంది.

### ప్రీమియం వివరాలు

18 నుంచి 40 ఏళ్ల వయస్సులోపు రైతులు ఈ పథకానికి అర్హులు. ప్రతీ నెల రూ.55 రూపాయల నుంచి రూ.200 రూపాయల వరకు ప్రీమియంను బ్యాంక్ ఖాతా నుంచి చెల్లించాల్సి ఉంటుంది. రైతు చెల్లించిన ప్రీమియం మొత్తానికి కేంద్ర ప్రభుత్వం సమానంగా చెల్లిస్తుంది. రైతు రూ.55జమ చేస్తే ప్రతీ నెల రూ.110 జమ అవుతుంది. 20 ఏళ్ల వయస్సు గల రైతులు రూ.61 ప్రీమియం, 25 ఏళ్ల వారికి రూ.61 ప్రీమియం, 30ఏళ్ల వారికి రూ.105, 35 ఏళ్ల వారికి రూ.150, 40 ఏళ్ల వారికి ప్రీమియం రూ.200 ఉంటుంది. రైతు మరణిస్తే భార్య ఈ పథకాన్ని కొనసాగించవచ్చు. 60 ఏళ్ల తరువాత రైతు మరణిస్తే భార్యకు రూ.1,500 పెన్షన్ వస్తుంది. రైతు ఫొటో నివాస ధ్రువీకరణ పత్రం, సాగుభూమి, ఆదాయం వంటి వివరాలను, పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. కాగా, ఈ కిసాన్ మాన్‌ధన్ పథకంలో చేరాలంటే కామన్ సర్వీస్ సెంటర్లలో రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.



### ప్రచారం చేస్తున్నాం..

రైతులకు వృద్ధాప్యంలో పీఎం కిసాన్ మన్ ధన్ యోజన ఎంతో ఆసరాగా ఉంటుంది. ఈ పథకంపై అవగాహన కల్పించేందుకు ప్రచారం నిర్వహిస్తున్నాం. ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తులు చేసుకోవాలి.

- విజయ్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి

### దరఖాస్తు చేసుకోండి ఇలా..

పీఎం కిసాన్ లబ్ధిదారులు కామన్ సర్వీస్ సెంటర్ (సీఎంసీ) పీఎం కిసాన్ పీఎం కేఎంవై పోర్టర్‌లో దరఖాస్తు చేసుకోవాలి. రైతు మొదట తన ఆధార్ నంబర్ ఎంటర్ చేయాలి. పీఎం కిసాన్ పథకానికి నమోదైన బ్యాంక్ ఖాతా నుంచి ప్రీమియం డబ్బులను చెల్లించాలి. ప్రతీనెల ఆటోమెటిగ్గా డబ్బులు ఖాతా నుంచి పథకానికి జమ అవుతాయి. నామినీ వివరాలను నమోదు చేయాలి. మాన్ ధన్ దరఖాస్తును డౌన్‌లోడు చేసుకోని రైతు సంతకం చేసి పోర్టల్లో అప్లోడ్ చేయాలి. వెంటనే మీకు పీఎం కిసాన్ మాన్‌ధన్ పింఛన్ కార్డు జనరేట్ అవుతుంది. కార్డును డౌన్‌లోడు చేసుకోవాలి. ప్రతీ నెలా బ్యాంక్ ఖాతా నుంచి ప్రీమియం డబ్బులు పీఎంకేఎంవై పథకానికి ఆటోమేటిక్‌గా జమ అవుతాయి. పీఎం కిసాన్ లబ్ధిదారులు కానట్లయితే సీఎస్‌సీలో మాన్యువల్‌గా దరఖాస్తు చేసుకోని పింఛన్ కార్డు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు, ప్రీమియం డబ్బును నగదు రూపంలో చెల్లించాలి. ఆ తరువాత బ్యాంక్ ఖాతాను జత చేసుకోవాలి.

# ఉపాధ్యాయుల పదోన్నతుల షెడ్యూల్ విడుదల

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పదోన్నతుల షెడ్యూల్‌ను విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ నవీన్ నికోలస్ గురువారం విడుదల చేశారు. అర్హులైన సీనియర్ అసిస్టెంట్లకు గ్రేడ్-2 హెడ్మాస్టర్లుగా, ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులను కల్పించనున్నారు. కాగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 114 మంది స్కూల్ అసిస్టెంట్లు హెడ్మాస్టర్లుగా పదోన్నతులు పొందనున్నారు. షెడ్యూల్ వివరాలు ఇలా ఉన్నాయి. ఆగస్టు 2న సంబంధిత డీఈవో, ఆర్జేడీ కార్యాలయాల్లో ప్రొవిజనల్ సీనియారిటీ లిస్టులను డిస్‌ప్లే చేస్తారు. 3న ఉపాధ్యాయుల నుంచి అభ్యంతరాలను స్వీకరిస్తారు. 4, 5 తేదీల్లో ఉపాధ్యాయుల నుంచి వచ్చిన అభ్యంతరాలను సరిచేసి సీనియారిటీ లిస్టులను రూపొందించి డిస్‌ప్లే చేస్తారు. 6న వెబ్‌ఆప్షన్లు ఎంపిక చేసుకోవడంతోపాటు ఎడిట్ చేసుకునే అవకాశం ఉంటుంది. 7న పదోన్నతులు పొందిన స్కూల్ అసిస్టెంట్లకు హెడ్మాస్టర్లుగా పదోన్నతులు ఇస్తూ ఉత్తర్వులు అందజేస్తారు. 8, 9 తేదీల్లో స్కూల్ అసిస్టెంట్ల సీనియారిటీ లిస్టును డిస్‌ప్లే చేస్తూ ఎస్జీటీ ఉపాధ్యాయుల నుంచి అభ్యంతరాలను స్వీకరిస్తారు. అనంతరం ఫైనల్ సీనియారిటీ లిస్టును రూపొందించి డిస్‌ప్లే చేస్తారు. 10న వెబ్‌ఆప్షన్ల ఎంపికతోపాటు ఎడిట్ చేసుకునే అవకాశం ఉంటుంది. ఎస్జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు 11న డీఈవోలు ఆర్డర్లు ఇస్తారు. ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ మొత్తం 10 రోజుల్లో ముగించేందుకు విద్యాశాఖ షెడ్యూల్‌ను ప్రకటించింది.

### ఉమ్మడి జిల్లాలో 114 మందికి పదోన్నతులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 114 మంది స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు హెడ్మాస్టర్లుగా పదోన్నతులు పొందనున్నారు. గవర్నమెంట్ యాజమాన్యంలో 7గురు, లోకల్‌బాడీ యాజమాన్యంలో 107 మంది పదోన్నతి పొందనున్నారు. వరంగల్ జిల్లాలో 25 మంది, హనుమకొండలో 26, మహబూబాబాద్‌లో 15, జనగామలో 20, జయశంకర్ భూపాలపల్లి 16, ములుగు జిల్లాలో 12 మంది స్కూల్‌అసిస్టెంట్లు హెడ్మాస్టర్లుగా పదోన్నతులు పొందనున్నారు. కాగా, ఎస్జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతులకు సంబంధించిన ఖాళీలను విద్యాశాఖాధికారులు ఇప్పటి వరకు గుర్తించలేదు. షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో రెండు రోజుల్లో ఎస్జీటీల సీనియారిటీ లిస్టులను రూపొందిస్తామని వారు పేర్కొంటున్నారు.





# కొత్త జీపీలు, అంగన్వాడీలకు సొంత భవనాలు

- రూ.48కోట్ల నిధులు మంజూరు
- త్వరలో ప్రారంభం కానున్న పనులు
- పంచాయతీ ఎన్నికల నాటికి సిద్ధం
- సిబ్బందికి తీరనున్న కష్టాలు

హనుమకొండ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో త్వరలో కొత్త గ్రామ పంచాయతీలు, అంగన్వాడీ కేంద్రాలు సొంత భవనాలకు నోచుకోనున్నాయి. 2019లో పాలనాసౌలభ్యం కోసం చిన్న గ్రామాలను కొత్త పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. ఆరేళ్ల కిందట ఏర్పాటైన వాటికి ఇప్పటివరకూ భవనాలు నిర్మించలేదు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తున్న క్రమంలో భవనాల నిర్మాణాన్ని చేపట్టింది. అంగన్వాడీ కేంద్రాల్లో చాలా వాటికి సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో కునారిల్లుతున్నాయి. కమ్యూనిటీ హాళ్లు, ప్రభుత్వ పాఠశాలలు, ఇతరత్రా భవనాల్లో ప్రస్తుతం పంచాయతీ కార్యాలయాలు నడుస్తున్నాయి. దీంతో గ్రామసభలు, సమావేశాలు నిర్వహించేందుకు, ఫైళ్లను భద్రపరిచేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

### ఎన్నికల నాటికి సిద్ధం

ఎన్నికల్లోగా భవనాలను పూర్తిచేయాలని కసరత్తు చేస్తున్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో ప్రతీ మండలంలో రెండు గ్రామ పంచాయతీ భవనాలు, రెండు అంగన్వాడీ భవనాలను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సంవత్సర డిసెంబర్ నాటికి భవనాల నిర్మాణాలను పూర్తి చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఉంది. పంచాయతీ భవనాలను ఒక్కొక దానిని రూ.20లక్షలతో, అంగన్వాడీ భవనాలను పూర్తిగా ఉపాధి హామీ నిధులతో నిర్మిస్తారు. అంగన్‌వాడీ భవనాలను రూ.12లక్షతో నిర్మిస్తారు. ఈ మొత్తంలో ఉపాధి హామీ ద్వారా రూ.8లక్షలు, మహిళా శిశు సంక్షేమం నుంచి రూ.2లక్షలు 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులు రూ.2లక్షలు కలిపి నిర్మిస్తారు.

### స్థలాలున్నవాటికే..

భవనాల నిర్మాణానికి స్థలాలున్న పంచాయతీలనే ఎంపిక చేశారు. స్థలం లేకుండా భవనాలు మంజూరు చేస్తే ఇబ్బందులు ఎదురవుతాయన్న ఉద్దేశంతోనే ఈ విధంగా చేశారు. సొంతంగా ప్రైవేటు స్థలాలు కొనుగోలు చేసే స్థోమత పంచాయతీలకు లేదు. ప్రస్తుతం మంజూరైన వాటిని నామినేషన్‌పై కేటాయిస్తారు. అయితే బిల్లులు సకాలంలో వస్తాయో రావోనసే అనుమానంతో కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు వచ్చేలా లేరు. పనుల నిర్వహణను పంచాయతీరాజ్ శాఖకు అప్పగించారు. నూతనంగా నిర్మించనున్న గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ భవనాలు యూనిక్ మోడల్‌గా ఉంటాయి. ఈ భవనాలను ప్రజలు చూడగానే అవి గ్రామ పంచాయతీ భవనాలని, ఇవి అంగన్‌వాడీ భవనాలని గుర్తించేలా డిజైన్లను రూపొందించారు.

### 300 భవనాలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 150 గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి రూ.30కోట్లు, అంగన్వాడీ కేంద్రాల భవనాలకు రూ.18కోట్లు విడుదలయ్యాయి. వరంగల్ ఇల్లాలో 22 పంచాయతీ, 22 అంగన్వాడీ, హనుమకొండ జిల్లాలో 24 పంచాయతీ, 24 అంగన్వాడీ, జనగామ జిల్లాలో 24 పంచాయతీ, 24 అంగన్వాడీ, మహబూబాబాద్ జిల్లాలో 36 పంచాయతీ, 36 అంగన్వాడీ, ములుగు జిల్లాలో 20 గ్రామ పంచాయతీ, 20 అంగన్వాడీ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 24 పంచాయతీ, 24 అంగన్వాడీ భవనాల నిర్మాణం జరుగుతుంది. ఇరుకు గదులు, కనీస సౌకర్యాలు లేక అద్దెభవనాల్లో నడుస్తున్న, శిథిలావస్థకు చేరుకొని ఎప్పుడు కూలుతుందో తెలియక భయం భయంతో ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్న పంచాయతీలు, అంగన్‌వాడీ కేంద్రాలకు కొత్త భవనాల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తారు.



మంత్రికి వినపత్రితం అందజేస్తున్న అర్చక, ఉద్యోగ నేతలు

# దేవాదాయ ఉద్యోగులకు ప్రమోషన్లు

## మంత్రి కొండా సురేఖ హామీ

హనుమకొండ కల్చరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆలయాల్లో పనిచేసే ఉద్యోగులకు, అర్చకులకు ప్రమోషన్లు ఇవ్వడంలో జాప్యం జరుగుతోందని, తద్వారా ఇంక్రిమెంట్లు రాకుండా ఉద్యోగులు అర్చకులు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆలయాల అర్చకులు, ఉద్యోగులు గురువారం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా స్పందించిన మంత్రి అధికారులతో మాట్లాడి వీలైనంత తొందరగా ప్రమోషన్లు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. సచివాలయంలోని మంత్రి చాంబర్‌లో తెలంగాణ అర్చక ఉద్యోగ జాక్ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో అర్చక సమాఖ్య నూతన అధ్యక్షుడు గట్టు శ్రీనివాసాచార్యులు, ధూప, దీప నైవేద్య రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహాచార్యులు, కార్యదర్శి పెండెం సురేందర్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ శర్మ, ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణమాచార్యులు తదితరులు మంత్రిని కలిసి ప్రత్యేకంగా వినతిపత్రం సమర్పించారు.

# నైపుణ్యం, సామర్థ్యం పెంచేందుకే డ్యూటీ మీట్

- తెలంగాణ పోలీస్ వ్యవస్థ దేశంలోనే టాప్
- అదనపు డీజీపీ, టీజీపీఏ డైరెక్టర్ అభిలాష బిస్త్
- మామునూరు పీటీసీలో సందడిగా డ్యూటీ మీట్
- పాల్గొన్న 400 మంది పోలీసులు

మామునూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో పోలీసులు నైపుణ్యం సాధించేందుకు డ్యూటీ మీట్ శిక్షణ ఎంతో అవసరమని తెలంగాణ పోలీస్ అకాడమీ(టీజీపీఏ) డైరెక్టర్ అభిలాష బిస్త్ అన్నారు. వరంగల్ జిల్లా కేంద్రం మామునూరు పీటీసీ వేదికగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన 2వ తెలంగాణ పోలీస్ డ్యూటీ మీట్-2025 పోటీలను టీజీపీఏ డైరెక్టర్ అభిలాష బిస్త్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అంతకుముందు అదనపు డీజీపీతో కలిసి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోలీసులు విధుల్లో అత్యుత్తమంగా రాణించాలంటే వృత్తి నైపుణ్యం సొంతం చేసుకోవడం ఎంతో కీలకమని అన్నారు. దేశంలో నేర దర్యాప్తుతో పాటు అన్ని విభాగాల్లో తెలంగాణ మొదటి రెండు స్థానాల్లో నిలవడం సంతోషదాయకమన్నారు. తీవ్ర ఒత్తిడితో విధులు నిర్వహించే పోలీసుల్లో ఈ డ్యూటీ మీట్ పోటీలు ఉత్తేజం నింపుతాయని అన్నారు. గురువారం నుంచి మూడు రోజుల పాటు జరుగనున్న ఈ డ్యూటీ మీట్‌లో రాష్ట్రంలోని ఏడు జోన్లతో పాటు హైదరాబాద్, రాచకొండ కమిషనరేట్ పోలీసులు, సీఐడీ, ఆక్టోపస్, గ్రేహౌండ్స్ విభాగాలకు చెందిన సుమారు 400 మందికి పైగా పోలీస్ అధికారులు, సిబ్బంది జిల్లాకు చేరుకున్నారని, వీరు నిర్ణయించిన తేదీల ప్రకారం తాము ఎంపిక చేసుకున్న 25 విభాగాలలో పోటీ పడుతారని చెప్పారు. పోటీల్లో పాల్గొనే అభ్యర్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చాలని సూచించారు. డ్యూటీ మీట్ పోటీల ద్వారా పోలీస్ అధికారులు చట్టాల అమలు, అంతర్జాతీయ భద్రత, నేరాలను గుర్తించడం, సులభతరం అవుతుందని వివరించారు. తాను కూడా 25 ఏళ్ల కిందట వరంగల్ మామునూరు పీటీసీ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించానని, మళ్లీ అదే ప్రాంగణంలో ముఖ్య అతిథిగా పోలీస్ డ్యూటీ మీట్‌లో పాల్గొనడం సంతోషకరంగా ఉందని, పాత జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయని తెలిపారు. విధి నిర్వహణలో దర్యాప్తు చేయడం, సామర్థ్యాలను మెరుగు పరుచుకునే అంశాల్లో అవకాశం లభిస్తుందని, అంతేకాక నేరాలను త్వరితగతిన ఛేదించేందుకు, సాక్ష్యాలను శాస్త్రీయంగా విశ్లేషించేందుకు, ప్రజలకు న్యాయం అందించేందుకు ఈ వృత్తి శిక్షణ ఎంతో అవసరమని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న అదనపు డీజీపీ మహేష్ భగవత్



మాట్లాడుతున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్




పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్



పోలీసు జాగిలంతో కరచాలనం చేస్తున్న పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిష్త

### సాధనతో ఏదైనా సాధ్యం..

పోలీసులు కష్టపడి సాధన చేస్తే ఏదైనా సాధ్యపడుతుందని అదనపు డీజీపీ మహేష్ భగవత్ అన్నారు. ఇటీవలే రాంచీలో జరిగిన ఆల్ ఇండియా 68వ పోలీస్ డ్యూటీ మీట్‌లో తెలంగాణ పోలీసులు అత్యుత్తమ ప్రదర్శనలు ఇవ్వడం ద్వారా ఓవరాల్ టీమ్ చాంపియన్‌గా నిలిచి వివిధ విభాగాల్లో మొత్తం 18 పతకాలను సాధించారని కొనియాడారు. సైంటిఫిక్, ఇన్వెస్టిగేషన్, యాంటీ-సాబోటెజ్ చెక్, డాగ్‌స్క్వాడ్ పోటీల వంటి ఈవెంట్లలో తెలంగాణ బృందం ఆరు బంగారు, నాలుగు రజత, ఎనిమిది కాంస్య పతకాలను గెలుచుకుందన్నారు. ఇదే తరహాలో త్వరలో జరుగబోయే ఆల్ ఇండియా 69వ డ్యూటీమీట్‌లో ఫొటో, వీడియోగ్రఫీ బృందాలు, డాగ్‌స్క్వాడ్ బృందాలు తమ సత్తా చాటి ఎక్కువ మెడల్స్ సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీఐడీ డీఐజీ నారాయణ నాయక్, వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్, బెటాలియన్ ఎస్పీ రాంరెడ్డి, వరంగల్ పోలీస్ కమిషనరేట్ డీసీపీలు అంకిత్‌కుమార్, షేక్ సలీమా, పీటీసీ ప్రిన్సిపాల్ పూజ, కమాండెంట్‌లు, ఏసీపీలు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పెట్టుబడిదారులకు కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయం

- యుద్ధోన్మాదులు, మతోన్మాదులతోనే దేశానికి ప్రమాదకరం
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి

ఖిలావరంగల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడిదారులకు కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయమని, యుద్ధోన్మాదులు, మతోన్మాదులతోనే దేశానికి ప్రమాదకరమని, కగార్ ఆపరేషన్‌పై న్యాయ విచారణ జరపాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లా సీపీఐ మహాసభల ముగింపును రెండో రోజు గురువారం ఖిలా వరంగల్ మండల కేంద్రంలోని రోటరీ క్లబ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తలసరి ఆదాయం రెట్టింపు అయితే ప్రజల కొనుగోలు శక్తి ఎందుకు పెరగలేదని, నిరుద్యోగులకు ఉద్యోగాలు, గిట్టుబాటు ధరలు ఎందుకు కల్పించడం లేదని ప్రశ్నించారు. మోదీ పాలనలో సంపద అంతా కార్పొరేట్ శక్తులైన అంబానీ, అదానీల వద్దే కేంద్రీకృతమైందని, అందుకే పేదల బతుకులు మారలేదన్నారు. మోదీ అధికారంలోకి రాకముందు రూ.50లక్షల కోట్లు ఉన్న అప్పు నేడు రూ.160 లక్షల కోట్లకు పెరిగిందన్నారు. మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పేదరికం, నిరుద్యోగం రెట్టింపు అయ్యాయని, ఇళ్లులేని నిరు పేదలు పెరిగిపోయారని చెప్పారు. మోదీ దృష్టి అంతా కార్పొరేట్ శక్తులపైనే ఉండడంతో పేదల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదన్నారు. దేశంలో మతోన్మాదాన్ని పెంచి పోషించిన బీజేపీ యుద్ధోన్మాదానికి తెర లేపిందని, మతోన్మాదులు, యుద్ధోన్మాదులతో దేశానికి ప్రమాదకరమన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం పేర ధనస్వామ్యం, భూస్వామ్యం, ఫాసిజం రాజ్యమేలుతోందని ఆయన ధ్వజమెత్తారు. దేశంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం భారత కమ్యూనిస్టు పార్టీ స్థాపించి 100 ఏళ్లు పూర్తి చేసుకున్న వీరోచిత విప్లవాల చరిత్ర కలిగిన శ్రమ జీవుల పార్టీ సీపీఐ అన్నారు. దశాబ్దాలుగా ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటాలను సీపీఐ నిర్వహించిందని పేర్కొన్నారు. ఎన్నో పార్టీలు పుట్టి కనుమరుగవుతున్నాయన్నారు. ప్రజా ప్రయోజనాలకై నిలబడి ఉండడం వల్లనే అధికారం లేకున్నా కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల పాటు నిలబడిందన్నారు. సీపీఐ ఆవిర్భవించి ఈ ఏడాది డిసెంబరు 25 నాటికి వందేళ్లు కావస్తుందన్నారు. వందేళ్ల ముగింపు బహిరంగ సభను ఖమ్మంలో 5లక్షల మందితో నిర్వహించనున్నట్లుగా ఆయన తెలిపారు.



సీపీఐ జిల్లా 2వ మహాసభలో జెండా ఎగురవేస్తున్న సీపీఐ రాష్ట్ర నాయకుడు వెంకట్రాములు

### అంబేద్కర్‌వాదులు, కమ్యూనిస్టులు ఏకం కావాలి

అంబేద్కర్ వాదులు, కమ్యూనిస్టులు ఏకం కావాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యవర్గ సభ్యుడు తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు అన్నారు. కేంద్రంలో మోదీ 3వసారి ప్రధాని అయిన తర్వాత అంబేద్కర్ అందించిన రాజ్యాంగాన్ని మార్చివేసి మనువాదాన్ని తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తోందన్నార ు. అలాగే ఆరేషన్ కగార్, వక్ఫ్ బిల్లు పేరుతో దాడి తీవ్రతరం చేస్తూ ముస్లింలు, క్రిస్టియన్‌లు, కమ్యూనిస్టులను శత్రువులుగా చూస్తున్నారన్నారు. అందుకే దేశంలో అంబేద్కర్ వాదులు, కమ్యూనిస్టులు ఏకం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దేశంలో తలసరి ఆదాయం పెరిగిందని, ప్రపంచంలో మన దేశం 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని, తప్పుడు లెక్కలు చెబుతున్నారని, దొంగ లెక్కలు, మాయ మాటలతో ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. దేశంలో సంపద రెట్టింపు కాలేదని, కేవలం అంబానీ, అదానీలాంటి కార్పొరేట్ శక్తుల ఆదాయమే పెరిగిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో మన పాత్ర ఉందని, అసెంబ్లీలో సీపీఐకి ఒక్క ఎమ్మెల్యేనే ఉన్నప్పటికీ ప్రజా సమస్యలపై గళమెత్తడంలో ముందున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేదంటే సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు.

అనంతరం వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి ఇప్పటి వరకు పార్టీ నిర్వహించిన కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టగా, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి ప్రతినిధుల సభను ఉద్దేశించి ప్రసంగించారు. తొలుత జిల్లా మహాసభల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సీపీఐ పతాకాన్ని రాష్ట్ర నాయకుడు తాటిపాముల వెంకట్రాములు ఎగురవేశారు. అనంతరం కళాకారులు ప్రదర్శనలు చేశారు. ఈ మహాసభకు అధ్యక్షవర్గంగా దండు లక్ష్మణ్, గుండె భద్రి, అక్కెనపల్లి రమేష్, ల్యాదల్ల శరత్, తోట చంద్రకళ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.విజయసారథి, రాష్ట్రకార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర నాయకులు సిరబోయిన కరుణాకర్, పంజాల రమేష్, ఆదరి శ్రీనివాస్, సయ్యద్ వలీ ఉల్లాఖాద్రి, ఎస్ఏ స్టాలిన్, జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్‌కే బాషుమియా, ప్రనాస ప్రసాద్, నాయకులు భిక్షపతి, రమేష్, రవీందర్, చంద్రకళ, ఎలేందర్, భద్రి, రవి, చెన్నకేశవులు, మునీశ్వర్, క్రిష్ణ, శంకరయ్య, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

## లైసెన్సు సర్వేయర్ ప్రశ్నాపత్రాల్లో లోపాలు

**అదనపు కలెక్టర్‌కు న్యాయ చేయాలని వినతి పత్రం**

హనుమకొండ, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : లైసెన్స్డ్ సర్వేయర్ పరీక్ష ప్రశ్నాపత్రాల్లో తప్పులు చోటుచేసుకున్న ఫలితంగా తమకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని కోరుతూ లైసెన్సుడు సర్వేయర్ల శిక్షణ అభ్యర్థులు గురువారం హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకటిరెడ్డికి వినతిపత్రం అందచేశారు. శిక్షణ పొందిన అభ్యర్థులు రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్లను కలుస్తున్న క్రమంలో హనుమకొండ జిల్లాకు చెందిన అభ్యర్థులు అదనపు కలెక్టర్‌ను కలిశారు. తమ సమస్యను వివరించారు.



అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న లైసెన్సుడు సర్వేయర్ శిక్షణ అభ్యర్థులు



ఏసీకి వినతిపత్రం అందిస్తున్న బాధితులు

## జేసీబీలతో మా ఇళ్లను కూల్చివేశారు..

**అదనపు కమిషనర్‌కు పోగుల ఆగయ్యకాలనీ వాసుల ఫిర్యాదు**

వరంగల్ కార్పొరేషన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచెర్ల పోగుల ఆగయ్యకాలనీలో 16 ఏళ్లుగా గుడిసెలు వేసుకుని ఉంటున్నామని, తమ గుడిసెలను రియల్ ఎస్టేట్ వ్యాపారి ప్రోద్బలంతో మునిసిపల్ అధికారులు కూల్చివేశారని కాలనీవాసులు ఆరోపించారు. గురువారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలోని అదనపు కమిషనర్ జోనాను కలిసి వినతి పత్రం అందించారు. తమ కాలనీకి ఆనుకుని మోతీలాల్ అనే రియల్టర్ వెంచర్ చేస్తుండగా తమ గుడిసెలు అడ్డుగా వస్తున్నాయని మునిసిపల్ అధికారులతో 29న రాత్రి జేసీబీతో కూల్చివేశారని వినతిలో తెలిపారు. తమకు న్యాయం చేసి కూల్చిన ఇండ్లను నిర్మించాలని డిమాండ్ చేశారు. ఏసీని కలిసిన వారిలో ఎంసీపీఐ(యూ) జిల్లా నాయకులు పెద్దారపు రమేష్, మాలోతు సాగర్, కనకం సంధ్య, సుంచు జగదీశ్వర్, ఎగ్గిడి మల్లిఖార్జున్, తాటికాయల రత్నం, సింగారపు దాసు, గాజు కళమ్మ, గనిపాక రేణుకలు ఉన్నారు.

## ప్రభుత్వ భూములను రక్షించాలి

కాజీపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను రక్షించాలని కోరుతూ కాజీపేట తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఐ.బావుసింగ్‌కు సీపీఐ నాయకులు వినతి పత్రం ఇచ్చారు. వినతి పత్రంలో న్యూశాయంపేటలోని 579 సర్వే నంబర్‌లోని 39 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు కబ్జాచేస్తున్నారని పేర్కొన్నారు. ఆ భూములను రెవెన్యూ సిబ్బంది రక్షించి హద్దులు పాతాలని పేర్కొన్నారు. లేని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో పోరాటం చేస్తుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేశ్, జిల్లా కార్యవర్గ సభ్యులు మునిగాల భిక్షపతి, మండల కార్యదర్శి శంకర్ నాయక్, నాయకులు రాసమల్ల కుమార్, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎక్కడి చెత్త అక్కడే..

- వ్యర్థాలతో అవస్థలెన్నో..
- మురుగునీటితో ప్రజల ఇబ్బందులు
- డ్రెయినేజీలు నిర్మించాలని గోకుల్‌నగర్ కాలనీ వాసుల వినతి

వడ్డెపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ 57వ డివిజన్ గోకుల్ నగర్ ప్రజలు సమస్యలతో సహవాసం చేస్తున్నారు. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే మురుగు నీటితో ప్రజలు పడుతున్న బాధలు వర్ణనాతీతం. చెత్త, వ్యర్థాలతో నిత్యం ప్రజలు నరక యాతన అనుభవిస్తున్నారు.

### ఎక్కడి చెత్త అక్కడే..

హనుమకొండ అంబేద్కర్ భవన్ వెనుక ప్రాంతంలోని గోకుల్ నగర్‌లో చెత్త పేరుకుపోయింది. పరిసరాల ప్రాంతంలో నివసించే గృహస్థులు వేసే చెత్తను నిత్యం పారిశుధ్య కార్మికులు తొలగించకపోవడంతో సమస్య జఠిల రూపం దాల్చింది.

### వ్యర్థాలతో అవస్థలెన్నో..

గోకుల్ నగర్‌లోని అంబేద్కర్ భవన్, ఎఫ్‌సీఐ గోదాముల వెనుక ఉన్న తుమ్మల కుంట ఖాళీ ప్రదేశంలో వ్యర్థాలను తొలగించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చికెన్ సెంటర్ల వ్యాపారులు కోళ్ల వ్యర్థాలను ఇక్కడే వేస్తున్నారు. అవి మురిగి కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయని గోకుల్‌నగర్ వాసులు ఆందోళన చెందుతున్నారు. కోళ్ల కుళ్లిపోయిన వ్యర్థాలను కుక్కలు, పందులుకదిలించడంతో దుర్వాసన చెప్పనలవి కాకుండా వస్తోందని ప్రజలు వాపోతున్నారు.

### డ్రెయినేజీలు లేక పరేషాన్

గోకుల్ నగర్ ప్రాంతంలో పక్కా డ్రెయినేజీలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లోతట్టు ప్రాంతమైన గోకుల్‌నగర్‌కు ఎగువ ప్రాంతమైన హౌసింగ్ బోర్డు కాలనీ, ఓల్డ్ బస్ డిపో, రాంనగర్ తదితర ప్రాంతాల నుంచి వర్షం నీటితో పాటు మురుగు నీరు వస్తోంది. పక్కా డ్రెయినేజీలు లేక అంబేద్కర్ భవన్, ఎఫ్‌సీఐ గోదాముల వెనుక ప్రాంతంలో మురుగు నీరు , వర్షపు నీరు నిల్వ ఉంటోంది. అంతేగాక అంబేద్కర్ భవన్ వెనుక ప్రాంతంలో నిరుపయోగమైన చెట్లు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి పాములు, తేళ్లకు విడిదిగా మారాయి. రాత్రివేళల్లో పాములు కాలనీలో సంచరించడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. మురుగు నీటి గుంతల్లో దోమలు వృద్ధి చెందడంతో తాము రోగాల బారిన పడుతున్నామని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. పక్కా డ్రెయినేజీ నిర్మించాలని గత 15 సంవత్సరాల నుంచి ప్రజా ప్రతినిధులకు, జీడబ్ల్యూఎంసీ అధికారులకు ఎన్నోమార్లు వినతి పత్రాలు సమర్పించుకున్నా, విన్నవించుకున్నా ఫలితం కనిపించలేదని కాలనీ వాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి గోకుల్‌నగర్ నుంచి ఎఫ్‌సీఐ గోదాం మీదుగా పక్కా డ్రెయినేజీ నిర్మించి మురుగు నీరు నిల్వకుండా తగిన చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు వేడుకుంటున్నారు.



గోకుల్ నగర్ అంబేద్కర్ భవన్ ఎఫ్‌సీఐ గోదామ్ వెనుక పేరుకుపోయిన చెత్త

### పక్కా డ్రెయినేజీ నిర్మించాలి..



గోకుల్ నగర్‌లో పక్కా డ్రెయినేజీ నిర్మించి మురుగు నీటి సమస్యను పరిష్కరించాలి. కాలనీలోని అంబేద్కర్‌భవన్, ఎఫ్‌సీఐ గోదాముల వెనుక ఖాళీ స్థలంలో పెరిగిన పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలి. ఖాళీ స్థలంలో కోళ్ల వ్యర్థాలను వేయకుండా నియంత్రించాలి. చెత్తను ప్రతీ రోజు తొలగించి, దోమల నివారణ మందును పిచికారి చేయించాలి.

- తిప్పారపు యాదగిరి, గోకుల్ నగర్

## మహిళల సమస్యల పరిష్కారం కోసం సఖి కేంద్రాలు

**వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి**



సఖి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు, మేయర్

రాంగనర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సఖి కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. 6వ డివిజన్‌లోని లష్కర్‌బజార్‌లో రూ.65 లక్షలతో నిర్మించిన సఖి కేంద్రం (వన్ స్టాప్ సెంటర్)ను గురువారం ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, మేయర్ గుండు సుధారాణిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ.. సఖి సెంటర్‌లో మహిళలకు మానసిక, శారీరక న్యాయ సహాయం అందించబడునని తెలిపారు.

మహిళల హక్కులను కాపాడటానికి శక్తివంతమైన వేదికగా ఉంటుందన్నారు. బాధిత మహిళలు సఖి కేంద్రం సేవలను ధైర్యంగా వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ చెన్నం మధు, సఖి కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విధులపట్ల బాధ్యతగా వ్యవహరించాలి

హసన్‌పర్తి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగి తన విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తేనే గుర్తింపు ఉంటుందని విద్యుత్ డీఈ టెక్నికల్ ఆనందం అన్నారు. గ్రేటర్ 1వ డివిజన్ పరిధి ఎర్రగట్టు దేవస్థానం ఆవరణలోని ఫంక్షన్ హాలులో ఉద్యోగ విరమణ పొందిన చింతగట్టు విద్యుత్ సబ్ స్టేషన్ ఫోర్‌మెన్ అరవింద్ అభినందన సభ గురువారం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా ఎస్ఈ ఆనందం, గౌరవ అతిథులుగా ఏడీ అశోక్, డిప్యూటీ డీఈ పెద్దిరాజ్యంతో పాటు పలువురు విద్యుత్ అధికారులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు హాజరై ఆనందంను సన్మానించి ఆయన ఉద్యోగ జీవితంలో చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఏఈలు శిరీష్‌కుమార్, సత్యనారాయణ, తరుణ్, లైన్ ఇన్‌స్పెక్టర్లు రైతు రమేష్‌కుమార్, లైన్‌మెన్‌లు శ్రీనివాస్, మల్లికార్జున్, నగేష్, ఎస్ఎల్ఐ రామ్మోహన్, ఇతర విద్యుత్ అధికారులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు, మిత్రులు పాల్గొన్నారు.



ఫోర్‌మెన్ అరవింద్‌ను సన్మానిస్తున్న విద్యుత్ అధికారులు

## నత్తనడకన ఇండోర్ స్టేడియం సుందరీకరణ పనులు

- రూ.68లక్షల నిధులతో 3నెలలు కిందట పనులు ప్రారంభం
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ముందుకు సాగని వైనం



నత్తనడకన కొనసాగుతున్న ఇండోర్ స్టేడియం అభివృద్ధి పనులు

వరంగల్ స్పోర్ట్స్, జూలై 31(ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో బాలసముద్రంలో కొనసాగుతున్న బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం మూగబోయింది. ఇండోర్ స్టేడియంలో 3 నెలలు కిందట చేపట్టిన ప్రత్యేక మరమ్మతు, సుందరీకరణ పనులు సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా ముందుకు కదలడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా బ్యాడ్మింటన్ క్రీడకు కేంద్ర బిందువుగా విరాజిల్లుతున్న ఇండోర్ స్టేడియంలోని ఉడెన్ కోర్టు, మ్యాట్లు, లైట్లు, రేకులు, కిటికీల సుందరీకరణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. మూడు నెలల కిందట డీఎస్ఏ నిధుల నుంచి రూ.68లక్షల అంచనా వ్యయంతో ఇండోర్ స్టేడియం మరమ్మతు, సుందరీకరణ పనులకు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఎంపీ కడియం కావ్య, అప్పటి కలెక్టర్ ప్రావీణ్యతో పాటు జిల్లా ఉన్నతాధికారులు లాంచనంగా శంకుస్థాపన చేశారు. రెండునెలల్లో స్టేడియం అభివృద్ధి పనులను పూర్తిచేయాల్సిన కాంట్రాక్టర్ పనులు చేపట్టకపోవడంతో క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు ఏ మాత్రం పట్టించుకోకపోవడంపై క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు దృష్టి సారించి పనులు త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని క్రీడాకారులు వేడుకుంటున్నారు.

# బహుజనులకు రాజ్యాధికారమే లక్ష్యం

**బీఆర్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య**

వడ్డెపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): బహుజనులకు రాజ్యాధికారమే తమ పార్టీ లక్ష్యమని బహుజన రాజ్యాధికార పార్టీ (బీఆర్‌పీ) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య అన్నారు. గురువారం హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలో బీఆర్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పీసరి రజిత అధ్యక్షతన నిర్వహించిన వరంగల్ ఉమ్మడి జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతీ ఒక్కరు ఆత్మగౌరవంతో జీవించాలనేదే తమ పార్టీ సిద్ధాంతమని అన్నారు.

మహనీయుల ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ తమ పార్టీ ఆధ్వర్యంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం సాధిస్తామని పేర్కొన్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలోని అంబేద్కర్ వాదులు, బహుజనులు పూరెళ్ల రమేష్, గోల్కొండ రాజేష్, మేకల విజయ్‌కుమార్, సామర్ల నరేష్, పోగుల శేఖర్ తదితరులు బీఆర్‌పీ తీర్థాన్ని పుచ్చుకున్నారు. బీఆర్‌పీలో చేరిన వారందరికి జన్ను సాంబయ్య కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సమావేశంలో బీఆర్‌పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుర్రి సాగర్, రాష్ట్ర నాయకులు శ్రీరాముల పైడి, ఎండి సాహేద, లడె దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



బీఆర్‌పీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పుతున్న జన్ను సాంబయ్య



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జైగౌడ జాతీయ నేతలు రామారావు, కిరణ్‌గౌడ్ తదితరులు

## 10న రవీంద్రభారతిలో పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలు

కేయూ క్యాంపస్ జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఈనెల 10న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 375వ జయంతి ఉత్సవాల పోస్టర్‌ను కేయూ రెండో గేటు వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జైగౌడ్ జాతీయ కమిటీ బాధ్యులు వట్టికూటి రామారావు గౌడ్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు మార్క రవిగౌడ్, ప్రెసిడెంట్ సోల్తి కిరణ్‌గౌడ్‌లు హాజరై మాట్లాడారు. పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గౌడ్ సంఘం నేతలు బొనగాని యాదగిరి, జనగాం శ్రీనివాస్, అనంతుల రమేశ్, నకిరకంటి మోహన్, పులి మోహన్, వినోద్, వెంకన్న, మెరుగు రాజేశ్, కొయ్యడి అంజయ్య, కుమార్, బొమ్మగాని వెంకటేశ్, చిర్రా రాజేశ్, బండి రాకేశ్, గిరికత్తుల సాయిబాబా, అన్వేశ్, నరేశ్, సింహాద్రి, నాగరాజు, వెంకటేశ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

### మడికొండ జడ్పీ హైస్కూల్‌ను సందర్శించిన డీఈవో

మడికొండ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి గురువారం కాజీపేట మండలంలోని మడికొండ జిల్లా పరిషత్ హైస్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. యూపీ లెవల్ స్కూల్ కాంప్లెక్స్ బయో సైన్స్ మీటింగ్ హాల్‌ను సందర్శించారు. కార్యక్రమంలో కాజీపేట ఎంఈవో మనోజ్ కుమార్, స్థానిక ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి తోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



**డాక్టర్ రాంభార్గవ్, యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్**

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**ప్రశ్న :** వర్షాకాలంలో సాధారణంగా వచ్చే వ్యాధులు ఏమిటీ..?

**జవాబు :** దగ్గు, జలుబు, వాంతులు, విరేచనాలు, జ్వరం.

**ప్ర :** జబ్బులు వ్యాప్తి చెందడానికి ప్రధాన కారణాలు?

**జ :** కలుషిత నీరు, కలుషిత ఆహారం, దోమలు, పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడం.

**ప్ర :** వ్యాధులను ప్రారంభ దశలోనే అరికట్టవచ్చా?

**జ :** అరికట్టవచ్చు. శుభ్రమైన ఆహారం తీసుకోవడం. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం. దోమలు వ్యాప్తిచెందకుండా చూసుకోవడం.

**ప్ర :** దోమలను అరికట్టడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటీ

**జ :** దోమ తెరలు, దోమ బిల్లలు వాడడం. నీరు నిలువ లేకుండా చూసుకోవాలి. టైర్లు, కొబ్బరి బోండాలు, వాడని పాత్రలు చూసుకోవాలి. నీటిపైన కిరోసిన్ లేదా మలాథిన్‌ను చల్లడం చేయాలి.

**ప్ర :** వ్యాధులు సోకినప్పుడు ఏం చేయాలి?

**జ :** సొంత చిట్కాలు, సొంత ప్రయోగాలు చేయకుండా దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిని సంప్రదించి వైద్యుడి సూచన మేరకు చికిత్స తీసుకోవాలి.

- హసన్‌పర్తి, ఆంధ్రజ్యోతి

# నిరుపయోగంగా టెలిఫోన్ భవనం

- ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు
- మందుబాబులకు అడ్డాగా మారిన వైనం

వడ్డెపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్ పాత గ్రామ పంచాయతీ ప్రాంతంలోని టెలిఫోన్ భవనం రెండు దశాబ్దాలుగా నిరుపయోగంగా ఉంటోంది. భవన ఆవరణలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో పాటు మందుబాబులకు అడ్డాగా మారింది. టెలిఫోన్ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని స్థానిక ప్రజలు జిల్లా కలెక్టర్‌ను కోరుతున్నారు.



గోపాల్‌పూర్‌లో నిరుపయోగంగా ఉన్న టెలిఫోన్ భవనం

### అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా..

సుమారు 30 ఏళ్ల కిందట అప్పటి గోపాల్‌పూర్ సర్పంచ్ కందుకూరి కాంతయ్య టెలిఫోన్ భవనం కోసం తన సొంత స్థలాన్ని కేటాయించారు. పదేళ్లు టెలిఫోన్ భవనం నుంచి అధికారులు ప్రజలకు సేవలను అందించారు. రెండు దశాబ్దాలుగా టెలిఫోన్ భవనం అధికారుల ఆలనా పాలన కొరవడి నిరుపయోగంగా మారింది. పిచ్చి మొక్కలు, నిరుపయోగమైన చెట్లు ఏపుగా పెరిగి పాములు, తేళ్లకు ఆవాసంగా మారింది. రాత్రివేళల్లో మందుబాబులకు నిలయంగా మారింది. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. జిల్లా కలెక్టర్‌తో పాటు మునిసిపల్ కమిషనర్ స్పందించి నిరుపయోగంగా ఉన్న టెలిఫోన్ భవనాన్ని వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

# ‘సంస్థాగతం’పై సన్నద్ధత ఏదీ?

(5వ పేజీ తరువాయి)

కసరత్తు చేస్తున్నాయి. బీజేపీ వార్డు, బూత్, గ్రామ, మండల, జిల్లా కమిటీలను కూడా ప్రకటించింది. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీలను ప్రకటించేందుకు కసరత్తు చేస్తోంది. వచ్చే నెలలో అన్ని కమిటీలను వేయాలని కాంగ్రెస్ కార్యాచరణ ప్రకటించింది. ఈ నేపథ్యంలో ప్రధాన ప్రతిపక్ష బీఆర్ఎస్‌లో మాత్రం సంస్థాగత సందడి లేకపోవటంపై క్యాడర్‌లో ఆందోళన వ్యక్తం అవుతోంది. ఒక్క జనగామ సెగ్మెంట్‌లో మినహా బీఆర్ఎ్‌స్‌కు ఎమ్మెల్యేలు లేరు. మిగతా అన్నిచోట్ల మాజీలే దిక్కయ్యారు. ఎన్నికల్లో క్యాడర్‌కు ఖర్చులను కూడా సర్దుబాటు చేసే నేతలు లేకపోవటంపై ద్వితీయ శ్రేణి నేతలు ఆందోళనలో ఉన్నారు.

### ఇన్‌చార్జి బాధ్యతలకే కొట్లాట

ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్ నేతలు తమకు పదవులు కావాలనే అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నారని, పార్టీ బలోపేతం చేసేలా కమిటీలను వేయాలనే ప్రతిపాదనలు చేయటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. భూపాలపల్లి నియోజకవర్గంలో ఇన్‌చార్జి పదవి కోసం ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిల పోటీ తీవ్రమవుతోంది. దీంతో ఏకంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను తీసుకువచ్చి నియోకవర్గ ఇన్‌చార్జిగా గండ్ర పేరును ప్రకటించేలా చేసుకున్నారు. అయినప్పటికీ ఇక్కడ వర్గపోరు ఆగేలా లేదు. గురువారం సిరికొండ మధుసూదనాచారి భూపాలపల్లి కోల్‌బెల్ట్‌లో పర్యటించటం చర్చనీయాంశంగా మారింది. అలాగే వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పదవిపై మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డిలు పోటీ పడ్డారు. కేసీఆర్ ఇద్దరు నేతలను కూర్చోబెట్టి దయాకర్‌రావుకు బాధ్యతలు అప్పగించాల్సి వచ్చింది. అలాగే ఇదే లొల్లి మహబూబాబాద్, డోర్నకల్, స్టేషన్‌ఘనపూర్, వరంగల్‌లో నెలకొంది. నేతలకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించే విషయంలో అధిష్ఠానం వేగంగా స్పందిస్తోందని, జిల్లా కార్యవర్గాల నియామకంపై దృష్టి పెట్టడం లేదనే ఆందోళనలో గులాబీ శ్రేణులు ఉన్నాయి. తమకు పదవులు లేకుంటే స్థానిక సంస్థల్లో నిలిచేది ఎట్లా..? గెలిచేది ఎట్లా..? అన్ని గులాబీ క్యాడర్ ప్రశ్నిస్తోంది. ఇప్పటికైనా గ్రామ స్థాయి నుంచి పార్టీని సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేసి, స్థానిక సంస్థలను ఎదుర్కొనేలా అధిష్ఠానం దృష్టి పెట్టాలని కార్యకర్తలు కోరుతున్నారు.

# ఆంజనేయుడికి ఆకుపూజ ఎందుకు చేస్తారు?

ఆంజనేయుడు జ్యోతి స్వరూపుడు. ఆయనను పూజిస్తే కష్టాలు, అవరోధాలు తొలగిపోతాయని, ముఖ్యంగా ఏలినాటి శని ప్రభావం తగ్గుతుందని నమ్మకం ఉంది. అందుకే ప్రతి మంగళవారం, శనివారం ఆయనకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. హనుమంతుడికి ఎంతో ఇష్టమైన తమలపాకులతో పూజ చేసి, మాలవేసి అలంకరిస్తే మనోభీష్టాలు నెరవేరుతాయనేది భక్తుల విశ్వాసం. ఆయనకు తమలపాకులతో పూజ ఎందుకు చేస్తారో తెలిపే కథలు కొన్ని ఉన్నాయి.

తెలుసుకుందాం



ఒక కథ ప్రకారం... రావణుడు మాయ లేడిని పంపి సీతమ్మను అపహరించడంతో... శ్రీరాముడు ఆమె కోసం అన్వేషణ ప్రారంభించాడు. ఆ అన్వేషణలో సాయపడిన ఆంజనేయుడు నూరు యోజనాల నిడివి ఉన్న సముద్రాన్ని దాటి... లంకలోని అశోకవనాన్ని చేరుకున్నాడు. సీతమ్మను దర్శించిన తరువాత... ఆ సంగతి శ్రీరాముడికి చెప్పాలని బయలుదేరాడు. అప్పుడు సీతమ్మ ఆయనను ఆశీర్వదించాలనుకుంది. ఆ వనంలోని పువ్వులు చేతికి అందకపోవడంతో... అందుబాటులో ఉన్న తమలపాకును కోసి, దాన్ని ఆంజనేయుడి తలపై ఉంచి దీవించింది. అందుకే ఆయనకు తమలపాకు ప్రీతిపాత్రమైందని చెబుతారు. సీతమ్మ దగ్గర సెలవు తీసుకొని బయలుదేరిన ఆంజనేయుడు... ఆకాశమార్గంలో పయనిస్తూ హూంకరించాడు. అది విన్న వానరులకు... ఆయన సీతమ్మ జాడ తెలుసుకొనే వస్తున్నాడని అర్థమైంది. ఆయన రాగానే వారు తమలపాకు తీగలతో సత్కరించారు. దానికి హనుమంతుడు ఆనందంతో ఉప్పొంగిపోయాడు. కాబట్టి తమలపాకు మాల వేస్తే స్వామి పరమానందం చెంది, దీవెనలు పుష్కలంగా అందిస్తాడని ప్రజల నమ్మకం.

మరో కథనం ప్రకారం... ఒకసారి సీతమ్మతల్లి అందిస్తున్న తమలపాకు చిలకలను శ్రీరాముడు సేవిస్తున్నాడు. అప్పుడు అక్కడికి వచ్చిన ఆంజనేయుడు "స్వామీ! ఏమిటది? మీ నోరు అంత ఎర్రగా ఎందుకయ్యింది?" అని అడిగాడు. "తమలపాకులు తింటే నోరు ఎర్రగా అవుతుంది. అంతేకాదు, ఇది ఆరోగ్యానికి చాలా మంచిది" అని చెప్పాడు శ్రీరాముడు. వెంటనే ఆంజనేయుడు అక్కడి నుంచి వెళ్ళి... తన శరీరమంతా తమలపాకులు కట్టుకొని, నర్తిస్తూ ఆనందించాడు. అప్పటి నుంచి ఆయన ఎక్కువగా తమలపాకు తోటల్లో, అరటి తోటల్లో విహరిస్తాడని ప్రతీతి. ఆంజనేయుడు రుద్రాంశ సంభూతుడు కాబట్టి తమలపాకులు ఆయనకు శాంతిని ఇస్తాయి. అలాగే తమలపాకులకు మరో పేరు నాగవల్లీ దళాలు. తమలపాకులతో స్వామిని పూజించి, సుందరకాండ, హనుమాన్ చాలీసా పారాయణ చేయడం వల్ల, స్వామికి తమలపాకుల హారాన్ని అలంకరించడం వల్ల మంత్ర సంబంధమైన పీడలు తొలగిపోతాయని, శనీశ్వరుడి అనుగ్రహం కలుగుతుందని, నాగదోష శాంతి చేకూరుతుందని, సకల శుభాలు, ఆయురారోగ్యాలు చేకూరుతాయని, కార్యాల్లో విజయం లభిస్తుందని పెద్దలు చెప్పారు.

• సి.ఎన్.మూర్తి
8328143489

---

ఏ పురాణాన్ని విన్నా, వినిపించినా, చదివినా, చదివించినా... ఆ కథలో దాగిన అంతరార్థాన్ని తెలుసుకోవాలి. దాన్ని మన జీవితానికి అన్వయించుకోవాలి. తప్పకుండా అన్వయించుకోవలసిన కథలు కొన్ని ఉన్నాయి. వాటిలో గౌరీ శంకరుల కథ ఒకటి.

విశేషం



# గౌరీ శంకరుల కథ... వధూవరులకు పాఠం

తపస్సు చేస్తున్న గౌరీ దేవి దగ్గరకు శంకరుడు మాయా బ్రహ్మచారి రూపంలో వచ్చాడు. గౌరి పక్కనే ఉన్న చెలికత్తె అతణ్ణి చూసి " నువ్వెరు? దేనికోసం వచ్చావు?" అని అడిగింది.

"ఏం లేదు! ఈమె ఇంత కఠోరమైన తపస్సు చేస్తోంది కదా? దేనికోసం?" అని అడిగాడు.

"శంకరుణ్ణి పతిగా పొందడం కోసం" అని ఆమె చెప్పింది.

అతను బిగ్గరగా నవ్వుతూ "ఇదేం పిచ్చితనం? తన తల్లితండ్రులెవరో ఆ శంకరుడికే తెలీదు. ఏదైనా పొరపొచ్చెం వస్తే అటువైపు నుంచి ఆమెకు దిక్కెవరు? పోనీ... ఉండేందుకు ఇల్లుందా? అంటే... శ్మశానం ఆయన నివాస స్థలం. చుట్టపక్కాలు ఎవరైనా వచ్చిపోతూ ఉంటారా? అంటే... వచ్చేవాళ్ళందరూ ఏడుస్తూ వస్తారు, దిగాలుగా వెళ్తూ ఉంటారు. మరెప్పుడూ ఇక్కడకు రాకుండా ఉంటే బాగుండుననుకుంటారు. అతని ఇంటికి (నివాసానికి) వెళ్ళే మార్గాన్ని చూద్దామా? ఆ దారి మొత్తం చనిపోయిన వ్యక్తుల తాలూకు వారి తలలు గొరిగిన వెంట్రుకలతో, తడిపేసిన వస్త్రాలతో ఉంటుంది. ఇంతకూ అందంగా ఉంటాడా? అంటే ఒళ్ళంతా శ్మశానంలోని భస్మపు పూతే. మెడలో ఆభరణాలంటావా? పుర్రెలు లేదా లావులావుగా, కఠినంగా ఉండే రుద్రాక్షలూను. విలువైన వస్త్రాలున్నాయనుకుంటున్నావేమో? ఆయనకు ఉన్నది రెండే రెండు... అంటే వస్త్రాల జత. ఒకటి రక్తపు బొట్లు ఓడుతూ ఉండే ఏనుగు చర్మం (గజాజినం శోణిత బిందు వర్షి), మరొకటి బరువైన పులి చర్మం. వివాహం అయ్యాక కౌగిలించుకుంటే.. ఆ శ్మశాన భస్మం... చందనపు పూతతో ఉన్న ఆమె శరీరానికి అంటుకుంటుంది. చక్కని పుష్పాలను కొప్పునిండా ధరించే ఆమె అందానికి... ఆయన బిరుసైన, ఏనాడూ తలంటి లాంటి సంస్కారం లేని కురులు, పైగా దాదాపు పాదాల వరకూ ఉండే జటాజూటం... వెగటుగా అనిపించదా మరి? అన్నిటికీ మించి... చూడ్డానికి అదోలా అనిపించేలా ఈయనకు మూడు కళ్ళు ఉంటాయి. చక్కని భోజనాన్ని అత్తింట్లో ఆరగిద్దామనుకుంటున్నదేమో ఆ వెర్రిది! ప్రతిరోజూ భిక్షాటనం చేసుకొని వచ్చి, దానితోనే సంతృప్తి పడతాడు. ఆమె గనుక వివాహం చేసుకున్నదనుకో... ఏదైనా మిగిలితే పెడతాడు, లేదంటే పస్తే మరి! చక్కని అన్న పాత్ర ఉందనుకోకు, పుర్రెలో తినాల్సి వస్తుంది. ముందే గమనించుకోవాలని చెప్పు. అతని కళ్ళలోనైనా అందం ఉందా? అవి నిత్యం కోపంతో (రుద్రః) ఎర్రగా రక్తం గడ్డకట్టినట్టు ఉంటాయి. ఏం ఆనందిస్తుందంటావ్ పెళ్ళి చేసుకొని?..." అంటూ ఇంకా ఏదో చెప్పబోయాడు.

## సనాతనుడు, లయకారుడు

అతని మాటలన్నిటినీ వింటున్న గౌరి తన చెలికత్తెతో... "అతణ్ణి వెళ్ళిపొమ్మను. గొప్పవాళ్ళ గొప్పతనం తెలియకుండా.. ఎవరైనా ఏదైనా మాట్లాడుతూ ఉన్నప్పుడు... అలా నిందించిన పాపంలో కొంత భాగం వింటున్న మనకు కూడా వస్తుంది" అని అంది. తరువాత అతనితో "ఓ బ్రహ్మచారీ! శంకరుడి గురించి నోటికి వచ్చినట్టు మాట్లాడుతున్నావు. ఇది సరికాదు. ఇంద్రుడంతటివాడు ఆయన వస్తూ ఉంటే... ఐరావతాన్ని దిగి నమస్కరించి వెళ్తాడు. ఆయనకు ఉన్న మూడో కన్ను... జ్ఞాననేత్రం తప్ప అంగవైకల్య సూచకం కాదు. ఆయనకి తల్లితండ్రులు లేకపోవడం కాదు... ఆయన ఎవరికీ అంతుపట్టనంత సనాతనుడు (ప్రాచీనుడు). ఆయన లయకారుడు. కాబట్టి ఆ సమయంలో శ్మశానమే ఆయన కార్యస్థలం. అందుకే అక్కడ ఉంటాడు. తమవారు మరణించిన సందర్భంగా ఎవరికైనా అశుచి (అంటు, మైలు) వస్తే... ఆ కార్యక్రమాలన్నీ పూర్తయ్యాక శుద్ధి జరిగేది ఆయన ఆలయంలో రాత్రి నిద్ర చేసిన తరువాతే! ఇలా ఎన్నని చెప్పను? వ్యతిరేకించాలనే దృక్పథంతో ఉన్నవాడికి ఎన్ని చెప్పినా ఒక్కటే!" అంటూ "అతణ్ణి పొమ్మను" అని గౌరి గద్దిస్తూ తన చెలికత్తెతో చెప్పింది. ఎప్పుడైతే తన సమక్షంలోనే తన గొప్పదనాన్ని గురించి శైలజ వివరించిందో... వెంటనే శంకరుడు తన నిజరూపాన్ని చూపించాడు. ఆమె చేతిని పట్టుకున్నాడు (చేపట్టడం అంటే వివాహాంగీకార సూచకం కదా). అంతే కాదు... "తవాస్మి దాసః... నీకు శాశ్వతంగా దాసుణ్ణి" అని కూడా అన్నాడు.

> పెళ్ళికి ముందు ఏ వరుడైనా తను చేసుకోబోయే వధువుకు కొన్ని ఎచ్చులు (అతిశయాలు) చెబుతాడు. తన గురించి ఉన్నది ఉన్నట్టు చెప్పుకొన్న వరుడు శంకరుడొక్కడే! ఇలాంటి ఎచ్చుల కారణంగానే ఈ రోజుల్లో ఎన్నో సంసారాలు అనతికాలంలోనే కూలిపోతున్నాయి. కాబట్టి సుఖంగా కాపురం చేసుకోదలచిన వరులు నిజాన్ని నిజంగానే చెప్పుకోవాలి లేదా చెప్పించాలి.

## అలాంటి వరుడు ఆయనొక్కడే!

ఈ మంగళ గౌరి కథ ద్వారా తెలుసుకోవలసిన విశేషాలు అనేకం ఉన్నాయి. పెళ్ళికి ముందు ఏ వరుడైనా తను చేసుకోబోయే వధువుకు కొన్ని ఎచ్చులు (అతిశయాలు) చెబుతాడు. తన గురించి ఉన్నది ఉన్నట్టు చెప్పుకొన్న వరుడు శంకరుడొక్కడే! ఇలాంటి ఎచ్చుల కారణంగానే ఈ రోజుల్లో ఎన్నో సంసారాలు అనతి కాలంలోనే కూలిపోతున్నాయి. లేదా "అప్పుడలా చెప్పావా? లేదా? ఎందుకలా చెప్పి నన్ను మోసగించావ్?" లాంటి దెప్పుళ్ళతో, నిత్య కలహాలతో కొన్ని సంసారాలు సాగుతున్నాయి. కాబట్టి సుఖంగా కాపురం చేసుకోదలచిన వరులు నిజాన్ని నిజంగానే చెప్పుకోవాలి లేదా చెప్పించాలి. ఒకవేళ వరుడు లేదా వధువు అలాంటివి చెబితే.. అది సరికాదని తల్లితండ్రులు మందలించాలి. పొరపాట్లను అంగీకరిస్తూ నిజాన్ని చెప్పి తీరాలి. రెండోది... శంకరుడు ఆమెను తాను తపస్సు చేసుకుంటున్న కాలంలో చూశాడు. అప్పుడు ఆమె చాలా సౌందర్యవతి. కఠోరమైన తపస్సు కారణంగా ఆమె గౌర వర్ణంలోకి మారింది. అయినా శంకరుడు 'ఆనాడు ఉన్న అందం లేదు కదా? మరొక ఆమెను చూసుకుందాం' అనుకోలేదు. ఆమె శరీరం రంగు మారినంత మాత్రాన తన అభిప్రాయాన్ని మార్చుకోలేదు. నేటి కాలపు వరులు దీన్ని నేర్చుకోవాలి. శరీరచ్ఛాయ అనేది శాశ్వతం కాదు. ఏ గాయంతోనో, మనోవేదనతోనో రూపంలో మార్పు రావచ్చు. అందమే శాశ్వతం అనుకుంటూ... అదే ప్రాతిపదిక మీద వివాహ నిర్ణయం సరికాదు. అలాగే ఆదాయానికి మాత్రమే ప్రాధాన్యత ఇవ్వకూడదు. ఉద్యోగం ఏ క్షణంలో పోతుందో తెలియదు... నేటి కాలంలో ఈ పరిస్థితి ఇంకా తీవ్రంగా ఉంది. మంచి ఆస్తి ఉన్నా... పెద్ద దూది గుట్టను దగ్ధం చెయ్యడానికి చిన్న నిప్పురవ్వ చాలన్నట్టు... ఒక్క వ్యసనం లేదా వెనుకటి రుణం ఉంటే చాలు... ఐశ్వర్యమంతా హుళక్కే కదా!

• డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు
9866700425

---

దైవమార్గం

# విర్రవీగినవారికి నరకమే...

ఒక మహా నగరంలో ధనవంతుడొకరు ఉన్నాడు. చుట్టూ సేవక జనంతో, నిత్య వైభోగాలతో అతని జీవితం సాగుతూ ఉండేది. అతని విలాసవంతమైన భోజనం బల్లపైనుంచి జారి పడే ఆహార పదార్థాలు తిని బతకాలని చూసే వ్యక్తి ఒకడు ఉన్నాడు. ఆ నిరుపేద పేరు లాజరు. చినిగిన దుస్తులు, బక్కచిక్కిన దేహం, దాని నిండా



గాయాలు, వాటిని నాకాలని అతని మీద ఎగబడే కుక్కలు. కానీ అతను ఎప్పుడూ తను లేనివాణ్ణని బాధపడడం కానీ, ఉన్నవాళ్ళను ద్వేషించడం కాని ఎరుగడు.

కొన్నాళ్ళకు లాజరు చనిపోయాడు. అతణ్ణి దేవదూతలు పరిశుద్ధుల లోకానికి తీసుకువెళ్ళారు. దివ్య పురుషుడైన అబ్రహం చెంతన ఉంచారు. మరి కొన్నాళ్ళకు ధనవంతుడు కూడా మరణించాడు. అతణ్ణి నరకంలో, అగ్ని జ్వాలల మధ్య ఉంచారు. అక్కడ అతను ఎన్నో బాధలు భరిస్తున్నాడు. ఒకసారి అబ్రహం పక్కన కూర్చొని ఉన్న లాజరును ఆ ధనికుడు చూశాడు. "రక్షించు" అని కేకలు వేశాడు. "దప్పికతో నా నాలుక ఎండిపోయింది. కాబట్టి దయచేసి నా పట్ల కనికరం చూపించు. లాజరును పంపించు" అని అభ్యర్థించాడు. అప్పుడు అబ్రహం "నీవు భూలోకంలో ఉన్నప్పుడు నీ ఇష్టం వచ్చినట్టు ప్రవర్తించావు. ఎక్కువ సుఖభోగాలను అనుభవించావు. దాని ఫలితంగా ఇప్పుడు కష్టపడుతున్నావు. లాజరు భూలోకంలో ఎన్నో బాధలు, కష్టాలు అనుభవించి, ఇప్పుడు సుఖపడుతున్నాడు. ప్రతి వ్యక్తి తన క్రియలకు తగిన ప్రతిఫలాన్ని అనుభవించక తప్పదు" అన్నాడు. ధనవంతుడు ఎంతో బాధపడ్డాడు. తాను దేవుణ్ణి మరచి... అక్రమ కార్యాలు చేసినందుకు పశ్చాత్తాపపడ్డాడు.

సిరిసంపదలు ఉన్నాయని విర్రవీగుతూ, కన్నూ మిన్నూ కానకుండా, పక్కవారిని ఈసడించే అహంకారులకు ఈ కథలో ఒక పెద్ద హెచ్చరిక ప్రతిధ్వనిస్తోంది. ఉన్నవాడు లేనివాడికి సాయపడాలి. సంపాదించడమే కాదు, అవసరంలో ఉన్నవారిని ఆదుకోవడం కూడా తెలియాలి. దానశీలత ఒక మహాకళ. ఎప్పుడైనా ఏదైనా మనం ఒకరికి ఇస్తేనే దేవుడు మనకూ ఇస్తాడు. ఇవ్వడానికి సంపదే అక్కరలేదు, ఇవ్వగలిగేవి ఇంకా చాలా ఉన్నాయి. సంపాదించడం నేరం కాదు కానీ... అవసరాల్లో ఉన్న ఇతరులను ఆదుకోవాలి అనేది ఈ కథలోని సారాంశం.

> ఉన్నవాడు లేనివాడికి సాయపడాలి. సంపాదించడమే కాదు, అవసరంలో ఉన్నవారిని ఆదుకోవడం కూడా తెలియాలి. దానశీలత ఒక మహాకళ. ఎప్పుడైనా ఏదైనా మనం ఒకరికి ఇస్తేనే దేవుడు మనకూ ఇస్తాడు. ఇవ్వడానికి సంపదే అక్కరలేదు, ఇవ్వగలిగేవి ఇంకా చాలా ఉన్నాయి.


• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్
9866755024

---

వ్యాసపీఠం

# వాల్మీకి-నారద సంభాషణే ఈ రామాయణం!

సీతారాముల జీవితచరిత్ర రసరమ్యమైనది. కొన్ని వేల ఏళ్ళుగా భారతావనికి జీవధారలాంటిది. మన పూర్వీకులు దీన్ని వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత, బ్రహ్మసూత్రాల స్థాయిలో నిలిపారు. వాల్మీకి మహర్షి విరచిత రామాయణానికి గత వెయ్యేళ్ళలో అనేక వ్యాఖ్యానాలు వెలువడ్డాయి. మహేశ్వర తీర్థుల 'తత్త్వదీపిక, గోవిందరాజుల 'భూషణం', త్రయంబక మఖిన్ రాసిన 'ధర్మకూతం', మాధవయోగి 'అమృతకటకం', నాగేశభట్టు 'తిలకం', వంశీధర శివసహాయ శిరోమణి లాంటి గ్రంథాలు రామాయణాన్ని భిన్నమైన పార్శ్వాల నుంచి విశ్లేషించాయి. ఇక భారతీయ భాషల్లో వెలువడిన రామాయణాల గురించి వేరుగా చెప్పాల్సిన అవసరమే లేదు. తెలుగులో మొల్ల, మళయాళంలో ఎళుత్తాచాన్, ఒడియాలో బాలరాముడు, అవధిలో తులసీదాసు, బెంగాలీలో కృత్తివాసుడు, కన్నడంలో తొరవేలు రాసిన గ్రంథాలు వాల్మీకి మూల రామాయణానికి అనేక




మెరుగులు అద్దాయి. ఈ గ్రంథాలన్నింటిలో ఉన్న ముఖ్యమైన అంశాలన్నింటినీ తీసుకొని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త దుష్యంత్ శ్రీధర్ ఇంగ్లీషులో ఒక రామాయణాన్ని రాశారు. దీనిని ప్రముఖ రచయిత్రి శ్రీదేవి మురళీధర్ తెలుగులోకి అనువదించారు. ఈ పుస్తకంలో కథ అంతా వాల్మీకి- నారదుల మధ్య సంభాషణగా నడుస్తుంది. శ్రీదేవి మురళీధర్ అనువాదం... సరళమైన తెలుగులో, అందరికీ సులభంగా అర్థమయ్యేలా ఉంది. రామాయణంపై ఆసక్తి ఉన్నవారందరూ తప్పనిసరిగా చదవాల్సిన పుస్తకమిది.

**రామాయణం**
**మూల రచన:** దుష్యంత్ శ్రీధర్
**అనువాదం:** శ్రీదేవి మురళీధర్
**ప్రచురణ:** హార్పర్ కాలిన్స్
అమెజాన్‌తో సహా అన్ని పుస్తక కేంద్రాల్లో లభిస్తుంది.

---

సద్బోధ

# గోశాలుడి పశ్చాత్తాపం

జైన మతానికి చెందిన తీర్థంకరుడు వర్ధమాన మహావీరుడు. ఆయనకు ఎందరో శిష్యులు ఉండేవారు. వారిలో మక్ఖలి గోశాలుడు ఒకరు. అతను చాలా తెలివైనవాడు. చక్కని మాటకారి. తాను కూడా మహావీరుడిలాంటి తీర్థంకరుడిగా గుర్తింపు పొందాలన్న దురాశ అతనికి కలిగింది. దానికోసం... మహావీరుడు చెబుతున్నవన్నీ తప్పని చాటడానికి ఎన్నో కుట్రలు పన్నాడు. క్రమంగా మహావీరుడు చెప్పే ప్రతిదాన్నీ ప్రత్యక్షంగానే ఖండించడం మొదలుపెట్టాడు.



ఒకసారి మహావీరుడు ఏడు రకాల నరకాల గురించి వివరిస్తున్నాడు. అప్పుడు గోశాలుడు "కాదు, మహావీరుడికి ఏమీ తెలియదు. నిజానికి ఏడు వందల నరకాలు ఉన్నాయి" అన్నాడు. ఇలా తన వాక్చాతుర్యంతో తెలిసినవి, తెలియనివి ఎన్నో చెప్పి... మహావీరుడి శిష్యులలో ఎంతోమందిని గోశాలుడు ఆకర్షించాడు. మహావీరుడి నుంచి వేరుపడి... తనదైన ఒక శాఖను స్థాపించాడు. వాక్చాతుర్యం ఉన్న వ్యక్తి తన మేధాశక్తిని ఉపయోగించి ఏదైనా చెబితే... దాన్ని నమ్మడానికి వేలమంది ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. కేవలం నమ్మడమే కాదు... అతనికి సర్వస్వాన్ని సమర్పించే శిష్యులుగా, భక్తులుగా మారుతారు. అతణ్ణి అనుసరిస్తారు. క్రమంగా అతను కొత్త మతాన్నో, ఉన్న మతంలోని ఒక శాఖనో ఏర్పాటు చేస్తాడు. మక్ఖలి గోశాలుడు చేసిది కూడా అదే!

ఒకసారి గోశాలుడు ఉంటున్న గ్రామానికి మహావీరుడు వచ్చాడు. గోశాలుడు ప్రచారం చేస్తున్న తప్పుడు సిద్ధాంతాలను గురించి చర్చించి, హెచ్చరించడం కోసం అతణ్ణి కలుసుకున్నాడు. "ఒకప్పుడు నీవు నా శిష్యుడివి కాబట్టి, ప్రేమతో నిన్ను సరైన మార్గంలో పెట్టడానికి వచ్చాను" అన్నాడు మహావీరుడు.

"నీకు శిష్యుడిగా ఉన్న ఆ వ్యక్తి ఎప్పుడో మరణించాడు. ఇప్పుడు ఈ శరీరంలో ఉన్నది ఒక తీర్థంకరుడు" అని గర్వంగా చెప్పాడు గోశాలుడు. మహావీరుడు అక్కడి నుంచి నిష్క్రమించాడు.

కొంతకాలం గడిచింది. గోశాలుడిలో క్రమక్రమంగా ఆత్మ పరిశీలన ప్రారంభమయింది. తను ఒక అజ్ఞాని, ఏదీ తెలియకపోయినా తెలిసినట్టు నటించే వంచకుడినని అతనికి తెలిసివచ్చింది. హృదయం బరువెక్కింది. పశ్చాత్తాపం కలిగింది. తన శిష్యులను పిలిచాడు. "నేను ఇంతవరకూ బోధించినదంతా అసత్యమే. నేను మరణించాక... నా శరీరాన్ని నడి వీధుల వెంట లాక్కొని వెళ్ళండి. వీడొక నయవంచకుడని ప్రకటించండి. నా శరీరం మీద ఉమ్మెయ్యమనండి" అని చెప్పాడు. ఆ తరువాత... మారిన మనిషిగా, అహంకారం లేకుండా జీవించాడు.

• రాచమడుగు శ్రీనివాసులు

---

చింతన

ప్రస్తుత కాలంలో మనిషి తనను తాను ఒక భిన్నమైన, ప్రత్యేకమైన ప్రాణిలా భావించుకుంటున్నాడు. తన దగ్గర ఎంతో సాంకేతికత ఉన్నదనీ, ఒకప్పుడు లేని ఎన్నో ఉపకరణాలు ఉన్నాయనీ గర్వపడుతున్నాడు. ఎక్కువ సమయం స్మార్ట్ ఫోన్‌తోనే గడుపుతున్నాడు. అదో అద్భుతమైన సాంకేతికత అని అనుకుంటున్నాడు. కానీ ఆ సాంకేతికతను ఎందుకు తయారు చేశారో ఎప్పుడైనా ఆలోచించారా? వాటిని కంపెనీలు తయారు చేస్తున్నది మానవ శ్రేయస్సు కోసం కాదు, స్వలాభం కోసం. మనకు సదుపాయాలు కల్పిస్తున్నందుకు డబ్బు తీసుకుంటున్నారు. సిమ్ కార్డు లేనిదే ఫోన్ పని చెయ్యదు. పైగా రీఛార్జి చేసుకుంటూ ఉండాలి. అలాగే ఫోన్ ఛార్జింగ్ ఎంత ఉందో ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకుంటూ ఉండాలి. ఎవరైతే ఎక్కువగా ఫోన్ వాడుతూ ఉంటారో వాళ్ళు తమతో పవర్ బ్యాంక్ మోస్తూ ఉంటారు. ఫోన్‌లో ఛార్జింగ్ తక్కువగా ఉందని తెలిసిన వెంటనే ఛార్జింగ్ పెడతారు.

# జీవితం సఫలం కావాలంటే...

కొత్త ఫోన్ కొనడానికి వెళుతున్నప్పుడు అది మనకు ఎంతో మేలు చేస్తుందనే ఆశతో ఉంటాం. కానీ కొన్న తరువాత ఎప్పుడూ దాని గురించే ఆలోచించే పరిస్థితి ఏర్పడుతుంది. ఎక్కడికైనా వెళ్ళేముందు... అక్కడ ఛార్జింగ్ చేసుకొనే అవకాశం ఉందో లేదో ఆలోచిస్తారు. ఈ విధంగా పొద్దున లేచినప్పటి నుంచి రాత్రి నిద్రపోయే వరకూ ఫోన్ గురించే ఆందోళన చెందేవారు చాలామంది ఉన్నారు. తనను సతమతం చేసే ఆలోచనల నుంచి కాపాడుకోవడానికి ఏ సాంకేతికతను వ్యక్తులు ఉపయోగించాలనుకుంటారో... ఆ సాంకేతికతే వారికి మరిన్ని ఆలోచనలు కలిగిస్తూ ఉంటుంది. మరి ఎప్పుడూ ఆలోచనలోనే మునిగి ఉండే మనిషికి అసలైన ఆనందానుభూతి ఎలా లభిస్తుంది?

మనమందరం మన జీవితాల్లో ఆనందాన్వేషణలో ఉన్నాం. కానీ చింతలు, చికాకులతో సతమతం అవుతున్నంతకాలం ఆనందానుభూతి పొందలేమనేది గ్రహించాలి. ఈ ప్రపంచంలో ఎన్నో విషయాల మీద వితండవాదాలు జరుగుతూ ఉంటాయి. కానీ సాధువులు, మహాత్ములు అన్ని విషయాలనూ ఎప్పుడో చెప్పేశారు. రాయాల్సినవన్నీ ఇంతకుముందే రాశారు. 'ఆత్మానందం లేక మానవుడు, కాశీ మధురలు తిరిగేను - కస్తూరి మృగం తన నాభిలోనే ఉన్న కస్తూరికోసం వనమెల్లా తిరిగినట్టు...'- ఇది విన్న ప్రతిసారీ నవ్వొస్తూ ఉంటుంది. ఇలాంటి మంచి విషయాలు మనిషి బుర్రకు ఎందుకు ఎక్కవు? వాటిని

> వేద వ్యాసుడి లాంటి మహా ఋషులు రచనలు చేయడానికి కారణం ఏమిటి? వాటిని చదవడానికో, గుర్తు పెచ్చుకోవడానికో కాదు... పుస్తకాల్లో ఉన్న విషయాలను గుర్తు పెట్టుకున్నంత మాత్రాన జీవితం సఫలం కాదు. వాటిని ఆచరించాలి.



అమలు చేయడానికి మనిషి ఎందుకు ప్రయత్నించడం లేదు? వేద వ్యాసుడి లాంటి మహా ఋషులు రచనలు చేయడానికి కారణం ఏమిటి? వాటిని చదవడానికో, గుర్తు పెచ్చుకోవడానికో కాదు... పుస్తకాల్లో ఉన్న విషయాలను గుర్తు పెట్టుకున్నంత మాత్రాన జీవితం సఫలం కాదు. వాటిని ఆచరించాలి. అన్నిటికన్న ముఖ్యంగా మీలో ఉన్న ఆ దివ్య శక్తితో అనుబంధం ఏర్పరచుకోండి. తద్వారా మీ జీవితం సఫలం అవుతుంది.



ప్రేమ్‌రావత్

## కేసీఆర్‌తో బీఆర్ఎస్ కీలకనేతల భేటీ

» ఫిరాయింపులపై సుప్రీం తీర్పు, కాళేశ్వరం నివేదిక ఇతర అంశాలు, కార్యాచరణపై చర్చ

హైదరాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌తో ఆ పార్టీ కీలక నేతలు కేటీఆర్, హరీశ్‌రావు, ఇతర నేతలు భేటీ అయ్యారు. తెలంగాణలో ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై సుప్రీంకోర్టు తీర్పు, కాళేశ్వరం కమిషన్ చైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ ప్రభుత్వానికి నివేదిక అందజేసిన నేపథ్యంలో గురువారం ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో జరిగిన ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. కాళేశ్వరం కమిషన్ నివేదికలోని అంశాలపై, ఆ ప్రాజెక్టుతో తెలంగాణకు ప్రయోజనం లేదంటూ కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం చేస్తున్న ప్రచారంపై దీటుగా స్పందించాలని నేతలకు గులాబీ బాస్ సూచించినట్టు తెలిసింది. ఆయా అంశాలపై ప్రజల్లోకి ఎలా వెళ్లాలన్న దానిపై దిశానిర్దేశం చేసినట్టు సమాచారం. ఇక ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు అంశంపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో.. తదుపరి కార్యాచరణ ఎలా ఉండాలన్న దానిపై భేటీలో చర్చించినట్టు తెలిసింది. ఆగస్టులో కరీంనగర్‌లో నిర్వహించే బీసీ సభ, బీసీ బిల్లుపై రాష్ట్రపతిని కలిసే అంశాలపైనా పార్టీనేతలకు కేసీఆర్ దిశా నిర్దేశం చేసినట్టు సమాచారం.

## పరిహారం ఎకరాకు రూ.40 లక్షలివ్వాలి

» ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుపై సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం: ఎమ్మెల్సీ కవిత

దామరగిద్ద, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా భూములు కోల్పోయే రైతులకు ఎకరాకు రూ.40 లక్షల వరకు పరిహారం ఇవ్వాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఇప్పటికే ఎకరాకు రూ.20 లక్షలు ఇస్తానని సీఎం రేవంత్‌రెడ్డి మాట ఇచ్చారని, కానీ, ఎకరాకు రూ.14 లక్షల ధర నిర్ణయించి రైతులకు అన్యాయం చేయడం సరికాదన్నారు. గురువారం నారాయణపేట జిల్లా దామరగిద్ద మండల పరిధిలోని కానుకుర్తి గ్రామంలో భూ నిర్వాసితుల సభ బీఆర్ఎస్ సీనియర్ నేత శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సభలో కవిత మాట్లాడుతూ.. భూ నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేసి పరిహారంతో పాటు ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులను కేసీఆర్ దిగిపోయేనాటికి 95% పూర్తి చేశారన్నారు. మిగతా 5% పనులు పూర్తి చేస్తే పాలమూరు పచ్చబడుతుందన్నారు. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుపై సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని ఆమె చెప్పారు.

## సీఎం రమేశ్ వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందించాలి

» కమ్మ సంఘాల సమాఖ్య డిమాండ్

యూసుఫ్‌గూడ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కమ్మ సామాజిక వర్గాన్ని అవమాన పరిచేలా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలు చేశారంటూ.. బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ చేసిన ప్రకటనపై కేటీఆర్ స్పందించాలని తెలంగాణ కమ్మ సంఘాల సమాఖ్య ప్రతినిధులు డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆయన నిజంగానే వ్యాఖ్యలు చేశారని భావించాల్సి ఉంటుందని అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమాఖ్య సభ్యులు శంకర్‌రావు, సుబ్బారావు, ఉప్పలపాటి రాణి తదితరులు మాట్లాడారు. సీఎం రమేశ్ వ్యాఖ్యలపై కేటీఆర్ ఇప్పటికీ వివరణ ఇవ్వకపోవడం బాధాకరమని అన్నారు. కేసీఆర్ పాలనలో తమ వర్గానికి సముచిత ప్రాధాన్యం ఇచ్చారని వారు గుర్తు చేశారు. రాష్ట్రంలో 25 లక్షల మంది కమ్మ సామాజిక వర్గం వారు ఉన్నారని, రాబోయే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో "మా ఓట్లు మీకు అవసరం లేదా ?." అంటూ కేటీఆర్‌ను ప్రశ్నించారు. సీఎం రమేశ్ చేసిన ప్రకటన అబద్ధమైతే కేటీఆర్ వెంటనే ఖండించాలని, లేదంటే తమ భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని సమాఖ్య నాయకులు అన్నారు.

# వేళ్లన్నీ కేసీఆర్‌వైపే!

(మొదటిపేజీ తరువాయి)

అనుకూలంగా నివేదికను తెప్పించుకున్నారని.. మంత్రివర్గం, ఉపసంఘం ఆమోదాలన్నీ నిర్మాణం ప్రారంభమయ్యాకే వచ్చాయని పేర్కొన్నట్లు సమాచారం. డిజైన్లకు తగ్గట్లుగా నిర్మాణం జరగలేదని, చాలా లోపాలు ఉన్నాయని పేర్కొన్నట్లు తెలుస్తోంది. 2016లో బ్యారేజీ నిర్మాణం ప్రారంభమవగా.. 2019లో బ్యారేజీలు వినియోగించడానికి వీలుగా పనులు జరిగాయని, తొలి ఏడాదే వరదల అనంతరం బ్యారేజీల గేట్లు మూయగా దిగువ భాగంలో రక్షణ వ్యవస్థలు దెబ్బతిన్నాయని పేర్కొన్నట్లు సమాచారం. ఆ వ్యవస్థలు ఏటా చెల్లాచెదురవుతున్నా.. వాటిని సరిచేసే ప్రక్రియ జరగలేదని గుర్తు చేసినట్లు సమాచారం. ఇక బ్యారేజీల నిర్మాణం పూర్తయిన నాటినుంచి కార్యకలాపాలు, నిర్వహణ (ఓఅండ్ఎం) పనులు చేయనందువల్లే 2023 అక్టోబరు 21న మేడిగడ్డ బ్యారేజీలోని ఏడో బ్లాకు కుంగిందని కమిషన్ గుర్తు చేసింది. బ్యారేజీల నిర్మాణం జరిగిన నాటి నుంచి నాలుగేళ్ల పాటు మేడిగడ్డలో ఓఅండ్ఎం పనులే జరగలేదని, నిర్మాణ సంస్థ కూడా దీనిపై నివేదించినప్పటికీ చర్యలు తీసుకోకపోవడం వల్లే బ్యారేజీ దెబ్బతిన్నదని పేర్కొన్నట్లు తెలిసింది. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను ఒక చోట ప్రతిపాదించి, మరో చోట నిర్మించారని, నిర్మాణానికి ముందు జరగాల్సిన పరిశీలన జరగలేదని, అందుకే బ్యారేజీల్లో సీపేజీలతో బుంగలు ఏర్పడ్డాయని కమిషన్ నిర్ధారించినట్లు సమాచారం. ఇక బ్యారేజీల్లో షీట్ పైల్స్ వినియోగించాల్సి ఉండగా.. సీకెంట్ పైల్స్ వినియోగించారని, దేశంలో ఏ ప్రాజెక్టులోనూ వీటిని వినియోగించినట్లుగా.. మన్నిక బాగున్నట్లుగా ఆధారాల్లేవని పేర్కొన్నట్లు తెలిసింది. షీట్ పైల్స్ స్థానంలో సీకెంట్ పైల్స్‌ను సరిగ్గా అమర్చకపోవడం వల్ల ఇసుక జారిపోయి.. బ్యారేజీలు కుంగడంతోపాటు సీపేజీలు ఏర్పడ్డాయని కమిషన్ వివరించినట్లు సమాచారం. బ్యారేజీలను నీటి మళ్లింపు కోసం వాడుకోవాల్సి ఉండగా.. నీటి నిల్వకు వినియోగించారని, ఎక్కువ కాలం నీటిని నింపడం వల్ల బ్యారేజీలు దెబ్బతిన్నాయని, నీటి నిల్వ నిర్ణయం కేసీఆర్‌దేనని కమిషన్ గుర్తించినట్లు తెలిసింది. ఇక భారీగా ఆర్థిక అవకతవకలు జరిగాయని, వీటిని నియంత్రించడంలో ఆర్థిక శాఖ వైఫల్యం కూడా ఉందని పేర్కొంది. చెల్లింపులు, నిర్మాణ అంచనాలను అడ్డదిడ్డంగా చేసుకుంటూ/సవరించుకుంటూ పోయారని తప్పుపట్టినట్లు తెలిసింది. ఇక బ్యారేజీల నిర్మాణం జరుగుతున్నప్పుడు క్వాలిటీ కంట్రోల్ విభాగం కూడా సమర్థ పాత్రను నిర్వర్తించలేదని, నిరంతరం నాణ్యతను పరిశీలించి, రికార్డు చేయాల్సి ఉండగా.. ఆ పని చేయలేదని కమిషన్ పేర్కొన్నట్లు సమాచారం. మాజీ ఈఎన్‌సీలు సి.మురళీధర్, నల్లా వెంకటేశ్వర్లు, బి.హరిరామ్, రామగుండం సీఈ సుధాకర్‌రెడ్డిల పాత్ర ఇప్పటికే విజిలెన్స్ నివేదికలో ఉండగా.. తాజాగా కమిషన్ నివేదికలో ఎస్ఈ కరుణాకర్ పాత్ర కూడా ఉన్నట్లు సమాచారం.

### నేడు బహిర్గతమవనున్న నివేదిక

జస్టిస్ ఘోష్ కమిషన్ సమర్పించిన నివేదికను శుక్రవారం తెరవనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు నివేదికను మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందించనున్నారు. ఈ నివేదికపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించే అవకాశాలు ఉన్నాయి. ఆ తర్వాత నివేదికను మంత్రివర్గ సమావేశంలో పెట్టి చర్చించాలా? అనే దానిపై నిర్ణయం తీసుకోనున్నారు.

### నా పాత్ర ముగిసింది: జస్టిస్ ఘోష్

నివేదిక అందించిన తర్వాత జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. విచారణలో తన పాత్ర ముగిసిందన్నారు. విచారణ విధివిధానాలకు లోబడి నివేదికను సిద్ధం చేశామని తెలిపారు. విచారణ పూర్తికావడంతో శుక్రవారం సాయంత్రం కోల్‌కతాకు వెళ్తున్నట్లు చెప్పారు. విచారణతో ముడిపడిన అంశాల కోసం మళ్లీ హైదరాబాద్‌కు రానని గుర్తుచేశారు. నివేదిక ప్రకారం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందా? అని విలేకరులు అడగ్గా.. తనకు తెలియదని చెప్పారు. గత ఏడాది మార్చిలో ప్రభుత్వం కమిషన్ వేయగా.. అదే ఏడాది జూన్ నుంచి విచారణ ప్రారంభమైంది. గత నెల 11న మాజీ సీఎం కేసీఆర్‌ను ప్రశ్నించడంతో విచారణ ముగిసింది. దాదాపు 13 నెలల పాటు జరిగిన విచారణ ప్రక్రియలో కమిషన్ 115 మందిని విచారించింది. విచారణ ప్రక్రియ అంతా సహజ న్యాయసూత్రాలకు లోబడే జరిగిందని న్యాయనిపుణులు చెబుతున్నారు. మాజీ సీఎం కేసీఆర్ మినహా, అందరినీ బహిరంగంగానే విచారించారు.

### రెండు నివేదికలు

కాళేశ్వరం బ్యారేజీల విచారణ నివేదికతో పాటు యాదాద్రి, భద్రాద్రి థర్మల్ ప్లాంట్ల నిర్మాణం, ఛత్తీస్‌గఢ్‌తో విద్యుత్తు ఒప్పందం, పవర్‌గ్రిడ్‌తో కారిడార్ బుక్ చేసుకొని.. మళ్లీ వదులుకోవడానికి సంబంధించిన అంశాలపై విచారణ జరిపిన నివేదికలు ప్రభుత్వం వద్ద ఉన్నాయి. విద్యుత్తు విచారణను జస్టిస్ మదన్ బి.లోకూర్ పూర్తిచేయగా.. ఆ నివేదికపై న్యాయ సలహా అనంతరం ముందుకు వెళ్తామని ప్రభుత్వం ప్రకటించింది. కాళేశ్వరం నివేదిక కూడా అందడంతో త్వరలోనే ఈ రెండు నివేదికలపై సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో సమీక్ష జరిగే అవకాశాలున్నాయి. ఈ నివేదికను న్యాయ పరిశీలనకు పంపి, మంత్రివర్గంలో చర్చించిన తర్వాత శాసనసభలో ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయి. నివేదికను తెలుగు, ఉర్దూలో అనువాదం చేసి, సభ్యులకు అందుబాటులో ఉంచనున్నట్లు సమాచారం. సభలో నివేదికలపై చర్చించి, విధానపరమైన నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. కాళేశ్వరం, విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణాలు/ఒప్పందాలపై విచారణ చేయించనున్నట్లు శాసనసభలోనే ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో సభలకు సమాచారం ఇచ్చి.. తదుపరి చర్యల దిశగా అడుగులు వేసే అవకాశాలు ఉన్నాయి.



నివేదిక సమర్పించేందుకు బీఆర్కే భవన్ లోపలికి వెళుతున్న జస్టిస్ పీసీ ఘోష్

### కాళేశ్వరం బాధ్యులపై ఇప్పటికే చర్యలు

కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణ లోపాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ జరిపి, నివేదిక సమర్పించిన సంగతి తెలిసిందే. ఆ నివేదిక ఆధారంగా 38 మంది తాజా, మాజీ అధికారులకు ప్రభుత్వం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. వారిలో 36 మంది సంజాయిషీ ఇచ్చారు. బ్యారేజీల నిర్మాణాలు పూర్తికాకముందే పూర్తిచేసినట్లు ధ్రువపత్రాలు ఇచ్చిన ఈఈ, ఎస్ఈపై కూడా అభియోగాలను నమోదు చేసింది.

## కాళేశ్వరం అవినీతిపై కఠిన చర్యలు

ఫిరాయింపులపై కేటీఆర్ మాట్లాడటమా?: మంత్రి కోమటిరెడ్డి



నల్లగొండ, జూలై 31 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతికి పాల్పడిన వారిపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. కక్షసాధింపు ధోరణితో కాకుండా వాస్తవాలు, నివేదిక ఆధారంగానే చర్యలు ఉంటాయని చెప్పారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో గురువారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో కేవలం కమీషన్లు, కాంట్రాక్టుల కోసమే కాళేశ్వరం కట్టారని దుయ్యబట్టారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. గతంలో కమీషన్ల కోసమే పనులు చేపట్టారు తప్ప, కీలకమైన విద్యారంగాన్ని పట్టించుకోలేదని ఆరోపించారు. పార్టీ ఫిరాయింపుల అంశంపై మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. బీఆర్ఎస్ హయాంలో వేరే పార్టీల నుంచి వచ్చిన వారికి మంత్రి పదవులు ఇచ్చిన విషయం కేటీఆర్ గుర్తుంచుకోవాలని ఆయన అన్నారు.

## మంచిరేవులలో చిక్కిన చిరుత

» ట్రెక్ పార్కు నుంచి జూపార్కుకు తరలింపు

నార్సింగ్/హైదరాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): గత 20 రోజులుగా మంచి రేవుల ప్రాంత ప్రజలకు కంటి మీద కునుకులేకుండా చేసిన చిరుతపులి ఎట్టకేలకు చిక్కింది. మంచిరేవులలోని ఫారెస్ట్ ట్రెక్ పార్కులో ఏర్పాటు చేసిన బోనులో బుధవారం రాత్రి చిరుత చిక్కింది. గురువారం ఉదయం అటవీ సిబ్బంది చిరుతపులిని జూపార్కుకు తరలించారు. గత 20 రోజులుగా ఈ ప్రాంతంలో చిరుత సంచారంతో జనం భయాందోళనలో ఉన్నారు. దానిని పట్టుకునేందుకు అటవీ అధికారులు ఏడు బోన్లు, 20 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. రెండుసార్లు పలు ప్రాంతాల్లో కెమెరాలకు చిక్కిన చిరుత మరోసారి గోల్కొండ ఆర్మీ ప్రాంతంలో రికార్డయింది. ఈసారి ఎలాగైనా చిరుతను పట్టుకోవాలని పథకం రచించిన అటవీ అధికారులు ట్రెక్ పార్కులో బోను ఏర్పాటు చేసి అందులో మేకను ఉంచారు. మేక అరుపులకు అక్కడికి వచ్చిన చిరుత బోనులో చిక్కింది.

### జనం అప్రమత్తంగా ఉండాలి: అటవీ శాఖ

హైదరాబాద్ చుట్టూ ఉన్న అటవీ ప్రాంతాలు తగ్గడం, అడవుల్లో సరైన ఆహారం దొరక్కపోవడంతో చిరుతలు బయటకు వస్తున్నాయని అటవీ సంరక్షణ ప్రధాన అధికారి సువర్ణ తెలిపారు. పులులు దాడులు చేసే అవకాశం ఉన్నందున జనం అప్రమత్తంగా ఉండాలని కోరారు. మంచిరేవుల వద్ద చిక్కిన మగ చిరుతపులి వయసు 5 నుండి 6 ఏళ్లు ఉండొచ్చని తెలిపారు. చిరుతపులుల సంచారాన్ని గమనిస్తే అటవీ శాఖ టోల్ ఫ్రీ నంబరు 040-23231772 కు ఫోన్ చేయాలని సీనియర్ అధికారి శంకరన్ తెలిపారు.

## తిరుమలలో రీల్స్ చేస్తే కేసులు: టీటీడీ

తిరుమల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తిరుమల పవిత్రతకు భంగం కలిగించేలా రీల్స్, షార్ట్స్ చేసే వ్యక్తులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని టీటీడీ మరోమారు స్పష్టం చేసింది. తిరుమల శ్రీవారి ఆలయం ముందు, మాడవీధుల్లో ఇటీవల కొంతమంది వెకిలి చేష్టలు చేస్తూ, నృత్యాలు చేస్తూ వీడియోలు చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేస్తున్నారని తెలిపింది. తిరుమల లాంటి ఆధ్యాత్మిక క్షేత్రంలో ఇలాంటి అభ్యంతరకర, అసభ్యకర చర్యలు అనుచితమని పేర్కొంది. భక్తుల మనోభావాలు దెబ్బతీసే ఈ తరహా చర్యలు ఆధ్యాత్మిక వాతావరణానికి విఘాతం కలిగిస్తున్నాయని, తిరుమల క్షేత్రం భక్తి, ఆరాధనలకు నిలయమనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని తెలిపింది. ఇలాంటి వీడియోలు చిత్రీకరించేవారిని టీటీడీ విజిలెన్స్, సెక్యూరిటీ సిబ్బంది గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటుందని టీటీడీ గురువారం ఓ ప్రకటన ద్వారా హెచ్చరించింది.

# చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

## వీరలెవెల్లో...



అడివి శేష్, మృణాల్ ఠాకూర్ జంటగా షానియల్ డియో తెరకెక్కిస్తున్న చిత్రం 'డెకాయిట్'. సుప్రియా యార్లగడ్డ నిర్మాత. గురువారం మృణాల్ పుట్టినరోజు. ఈ సందర్భంగా చిత్రబృందం ఇంటెన్స్ లుక్‌లో గన్ పట్టుకుని ఉన్న ఆమె స్టిల్ విడుదల చేసింది. 'ఇందులో మృణాల్ పాత్ర ఇప్పటి వరకూ చూసిన హీరోయిన్ రోల్స్‌కు భిన్నంగా వీరలెవెల్లో ఉండబోతోంది' అని చిత్రబృందం పేర్కొంది. డిసెంబర్ 25న ఈ చిత్రం విడుదలవుతోంది.

## ప్లీజ్ మేడమ్



నారా రోహిత్ హీరోగా వెంకటేశ్ నిమ్మలపూడి తెరకెక్కిస్తున్న చిత్రం 'సుందరకాండ'. వృతి వాఘాని, శ్రీదేవి విజయ్‌కుమార్ కథానాయికలు. సంతోశ్ చిన్నపోళ్ల, గౌతమ్ రెడ్డి, రాకేశ్ మహంకాళి నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి 'ప్లీజ్ మేడమ్' అంటూ సాగే ఓ అందమైన గీతాన్ని విడుదల చేశారు మేకర్స్. శ్రీహర్ష ఇమాని రాసిన ఈ పాటను దీపక్ బ్లూ, అర్జున్ చాందీ, రేష్మా శ్యామ్ ఆలపించారు. లియోన్ జేమ్స్ సంగీతం అందించారు. ఈ నెల 27న చిత్రం విడుదలవుతుంది.

## హృదయం నిండిపోయింది

- విజయ్ దేవరకొండ



ఈ విజయంతో నా హృదయం నిండిపోయింది. దాన్ని మాటల్లో ఎలా చెప్పాలో అర్థం కావడం లేదు' అని అన్నారు హీరో విజయ్ దేవరకొండ. ఆయన నటించిన 'కింగ్‌డమ్' సినిమా గురువారం విడుదలైంది. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ "అర్జున్ రెడ్డి', 'గీత గోవిందం' సినిమాల విడుదలకు ముందు చిన్ననాటి స్నేహితులతో కలసి సరదాగా గడిపేవాడిని. నిన్న రాత్రి కూడా వాళ్లు మా ఇంటికి వచ్చారు. చాలా విషయాలు మాట్లాడుకున్నాం. అదే సమయంలో యూఎస్‌లో 'కింగ్‌డమ్' ప్రీమియర్ మొదలైంది. ఎంతో మంది నాకు ఫోన్ చేసి 'అన్నా మనం హిట్ కొట్టినం..' అని ఎమోషనల్‌గా మాట్లాడారు. మీ అందరి ప్రేమ, వేంకటేశ్వర స్వామి ఆశీస్సుల వల్లే ఇది సాధ్యమైంది' అని అన్నారు. నిర్మాత నాగవంశీ మాట్లాడుతూ 'అన్నిఏరియాల్లోనూ 'కింగ్‌డమ్'కు మంచి వసూళ్లు వస్తున్నాయి. సినిమాని ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు. దీనికి రెండో భాగం కూడా చేస్తాం. అందులో ఓ పెద్ద హీరో నటిస్తారు. రెండో భాగంలో హీరోయిన్ పాత్రకు స్కోప్ ఎక్కువగా ఉంటుంది' అని అన్నారు.

### మనం హిట్ కొట్టాం: రష్మిక

'విజయ్.. 'కింగ్‌డమ్' విజయం నీకూ, నీ అభిమానులకూ ఎంత ముఖ్యమో తెలుసు. మనం హిట్ కొట్టాం' అని రష్మిక మందన్న ఎక్స్‌లో సంతోషాన్ని వెలిబుచ్చారు. విజయ్, రష్మిక మందన్న కొన్నాళ్లుగా ప్రేమలో ఉన్నారంటూ ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఈ కామెంట్ ప్రాధాన్యం సంతరించుకుంది.

## స్నేహితులే ప్రత్యర్థులైతే..

ఆది పినిశెట్టి, చైతన్య రావు ప్రధాన పాత్రల్లో దేవా కట్టా, కిరణ్ జయకుమార్ దర్శకత్వంలో రూపొందిన వెబ్ సిరీస్ 'మయసభ: రైజ్ ఆఫ్ ద టైటాన్స్'. విజయ్ కృష్ణ లింగమనేని, శ్రీహర్ష నిర్మించారు. ఈ నెల 7 నుంచి 'సోని లివ్' ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. గురువారం ట్రైలర్‌ని లాంచ్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హీరో సాయి దుర్గాతేజ్ మాట్లాడుతూ 'ఓ మూడు భాగాలకు సరిపడా కథ రాశానని దేవా కట్టా 'మయసభ' గురించి 'రిపబ్లిక్' సినిమా టైంలోనే చెప్పారు. ఈ సిరీస్ అద్భుతాలు సృష్టించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. దేవా కట్టా మాట్లాడుతూ 'ఇద్దరు ప్రాణ స్నేహితుల ప్రయాణమే ఈ కథ. పరిస్థితుల వల్ల వారిద్దరి మధ్య ఏర్పడిన దూరం ఏమిటి? అనే కాన్సెప్ట్‌తో తీశాం' అని చెప్పారు.



## నా కుటుంబాన్ని బాధించాయి

-విజయ్ సేతుపతి



నా స్నేహితురాలిని విజయ్ సేతుపతి లైంగికంగా వేధించాడంటూ రమ్య మోహన్ అనే మహిళ ఆరోపించిన సంగతి తెలిసిందే. దీనిపై విజయ్ సేతుపతి స్పందించారు. "నన్ను ఎన్నో ఏళ్లగా చూస్తున్నవారంతా ఆమె చేసిన ఆరోపణలు చూసి నవ్వుకున్నారు. నేనేంటో నాకు తెలుసు. ఈ తప్పుడు ఆరోపణలు నన్ను బాధించలేవు. కానీ నా కుటుంబం, సన్నిహితులు ఎంతో బాధపడ్డారు. 'ఆమె ఫేమస్ కావడం కోసం అలాంటి ఆరోపణలు చేస్తోంది. ఆమెను కాసేపు హైలైట్ అవ్వనివ్వండి' అని వారికి చెప్పాను. ఆమెపై మా టీమ్ సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేసింది. ఏడేళ్ళుగా నాపై ఇలాంటి ప్రచారాలెన్నో జరిగాయి. అన్నిటినీ తట్టుకుని నిలబడ్డాను. ఇవి ఎప్పటికీ నన్ను బాధించలేవు" అని పేర్కొన్నారు.

## భావోద్వేగాలతో అలరిస్తుంది



అశ్విన్‌బాబు కథానాయకుడిగా ఎం. ఆర్ కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'వచ్చినవాడు గౌతమ్'. రియా సుమన్ కథానాయిక. టి. గణపతిరెడ్డి నిర్మాత. త్వరలోనే విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. నేడు అశ్విన్‌బాబు పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రబృందం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. పోరాట ఘట్టాలు, పతాకస్థాయి భావోద్వేగాలతో ఈ చిత్రం అలరిస్తుందని నిర్మాత తెలిపారు.

## ప్రేమ్ ప్రారంభం



పవన్ తాత, చమిందా వర్మ జంటగా నటిస్తోన్న నూతన చిత్రం 'ప్రేమ్'. రాజేశ్ రావూరి దర్శకుడు. శివమ్ మీడియా పతాకంపై సుజాత సమర్పిస్తున్న ఈ చిత్రానికి శివ మల్లాల నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. గురువారం ఈ సినిమా ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హీరో సందీప్ కిషన్ క్లాప్ కొట్టగా, రాజీవ్ కనకాల కెమెరా స్విచ్ఛాన్ చేశారు.




## అరబిందో గూటికి అమెరికన్ కంపెనీ

### ఒప్పందం విలువ రూ.2,185 కోట్లు

హైదరాబాద్(ఆంధ్రజ్యోతి బిజినెస్): నగరానికి చెందిన ప్రముఖ ఔషధ కంపెనీ అరబిందో ఫార్మా మరో భారీ కొనుగోలు జరిపింది. అమెరికాకు చెందిన లానెట్ సెల్లర్ హోల్డ్‌కో నుంచి లానెట్ కంపెనీ ఎల్ఎల్‌సీని 25 కోట్ల డాలర్లకు (సుమారు రూ.2,185 కోట్లు) చేజిక్కించుకుంది. అరబిందో ఫార్మా తన పూర్తి అనుబంధ విభాగమైన అరబిందో ఫార్మా యూఎస్ఏ ఇంక్ ద్వారా ఈ డీల్ కుదుర్చుకుంది. అమెరికాలో తయారీ సామర్థ్యంతోపాటు వ్యాపారాన్ని మరింత విస్తరించాలన్న లక్ష్యంలో భాగంగా ఈ కొనుగోలు జరిపినట్లు అరబిందో ఫార్మా వెల్లడించింది.

అమెరికాలోని పెన్సిల్వేనియా రాష్ట్రంలో ట్రెవోస్ కేంద్రంగా ప్రారంభమైన లానెట్.. అత్యంత నాణ్యమైన, కాంప్లెక్స్ జనరిక్ ఔషధాల ఉత్పత్తిదారు. ముఖ్యంగా ఏడీహెచ్‌డీ చికిత్సలో ఉపయోగించే జనరిక్ లిక్విడ్‌ను తయారు చేస్తోందీ సంస్థ. ఇండియానాలో ఏటా 360 కోట్ల ట్యాబ్లెట్లను తయారు చేయగలిగే భారీ ప్లాంట్‌ను సైతం కలిగి ఉంది. ఈ డీల్ ద్వారా లానెట్‌కు చెందిన అత్యంత లాభదాయక ఔషధాల పోర్ట్‌ఫోలియోతోపాటు కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్ అండ్ మాన్యుఫాక్చరింగ్ ఆర్గనైజేషన్(సీడీఎంఓ) వ్యాపారంలోకి అరబిందోకు ప్రవేశం లభించనుంది.

## ద్రవ్య లోటు రూ.2.80 లక్షల కోట్లు

### వార్షిక లక్ష్యంలో 17 శాతానికి..

న్యూఢిల్లీ :ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం(ఏప్రిల్-జూన్)లో కేంద్ర ప్రభుత్వ ద్రవ్య లోటు రూ.2,80,732 కోట్లకు చేరిందని కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ (సీజీఏ) వెల్లడించింది. ఇది వార్షిక బడ్జెట్ అంచనా(బీఈ)లో 17.9 శాతానికి సమానం. గత ఆర్థిక సంవత్సరం(2024-25) ఇదే కాలానికి ద్రవ్యలోటు బడ్జెట్ అంచనాలో 8.4 శాతంగా ఉంది. కాగా ఈసారి లోటును రూ.15.69 లక్షల కోట్లకు (జీడీపీలో4.4%) కుదించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది.




## జీఆర్‌టీ జువెలర్స్‌కు పీజీఐ అవార్డు

హైదరాబాద్: ప్లాటినం గిల్డ్ ఇంటర్నేషనల్(పీజీఐ) నిర్వహించిన ప్లాటినం సీజన్ ఆఫ్ లవ్ 2025 పోటీలో జీఆర్‌టీ జువెలర్స్ మరోసారి అవార్డు దక్కించుకుంది. ఈ పోటీలో జీఆర్‌టీ అవార్డు గెలుచుకోవడం వరుసగా ఇది తొమ్మిదోసారి. దేశవ్యాప్తంగా, ముఖ్యంగా దక్షిణాదిలో ప్లాటినం విక్రయాల్లో అగ్రగామిగా నిలిచినందుకు గాను జీఆర్‌టీకి ఈ అవార్డు లభించింది.

# రూ.16 లక్షల కోట్లు

### దేశంలోని టాప్ రియల్టీ కంపెనీల మొత్తం ఆస్తుల విలువ ఇది..

- అగ్రస్థానంలో డీఎల్ఎఫ్
- టాప్-10 జాబితాలో అపర్ణ కన్‌స్ట్రక్షన్స్
- గ్రోహ్-హురున్ ఇండియా రిపోర్టు వెల్లడి



న్యూఢిల్లీ : దేశంలోని అత్యంత విలువైన రియల్టీ కంపెనీల ఆస్తుల విలువ రూ.16 లక్షల కోట్లకు చేరింది. గత ఏడాదిలో రూ.1.4 లక్షల కోట్ల వృద్ధి నమోదైంది. గురువారం విడుదలైన 'గ్రోహ్-హురున్ ఇండియా రియల్ ఎస్టేట్ 150' నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. గత ఏడాది కాలంలో రియల్ ఎస్టేట్ రంగ వృద్ధి రేటు 70 శాతం నుంచి 14 శాతానికి పడిపోయినా కంపెనీల ఆస్తుల విలువ మాత్రం ఎగబాకడం విశేషం.

**డీఎల్ఎఫ్ నం.1**

దేశీయ రియల్టీ రంగంలో డీఎల్ఎఫ్ హవా కొనసాగుతోంది. రూ.2.07 లక్షల కోట్ల ఆస్తులతో డీఎల్ఎఫ్ అగ్రస్థానంలో నిలిచింది. గత ఏడాది కాలంలోనే ఈ కంపెనీ ఆస్తుల విలువ 2.6 శాతం పెరిగింది. లోధా డెవలపర్స్ (రూ.1.38 లక్షల కోట్లు), తాజ్ గ్రూపు కంపెనీ ఇండియన్ హోటల్స్ (రూ.1.08 లక్షల కోట్లు), ప్రెస్టీజ్ ఎస్టేట్స్ (రూ.71,500 కోట్లు) వరుసగా రెండు, మూడు, నాలుగో స్థానాల్లో నిలిచాయి. హైదరాబాద్‌కు చెందిన అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ రూ.37,400 కోట్ల ఆస్తులతో తొమ్మిదో స్థానంలో నిలిచింది. ఏడాది కాలంలో ఈ కంపెనీ ఆస్తుల విలువ 12.9 శాతం పెరిగింది.

### రియల్టీలో రిచ్.. రాజీవ్ సింగ్





- స్థిరాస్తి రంగ సంపన్నుల్లో రూ.1.27 లక్షల కోట్ల ఆస్తులతో డీఎల్ఎఫ్ అధినేత రాజీవ్ సింగ్ అగ్రస్థానంలో ఉన్నారు.
- రూ.92,340 కోట్ల ఆస్తులతో రెండో స్థానంలో లోధా డెవలపర్స్ అధినేత ఎంపీ లోధా.
- అదానీ రియల్టీ అధిపతి గౌతమ్ అదానీ రూ.52,320 కోట్ల స్థిరాస్తి సంపదతో మూడో స్థానంలో ఉన్నారు.
- అపర్ణ కన్‌స్ట్రక్షన్‌కు చెందిన ఎస్ సుబ్రమణ్యమ్ రెడ్డి, సీ వెంకటేశ్వర రెడ్డి వరుసగా 8, 9వ స్థానాల్లో ఉన్నారు.
- నగరాలవారీగా.. రూ6,96,800 కోట్ల ఆస్తులు, 42 రియల్ ఎస్టేట్ కంపెనీలతో ముంబై అగ్ర స్థానంలో ఉంది.
- 23 కంపెనీలు రూ.1,97,400 కోట్ల ఆస్తులతో రెండో స్థానంలో బెంగళూరు.
- 16 కంపెనీలు, రూ.86,700 కోట్ల ఆస్తులతో మూడో స్థానంలో ఢిల్లీ.
- 13 కంపెనీలు, రూ.93,700 కోట్ల ఆస్తులతో నాలుగో స్థానంలో హైదరాబాద్.



# పసిడీలా!

- ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 10% తగ్గిన బంగారం గిరాకీ
- 135 టన్నులకు పరిమితం
- అధిక ధరలే ప్రధాన కారణం
- డబ్ల్యూజీసీ రిపోర్టు వెల్లడి

ముంబై: ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారత్‌లో గోల్డ్ డిమాండ్ వార్షిక ప్రాతిపదికన 10 శాతం తగ్గి 134.9 టన్నులకు పరిమితమైందని ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) గురువారం విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. గత ఏడాది ఇదే కాలానికి పసిడి గిరాకీ 149.7 టన్నులుగా నమోదైంది. విక్రయాల విలువ పరంగా చూస్తే, ఈ జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో బంగారం డిమాండ్ 30 శాతం పెరిగి రూ.1,21,800 కోట్లకు చేరింది. క్రితం సంవత్సరంలో ఇదే సమయానికి డిమాండ్ విలువ రూ.93,850 కోట్లుగా నమోదైంది. సమీక్షా కాలంలో బంగారం ధర తొలిసారిగా రూ.లక్షకు చేరడంతో.. గిరాకీ పరిమాణం తగ్గినప్పటికీ, విలువలో వృద్ధి నమోదైందని డబ్ల్యూజీసీ రీజినల్ సీఈఓ- ఇండియా సచిన్ జైన్ అన్నారు. ఈ ఏడాది ప్రథమార్ధం(జనవరి-జూన్)లో బంగారం గిరాకీ దాదాపు 253 టన్నులుగా ఉండగా.. పూర్తి ఏడాదికి గిరాకీ 600-700 టన్నుల స్థాయిలో ఉండవచ్చని ఆయన అంచనా వేశారు.

**రిపోర్టులోని మరిన్ని విషయాలు**

- అధిక ధరల కారణంగా జూన్ క్వార్టర్‌లో స్వర్ణాభరణాల విక్రయాలు 17 శాతం తగ్గి 88.8 టన్నులకు పరిమితమయ్యాయి. 2024లో ఇదే కాలానికి 106.5 టన్నుల సేల్స్ జరిగాయి. గోల్డ్ జువెలరీ విక్రయాల విలువ మాత్రం 20 % వృద్ధితో రూ.80,150 కోట్లుగా నమోదైంది.
- ఈ ఏప్రిల్-జూన్‌లో బంగారంలో పెట్టుబడులు 7 శాతం పెరిగి 46.1 టన్నులకు చేరగా.. పెట్టుబడుల విలువ ఏకంగా 54 శాతం వృద్ధితో రూ.41,650 కోట్లుగా నమోదైంది. పసిడి దీర్ఘకాలంలో మెరుగైన ప్రతిఫలాలు అందించగలదన్న ఇన్వెస్టర్ల నమ్మకాన్ని ఇది నొక్కి చెబుతోందని సచిన్ జైన్ అన్నారు.
- జూన్ క్వార్టర్‌లో భారత్‌లోకి పసిడి దిగుమతులు 34 శాతం తగ్గి 102.5 టన్నులుగా నమోదయ్యాయి. గత ఏడాది ఇదే త్రైమాసికంలో దేశంలోకి 150 టన్నుల బంగారం దిగుమతైంది.
- సమీక్షా కాలంలో గోల్డ్ రీసైక్లింగ్ (పాత బంగారం పునర్వినియోగం) ఒక శాతం పెరుగుదలతో 23.1 టన్నులుగా నమోదైంది.
- ఈ ఏప్రిల్ - జూన్‌లో ప్రపంచవ్యాప్తంగా బంగారం గిరాకీ 3 శాతం పెరిగి 1,249 టన్నులకు చేరింది. అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితుల నేపథ్యంలో గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ల (ఈటీఎఫ్)లోకి పెట్టుబడులు భారీగా పెరగడం ఇందుకు కారణమని డబ్ల్యూజీసీ తెలిపింది. అంతేకాదు, సెంట్రల్ బ్యాంకులు కూడా 166 టన్నుల బంగారం కొనుగోలు చేశాయని రిపోర్టులో వెల్లడించింది.

## టారిఫ్‌లతో వృద్ధికి గండి

న్యూఢిల్లీ : ట్రంప్ 25% సుంకాల పోటు భారత ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావమే చూపనుంది. ప్రభుత్వం పైకి గుంభనంగా ఉన్నా.. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) మన జీడీపీ వృద్ధి రేటు పావు శాతం నుంచి అర శాతం వరకు కుంచించుకుపోయే అవకాశం కనిపిస్తోంది. తాజా సుంకాలతో వృద్ధి రేటు 0.3 శాతం వరకు తగ్గే ప్రమాదం ఉందని అంతర్జాతీయ సంస్థ బర్క్‌లీస్ అంచనా.

**పెనాల్టీలతో మరింత భారం:** రష్యా నుంచి భారత్ అదే పనిగా చమురు, ఆయుధాలు కొంటే, భారత వస్తువులపై 25 శాతం సుంకాలతో పాటు, పెనాల్టీలు తప్పవని ట్రంప్ ప్రకటించారు. అయితే ఈ పెనాల్టీలు ఎంత అనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. ఈ పెనాల్టీల భయంతో రిలయన్స్ సహా భారత ఆయిల్ కంపెనీలు ప్రత్యామ్నాయాలను అన్వేషిస్తున్నాయి. అమెరికా, పశ్చిమాసియా దేశాల నుంచే పెద్ద మొత్తంలో ముడి చమురు, గ్యాస్ దిగుమతులకు చర్చలు జరుపుతున్నాయి.

**అసలు ఎత్తుగడ:** మన వస్తు ఎగుమతుల్లో అమెరికాదే అగ్రతాంబూలం. గత ఏడాది రెండు దేశాల మధ్య 12,920 కోట్ల డాలర్ల (సుమారు రూ.11.31 లక్షల కోట్లు) ద్వైపాక్షిక వాణిజ్యం జరిగింది. అందులో మన దేశం నుంచి అమెరికాకు 8,740 కోట్ల డాలర్ల విలువైన వస్తు ఎగుమతులు జరిగాయి. మన మొత్తం వస్తు ఎగుమతుల్లో ఇది దాదాపు 20 శాతానికి సమానం. ద్వైపాక్షిక వాణిజ్యంలో గత ఏడాది మన దేశానికి 4,600 కోట్ల డాలర్ల మిగులు ఉంది. ఈ మిగులును దెబ్బ కొట్టడం కూడా ట్రంప్ వ్యూహంగా కనిపిస్తోంది. ఈ సుంకాలు+ పెనాల్టీలతో అమెరికాకు మన దేశం నుంచి జరిగే వస్తు ఎగుమతుల్లో ఎంత లేదన్నా 30 శాతానికి గండి పడుతుందని నిపుణుల అంచనా.

**ద్వంద్వ వైఖరి:** తమ వ్యవసాయ, పాడి ఉత్పత్తుల దిగుమతులను ఎలాంటి సుంకాలు లేకుండా భారత్ అనుమతించాలని కోరుతున్న అమెరికా, తన మార్కెట్‌ను మాత్రం తెరవడం లేదు. పాడి ఉత్పత్తుల దిగుమతులపై 200 శాతం.. పండ్లు, కూరగాయల దిగుమతులపై 132 శాతం, శుద్ధి చేసిన ఆహార ఉత్పత్తులపై 196 శాతం, నూనె గింజలు, వంట నూనెలపై 164 శాతం దిగుమతి సుంకాలు విధిస్తోంది. మొత్తం మీద ట్రంప్ సుంకాల ప్రభావం, భారత ఎగుమతులకు పెను ముప్పుగా మారింది.

## సూచీలకు సుంకాల సెగ

### ఆరంభంలో సెన్సెక్స్ 787 పాయింట్లు పతనం

### 296 పాయింట్ల నష్టంతో ముగింపు

ముంబై: ట్రంప్ సుంకాల సెగతో భారత స్టాక్ మార్కెట్ గురువారం భారీగా నష్టపోయింది. ఆరంభ ట్రేడింగ్‌లో 787 పాయింట్లు క్షీణించి 81,000 దిగువకు జారిన సెన్సెక్స్.. మధ్యాహ్నం నుంచి మళ్లీ కాస్త తేరుకుంది. చివరికి సూచీ 296.28 పాయింట్ల నష్టంతో 81,185.58 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 86.70 పాయింట్లు కోల్పోయి 24,768.35 వద్ద ముగిసింది. టెక్స్‌టైల్స్, ఆటో, ఫార్మా, ఐటీ రంగ షేర్లు అధిక అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 23 నష్టపోగా.. టాటా స్టీల్ అత్యధికంగా 2.20 శాతం క్షీణించింది. సన్‌ఫార్మా, అదానీ పోర్ట్స్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎన్‌టీపీసీ షేర్లు ఒక శాతానికి పైగా పతనమయ్యాయి. ఆశాజనక త్రైమాసిక ఫలితాలు ప్రకటించిన హిందుస్థాన్ యూనిలీవర్ షేరు 3.48 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. కాగా, బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు 0.85 శాతం వరకు నష్టపోయాయి.

## మారుతి లాభం రూ.3,792 కోట్లు

న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద కార్ల విక్రయ కంపెనీ మారుతి సుజుకీ ఇండియా ఈ జూన్‌తో ముగిసిన త్రైమాసికానికి రూ.3,792 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాదిలో ఇదే కాలానికి గడించిన రూ.3,760 కోట్ల లాభంతో పోలిస్తే అతి స్వల్పంగా పెరిగింది. దేశీయంగా కంపెనీ వాహన విక్రయాలు 4.5 శాతం తగ్గినప్పటికీ, ఎగుమతులు ఏకంగా 37.4 శాతం పెరగడం కంపెనీ లాభదాయకతకు తోడ్పడింది. కాగా, ఈ జూన్ క్వార్టర్‌లో మారుతి సుజుకీ మొత్తం ఆదాయం రూ.40,493 కోట్లకు చేరింది. మొత్తం వాహన విక్రయాలు 1.1 శాతం పెరుగుదలతో 5,27,861 యూనిట్లకు చేరాయి.

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| 1వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 420 | విజయవాడ | 475 |
| వరంగల్ | 422 | గోదావరి | 460 |
| చిత్తూరు | 493 | విశాఖపట్నం | 460 |
| | | డజను గుడ్లు రూ. | 72 |

### ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 100 | విజయవాడ | 104 |
| వరంగల్ | 100 | గుంటూరు | 109 |
| కరీంనగర్ | 100 | ఒంగోలు | 112 |
| మహబూబ్‌నగర్ | 100 | చిత్తూరు | 102 |
| కర్నూలు | 100 | నెల్లూరు | 107 |
| విశాఖపట్నం | 92 | అనంతపురం | 107 |
| గోదావరి | 104 | | |

### బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 1,00,030 | 91,700 | 1,25,000 |
| విజయవాడ | 1,01,600 | 96,000 | 1,13,500 |
| విశాఖపట్నం | 1,01,600 | 92,100 | 1,25,000 |
| రాజమండ్రి | 1,00,040 | 91,700 | 1,15,000 |
| ప్రొద్దుటూరు | 99,500 | 91,540 | 1,15,000 |
| ముంబై | 98,530 | 90,260 | 1,09,950 |

## తరుణ్ సంచలనం

- టాప్‌సీడ్‌కు షాక్.. క్వార్టర్స్‌కు చేరిక
- సాత్విక్ జోడీ ముందంజ.. మకావు ఓపెన్




మకావు : మకావు ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీలో తెలుగు షట్లర్ తరుణ్ మన్నేపల్లి సంచలనం సృష్టించాడు. టాప్‌సీడ్ లీ చుక్ యుకి షాక్ ఇచ్చి క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకు పోయాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్‌లో రెండో రౌండ్‌లో తరుణ్ 19-21, 21-14, 22-20తో వరల్డ్ నెం. 15 లీ (హాంకాంగ్)పై విజయం సాధించాడు. మరో మ్యాచ్‌లో లక్ష్యసేన్ 21-14, 14-21, 21-17 వార్డోయోపై నెగ్గి క్వార్టర్స్‌లో అడుగుపెట్టాడు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్/చిరాగ్ జంట 10-21, 22-20, 21-16తో కుమగాయ్/నిషి (జపాన్) జోడీపై గెలుపొంది రౌండ్-8కి చేరింది. అలాగే సాయిప్రతీక్/కృష్ణమూర్తి రాయ్ జంట 21-18, 21-18తో జునైద్/రాయ్ కింగ్ (మలేసియా) ద్వయంపై నెగ్గి క్వార్టర్‌ఫైనల్లో ప్రవేశించింది. ఆయుష్ షెట్టి 18-21, 16-21తో జస్టిన్ హో (మలేసియా) చేతిలో ఓడాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ఐదో సీడ్ భారత ద్వయం ధ్రువ్ కపిల/తనీషా క్రాస్టో 21-19, 13-21, 18-21తో మలేసియా జోడీ జిమ్మీ వాంగ్/లీ నీ జింగ్ చేతిలో పరాజయంతో టోర్నీ నుంచి నిష్క్రమించింది.

## వరల్డ్ చాంపియన్లు రచన, అశ్విని

**అండర్-17 రెజ్లింగ్**







ఏథెన్స్ : భారత్‌కు చెందిన రచన, అశ్వినీ విష్ణోయ్ అండర్-17 వరల్డ్ రెజ్లింగ్ చాంపియన్లుగా నిలిచారు. గురువారం జరిగిన 43 కి. ఫైనల్లో రచన 3-0తో జిన్ హాంగ్ (చైనా)ను చిత్తు చేసి పసిడి పతకం కైవసం చేసుకుంది. 65కి. తుదిపోరులో అశ్విని కూడా 3-0తోనే ముఖయో (ఉజ్బెకిస్థాన్)పై నెగ్గి స్వర్ణ పతకం దక్కించుకుంది. కజకిస్థాన్ రెజ్లర్ మధ్కియాతో 57 కి. విభాగం తుది పోరులో 5-6తో ఓడిన మోనీ రజత పతకం అందుకుంది. 49కి.లలో కోమల్ వర్మ కాంస్యం సొంతం చేసుకుంది.


## నేటి నుంచే జాతీయ జూ.మహిళల హాకీ

కాకినాడ : జాతీయ జూనియర్ మహిళల హాకీ చాంపియన్‌షిప్ శుక్రవారం ఇక్కడ ప్రారంభం కానుంది. 30 జట్లు తలపడుతున్న ఈ టోర్నమెంట్ ఆగస్టు 12 వరకు జరగనుంది. కొత్తగా ప్రవేశపెట్టిన డివిజన్ ఆధారిత విధానంలో చాంపియన్‌షిప్ నిర్వహిస్తున్నారు. ఎ,బి,సి డివిజన్లుగా జట్లు పోటీపడతాయి. ఈ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు డివిజన్ ఎ నుంచి, తెలంగాణ జట్టు డివిజన్ సి నుంచి తలపడుతున్నాయి.

## ఆ టెస్టుల్లో కుల్దీప్‌ను ఆడించాల్సింది: గంగూలీ

లండన్: ఓవల్ టెస్టులో పేస్ వికెట్ కావడంతో.. కుల్దీప్‌ను పక్కనపెట్టడంలో తప్పులేదని భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ అభిప్రాయపడ్డాడు. కానీ, లార్డ్స్, మాంచెస్టర్ టెస్టుల్లో కుల్దీప్ మ్యాజిక్‌ను టీమిండియా మిస్ చేసుకొందని చెప్పాడు. 'బర్మింగ్‌హామ్, మాంచెస్టర్, లార్డ్స్ టెస్టుల్లో కుల్దీప్‌ను తీసుకుంటారనుకున్నా. నాణ్యమైన స్పిన్నర్ లేకుండా నాలుగో రోజు, ఐదో రోజు ఆలౌట్ చేయడం కష్టమ'ని అన్నాడు.

హైదరాబాద్ బౌలర్ మహ్మద్ సిరాజ్ ఈ ఆఖరి టెస్టు ఆడడం ద్వారా అరుదైన ఘనతను అందుకున్నాడు. విదేశాల్లో జరిగిన ఐదు టెస్టుల సిరీస్‌లోని అన్ని టెస్టులనూ మూడుసార్లు ఆడడమే గాక, ఆడిన ప్రతిసారీ పదేసి వికెట్లను పడగొట్టాడు. ఈ ఘనతను అంతకు ముందు కపిల్‌దేవ్, వినూమన్కడ్ మాత్రమే సాధించారు.



టాస్‌లు ఓడడంలో భారత్ సరికొత్త రికార్డు సృష్టించింది. కెప్టెన్‌గా గిల్

### టాస్...మరోసారి




వరుసగా ఐదో టాస్ ఓడగా.. గత జనవరి నుంచి అన్ని ఫార్మాట్లలో టీమిండియా వరుసగా 15వ సారి టాస్ చేజార్చుకొంది. 1999 ఫిబ్రవరి-ఏప్రిల్ మధ్య వెస్టిండీస్ వరుసగా 12 టాస్‌లు ఓడింది. ఆ రికార్డును భారత్ అధిగమించింది.

**తొలి రోజు**

# తడబ్యాటు

- అర్ధ శతకంతో ఆదుకొన్న కరుణ్ నాయర్
- వోక్స్‌కు గాయం
- ఇంగ్లండ్‌తో ఐదో టెస్ట్

**భారత్ 204/6**




కరుణ్ నాయర్ (52 బ్యాటింగ్)

లండన్: గత మ్యాచ్‌లో అద్భుత పోరాటంతో అంచనాలు పెంచిన భారత బ్యాటర్లు అంతలోనే ఉసూరుమనిపించారు. పేసర్లకు సహకరిస్తున్న పిచ్‌పై ఇంగ్లండ్ ద్వితీయ శ్రేణి బౌలర్లను ఎదుర్కోవడంలో టాపార్డర్ బ్యాటర్లు విఫలమైన చోట.. అనూహ్యంగా రీఎంట్రీ ఇచ్చిన కరుణ్ నాయర్ (52 బ్యాటింగ్) అర్ధ శతకంతో జట్టును ఆదుకొన్నాడు. దీంతో గురువారం ఆరంభమైన వర్ష ప్రభావిత ఐదవ, ఆఖరి టెస్టులో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 64 ఓవర్లలో 6 వికెట్లకు 204 పరుగులు చేసింది. రోజు ఆఖరుకు నాయర్‌తోపాటు సుందర్ (19 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. సాయి సుదర్శన్ (38), శుభ్‌మన్ గిల్ (21) భారీ స్కోర్లు చేయలేక పోయారు. అట్కిన్సన్, జోష్ టంగ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఓవరాల్‌గా మొదటి రోజు ఇంగ్లండ్‌దే పైచేయిగా నిలిచింది. కాగా, ప్రధాన పేసర్ వోక్స్ ఫీల్డింగ్ చేస్తూ గాయపడ్డాడు.

**జైస్వాల్ మళ్లీ ఫ్లాప్..:** పచ్చని పిచ్.. మేఘావృతమైన ఆకాశం. దీంతో మరో ఆలోచన లేకుండా ఇంగ్లండ్ కెప్టెన్ పోప్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకొన్నారు. అతడి అంచనా తప్పుకాదన్నట్టు తొలి సెషన్‌లోనే భారత ఓపెనర్లు జైస్వాల్ (2), రాహుల్ (14)ను అవుట్ చేసి ఇంగ్లండ్ దెబ్బకొట్టినా.. సుదర్శన్ నిలకడగా ఆడుతూ జట్టును ఆదుకొనే ప్రయత్నం చేశాడు. తన రెండో ఓవర్‌లోనే జైస్వాల్‌ను అట్కిన్సన్ ఎల్బీగా వెనక్కిపంపాడు. అంపైర్ స్పందించక పోవడంతో.. రివ్యూకు వెళ్లిన ఇంగ్లండ్ ఫలితాన్ని సాధించింది. ఇతర పేసర్లు టంగ్, ఓవర్టన్ బౌలింగ్ గతి తప్పడంతో మరో ఓపెనర్ రాహుల్, వన్‌డౌన్‌లో వచ్చిన సాయి సుదర్శన్ క్రీజులో పాతుకుపోయేందుకు ప్రయత్నించారు. వీరిద్దరి భాగస్వామ్యం బలపడుతున్న సమయంలో కీలక రాహుల్‌ను వోక్స్ పెవిలియన్ చేర్చాడు. అయితే, సుదర్శన్, గిల్ ఆచితూచి ఆడుతూ స్కోరు బోర్డును నడిపించారు. టంగ్, వోక్స్ బౌలింగ్‌లో సుదర్శన్ రెండు ఫోర్లు కొట్టగా.. గిల్ కూడా చూడముచ్చటైన షాట్లతో బౌండ్రీలు సాధించాడు. అకస్మాత్తుగా వర్షం కురవడంతో.. ముందుగానే లంచ్‌కు వెళ్లాల్సి వచ్చింది. ఈ సమయానికి భారత్ 72/2తో నిలిచింది.

**గిల్ తొందరపాటు..:** వర్షం కారణంగా రెండో సెషన్‌లో ఆరు ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైనా.. గిల్ వికెట్ చేజార్చుకోవడం భారత్‌కు కోలుకోలేని దెబ్బ. వరుణుడి కారణంగా రెండో సెషన్ ఆలస్యంగా ఆరంభమైంది. అయితే, 27వ ఓవర్‌లో అట్కిన్సన్ బౌలింగ్‌లో డిఫెన్స్ ఆడిన గిల్.. లేని సింగిల్ కోసం యత్నించి రనౌట్ కావడంతో.. మూడో వికెట్‌కు 45 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. మళ్లీ వర్షం కురవడంతో.. టీ సమయానికి భారత్ 85/3 స్కోరు చేసింది.

**భారత్ 119/3:** ఆఖరి సెషన్‌లో సుదర్శన్‌తోపాటు ఫామ్‌లో ఉన్న జడేజా (9)ను టంగ్ అవుట్ చేయడంతో.. ఇంగ్లండ్ పైచేయి సాధించింది. అయితే, నాయర్, సుందర్ ఏడో వికెట్‌కు అజేయంగా 51 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడంతో.. ఈ ఒక్క సెషన్‌లో 3 వికెట్లు కోల్పోయిన భారత్ 119 పరుగులు జోడించింది. వర్షం ఆగడంతో ఈ సెషన్‌ను అరగంటపాటు పొడిగించారు. నాయర్ ఇంగ్లండ్ పేసర్ల సహనాన్ని పరీక్షించగా.. రెండు బౌండ్రీలతో గేర్ మార్చే ప్రయత్నం చేసిన సుదర్శన్ టీమ్ స్కోరును సెంచరీ మార్క్ దాటించాడు. కానీ, టంగ్ అద్భుతమైన అవుట్ స్వింగర్‌తో పెవిలియన్ చేర్చాడు. జడేజాను కూడా టంగ్ అవుట్ చేయడంతో.. భారత్ 123/5తో ఇబ్బందుల్లో పడింది. ఈ దశ నాయర్‌కు జత కలసిన ధ్రువ్ జురెల్ (19) రక్షణాత్మకంగా ఆడుతూ ఆరో వికెట్‌కు 30 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. జురెల్‌ను అట్కిన్సన్ వెనక్కిపంపాడు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన సుందర్‌తో కలసి నాయర్ పోరాటాన్ని కొనసాగించాడు. వీలుచిక్కినప్పుడల్లా షాట్లు ఆడిన కరుణ్ ఫిఫ్టీ పూర్తి చేసుకోగా.. స్కోరు 200 మార్క్ దాటింది.

**స్కోరుబోర్డు**

**భారత్ తొలి ఇన్నింగ్స్:** జైస్వాల్ (ఎల్బీ) అట్కిన్సన్ 2, రాహుల్ (బి) వోక్స్ 14, సుదర్శన్ (సి) స్మిత్ (బి) టంగ్ 38, గిల్ (రనౌట్/అట్కిన్సన్) 21, నాయర్ (బ్యాటింగ్) 52, జడేజా (సి) స్మిత్ (బి) టంగ్ 9, జురెల్ (సి) బ్రూక్ (బి) అట్కిన్సన్ 19, సుందర్ (బ్యాటింగ్) 19; **ఎక్స్‌ట్రాలు: 30; మొత్తం: 64 ఓవర్లలో 204/6; వికెట్ల పతనం:** 1-10, 2-38, 3-83, 4-101, 5-123, 6-153; **బౌలింగ్:** వోక్స్ 14-1-46-1, అట్కిన్సన్ 19-7-31-2, టంగ్ 13-3-47-2, ఓవర్టన్ 16-0-66-0, బెథెల్ 2-1-4-0.

## నాయర్‌కు మరో అవకాశం..

తొలి మూడు టెస్టుల్లో ఆకట్టుకోలేకపోయిన కరుణ్ నాయర్.. మళ్లీ తుది జట్టులోకి రావడం అందరినీ ఆశ్చర్యపర్చింది. మరోవైపు స్పిన్నర్ కుల్దీప్ యాదవ్, పేసర్ అర్ష్‌దీప్ సింగ్ ఒక్క మ్యాచ్ కూడా ఆడకుండానే సిరీస్‌ను ముగించారు. ఇక బుమ్రాకు బదులుగా ఆకాశ్‌దీప్, కాంబోజ్ స్థానంలో ప్రసిద్ధ్‌కృష్ణ జట్టులోకొచ్చారు.

ఓ సిరీస్‌లో అత్యధిక పరుగులు సాధించిన కెప్టెన్‌గా 47 ఏళ్ల క్రితంనాటి గవాస్కర్ రికార్డును గిల్ అధిగమించాడు. 1978-79లో వెస్టిండీస్‌తో సిరీస్‌లో గవాస్కర్ 732 రన్స్ సాధించాడు. కాగా, ఈ ఐదో టెస్ట్‌లో చేసిన 21 రన్స్‌తో ఈ సిరీస్‌లో గిల్ మొత్తం 743 పరుగులు స్కోరు చేశాడు.

### అంపైర్ ధర్మసేనపై ఫైర్..



ఇంగ్లండ్‌కు లబ్ధి చేకూర్చేలా ఫీల్డ్ అంపైర్ కుమార ధర్మసేన వ్యవహరించాడంటూ నెటిజన్లు ఫైర్ అవుతున్నారు. టంగ్ విసిరిన ఇన్నింగ్స్13వ ఓవర్ రెండో బంతి సుదర్శన్ ప్యాడ్‌ను తాకింది. ఎల్బీ కోసం ఇంగ్లండ్ అప్పీలు చేసినా.. ధర్మసేన తోసిపుచ్చాడు. అంత వరకు ఆగకుండా...బంతి ప్యాడ్‌కు తాకేముందు బ్యాట్‌కు ఇన్‌సైడ్ ఎడ్జ్ తీసుకుందంటూ వేళ్ల ద్వారా సూచించాడు. దీంతో ఇంగ్లండ్ రివ్యూకు వెళ్లే ఆలోచనను విరమించుకొంది. ఇలా ఆతిథ్య జట్టుకు ధర్మసేన ఒక రివ్యూ మిగిల్చేందుకు సహకరించాడని నెటిజన్లు తప్పుబడుతున్నారు.

# స్పోర్ట్స్

## విశాఖలో ప్రొ కబడ్డీ లీగ్

### వచ్చే 29నుంచి నాలుగు నగరాల్లో పోటీలు



ముంబై: ప్రొ కబడ్డీ సీజన్ 12వ అంచెకు విశాఖపట్నం ఆతిథ్యం ఇవ్వనుంది. 12 జట్లు పాల్గొనే ఈ లీగ్‌ను మొత్తం నాలుగు నగరాల్లో.. విశాఖతో పాటు జైపూర్, చెన్నై, ఢిల్లీలో నిర్వహించనున్నారు. 2018లో పోటీలు జరగ్గా.. మళ్లీ ఏడేళ్ల తర్వాత పీకేఎల్ సాగరతీరానికి తిరిగి రానుందని నిర్వాహకులు తెలిపారు. కాగా మొత్తం 108 మ్యాచ్‌లకుగాను విశాఖలో 28 జరుగుతాయి.

**లీగ్ వివరాలు: ఆగస్టు 29-అక్టోబరు 23**

- తొలి అంచె-విశాఖపట్నం: ఆగస్టు 29-సెప్టెంబరు 11
- రెండో అంచె-జైపూర్ : సెప్టెంబరు 12-28
- మూడో అంచె-చెన్నై : సెప్టెంబరు 29-అక్టోబరు 12
- నాలుగో అంచె-న్యూఢిల్లీ : అక్టోబరు 13-23

## పట్టుబిగించిన కివీస్

బులవాయో : జింబాబ్వేతో తొలి టెస్ట్ రెండోరోజే న్యూజిలాండ్ పట్టుబిగించింది. ఆతిథ్య జట్టును మొదటి ఇన్నింగ్స్‌లో 149 పరుగులకే పరిమితం చేసిన కివీస్..ఓవర్‌నైట్ 92/0తో గురువారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించి 307 పరుగులకు ఆలౌటైంది. కాన్వే (88), మిచెల్ (80), యంగ్ (41) రాణించారు. ఇక..158 పరుగుల తొలి ఇన్నింగ్స్ లోటుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన జింబాబ్వే రెండో రోజు ఆఖరికి 31/2తో కష్టాల్లో పడింది.

## మెకింటోష్ హ్యాట్రిక్

- ప్రపంచ అక్వాటిక్ చాంపియన్‌షిప్




సింగపూర్ : కెనడా సంచలన స్విమ్మర్ సమ్మర్ మెకింటోష్ ప్రపంచ అక్వాటిక్ చాంపియన్‌షిప్స్‌లో అదరగొడుతోంది. ఈ పోటీల్లో ఆమె మూడో స్వర్ణం కొల్లగొట్టింది. గురువారం జరిగిన మహిళల 200 మీ. బటర్‌ఫ్లైలో 18 ఏళ్ల మెకింటోష్ అగ్రస్థానంలో నిలిచింది. కాగా..ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో మెకింటోష్ ఇప్పటికే 400 మీ. ఫ్రీస్టయిల్, 200 మీ. వ్యక్తిగత మెడ్లేలో స్వర్ణాలు నెగ్గింది. ఈ క్రమంలో ఐదు స్వర్ణాల మైకేల్ ఫెల్ప్స్ రికార్డుకు ఆమె గురి పెట్టింది.

# కేంద్రం మెడలు వంచైనా '42 %' సాధిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

గురువారం వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గంలోని రంగాపూర్‌లో ఆయన శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిగిలో నిర్వహించిన సమావేశంలో మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. "ప్రభుత్వంలో ఉన్నారు.. పాదయాత్ర ఎందుకు?" అని కొందరు అంటున్నారని.. ఉచిత బస్సు నుంచి రేషన్ కార్డుల వరకు ఇచ్చిన ప్రతి హామీని తమ ప్రభుత్వం నిలబెట్టుకుందని.. ప్రజలకు ఇంకా ఏం కావాలో తెలుసుకునేందుకు, వారి బాగోగులు తెలుసుకునేందుకు, వారికి వాస్తవాలు తెలియజేసి, మరింత చేరువయ్యేందుకు జనహిత పాదయాత్రను నిర్వహిస్తున్నట్లు వివరించారు. టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి ఎన్నో యాత్రలు, పాదయాత్రలు చేస్తేనే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. భారత్ జోడో యాత్ర ద్వారా భౌగోళికంగా, సామాజికంగా దేశంలోని వాస్తవ పరిస్థితులను రాహుల్ గాంధీ అర్థం చేసుకున్నారని చెప్పారు.

### ఏడాదిన్నరలోనే రూ.1.80 లక్షల కోట్ల పెట్టుబడులు

కేసీఆర్ రాష్ట్రంపై రూ.7.5 లక్షల కోట్ల అప్పులు రుద్దితే.. ఆ అప్పులకు తమ ప్రభుత్వం వడ్డీలు కడుతూ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ.. అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ తమ ప్రభుత్వం పాలన సాగిస్తోందని మహేశ్ కుమార్ గౌడ్ చెప్పారు. ఏడాదిన్నర కాలంలోనే రాష్ట్రానికి లక్షా 80 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, ఫలితంగా వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 65 వేల ఉద్యోగాలు ఇచ్చామని, మరో 35 వేల ఉద్యోగాలు త్వరలో ఇస్తామని, రెండేళ్లలో లక్ష ఉద్యోగాలు ఇస్తామన్న హామీ త్వరలో సాకారం చేయనున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో కుటుంబ పాలనకు ముగింపు పలికి ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టారని తెలిపారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో ఒక్క మహిళా మంత్రి లేరని, తమ పోరాట ఫలితంగానే బీసీ రిజర్వేషన్లు అంటూ ఆ పార్టీకి చెందిన ఓ మహిళానేత మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇక బీఆర్ఎస్ ఉండదన్నారు. దేశానికి దశ, దిశ రాహుల్‌గాంధీ అని.. దేశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఆయన నిస్వార్థంగా తపిస్తున్నారని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. సోనియా గాంధీ మాట ఇచ్చినందుకే తెలంగాణ వచ్చిందని, ఖర్గే, రాహుల్‌గాంధీ హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేస్తున్నామని చెప్పారు. బీసీలను బీజేపీ మోసం చేస్తోందని ఆయన ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ల కోసం ఆగస్టు 5, 6, 7వ తేదీల్లో ఢిల్లీకి తమతో కలిసి రావాలని రాష్ట్ర బీజేపీ నేతలకు విజ్ఞప్తి చేస్తున్నానని చెప్పారు. రెడ్డి అయి ఉండి కూడా బీసీల కోసం సీఎం రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారని కొనియాడారు.



టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన జనహిత పాదయాత్రలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు

### ఎక్కడికి వెళ్లినా తెలంగాణ గురించే: మీనాక్షి

ప్రతి వ్యక్తి మనసులో ఉన్న ఈశ్వరుడిని దర్శించుకోవడం కోసమే జనహిత పాదయాత్ర అని మీనాక్షీ నటరాజన్ అన్నారు. పాదయాత్రలు కాంగ్రెస్‌కు కొత్తేమీ కాదని, పవిత్ర స్థలాలకు పాదయాత్రతో వెళితేనే దేవుడి అంతరంగం తెలుస్తుందన్నారు. భారత్ జోడో యాత్రతో రాహుల్‌గాంధీ 3,500 కిలోమీటర్లు పాదయాత్ర చేసి తమకు మార్గం చూపించారని, తాము ఆ మార్గాన్ని అనుసరిస్తూ జనం మధ్యలోకి వచ్చామని ఆమె ప్రజలను ఉద్దేశించి అన్నారు. రాహుల్ గాంధీ ఎక్కడికి వెళ్లినా తెలంగాణ మోడల్ గురించే చెబుతుంటారని పేర్కొన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల కోసం కేంద్రంపై కాంగ్రెస్ పోరాటం చేస్తోందని, 6న ఢిల్లీలో పార్లమెంట్ ముందు నిర్వహించే ధర్నాకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆమోదించిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

### దేశంలోనే తెలంగాణ ఆదర్శం: శ్రీధర్‌బాబు

తెలంగాణలో కులగణన, బీసీకు 42 శాతం రిజర్వేషన్లతో తెలంగాణ మిగతా రాష్ట్రాలకు ఆదర్శం కానుందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లకు చిత్తశుద్ధి ఉంటే బీసీ రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ చేస్తున్న పోరాటానికి కలిసి రావాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ చేపట్టిన జనహిత పాదయాత్ర స్థానిక సంస్థల ఎన్నికల కోసం కాదని, ప్రజాహితం కోసమేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు రాంమోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, పర్ణికారెడ్డి, మాజీ ఎంపీలు వి.హనుమంతరావు, మధుయాష్కీగౌడ్, రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

**8 కిలోమీటర్ల పాదయాత్ర**

రంగాపూర్‌లో పార్టీ జెండా ఎగురవేసిన తర్వాత మహేశ్‌గౌడ్ పాదయాత్ర ప్రారంభించారు. 8 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేశారు. రాత్రి పరిగిలోని ఎస్ గార్డెన్స్‌లో భోజనం చేసిన తర్వాత అక్కడే నిద్రకు ఉపక్రమించారు. జనహిత పాదయాత్రలో భాగంగా రెండోరోజైన శుక్రవారం ఉదయం 7 గంటలకు గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో శ్రమదానం, మొక్కలు నాటే కార్యక్రమంలో మహేశ్‌గౌడ్, మీనాక్షి పాల్గొంటారు. అనంతరం ఎస్ గార్డెన్స్‌లో పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులతో సమావేశం కానున్నారు.

---

## తెలంగాణ పోలీస్ వ్యవస్థ దేశంలోనే టాప్

» రాష్ట్ర పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్

మామునూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): నేర దర్యాప్తుతో పాటు అన్ని విభాగాల్లో దేశంలోనే తెలంగాణ మొదటి రెండు స్థానాల్లో నిలవడం సంతోషకరమని తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ చెప్పారు. వరంగల్ జిల్లా కేంద్రం మామునూరు పీటీసీ వేదికగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 2వ తెలంగాణ పోలీస్ డ్యూటీ మీట్-2025 పోటీలను ఆమె ప్రారంభించారు. అంతకుముందు ఆమె అదనపు డీజీపీతో కలిసి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. మూడు రోజుల పాటు జరుగనున్న డ్యూటీ మీట్‌లో రాష్ట్రంలోని ఏడు జోన్లతో పాటు హైదరాబాద్, రాచకొండ కమిషనరేట్ పోలీసులు, సీఐడీ, ఆక్టోపస్, గ్రేహౌండ్స్ విభాగాలకు చెందిన సుమారు 400 మందికి పైగా పోలీస్ అధికారులు, సిబ్బంది 25 విభాగాలలో పోటీ పడతారని ఆమె చెప్పారు. డ్యూటీ మీట్ పోటీల ద్వారా పోలీస్ అధికారులు చట్టాల అమలు, అంతర్జాతీయ భద్రత, నేరాలను గుర్తించడం, సులభతరం అవుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు డీజీపీ మహేష్ భగవత్ మాట్లాడుతూ పోలీసులు కష్టపడి సాధన చేస్తే ఏదైనా సాధ్యమేనన్నారు. రాంచీలో జరిగిన ఆల్ ఇండియా 68వ పోలీస్ డ్యూటీ మీట్‌లో తెలంగాణ పోలీసులు 18 పతకాలు సాధించడంపై ఆయన ప్రశంసలు కురిపించారు.

## పెండింగ్‌లో 18 వేల ఆర్టీఐ దరఖాస్తులు

» ఈ నెలలోనే అన్నీ పరిష్కరించేలా కృషి

» రాష్ట్ర సమాచార కమిషనర్ అయోధ్య రెడ్డి

కొత్తగూడెం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమాచార కమిషన్ వద్ద 18 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని ముఖ్య సమాచార కమిషనర్ బోరెడ్డి అయోధ్యరెడ్డి తెలిపారు. గత ప్రభుత్వంలో వివిధ శాఖల నుంచి స్పందన లేకపోవడం, సమాచార కమిషనర్ అందుబాటులో ఉండకపోవడం వల్ల ఈ దరఖాస్తులు పేరుకుపోయాయని చెప్పారు. వీటి ఆగస్టులో పరిష్కరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) అమలుపై గురువారం కొత్తగూడెం కలెక్టరేట్‌లో ఆయన సహ కమిషనర్లు దేశాల భూపాల్, పీవీ శ్రీనివాస్‌రావుతో కలిసి సమీక్ష నిర్వహించారు. అనంతరం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రజలు ఆర్టీఐ కింద చేసిన దరఖాస్తుకు 30 రోజుల్లో సమాచారం అందించాలని చెప్పారు. అవినీతి నిర్మూలన, పారదర్శకత లక్ష్యంగా సమాచార హక్కు చట్టం 136 దేశాల్లో అమలవుతోందని, మన దేశం ప్రపంచంలో 8వ స్థానంలో ఉందన్నారు. దేశంలో తెలంగాణ మొదటి స్థానంలో నిలిచేలా కృషి చేస్తామని చెప్పారు. మరుగున పడిన సమాచార కమిషన్ వ్యవస్థలో నూతనోత్సాహం నింపుతున్నామన్నారు. ప్రజల సమాచార హక్కు పరిరక్షణకు అధికారులు పాటుపడాలని, వారికి, ప్రభుత్వానికి జవాబుదారీగా, వారధిలా నిలవాలని సూచించారు.

## 100 కోసం గొడవ.. ఆపినందుకు హత్య

» పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీలో ఘటన

జ్యోతినగర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తోటి కార్మికుడు, తనతో పాటు ఒకే గదిలో ఉంటున్న వ్యక్తి రూ.100 కోసం మరొకరితో గొడవ పడుతుంటే అడ్డుకున్న ఓ వలస కార్మికుడు హత్యకు గురయ్యాడు. ఆ కార్మికుడు నిద్రలో ఉండగా అతని రూమ్‌మేట్ తలపై రాడ్డుతో కొట్టి ప్రాణం తీశాడు. పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీ పర్మనెంట్ టౌన్‌షిప్‌లో బుధవారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనలో మహారాష్ట్రకు చెందిన వినోద్ బుభాజీ సోన్కర్(44) అనే కార్మికుడు మనోజ్ వర్మార్కర్ అనే వ్యక్తి చేతిలో హత్యకు గురైనట్లు తెలిసింది. పోలీసుల కథనం ప్రకారం.. ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో భవన నిర్మాణ సంస్థలో కార్మికుడిగా పని చేస్తున్న వినోద్.. నిర్మాణ స్థలంలో నిర్మించిన తాత్కాలిక రేకుల షెడ్డులో నివాసముంటున్నాడు. వినోద్, మనోజ్‌తోపాటు మరో నలుగురు కార్మికులు ఆ షెడ్డులోని ఓ గదిలో ఉంటున్నారు. అందులో ఇద్దరు రెండ్రోజుల క్రితం స్వగ్రామాలకు వెళ్లారు. ఇదిలా ఉండగా.. మనోజ్ తమ పక్క షెడ్‌లో ఉంటున్న నీలకంఠ అనే కార్మికుడికి బుధవారం రూ.300 అప్పుగా ఇచ్చాడు. నీలకంఠ సాయంత్రానికి మనోజ్‌కు రూ.200 తిరిగి ఇచ్చాడు. మిగిలిన రూ.100 విషయంలో ఇరువురి మధ్య వాగ్వాదం జరగ్గా.. మద్యం మత్తులో ఉన్న మనోజ్.. నీలకంఠపై చేయి చేసుకున్నాడు. గొడవ తీవ్రమవుతుండడంతో గమనించిన వినోద్ వారిద్దరిని అడ్డుకుని సర్దిచెప్పాడు. అనంతరం ఎవరి గదిలోకి వారు వెళ్లి నిద్రపోగా.. అర్ధరాత్రి తర్వాత నిద్రలేచిన మనోజ్.. నిద్రలో ఉన్న వినోద్ తలపై రాడ్‌తో కొట్టి నిద్రపోయాడు. గురువారం ఉదయం నిద్రలేచిన తర్వాత వినోద్‌ను గమనించిన ఆ గదిలోని తోటి కార్మికులు సూపర్‌వైజర్‌కు సమాచారం ఇచ్చి గోదావరిఖని ఆస్పత్రికి తరలించారు. వినోద్ అప్పటికే మరణించినట్లు వైద్యులు వెల్లడించారు. విషయం తెలిసి కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా, నిందితుడు మనోజ్ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

## 'దోస్త్' ప్రత్యేక విడత కౌన్సెలింగ్ ప్రారంభం

డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన 'దోస్త్' ప్రత్యేక విడత కౌన్సెలింగ్ ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. ఆగస్టు 2 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. 3 వరకు ఆప్షన్ల ప్రక్రియ అందుబాటులో ఉంటుంది. 6న జాబితా విడుదల చేస్తామని ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డి తెలిపారు.

---

# అనర్హతపై నిర్ణయాధికారం స్పీకర్‌దే!

» సుప్రీంకోర్టు గడువు మాత్రమే నిర్దేశించింది

» కోర్టు ఆదేశాలను స్పీకర్ పాటించాల్సిందే

» మరికొంత సమయం కూడా కోరవచ్చు

» సుప్రీం తీర్పుపై న్యాయ నిపుణుల అభిప్రాయం

» బీఆర్ఎస్, కాంగ్రెస్ పరస్పర విమర్శలు

» 'చెంపదెబ్బలు మీకే' అంటూ నేతల వ్యాఖ్యలు

న్యూఢిల్లీ/హైదరాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అనర్హత పిటిషన్‌లో పేర్కొన్న 10 మంది ఎమ్మెల్యేలపై మూడు నెలల్లోపు నిర్ణయం తీసుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను స్పీకర్ పాటించాల్సిందేనని.. అయితే అనర్హతపై ఏ నిర్ణయం తీసుకోవాలన్నది మాత్రం సుప్రీంకోర్టు నిర్దేశించలేదని న్యాయనిపుణులు చెబుతున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం అనర్హత పిటిషన్లపై స్పీకర్ చర్యలు ప్రారంభిస్తారని, ఒకవేళ ఈ పిటిషన్లపై మూడు నెలలు సరిపోకపోతే మరికొంత సమయం కోరవచ్చునని సుప్రీం మాజీ న్యాయమూర్తి ఒకరు తెలిపారు. మణిపూర్ అసెంబ్లీలో ఫిరాయింపులపై రెండు వారాల్లో నిర్ణయం తీసుకోవాలంటూ గతంలో సుప్రీం న్యాయమూర్తి జస్టిస్ రోహింగ్టన్ ఇచ్చిన తీర్పు తెలంగాణ ఎమ్మెల్యేల విషయంలో కూడా వర్తిస్తుందని ప్రముఖ న్యాయనిపుణుడు వికాస్ బన్సోడే తెలిపారు. స్పీకర్‌కు రాజ్యాంగంలోని 10వ షెడ్యూలు ఎలాంటి రక్షణా కల్పించలేదని, ఆయన నిర్ణయాలు న్యాయసమీక్షకు లోను కావాల్సిందేనని చెప్పారు. అయితే, ఎమ్మెల్యేల అనర్హతపై ఎలాంటి నిర్ణయం తీసుకోవాలనే అధికారాన్ని కోర్టు స్పీకర్‌కే వదిలేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఇదిలా ఉండగా.. సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నామంటూనే 'చెంపదెబ్బలు మీకంటే.. మీకే' అంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పరస్పర విమర్శలకు దిగాయి.

### స్పీకర్‌కు పలు ప్రత్యామ్నాయాలు..

ఈ పరిస్థితుల్లో సభాపతి ముందు రెండు, మూడు అవకాశాలు ఉన్నాయని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. అందులో ఒకటి 3 నెలల్లోపు నిర్ణయం తీసుకోవడం అంటున్నారు. ఎమ్మెల్యేల అనర్హతపై నిర్ణయం విషయంలో స్పీకర్‌కు పూర్తి అధికారం ఉంటుంది. తన ముందున్న ఆధారాల ప్రాతిపదికన ఆయన ఏ నిర్ణయమైనా తీసుకోవచ్చు. ఒకవేళ స్పీకర్ తీసుకున్న నిర్ణయం నచ్చకపోతే పిటిషనర్లు మళ్లీ కోర్టును ఆశ్రయించవచ్చు. మరోవైపు సుప్రీం ఇచ్చింది సూచనతో కూడిన నిర్దేశమే అని స్పీకర్ భావిస్తే.. ఆయనకు న్యాయ సలహా కూడా అదేవిధంగా వస్తే.. 3 నెలల్లో నిర్ణయం తీసుకోకుండా కూడా ఉండొచ్చు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టంలో ఫిరాయింపులపై అంతిమ నిర్ణయం స్పీకర్‌దేనని, అయితే వీలైనంత తొందరగా తీసుకోవాలని మాత్రమే ఉంది. వీలైనంత తొందరగా అంటే ఎంత సమయం అన్నది స్పష్టంగా పేర్కొనలేదు. మరోవైపు ప్రభుత్వం లేదా సభాపతి రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేసి విచారించాలని కూడా కోరవచ్చు. కాగా, సుప్రీం తీర్పు విషయంలో న్యాయ సలహా తీసుకుని ముందుకెళ్తానని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఇప్పటికే ప్రకటించారు.

### రాజకీయ విమర్శలు..

ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులు, అనర్హత పిటిషన్‌పై సుప్రీం ఇచ్చిన తీర్పు రాజకీయంగా పరస్పర విమర్శలకు దారితీసింది. అలాగే తీర్పు తమకే అనుకూలం అంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ప్రకటించుకున్నాయి. బీఆర్ఎస్ గుర్తుపై గెలిచి పార్టీ ఫిరాయించి కాంగ్రెస్‌లోకి వెళ్లిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సుప్రీంలో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌ను సుప్రీం తిరస్కరించడంతో పాటు అనర్హతపై నిర్ణయాధికారం స్పీకర్‌దేనని స్పష్టం చేసింది. అంటే బీఆర్ఎస్ వేసిన పిటిషన్ మేరకు సుప్రీంకోర్టు పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత విధించలేదు కదా? అని కాంగ్రెస్ అంటోంది. అయితే, పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు గడువు విధించింది కదా? అని బీఆర్ఎస్ వాదిస్తోంది.

### ముగ్గురిపైనే వేటు..?

అనర్హత పిటిషన్లు దాఖలైన 10 మంది ఎమ్మెల్యేల్లో దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావుపైనే వేటు పడే అవకాశాలు ఉన్నాయని కాంగ్రెస్ నేత ఒకరు చెప్పారు. మిగతా ఏడుగురు తమ నియోజకవర్గాల్లో అభివృద్ధిపై చర్చించేందుకే ముఖ్యమంత్రిని కలిశామని, కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనలేదని వాదిస్తారని.. వారి వాదనను స్పీకర్ అంగీకరించే అవకాశాలు లేకపోలేదని ఆయన చెప్పారు.మూడు నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ పార్టీకే విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయని ధీమా వ్యక్తం చేశారు. ఒక రకంగా ఇది సీఎం రేవంత్‌కు మంచి అవకాశమని అభిప్రాయపడ్డారు. మరోవైపు అనర్హత వేటు పడితే ఎమ్మెల్యేలు కోర్టును ఆశ్రయించే అవకాశాలు ఉన్నాయని, ఆ పిటిషన్లను తేల్చడానికి మరికొంత సమయం పడుతుందని రాజకీయ వర్గాలు అంటున్నాయి. స్పీకర్ ఒక్కసారి నిర్ణయం అంటూ తీసుకున్న తర్వాత బంతి ఆయన కోర్టులో ఉండదని, సుప్రీం తీర్పును అనుసరించినట్లే అవుతుందని అంటున్నాయి.

---

## నారుకట్టలు వేస్తూ కుప్పకూలిన రైతు

» గుండెపోటుతో చేనులోనే కన్నుమూత

» ఖమ్మం జిల్లా కొణిజర్లలో విషాదం



కొణిజర్ల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వరి నాట్లకు సన్నద్ధతలో భాగంగా చేనులో నారు కట్టలు వేస్తూ ఓ రైతు కుప్పకూలి చనిపోయాడు. ఈ ఘటన ఖమ్మం జిల్లా కొణిజర్ల మండల కేంద్రంలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన బండారు పుల్లయ్య(63) పొలంలో శుక్రవారం వరినాటు వేయాల్సి ఉంది. దీంతో గురువారమే మడులను గొర్రు చేసి.. నారు కట్టలను వేస్తుండగా.. గుండెపోటు వచ్చి కుప్పకూలిపోయాడు. వెంటనే అక్కడే ఉన్న తోటి రైతులు, కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే పుల్లయ్య మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అయితే బండారు పుల్లయ్య సీపీఐ సీనియర్ నాయకుడిగా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడు. దీంతో ఆయన మృతి వార్త తెలుసుకున్న సీపీఐ నేత బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, పలువురు నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

---

# సిజేరియన్‌కు ఆమె భర్త ఒప్పుకోవట్లేదు!

**3.5 లక్షలు డిమాండ్ చేస్తున్నాడంటూ డాక్టర్ నమ్రత డ్రామా**

» అసలు 'సరొగసీ' అనేదే లేకపోయినా.. భారీగా డబ్బు వసూలు

» వైద్య పరీక్షల ఫలితాలు ఇవ్వని వైనం.. సృష్టి కేసులో రిమాండ్ రిపోర్ట్

» 5 రోజుల పోలీసు కస్టడీకి డాక్టర్ నమ్రత

హైదరాబాద్ సిటీ/అడ్డగుట్ట, జూలై 31(ఆంధ్రజ్యోతి): పిల్లలు లేని దంపతులను మోసం చేసి, డబ్బులు వసూలు చేసేందుకు సికింద్రాబాద్ సృష్టి ఫర్టిలిటీ కేంద్రం నిర్వాహకురాలు డాక్టర్ నమ్రత ఏ అవకాశాన్నీ వదల్లేదని పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. సరొగసీ పద్ధతి అని రాజస్థాన్ దంపతులకు నమ్మబలికి.. వారికి అసోంకు చెందిన దంపతుల బిడ్డను ఇచ్చిన కేసులో నమ్రతను పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. పోలీసులు రిమాండ్ రిపోర్టులో ఆమె ఎలా మోసం చేసిందీ పేర్కొన్నారు. దాని ప్రకారం.. సరొగసీ చార్జీలు కాకుండా పరీక్షలు, వీర్యం, అండాల సేకరణ, కాన్పు ఖర్చు అంటూ డబ్బులు వసూలు చేసిన నమ్రత.. చివరికి సిజేరియన్ చేసేందుకు సరొగేట్ మదర్ భర్త ఒప్పుకోవడం లేదంటూ కూడా సొమ్ములు రాబట్టింది. వందలాది మందికి సరొగసీ ద్వారా సంతానం కలిగేలా చేశామని నమ్మబలికి.. రాజస్థాన్ దంపతులను సరొగసీకి ఒప్పించింది. సరొగసీకి కావాల్సిన మహిళను తామే ఏర్పాటు చేస్తామని, పుట్టిన బిడ్డకు డీఎన్ఏ పరీక్ష చేయించి మరీ ఇస్తామని నమ్మించి పలు దఫాలుగా రూ.30.26 లక్షలు వసూలు చేసింది. దంపతులకు పలు పరీక్షలు నిర్వహించిన నమ్రత ఫలితాలను పేపర్‌పై చూపడం తప్ప రిపోర్టు కాపీలు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకుంది. సరొగసీకి వీర్యం, అండాలు సేకరించాలని ఏపీలోని విశాఖపట్నంలో సృష్టి ఫర్టిలిటీ శాఖకు పంపింది. తర్వాత మరింత డబ్బు దండుకునేందుకు మరో డ్రామాకు తెర తీసింది. 'మీ బిడ్డను కడుపులో మోస్తున్న మహిళ (సరొగేట్ మదర్)కి కాన్పు కష్టమయ్యే ప్రమాదం ఉంది. సిజేరియన్ చేయాల్సి వస్తుంద'ని రాజస్థాన్ దంపతులకు చెప్పింది. ఆ తర్వాత సిజేరియన్‌కు ఆ మహిళ భర్త అంగీకరించడం లేదని, బ్లాక్‌మెయిల్ చేస్తూ రూ.3.50 లక్షలు అడుగుతున్నాడని, మీరు రూ.2.50 లక్షలు ఇవ్వాల్సిందేనని తొందరపెట్టింది. నిజానికి సరొగసీ చేయలేదు. సరొగేట్ మదర్ లేదు. ఆమె భర్తా లేడు. కానీ వారు పేరు చెప్పి రాజస్థాన్ దంపతుల నుంచి నమ్రత డబ్బులు వసూలు చేసింది. బాబు పుట్టాడని చెప్పిన నమ్రత వారిని విశాఖ పిలిపించింది. వారిని లోటస్ ఆస్పత్రికి తీసుకెళ్లిన విశాఖ సృష్టి ఫర్టిలిటీ సెంటర్ సిబ్బంది ఓ బాబును అప్పగించారు. డీఎన్ఏ పరీక్ష వివరాలు త్వరలో పంపుతామని చెప్పి, బాబును ఇంటికి తీసుకెళ్లాలని నమ్రత వారికి సూచించింది. బిడ్డకు తమ పోలికలు లేకపోవడంపై ఆ దంపతులకు అనుమానం వచ్చి ఢిల్లీలో డీఎన్ఏ పరీక్ష చేయించారు. దీంతో ఆ బిడ్డ తమ బిడ్డ కాదని తేలింది. సికింద్రాబాద్‌లోని సృష్టి ఫర్టిలిటీ సెంటర్‌కు వచ్చి నమ్రతను నిలదీశారు. తప్పు జరిగిందని ఒప్పుకున్న ఆమె.. సమస్యను పరిష్కరిస్తానంటూ మరునటి రోజు రావాలని సూచించింది. తర్వాత ఫోన్ స్విచ్ఛాఫ్ చేసిన విజయవాడకు పారిపోయింది. నమ్రత పలు ప్రాంతాల్లో పిల్లలను కొనేందుకు ఏజెంట్లను ఏర్పాటు చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో పిల్లలు వద్దనుకున్న అసోంకు చెందిన దంపతుల నుంచి ఓ బాబును సంగారెడ్డి జిన్నారం ప్రాంతానికి చెందిన సంతోషి అనే ఏజెంట్ ఒప్పందం కుదుర్చుకుంది. ఆ బాబునే రాజస్థాన్ దంపతులకు అప్పగించారు. ఈ కేసులో నమ్రత కుమారుడు జయంత్ కృష్ణ, టెక్నీషియన్ గొల్లమండల నెన్నారావు, అనస్తీషియా వైద్యుడు నాగుల సదానందం, ఏజెంట్ సంతోషి, బాలుడిని విక్రయించిన మహ్మద్ అలీ, నస్రీన్ బేగం (అసోం)ను గోపాలపురం పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో కీలకంగా ఉన్న కల్పన, సంజయ్, నందిని పరారీలో ఉన్నారు. కాగా, డాక్టర్ నమ్రతను 5 రోజుల పాటు పోలీసు కస్టడీకి ఇచ్చేందుకు సికింద్రాబాద్ కోర్టు గురువారం అనుమతి ఇచ్చింది.

---

## వెస్టర్న్ విండ్సర్ నిర్మాణాలపై లోకాయుక్తకు ఫిర్యాదు

» డీఎస్ఆర్ ఎస్ఎస్ఐ బిల్డర్స్, డెవలపర్స్‌పై కూడా..

» హెచ్‌ఎండీఏ కమిషనర్, ప్లానింగ్ డైరెక్టర్-1కు లోకాయుక్త నోటీసులు

హైదరాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల్లో మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డికి చెందిన వెస్టర్న్ విండ్సర్ పార్కు ఎల్ఎల్‌పీ సంస్థ అక్రమంగా అనుమతులు పొంది 41 అంతస్తుల భారీ నిర్మాణాలు చేపడుతోందని ఆరోపిస్తూ న్యాయవాది రామారావు లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. ఇందుకు హెచ్‌ఎండీఏ మాజీ కమిషనర్, ఐఏఎస్ అరవింద్‌కుమార్, హెచ్‌ఎండీఏ ప్లానింగ్ మాజీ డైరెక్టర్ -1 శివ బాలకృష్ణ అనుమతులు ఇచ్చారని తెలిపారు. రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం పుప్పాలగూడలోని సర్వే 277, ఇతర నెంబర్లలోని దాదాపు 30 ఎకరాల ప్రభుత్వ భూముల్లో అక్రమంగా అనుమతులు పొందారని ఆరోపించారు. ఇవి ప్రభుత్వ భూములే అని 2019లో సుప్రీంకోర్టు సైతం తీర్పు ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ భూములపై 26 సివిల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, అయినా నిర్మాణాలు చేపట్టడం అక్రమమని తెలిపారు. వాదనలు విన్న లోకాయుక్త విచారణ చేపట్టి నివేదిక సమర్పించాలని పేర్కొంటూ హెచ్‌ఎండీఏ కమిషనర్‌కు ఈ నెల 14న ఆదేశాలు జారీచేసింది. సెప్టెంబర్ 24 నాటికి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించింది. అలాగే, పుప్పాలగూడలోని 278, 280, 281 తదితర సర్వే నెంబర్లలోని దాదాపు 30 ఎకరాల ప్రభుత్వ భూముల్లో డీ రఘురామిరెడ్డికి చెందిన డీఎస్ఆర్ ఎస్ఎస్ఐ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ సంస్థ అక్రమంగా అనుమతులు పొంది దాదాపు 30 అంతస్తుల భారీ నిర్మాణాలు చేపడుతోందని కూడా రామారావు ఫిర్యాదు చేశారు. దీనికి సైతం మాజీ హెచ్‌ఎండీఏ కమిషనర్, ఐఏఎస్ అర్వింద్‌కుమార్, మాజీ ప్లానింగ్ డైరెక్టర్ శివబాల కృష్ణ అనుమతులు ఇచ్చారని తెలిపారు. దీనిపై సెప్టెంబరు 24లోగా వివరణ ఇవ్వాలని హెచ్‌ఎండీఏ కమిషనర్, హెచ్‌ఎండీఏ ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్-1కు లోకాయుక్త ఆదేశాలు జారీచేసింది.

# కేసుల నమోదెప్పుడు?

• పట్టుబడ్డ ఆర్ఎంపీలపై కేసులకు పోలీసుల వెనుకడుగు

• రాజకీయ జోక్యంతో ఉదాసీనత

భూపాలపల్లి కలెక్టరేట్, జూలై 31(ఆంధ్రజ్యోతి): అక్రమ వైద్యం చేస్తున్న ఆర్ఎంపీలపై కేసుల నమోదుకు పోలీసులు వెనుకాడుగు వేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. తెలంగాణ వైద్యమండలి సభ్యుల తనిఖీల్లో పట్టుబడ్డ ఆర్ఎంపీలపై కేసుల నమోదు చేయాలని అధికారులు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు చర్యలు తీసుకున్న దాఖలు లేవు. 2024 మే 21న భూపాలపల్లి, కాటారం ప్రాంతాల్లో ఆర్ఎంపీల క్లినిక్‌లపై తెలంగాణ వైద్యమండలి అధికారులు దాడుల నిర్వహించారు. కాటారంలోని నాలుగు క్లినిక్‌లు, భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఒక క్లినిక్ నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తున్నట్లు గుర్తించారు. వీరిపై కేసులు నమోదు చేయాలని కాటారం, భూపాలపల్లి పోలీస్ స్టేషన్లల్లో తెలంగాణ వైద్యమండలి సభ్యులు ఫిర్యాదు చేశారు. అయినా ఇప్పటి వరకు పోలీసులు ఎటువంటి చర్యలకు పాల్పడకపోవడంతో చేసేదేమేలేక సంబంధిత అధికారులు ఇటీవల ఎస్పీ కిరణ్ ఖరేను కలిసి కేసులు నమోదు చేసేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

### తెర వెనుక కీలక నేత?

తెలంగాణ వైద్యమండలి సభ్యుల తనిఖీల్లో అక్రమ వైద్య చేస్తూ పట్టుబడ్డ ఆర్ఎంపీలపై చర్యలు తీసుకోకుండా ఆర్ఎంపీ అసోసియేషన్‌కు చెందిన ఓ కీలక నేత ముఖ్యపాత్ర వహిస్తున్నట్లు సమాచారం. గతంలో వేరే పార్టీలో ఉండి ఎన్నికల ముందు అధికార పార్టీలో చేరిన ఆయన పోలీసులపై ఒత్తిడి తెచ్చి కేసులు నమోదు కాకుండా అడ్డుకుంటున్నట్లు తెలిసింది. ప్రైవేటు ఆస్పత్రులతో మంచి సత్సంబంధాలు ఉన్న ఆ నేత అధికారులను మేనేజ్ చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్న ఆర్ఎంపీలపై చర్యలు తీసుకోకుండా అడ్డుకుంటున్నాడనే చర్చ జోరుగా సాగుతోంది.

---



ప్రొఫెసర్ అన్సారీని అడ్డుకుంటున్న సిబ్బంది

**పాత విధానంలో పింఛను కోసం**

## రెండేళ్లుగా రిటైర్డ్ ప్రొఫెసర్ అన్సారీ పోరాటం

» పట్టించుకోని వర్సిటీ అధికారులు

» ప్రొఫెసర్ అన్సారీకి మద్దతుగా విద్యార్థి సంఘాల నిరసన

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తనకు పాత విధానంలో పింఛను చెల్లించాలని కోరుతూ ఉస్మానియా విశ్వవిద్యాలయ విశ్రాంత ప్రొఫెసర్ రెండేళ్లుగా పోరాటం చేస్తున్నా.. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ప్రొఫెసర్ అన్సారీ ఓయూలో లింగ్విస్టిక్స్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసి 2023లో పదవీ విరమణ పొందారు. అప్పుడు తనకు రావాల్సిన పింఛను పాత విధానంలో అమలు కాకుండా అప్పటి వీసీ నిర్లక్ష్యం చేశారని, మైనార్టీ కమిషన్ రిపోర్టులను కూడా పెడచెవిన పెట్టారని ఆయన ఆరోపిస్తున్నారు. ప్రస్తుత వీసీ ఎం.కుమార్ కూడా కొన్ని నెలలుగా సమస్యను పరిష్కరించకుండా వాయిదా వేస్తూ వస్తున్నారన్నారు. కనీసం మాట్లాడడానికి కూడా సమయం ఇవ్వడం లేదని, పరిపాలనా భవన లోపలికి అనుమతించకుండా సెక్యూరిటీ సిబ్బందితో అడ్డుకుని అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. రిటైర్డ్ ప్రొఫెసర్ అన్సారీ సమస్యను తెలుసుకున్న వర్సిటీ విద్యార్థి సంఘాల నాయకులు ఆయనకు మద్దతు ప్రకటించి, గురువారం ఆర్ట్స్ కాలేజీ వద్ద నిరసన తెలిపారు. ఒక రిటైర్డ్ ప్రొఫెసర్ సమస్యను పట్టించుకోకపోవడమే కాకుండా, కనీసం పరిపాలనా భవనంలోకి వెళ్లనివ్వకుండా గేట్లు మూసి వేయడం ప్రజాస్వామ్యానికి, యూనివర్సిటీ స్వయం ప్రతిపత్తికి విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే విశ్వవిద్యాలయ అధికారులు సానుకూలంగా స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## పూలే నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటుకు ఓకే

» బీసీ సంఘాలతో భేటీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల ముందు కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌కు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. బీసీ రిజర్వేషన్ల పెంపుతోపాటు బడ్జెట్‌లో నిధులు పెంచి సరైన సమయంలో బీసీ సబ్ ప్లాన్ తెస్తామన్నారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో జ్యోతిబాపూలే నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటుకు సానుకూలంగా ఉన్నట్లు తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పనతోపాటు నిధుల కేటాయింపులో న్యాయం చేస్తామని చెప్పారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను దశల వారీగా చెల్లిస్తామని మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. తమ ప్రభుత్వం బీసీల విషయంలో చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. పూలే భవన్‌లో భట్టితో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలోని బీసీ ప్రతినిధులు సమావేశమయ్యారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బడ్జెట్లో బీసీలకు ప్రతియేటా 20వేల కోట్లు కేటాయించాలని జాజుల కోరారు.

## కబ్జా అయిన ఇరిగేషన్ భూములను.. స్వాధీనం చేసుకుంటాం: మంత్రి ఉత్తమ్



ఆక్రమణలకు గురైన నీటిపారుదల శాఖ భూములన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన స్వాధీనం చేసుకుంటామని ఆ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రకటించారు. నీటిపారుదల శాఖ భూముల పరిరక్షణపై గురువారం సచివాలయంలో ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని గండిపేట, రాజేంద్రనగర్ మండలాల పరిధిలోని హిమాయత్‌సాగర్, కిస్మత్‌పుర, వాలంతరి, తెలంగాణ ఇంజనీరింగ్ రిసెర్చ్ ల్యాబొరేటరీ(టీజీఈఆర్ఎల్)లకు చెందిన 426.3 ఎకరాల స్థలాలు ఉండగా.. 131.31 ఎకరాలు కబ్జాకు గురైనట్లు గుర్తించామన్నారు. ఐటీఐఆర్ ఆధీనంలోని 81.26 ఎకరాల స్థలంపై కోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా, మిగిలిన 50.13 ఎకరాలు కబ్జాకు గురైనట్టు వెల్లడించారు. ఈ భూములపై జిల్లా కోర్టులో 20 కేసులు, హైకోర్టులో మరో 2 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ భూములను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు గాను నీటిపారుదల శాఖ, హైడ్రా, రెవెన్యూ శాఖలు ఆర్‌అండ్‌ఆర్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించామని చెప్పారు.

## ధాన్యం సేకరణ తర్వాత తనిఖీలు చేపట్టాలి

» ఎస్‌వోపీ జారీ చేసిన కేంద్ర ఆహార పంపిణీ శాఖ

ప్రతి సీజన్ ముగిసిన వెంటనే ధాన్యం నిల్వలపై ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు భౌతిక తనిఖీలు(ఫిజికల్ వెరిఫికేషన్) చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా 24 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు గురువారం స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్(ఎస్‌వోపీ)ను కేంద్ర వినియోగదారులు, ఆహార పంపిణీ శాఖ జారీ చేసింది. ఏ సీజన్‌లో అయినా ధాన్యం సేకరణ ముగిసిన వెంటనే భౌతిక తనిఖీలు నిర్వహించాలని, 30 రోజుల్లోగా నివేదిక సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఒకవేళ నిల్వలు గుట్టలుగా ఉంటే.. వాటిని 3 రోజుల్లో క్రమబద్ధీకరించాలని, లేకపోతే వాటిని నిల్వలుగా పరిగణించబోమని స్పష్టం చేసింది. ధాన్యం మర ఆడించడానికి అదనపు గడువు పొడిగించాలని కోరే రాష్ట్రాలు... ముందుగా మిగిలిన నిల్వలపై కనీసం 10 శాతం మిల్లుల్లో సంయుక్త తనిఖీలు నిర్వహించాలని సూచించింది.

## బనకచర్లపై అనుమతులన్నీ తీసుకున్నాక మళ్లీ ప్రతిపాదనలు పంపాలన్నాం:కేంద్రం

న్యూఢిల్లీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు కోసం పర్యావరణ మదింపు అంచనా(ఈఐఏ) అధ్యయనం చేపట్టడానికి టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ (టీవోఆర్) మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపిందని కేంద్ర పర్యావరణ, అటవీ సహాయ మంత్రి కీర్తివర్ధన్‌సింగ్ తెలిపారు. అయితే కేంద్ర జలసంఘం అనుమతులన్నీ తీసుకున్నాక టీవోఆర్ రూపకల్పనకు మళ్లీ ప్రతిపాదనలు సమర్పించాలని రాష్ట్రప్రభుత్వానికి సూచించినట్లు చెప్పారు. గురువారం రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ అడిగిన ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానమిచ్చారు.



ప్రధాని మోదీకి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న హెటిరో అధినేత పార్థసారథిరెడ్డి

## ప్రధాని మోదీతో హెటిరో అధినేత పార్థసారథి భేటీ

న్యూఢిల్లీ, జూలై 31(ఆంధ్రజ్యోతి): హెటిరో సంస్థల అధినేత, బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రధాని నరేంద్రమోదీతో గురువారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. తన కుమార్తె కృష్ణ సింధూరి జ్ఞాపకార్థం హైదరాబాద్‌లో నిర్మించిన అత్యాధునిక 1,400 పడకల సింధు హాస్పిటల్స్ ప్రారంభోత్సవానికి రావాలని ప్రధానిని పార్థసారథిరెడ్డి ఈ సందర్భంగా ఆహ్వానించారు.

## దేవాదాయశాఖలో ఈ-ఆఫీసు సేవలు షురూ..!

» లాంఛనంగా ప్రారంభించిన మంత్రి సురేఖ

హైదరాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవాదాయశాఖలో ఈ-ఆఫీసు సర్వీసులు ప్రారంభమయ్యాయి. ఆ శాఖ మంత్రి కొండా సురేఖ.. దేవాదాయశాఖ కమిషనరేట్‌లో గురువారం లాంఛనంగా ప్రారంభిస్తూ.. తమశాఖలో చేపట్టిన సంస్కరణలు గొప్ప ముందడుగు అని అభివర్ణించారు. ఈ-ఆఫీస్ ద్వారా త్వరితగతిన ఫైళ్ల క్లియర్ కావడంతో అవి దొంగతనానికి గురి కావడం గానీ, అగ్ని ప్రమాదంలో కాలి పోవడం గానీ, మాయం కావడం గానీ ఉండదన్నారు. ఈ-ఆఫీసు ప్రారంభోత్సవం ద్వారా ఒక కారుణ్య నియామక ప్రక్రియ పూర్తి చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక దేవాదాయ ధర్మాదాయ బిల్లును రూపొందించి అసెంబ్లీలో ప్రవేశ పెడతామని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ హామీ ఇచ్చారు. అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ ఆధ్వర్యంలో అర్చకులు గురువారం ఆమెను కలిసి ఆశీర్వదించారు. అర్చకులకు పదోన్నతుల కల్పనలో జాప్యం జరుగుతున్నదని మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ అంశాన్ని శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే అర్చక ఆగమ పరీక్షలు నిర్వహిస్తామని అర్చక ఉద్యోగ జేఏసీ ప్రతినిధులకు మంత్రి సురేఖ హామీ ఇచ్చారు.

## హెచ్‌సీఏ అధ్యక్షుడిపై సస్పెన్షన్ వేటు

» కార్యదర్శి, కోశాధికారిపైనా చర్యలు

అవినీతి ఆరోపణలపై అరెస్టయిన హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్మోహన్ రావు, కార్యదర్శి దేవరాజ్, కోశాధికారి సీజే శ్రీనివాసరావుపై వేటు పడింది. ఈ ముగ్గురినీ కార్యవర్గం నుంచి సస్పెండ్ చేస్తూ జూలై 28న జరిగిన సంఘం అపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్ణయం తీసుకుంది. హెచ్‌సీఏ గురువారం ఈ విషయాన్ని వెల్లడించింది. "సమగ్రత, పారదర్శకత, జవాబుదారీతనం, అత్యున్నత ప్రమాణాలకు హెచ్‌సీఏ కట్టుబడి ఉంది. సంఘం విశ్వసనీయతను కాపాడటం, సంఘం విస్తృత ప్రయోజనాల రీత్యా అధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారిపై చర్యలు తీసుకున్నాం" అని పేర్కొంది. మోసం, నిధుల దుర్వినియోగం, అధికార దుర్వినియోగానికి సంబంధించి వారిపై సీఐడీ, ఈడీ విచారణ జరుగుతున్న నేపథ్యంలో.. హెచ్‌సీఏ నిబంధనలు 41 (6), రూల్ 51(4) (డి) ప్రకారం ఈ చర్యలు చేపట్టినట్టు తెలిపింది. ఉపాధ్యక్షుడు దల్జీత్ సింగ్ తాత్కాలిక అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నట్టు తెలిపింది.

## ఫిరాయింపులపై సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు**



హైదరాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించిన కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. మూడు నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని చెప్పడం మంచి పరిణామమని వ్యాఖ్యానించారు. కోర్టు తీర్పునకు అనుగుణంగా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేలా స్పీకర్ వ్యవహరించాలని కోరారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టంలో మార్పులు చేసినా, అందులోని లోపాలను ఆసరాగా చేసుకుని విపక్ష ఎమ్మెల్యేలను కాంగ్రెస్ ఫిరాయింపులకు ప్రోత్సహిస్తోందని విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ కూడా ఇదే పాపం చేసిందని మండిపడ్డారు. కాగా, కాంగ్రెస్ చేపట్టిన 'జనహిత పాదయాత్ర' జనాలను మోసం చేసే పాదయాత్ర అని రాంచందర్‌రావు విమర్శించారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు, డిక్లరేషన్లు ఎంత వరకు అమలు చేశారో శ్వేతపత్రం ప్రకటించి పాదయాత్ర చేయాలన్నారు. ఇక, మాలేగావ్‌లో 2008లో జరిగిన పేలుళ్ల కేసులో కుట్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏడుగురిని ముంబై ఎన్ఐఏ కోర్టు నిర్దోషులుగా ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని రాంచందర్‌రావు తెలిపారు. కాగా, పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల విషయంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రజాస్వామ్యానికి స్ఫూర్తిదాయకమని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును స్పీకర్ అమలు చేస్తారన్న నమ్మకం తనకు ఉందని ఒక ప్రకటనలో తెలిపారు.

## సుప్రీం కొంచెం స్పష్టత ఇస్తే బాగుండేది: రఘునందన్

న్యూఢిల్లీ, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. స్పీకర్ మూడు నెలల్లో నిర్ణయం తీసుకోకపోతే ఏం చేయాలనే విషయంలో కోర్టు కొంచెం స్పష్టత ఇచ్చి ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. గురువారం ఎమ్మెల్యేల అనర్హత కేసులలో స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని ఆశిస్తున్నామని కోర్టులు పేర్కొంటున్నాయని.. అయితే ఆశించడం వేరు.. శాసించడం వేరని అన్నారు.

# 3 నెలల్లోగా తేల్చండి

(మొదటిపేజీ తరువాయి)



ఉద్దేశాలే దెబ్బతింటాయని అభిప్రాయపడింది. 'ఆపరేషన్ సక్సెస్.. పేషంట్ డెడ్' అనే పరిస్థితికి స్పీకర్ అనుమతించేందుకు తాము వీలు కల్పించినట్టు అవుతుందని పేర్కొంది.

### స్పీకర్‌ను తప్పుబట్టిన ధర్మాసనం

ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై సుప్రీం కోర్టే నిర్ణయం తీసుకోవాలని బీఆర్ఎస్ నేతలు చేసిన అభ్యర్థనను ధర్మాసనం తోసిపుచ్చింది. ఆ అధికారం స్పీకర్‌కే ఉందని స్పష్టం చేసింది. ఈ మేరకు సుభాష్ దేశాయ్ తదితరుల కేసులకు సంబంధించి గతంలో సుప్రీంకోర్టు రాజ్యాంగ బెంచ్ ఇచ్చిన తీర్పును ప్రస్తావించింది. అయితే, అనర్హత అంశాన్ని తేల్చే ముఖ్యమైన బాధ్యతను స్పీకర్‌కు లేదా చైర్మన్‌కు అప్పగించటం వల్ల.. రాజకీయ ఫిరాయింపులను సమర్థవంతంగా అరికట్టగలుగుతున్నామా? లేదా? అన్న అంశాన్ని పరిశీలించాల్సింది పార్లమెంటేనని తెలిపింది. ప్రజాస్వామ్య పునాదులు బలంగా ఉండాలంటే, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలంటే.. ప్రస్తుత ఫిరాయింపుల నిరోధక వ్యవస్థ సరిపోతుందా? లేదా? అనే విషయాన్ని తేల్చాల్సింది కూడా పార్లమెంటేనని ధర్మాసనం స్పష్టం చేసింది. అనర్హత పిటిషన్లు సమర్పించి దాదాపు ఏడు నెలలు గడిచినా నోటీసులు జారీ చేయకపోవడం, కోర్టులో కేసు దాఖలు చేసిన తర్వాతే నోటీసులు జారీ చేయడంపై స్పీకర్‌ను సుప్రీంకోర్టు తప్పుబట్టింది. అనర్హత పిటిషన్లపై తేల్చే అత్యంత ముఖ్యమైన బాధ్యత స్పీకర్‌ది అయినప్పుడు.. ఆ హోదాలో ఉన్నవారు ఎంతవేగంగా చర్యలు తీసుకున్నారనేది ప్రధానమని పేర్కొంది. ఈ ఏడాది జనవరి 15న సుప్రీంకోర్టు ముందు కేసు దాఖలైన తర్వాతే జనవరి 16న స్పీకర్ కొందరు ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేశారని, అదేవిధంగా ఫిబ్రవరి 3న కేసు మరోసారి విచారణకు వచ్చినప్పుడు ఫిబ్రవరి 4న మరికొందరు ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చారని సుప్రీంకోర్టు గుర్తు చేసింది. జనవరి 31న ఈ కేసుపై విచారణ ప్రారంభమైనప్పుడు.. అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకునేందుకు స్పీకర్‌కు ఎంత సమయం అవసరమో తెలుసుకోవాల్సిందిగా తాము సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీకి సూచించామని ధర్మాసనం గుర్తు చేసింది. పలుమార్లు కేశం మేఘచంద్ర సింగ్ కేసును ప్రస్తావించిన సుప్రీంకోర్టు ధర్మాసనం.. మూడు నెలల్లోపు అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలని మణిపూర్ అసెంబ్లీ స్పీకర్‌కు ఆదేశాలిస్తూ అప్పటి న్యాయమూర్తి రోహింటన్ ఫాలీ నారిమన్ తీర్పు ఇచ్చారని పేర్కొంది.

### నాన్చుడు వైఖరి సరి కాదు

అనర్హత పిటిషన్లపై నిర్ణయించే బాధ్యతను స్పీకర్‌కు అప్పగించారంటే.. ఆ పిటిషన్లపై నాన్చుడు వైఖరి అవలంబించడమో, విషయాన్ని కోర్టులకో, ఎన్నికల సంఘానికో అప్పగించడం కాదని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. మూడు దశాబ్దాల క్రితం పదో షెడ్యూల్‌ను ప్రవేశపెట్టినప్పుడు.. అనర్హత పిటిషన్లపై సభాధ్యక్షుడు ఆలస్యం చేయడాన్ని ఏమాత్రం సహించకూడదని అప్పటి కేంద్ర న్యాయశాఖ మంత్రి ఏకే సేన్ స్పష్టం చేసిన విషయాన్ని గుర్తుచేసింది. 30 ఏళ్ల తర్వాత వెనుదిరిగి చూస్తే.. అనర్హత పిటిషన్లపై జాప్యాన్ని నివారించే విషయంలో స్పీకర్‌పై ఉంచిన విశ్వాసం నెరవేరిందా? లేదా? అని ప్రశ్నించుకోవాల్సిన అగత్యం ఏర్పడిందని సుప్రీం కోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది.

### మళ్లీ ఎన్నికలకు వెళ్లాలి

ఒక రాజకీయ పార్టీ ప్రజల ముందుకు నిర్దిష్ట కార్యాచరణతో వెళుతుందని, దాని ప్రాతిపదికపైనే ఎన్నికల్లో అభ్యర్థులను నిలబెడుతుందని, అటువంటప్పుడు ఎన్నికల్లో గెల్చిన అభ్యర్థి ఆ పార్టీని వదిలిపడితే తన సభ్యత్వాన్ని వదులుకుని మళ్లీ ఓటర్ల ముందుకు వెళ్లాలని రాజ్యాంగ బెంచ్ గతంలో ఇచ్చిన తీర్పును కూడా సుప్రీంకోర్టు ప్రస్తావించింది. 10వ షెడ్యూల్ ప్రకారం స్పీకర్.. న్యాయసమీక్ష పరిధికి అతీతులు కాదని రాజ్యాంగ బెంచ్ స్పష్టం చేసిందని తెలిపింది. ఈ షెడ్యూల్‌లోని పేరా 6(1) ప్రకారం స్పీకర్.. ట్రిబ్యునల్ బాధ్యతలు నెరవేరుస్తారని తెలిపింది. స్పీకర్ అధికారాలు న్యాయపరమైనవని.. అదే సమయంలో ఆయన నిర్ణయాలు న్యాయ సమీక్షకు అతీతం కాదని ధర్మాసనం పేర్కొంది.

### డివిజన్ బెంచ్ జోక్యం ఎందుకు?

ఈ కేసుపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. అనర్హత పిటిషన్లపై విచారించేందుకు సమయాన్ని నిర్ణయించమని స్పీకర్‌ను కోరారని, పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలని ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదని సుప్రీంకోర్టు గుర్తు చేసింది. అయినప్పటికీ.. హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోవడం ద్వారా డివిజన్ బెంచ్ తప్పిదానికి పాల్పడిందని స్పష్టం చేసింది. ఎలాంటి వ్యతిరేక వ్యాఖ్యలు లేకపోయినా తెలంగాణ శాసనసభ సెక్రటరీ.. సింగిల్ జడ్జి తీర్పును సవాల్ చేయడం సరైంది కాదని తెలిపింది. ఈ మేరకు, ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై 2024 నవంబరు 22న హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు కొట్టేసింది.

### ఇదీ నేపథ్యం...

ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తెల్లం వెంకట్రావ్, కడియం శ్రీహరి బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించారని.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద సుప్రీంకోర్టులో జనవరి 15న స్పెషల్ లీవ్ పిటిషన్(సివిల్) దాఖలు చేశారు. ఎమ్మెల్యేలు పరిగి శ్రీనివాస్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, కాలే యాదయ్య, టీ ప్రకాశ్ గౌడ్, అరికెపూడి గాంధీ, గూడెం మహిపాల్ రెడ్డి, ఎం సంజయ్ కుమార్ కూడా ఇదే విధంగా పార్టీ ఫిరాయించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, జగదీశ్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, చింత ప్రభాకర్, కల్వకుంట్ల సంజయ్ తదితరులు కూడా జనవరి 15వ తేదీనే సుప్రీంలో రిట్ పిటిషన్(సివిల్) వేశారు. వీటిపై వాదనలు జరుగుతుండగానే మార్చి 18న బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పెషల్ లీవ్ పిటిషన్(సివిల్) దాఖలు చేశారు. దానం నాగేందర్‌ని ప్రతివాదిగా చేర్చారు. ఈ పిటిషన్లన్నింటినీ కలిపి జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలోని ధర్మాసనం విచారించి తాజాగా తీర్పు వెలువరించింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు సీ ఆర్యమ సుందరం, దామా శేషాద్రి నాయుడు, గండ్ర మోహన్‌రావు, ఏవోఆర్ మోహిత్‌రావు, ప్రతివాదుల తరఫున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గి, అభిషేక్ మను సింఘ్వి, రవిశంకర్ జంధ్యాల, గౌరవ్ అగర్వాల్ వాదనలు వినిపించారు.



## న్యాయ సలహా తీసుకుంటాం

» 10 మంది ఎమ్మెల్యేలకు ఇప్పటికే నోటీసులిచ్చాం

» సమాధానం ఇవ్వడానికి సమయం కోరారు: స్పీకర్ ప్రసాద్‌కుమార్

హైదరాబాద్/రాజేంద్రనగర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలన్న సుప్రీంకోర్టు తీర్పుపై తాను ఇప్పుడే ఏమీ స్పందించలేనని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన 10 మంది ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీం ఇచ్చిన తీర్పు ప్రతిని స్వీకరించిన తర్వాత న్యాయ నిపుణుల సలహా తీసుకుంటామని చెప్పారు. వారి సలహా మేరకే తదుపరి చర్యలు ఉంటాయన్నారు. బీఆర్ఎస్ తరఫున గెలిచి, కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ దాఖలైన పిటిషన్లపై విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం.. పార్టీ ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేల అనర్హతపై మూడు నెలల్లోగా తుది నిర్ణయం తీసుకోవాలని శాసనసభ స్పీకర్‌కు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్ గురువారం మీడియాతో మాట్లాడుతూ.. మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ చేసిన వ్యాఖ్యల ప్రకారం కోర్టులు రాష్ట్రపతి, స్పీకర్లను ప్రశ్నించలేవని చెప్పారు. కాంగ్రెస్ పార్టీలోకి మారిన ఆ పది మంది ఎమ్మెల్యేలకు ఇప్పటికే నోటీసులు జారీ చేశామన్నారు. సమాధానం ఇవ్వడానికి కొంత సమయం కోరారని తెలిపారు. ఈ అంశంలో న్యాయ నిపుణుల సలహా తీసుకుని, చట్ట ప్రకారమే తుది నిర్ణయం తీసుకుంటామని స్పీకర్ చెప్పారు.

## స్పీకర్ నిర్ణయం తీసుకుంటే.. కోర్టులు సమీక్షించవచ్చు

» ఫిరాయింపుల చట్టంలోనే లొసుగులు

» సవరణ ద్వారా సరిదిద్దాలి: యనమల

అమరావతి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ముందున్న ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లను మూడు నెలల్లోగా పరిష్కరించాలన్న సుప్రీం కోర్టు తీర్పును మాజీ స్పీకర్ యనమల రామకృష్ణుడు స్వాగతించారు. అయితే పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టంలోనే అనేక లొసుగులు ఉన్నాయని, వీటిని సమీక్షించి చట్టసవరణ ద్వారా సరిదిద్దాల్సిన అవసరం ఉందని గురువారం ఒక ప్రకటనలో అభిప్రాయపడ్డారు. స్పీకర్ ముందు దాఖలైన పిటిషన్లను పరిష్కరించడానికి ఎటువంటి కాలపరిమితీ లేదని, సభాపతి నిర్ణయం వెలువడే వరకు కోర్టులు జోక్యం చేసుకోలేవని తెలిపారు. చాలా శాసనసభల్లో ఈ రకమైన పిటిషన్లు నిరవధికంగా పెండింగ్‌లో ఉన్నాయని, అందుకే ఫిరాయింపుదారులు అనర్హత వేటు పడకుండా తప్పించుకుంటున్నారని తెలిపారు. అనర్హత పిటిషన్లపై స్పీకర్ ఏదో ఒక నిర్ణయం తీసుకున్న తర్వాతే.. కోర్టులు జోక్యం చేసుకుని న్యాయపరంగా తీర్పులు ఇవ్వవచ్చని పేర్కొన్నారు. ఫిరాయింపులపై తీసుకునే నిర్ణయం కేవలం స్పీకర్‌దేనని, శాసనసభ తీసుకునే నిర్ణయం కాదని... అందువల్ల స్పీకర్ నిర్ణయాన్ని కోర్టులు సమీక్షించవచ్చని యనమల స్పష్టం చేశారు. అదే శాసనసభ నిర్ణయాలు రాజ్యాంగ విరుద్ధంగా లేనంత వరకు కోర్టులు జోక్యం చేసుకోలేవన్నారు.

## స్పీకరే స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోవాలని కోర్టు చెప్పింది

» సీనియర్ న్యాయవాది జంధ్యాల శంకర్

న్యూఢిల్లీ, జూలై 31(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ వ్యవహారాలపై న్యాయస్థానం జోక్యం పరిమితమేనని, కానీ స్పీకరే స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని సుప్రీం కోర్టు చెప్పిందని సీనియర్ న్యాయవాది జంధ్యాల శంకర్ తెలిపారు. పదో షెడ్యూల్ కింద స్పీకర్‌కు ట్రిబ్యునల్‌కు ఉన్న అధికారాలుంటాయని, స్పీకర్‌కు న్యాయపరమైన అధికారాలున్నాయని, అందువల్ల ఆ పదవి న్యాయసమీక్షకు అతీతం కాదని కోర్టు భావించిందని తెలిపారు. అసెంబ్లీ వ్యవహారాలపై న్యాయస్థానం జోక్యం పరిమితమేనని, కానీ స్పీకర్ స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని చెప్పిందన్నారు. స్పీకర్ సకాలంలో నిర్ణయం తీసుకోకపోతే గవర్నర్, ఎన్నికల కమిషన్లతో ప్రత్యామ్నాయ యంత్రాంగం ఏర్పాటు చేసే విషయం పార్లమెంట్ నిర్ణయించాల్సి ఉంటుందని సుప్రీం కోర్టు తెలిపిందని వివరించారు. గతంలో స్పీకర్ 4 వారాల్లో నిర్ణయం తీసుకోవాలని జస్టిస్ రోహింగ్టన్ నారిమన్ ఇచ్చిన తీర్పును జస్టిస్ గవాయి ఉటంకించారని తెలిపారు. అనర్హత పిటిషన్లపై స్పీకర్ పదవిలో ఉన్నవారు సకాలంలో నిర్ణయం తీసుకోకపోతే.. శస్త్రచికిత్స విజయవంతమైనా, రోగి మరణించినట్టే అవుతుందని కోర్టు వ్యాఖ్యానించిందన్నారు. అనర్హత వేటు పడిన వారు హైకోర్టుకు అప్పీలుకు వెళ్లే అవకాశముందన్నారు. రాజ్యాంగ బెంచ్‌కు వెళ్లాలన్న అభ్యర్థనను సుప్రీం అంగీకరించలేదని పెద్ద బెంచ్‌కు వెళ్లే అవకాశముండదని శంకర్ చెప్పారు.

# ఉప ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాం

**సుప్రీం తీర్పు బీఆర్ఎస్ నేతలకు చెంపపెట్టు.. అనర్హతపై నిర్ణయాధికారం స్పీకర్‌దేనని చెప్పింది**

» కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

» ఫిరాయింపులపై మాట్లాడే అర్హత హరీశ్, కేటీఆర్‌కు లేదు: మధుసూధన్



న్యూఢిల్లీ/హైదరాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఉప ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. గురువారం ఆయన ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు బీఆర్ఎస్ పార్టీకి చెంపపెట్టని అన్నారు. సర్వోన్నత న్యాయస్థానం అనర్హత వేటు వేస్తుందని బీఆర్ఎస్ నేతలు పగటి కలలు కన్నారని, వారి కలలన్నీ కల్లలయ్యాయని తెలిపారు. అసెంబ్లీ స్పీకర్‌కు మాత్రమే నిర్ణయం తీసుకునే అధికారం ఉంటుందని సుప్రీం కోర్టు స్పష్టంగా చెప్పిందన్నారు. స్పీకర్ నిర్ణయం కోసం వేచి చూడాల్సిందేనని చెప్పారు. ఆయన ఏ నిర్ణయం తీసుకున్నా కాంగ్రెస్ కట్టుబడి ఉంటుందన్నారు. ఉప ఎన్నికలొస్తే సిద్ధంగా ఉన్నామని, తప్పక గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీంకోర్టు తీర్పు బీఆర్ఎస్ నేతలకు చెంపపెట్టు అని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ నేతల మాటలు దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. సీఎల్పీ కార్యాలయంలో మధుసూధన్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ ఫిరాయింపులపై హరీశ్, కేటీఆర్‌లకు మాట్లాడే అర్హత లేదన్నారు. ఉప ఎన్నికలు వస్తాయని బీఆర్ఎస్ నాయకులు సంబరపడుతున్నారని మధుసూదన్‌రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానందగౌడ్ 2014లో టీడీపీ తరఫున గెలిచి, బీఆర్ఎస్‌లో చేరారని.. అలాంటి వ్యక్తి ఇప్పుడు ఫిరాయింపులపై మాట్లాడడం విడ్డూరంగా ఉందని చెప్పారు.

**అనర్హతపై స్పీకర్‌కు సుప్రీం సూచనే: అద్దంకి**

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హతపై స్పీకర్ అధికారాలను సుప్రీంకోర్టు ప్రశ్నించలేదని, మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని సూచన మాత్రమే చేసిందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. న్యాయస్థానాలు స్పీకర్ అధికారాలను ప్రశ్నించలేవని చెప్పారు. ప్రతిపక్ష నేత హోదా ఉన్నప్పటికీ అసెంబ్లీకి రాని కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాలని తాము స్పీకర్‌ను కోరుతున్నట్టు దయాకర్ పేర్కొన్నారు. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై స్పీకర్ మూడు నెలల్లోపు నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా.. చట్టంలోని లొసుగుల కారణంగా అది సాధ్యమవుతుందా? అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సందేహం వ్యక్తం చేశారు. పార్టీ మారిన వారిపై తక్షణమే అనర్హత వేటు పడేలా చట్టాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

# ఉప ఎన్నికలొస్తాయి సిద్ధంకండి

» పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపు

» సుప్రీం కోర్టు తీర్పుపై హర్షం

» చర్యలు తీసుకోమని స్పీకర్‌ను రాహుల్ కోరతారా? : హరీశ్



హైదరాబాద్, చేర్యాల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై స్పీకర్ మూడు నెలల్లోగా చర్యలు తీసుకోవాలంటూ సుప్రీం కోర్టు గురువారం ఇచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. సుప్రీం తీర్పు కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెంపదెబ్బ అని వ్యాఖ్యానించాయి. రాష్ట్రంలోని పది నియోజకవర్గాల్లో ఉపఎన్నికలు వస్తాయని, ఆ స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించేందుకు సిద్ధం కావాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తమ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు తీర్పుపై ఓ ప్రకటన ద్వారా హర్షం వ్యక్తం చేసిన కేటీఆర్.. కొందరు ప్రజాప్రతినిధులు అడ్డదారులు తొక్కినంత మాత్రాన ప్రజాస్వామ్య వ్యవస్థ నాశనం కాదని సుప్రీం తీర్పు నిరూపించిందని పేర్కొన్నారు. స్పీకర్ పదవిని అడ్డంపెట్టుకొని కాంగ్రెస్ చేసిన రాజ్యాంగ వ్యతిరేక ఫిరాయింపుల రాజకీయానికి సుప్రీం తీర్పు చెంపదెబ్బ అని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పును గౌరవించి ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్ అనర్హత వేటు విధించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పుతో రానున్న మూడు నెలల్లో 10 నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు వస్తాయని భావిస్తున్నామన్నారు. కాగా, ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తన నిజాయితీని నిరూపించుకోవాలని కేటీఆర్ ఈ సందర్భంగా కోరారు. పార్టీ మారితే ఆటోమేటిక్‌గా అనర్హత వర్తించాలని 'పాంచ్ న్యాయ్' పేరును వల్లించిన రాహుల్ గాంధీ.. రాజ్యాంగ వ్యతిరేక చర్యలను అడ్డుకుని తన చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మరో పార్టీలో చేరితే తప్పుబడుతున్న రాహుల్ గాంధీ.. తెలంగాణలో పార్టీమారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరతారా? అని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. సుప్రీం తీర్పుపై ఎక్స్‌లో హర్షం వ్యక్తం చేసిన హరీశ్.. 52వ రాజ్యాంగ సవరణ ద్వారా దివంగత రాజీవ్ గాంధీ ప్రవేశపెట్టిన ఫిరాయింపుల నిరోధక చట్ట ప్రకారం ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని రాహుల్ గాంధీ ప్రతిపాదించాలని డిమాండ్ చేశారు. కాగా, సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామన్న బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర.. సుప్రీంకోర్టు ఆదేశాలను స్పీకర్ పాటిస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు. సుప్రీం తీర్పు భవిష్యత్తులో పార్టీ ఫిరాయింపులకు అడ్డుకట్టగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఇక, సుప్రీంకోర్టు తీర్పుతోనైనా కాంగ్రెస్ పార్టీ కళ్లు తెరుచుకొని ప్రజాస్వామ్య పద్ధతులు పాటించాలని, ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసి ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. కాగా, ఉప ఎన్నికలు ఎలా వస్తాయి అధ్యక్షా? అంటూ ముఖ్యమంత్రినన్న అధికార మదంతో రేవంత్ రెడ్డి శాసనసభలో చేసిన వ్యాఖ్యలకు విరుద్ధంగా సుప్రీం కోర్టు తీర్పునివ్వడం చెంపపెట్టులాంటిదని అసెంబ్లీలో బీఆర్ఎస్ విప్ కేపీ వివేకానంద పేర్కొన్నారు. ఉప ఎన్నికలు ఎలా వస్తాయో సుప్రీం కోర్టు చెప్పిందని వివేకానంద వ్యాఖ్యానించారు.

**స్పీకర్ నిర్ణయం తీసుకోకుంటే కోర్టు ధిక్కారణే బీఆర్ఎస్ న్యాయవాది మోహిత్ రావు**

న్యూఢిల్లీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఫిరాయింపు ఎమ్మెల్యేలపై మూడు నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోకపోతే అది కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని బీఆర్ఎస్ తరఫున సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన న్యాయవాది మోహిత్ రావు అన్నారు. ఎమ్మెల్యేలు విచారణను ఆలస్యం చేయడాన్ని స్పీకర్ కార్యాలయం అనుమతించకూడదని, ఒకవేళ ఎమ్మెల్యేలు ఆలస్యం చేస్తే తీవ్రంగా పరిగణించాలని కూడా సుప్రీంకోర్టు తెలిపిందని చెప్పారు. గతంలో చాలా కేసుల్లో ఎన్నికలు సమీపించినప్పుడు చర్యలు తీసుకున్న విషయాన్ని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. వాటి ఆధారంగానే ప్రస్తుతం ఈ కేసు విషయంలో ఆపరేషన్ సక్సెస్.. పేషెంట్ డెడ్‌లా ఉండొద్దని సూచనలు ఇచ్చిందన్నారు.

# పదిలంగా అల్లుకున్న 'ఇందిరమ్మ ఇల్లు' మాదీ!

» హనుమకొండ జిల్లా భీమదేవరపల్లిలో గృహప్రవేశం చేసిన దంపతులు

భీమదేవరపల్లి, కోనరావుపేట (ఆంధ్రజ్యోతి): సొంతిల్లు ఓ భరోసా! మనదంటూ ఓ గూడు ఉంటే ఆ నీడన కారం, రొట్టె తిన్నా కూడా తృప్తిగా ఉంటుందని.. రంధి అనేదే ఉండదని గట్టి నమ్మకం! హనుమకొండ జిల్లా భీమదేవరపల్లిలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులైన శ్రుతి-జలంధర్ రెడ్డి దంపతుల్లో ఇప్పుడిదే సంబురం. జలంధర్ చిన్న గుమాస్తా ఉద్యోగం చేస్తున్నారు. ఈ దంపతులకు బాబు, పాప ఉన్నారు. గత మార్చి 6న వీరికి రేవంత్ సర్కారు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసింది. బేస్‌మెంట్ నుంచి స్లాబ్ పోసే దాకా ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఇంటిని నిర్మించుకున్నారు. 440 చదరపు అడుగుల్లో చక్కగా వంటగది, అటాచ్డ్ బాత్‌రూంతో పడకగది, హాల్‌తో ఇంటిని పొందికగా కట్టుకున్నారు. ఇంటి నిర్మాణంలో భాగంగా బేస్‌మెంట్ అయ్యాక రూ. లక్ష, గోడలు నిర్మించాక రూ.లక్ష, స్లాబ్ పూర్తయ్యాక రూ.2 లక్షలు.. ఇలా ఇప్పటి దాకా రూ.4 లక్షల బిల్లులు వచ్చాయని జలంధర్ దంపతులు చెప్పారు. మరో రూ.లక్ష రావాల్సి ఉందన్నారు. బుధవారం బంధువుల సమక్షంలో నూతన గృహ ప్రవేశం చేశారు. నెలక్రితం పరిగి నియోజకవర్గం శివారెడ్డిపల్లిలో కూడా ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం జరిగింది. తాజాగా భీమదేవరపల్లిలో జరిగిన గృహప్రవేశం రెండోది!

### సీఎంపై అభిమానాన్ని చాటుకునేందుకు..

సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులైన దంపతులు నరహరి-లావణ్య బుధవారం ఇంటిగడప కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌లపై అభిమానంతో వారి చిత్రపటాలతో గడప పూజా కార్యక్రమాన్ని జరుపుకొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకం కారణంగా తమ సొంతింటి కల నెరవేరుతోందని ఆ దంపతులు ఆనందం వ్యక్తం చేశారు.



సీఎం రేవంత్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలతో ఇంటిగడప పూజా కార్యక్రమం నిర్వహిస్తున్న నరహరి-లావణ్య దంపతులు

## హైకోర్టు న్యాయమూర్తుల్లో ఓబీసీలు 12.5% మంది

ఎస్సీలు 3, ఎస్టీలు 2.2 శాతం..

2018 నుంచి ఈ ఏడాది జూలై వరకు

743 మంది న్యాయమూర్తుల నియామకం

తెలంగాణలో 16, ఏపీలో 9 ఖాళీలు: కేంద్రం

న్యూఢిల్లీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా వివిధ హైకోర్టుల్లో 2018 నుంచి ఈ ఏడాది జూలై వరకు న్యాయమూర్తులుగా నియమితులైన 743 మందిలో 93 మంది ఓబీసీలు (12.5 శాతం), 23 మంది ఎస్సీలు (3 శాతం), 17 మంది ఎస్టీలు (2.2 శాతం) ఉన్నారని కేంద్రం తెలిపింది. అలాగే 105 మంది (14 శాతం) మహిళా న్యాయమూర్తులు ఉన్నారని వెల్లడించింది. గురువారం రాజ్యసభలో ఓబీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఉన్నత న్యాయవ్యవస్థలో ప్రాతినిధ్యంపై టీడీపీ ఎంపీ బీద మస్తాన్‌రావు అడిగిన ప్రశ్నకు కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్‌మేఘ్వాల్ ఈ మేరకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. ఆలిండియా జ్యుడిషియల్ సర్వీస్ (ఏఐజేఎస్)ను ప్రవేశపెట్టే విషయమై రాష్ట్రాలు, హైకోర్టుల మధ్య విభేదాలున్న కారణంగా ఇప్పటివరకు ఏ నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. ఇక తెలంగాణ హైకోర్టులో 16 న్యాయమూర్తుల పదవులు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో 9 న్యాయమూర్తుల పదవులు ఖాళీగా ఉన్నాయని మరో సభ్యుడు వివేక్ కే ఠంకా అడిగిన ప్రశ్నకు అర్జున్ రామ్‌మేఘ్వాల్ బదులిచ్చారు. దేశవ్యాప్తంగా 25 హైకోర్టుల్లో 1,122 జడ్జి పదవులకు గానూ 362 ఖాళీలు ఉన్నాయని, 760 మంది న్యాయమూర్తులు పనిచేస్తున్నారని వివరించారు. జిల్లా కోర్టులకు సంబంధించి తెలంగాణలో 115, ఏపీలో 65 న్యాయధికారుల ఖాళీలు ఉన్నాయని చెప్పారు.

## బసవతారకం ఆస్పత్రి విస్తరణకు సహకరించండి

కేంద్ర మంత్రులకు నందమూరి బాలకృష్ణ విన్నపం

టీడీపీ ఎంపీలతో కలిసి స్పీకర్ ఓంబిర్లాతో భేటీ

న్యూఢిల్లీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల ద్వారా బసవతారకం ఆస్పత్రిని విస్తరించేందుకు మద్దతు అందించాలని పలువురు కేంద్ర మంత్రులకు ప్రముఖ సినీనటుడు, టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ విజ్ఞప్తి చేశారు. గురువారం పార్లమెంటులో టీడీపీ ఎంపీలతో కలిసి ఆయన కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, జేపీ నడ్డా, మనోహర్‌లాల్ ఖట్టర్, హర్దీప్‌సింగ్ పూరి, మన్‌సుఖ్ మాండవీయతో వేర్వేరుగా భేటీ అయ్యారు. ఈ సమావేశాల్లో సీఎస్ఆర్ నిధుల ద్వారా బసవతారకం ఆస్పత్రి విస్తరణకు మద్దతు కోరారు. తన అసెంబ్లీ నియోజకవర్గం హిందూపురంలో ఈఎస్ఐ ఆస్పత్రిని స్థాపించాలని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయకు బాలకృష్ణ విన్నవించారు. కాగా, అంతకుముందు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పార్టీ ఎంపీలతో కలిసి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో బాలకృష్ణ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి ద్వారా పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు అందిస్తున్న సేవల గురించి తెలియజేశారు.

## ప్రమాణ స్వీకారం చేసిన హైకోర్టు అదనపు జడ్జీలు

హైదరాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నూతనంగా నియామకమైన నలుగురు హైకోర్టు అదనపు న్యాయమూర్తులు- జస్టిస్ జీఎం మొహియుద్దీన్, జస్టిస్ చలపతిరావు, జస్టిస్ రామకృష్ణారెడ్డి, జస్టిస్ గాడి ప్రవీణ్‌కుమార్ గురువారం ప్రమాణస్వీకారం చేశారు. మొదటి కోర్టు హాల్‌లో జరిగిన ఫుల్ కోర్టు సమావేశంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏకే సింగ్ వారితో ప్రమాణం చేయించారు. అంతకుముందు రిజిస్ట్రార్ జనరల్ గోవర్ధన్‌రెడ్డి రాష్ట్రపతి కార్యాలయం జారీచేసిన నియామక ఉత్తర్వులను చదివి వినిపించారు. అనంతరం నూతన జడ్జీలు ఆయా డివిజన్ బెంచ్‌లలో కేసులను విచారణకు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, నూతన న్యాయమూర్తుల కుటుంబ సభ్యులు, ఏజీ సుదర్శన్‌రెడ్డి, ఏఏజీలు ఇమ్రాన్‌ఖాన్, రజనీకాంత్‌రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు, బార్ అధ్యక్షుడు జగన్, బార్ కౌన్సిల్ ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ నర్సింహారెడ్డి, సునీల్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

## యూఎస్ కాన్సులేట్‌లో నిరీక్షణ ప్రాంగణం

హైదరాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులర్ జనరల్ కార్యాలయంలో సందర్శకుల కోసం కొత్తగా రూ.1.5 కోట్లతో టీఎస్ఐఐసీ ఏర్పాటు చేసిన నిరీక్షణ ప్రాంగణాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నీఫర్ లార్సన్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. యూఎస్ కాన్సులేట్‌కు ప్రతి రోజూ 3వేల మందికిపైగా సందర్శకులు వస్తుంటారని, వేచి ఉండేందుకు సరైన సౌకర్యాలు లేక వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తమ దృష్టికొచ్చిందని తెలిపారు. సందర్శకుల అవసరాలకనుగుణంగా ఆధునిక వసతులతో నిరీక్షణ ప్రాంగణాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వం వేసే ప్రతి అడుగు తెలంగాణ ప్రజల కోసమేనని శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు.

## గ్రీన్ ఫార్మా సిటీ భూముల సర్వే

» పట్టా భూముల జోలికి రావద్దని అధికారులతో రైతుల వాదన

» పరిహారం ఇచ్చిన భూములే సర్వే చేస్తున్నామన్న ఆర్డీవో

యాచారం, జూలై 31(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ గ్రీన్ ఫార్మా సిటీ కోసం గతంలో ప్రభుత్వం సేకరించిన భూములను గురువారం టీజీఐఐసీ, రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. దీన్ని అడ్డుకునేందుకు కొంతమంది రైతులు అధికారులతో వాదనకు దిగడంతో రంగారెడ్డి జిల్లా మేడిపల్లిలో ఉద్రిక్త పరిస్థితి తలెత్తింది. గ్రీన్ ఫార్మా సిటీ కోసం ప్రభుత్వం మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద రెవెన్యూ గ్రామాల్లో ఇప్పటి వరకు 11,000 ఎకరాల పట్టా, అస్సైన్డ్ భూములను సేకరించింది. వీటికి సంబంధించి రైతులకు పరిహారంతో పాటు ఇళ్ల ప్లాట్లు కూడా కేటాయించింది. ఈ భూములు ఏ సర్వే నంబర్లలో ఎంతమేరకు ఉన్నాయో తెలుసుకునేందుకు సర్వే చేపట్టారు. అయితే కొందరు రైతులు తమ పట్టాభూములు, కోర్టు వివాదంలో ఉన్న భూములను సర్వే చేస్తున్నారని భావించి అధికారులతో వాగ్వాదానికి దిగారు. అధికారులు, పోలీసులు వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వారు ముందు వినిపించుకోలేదు. ఎన్నికల ముందు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తమకు ఇచ్చిన మాట నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. పరిహారంతో పాటు ప్లాట్లు ఇచ్చిన భూములను మాత్రమే సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తున్నామని, కోర్టు వివాదంలో ఉన్న భూములను, పట్టా భూములను ఎట్టి పరిస్థితుల్లో సర్వే చేయబోమని ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి స్పష్టం చేయడంతో రైతులు ఆందోళన విరమించారు.

## 'సిగాచీ' పేలుడు ఘటనపై సమగ్ర వివరాలివ్వండి

» ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదు?: హైకోర్టు

హైదరాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సిగాచీ పరిశ్రమ పేలుడు ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు, ఇప్పటివరకు తీసుకున్న చర్యలతో సమగ్రమైన కౌంటర్ దాఖలు చేయాలని చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి గురువారం హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. ఈ ప్రమాదంపై దర్యాప్తు చురుగ్గా సాగడం లేదని, బాధిత కుటుంబాలకు పరిహారం అందించడంలో జాప్యం చోటుచేసుకుంటోందని పేర్కొంటూ విశ్రాంత శాస్త్రవేత్త కే బాబూరావు దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై ఈ ఆదేశాలు ఇచ్చింది. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ గౌస్ మొహియుద్దీన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది వసుధా నాగరాజ్ వాదనలు వినిపిస్తూ బాధిత కార్మికుల్లో ఎక్కువశాతం కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న వలస కార్మికులని, ఇంకా పూర్తిగా పరిహారం చెల్లించలేదని తెలిపారు. స్పందించిన ధర్మాసనం.. పేలుడు ఘటనపై ఏయే సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు? దర్యాప్తు ఎక్కడి వరకు వచ్చింది? ఇప్పటివరకు ఏమైనా అరెస్టులు చేశారా? అని ప్రశ్నించింది. హోంశాఖ తరఫున ప్రభుత్వ న్యాయవాది సమాధానం ఇస్తూ ఇప్పటివరకు ఎలాంటి అరెస్టులు చేయలేదని పేర్కొన్నారు. హైలెవల్ కమిటీ, నిపుణుల కమిటీ నివేదికల కోసం ఎదురుచూస్తున్నామని నివేదించారు. ఈ సమాధానంపై అసహనం వ్యక్తం చేసిన ధర్మాసనం.. పోలీసుల దర్యాప్తునకు కమిటీల నివేదికలకు సంబంధం ఉందా అని ప్రశ్నించింది. ప్రస్తుత పిటిషన్‌ను ప్రభుత్వానికి వ్యతిరేకంగా దాఖలైన వ్యాజ్యంగా భావించరాదని స్పష్టంచేసింది.

## సైబర్ ఆర్థిక మోసాల ముఠా గుట్టు రట్టు

» మంచిర్యాల జిల్లా జన్నారంలో నలుగురి అరెస్టు

హైదరాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అమాయకులను మభ్యపెట్టి సైబర్ ఆర్థిక మోసాలకు పాల్పడిన ముఠా గుట్టు రట్టయింది. మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలో నిర్వహిస్తున్న అక్రమ సిమ్ బాక్స్ సెటప్‌ను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) టెలీ కమ్యూనికేషన్ విభాగం(డాట్), రామగుండం పోలీసులు సంయుక్తంగా ఛేదించాయి. ఈ కేసులో నలుగురిని అరెస్టు చేసిన పోలీసులు.. ఈ ఆపరేషన్‌లో 5 సిమ్ బాక్స్ పరికరాలు, 230కి పైగా సిమ్ కార్డులు, ల్యాప్‌టాప్, ఇతర హార్డ్‌వేర్ స్వాధీనం చేసుకున్నారు. ఈ మోసాలకు ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న పొలవల్లుల సాయి కృష్ణ (జాక్) పరారీలో ఉన్నాడని పోలీసు వర్గాలు తెలిపాయి. స్వాధీనం చేసుకున్న సిమ్‌బాక్స్‌లు కంబోడియా, మయన్మార్ దేశాల నుంచి రిమోట్‌గా నియంత్రిస్తున్నారని అధికారులు అనుమానిస్తున్నారు.

## ఓబీసీల్లో మరో 40 కులాలను చేర్చాలి: నిరంజన్

కేంద్ర ఓబీసీ జాబితాలో మరో 40 కులాలను చేర్చాలని తెలంగాణ బీసీ కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్ కోరారు. ఈ మేరకు కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రి వీరేంద్ర కుమార్‌కు ఆయన లేఖ రాశారు. తెలంగాణకు సంబంధించిన కేంద్ర ఓబీసీ జాబితాను 2016లో ప్రకటించారు. అయితే అప్పటికే రాష్ట్ర బీసీ జాబితాలో 112 కులాలుండగా, కేంద్రం కేవలం 90 కులాలతోనే జాబితా విడుదల చేసింది. ఇటు రాష్ట్ర జాబితాలో అనాథలను, మరో 17 కులాలనూ చేర్చడంతో బీసీ జాబితాలో కులాల సంఖ్య 130కి పెరిగింది. దీంతో కేంద్ర జాబితాలో చేర్చాల్సిన కులాల సంఖ్య 40కి చేరింది. ఇప్పటికైనా సదరు 40 కులాలను వెంటనే ఓబీసీ జాబితాలో చేర్చాలి' అని విన్నవించారు.

# ఊపిరి తీస్తున్న పొగాకు

ధూమపానంతో పెరుగుతున్న ఊపిరితిత్తుల క్యాన్సర్లు.. 90 శాతం లంగ్ క్యాన్సర్ కేసులకు కారణం అదే

» నేడు అంతర్జాతీయ లంగ్ క్యాన్సర్ డే

హైదరాబాద్ సిటీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా ఏటా నమోదవుతున్న క్యాన్సర్ మరణాల్లో అత్యధికం ఏ క్యాన్సర్ వల్లనో తెలుసా?.. ఊపిరితిత్తుల క్యాన్సర్‌వల్లేనని ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాలు చెబుతున్నాయి! అందుకే ఏటా ఆగస్టు 1వ తేదీని.. ఊపిరితిత్తుల క్యాన్సర్‌పై అవగాహన కలిగించే రోజుగా నిర్వహిస్తున్నారు. ఊపిరితిత్తుల క్యాన్సర్ రావడానికి ప్రధాన కారణం.. పొగాకు ఉత్పత్తులే. ధూమపానానికి, పొగాకు ఉత్పత్తులకు బానిసలవుతున్న యువత సంఖ్య భారీగా పెరుగుతుండడంతో ఏటా లంగ్ క్యాన్సర్ కేసుల సంఖ్య కూడా అదే స్థాయిలో పెరుగుతోంది. తెలుగు రాష్ట్రాల్లో క్యాన్సర్ చికిత్సకు సంబంధించిన ప్రముఖ ఆస్పత్రి ఎంఎన్‌జే క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో గత ఏడాది 16 వేల క్యాన్సర్ కేసులు నమోదు కాగా.. అందులో 1000కి పైగా కేసులు లంగ్ క్యాన్సర్‌వే. బాధితుల్లో చాలా మంది (దాదాపు 90% మంది) క్యాన్సర్ బాగా ముదిరి.. నాలుగో దశలో ఉన్నప్పుడు వస్తుండడం వల్ల వారిని కాపాడడం కష్టమవుతోంది. మిగతా 10 శాతం మంది కూడా క్యాన్సర్ మూడో దశలో ఉన్నప్పుడు వస్తున్నారని వైద్యులు చెబుతున్నారు. ధూమపానం కారణంగా దాని బారిన పడినవారు దాదాపు 90% మంది దాకా ఉంటున్నారు. పొగతాగకపోయినా.. జన్యుపరమైన, పర్యావరణ కారణాలతో కొందరు ఆ మహమ్మారి బారిన పడుతున్నట్టు వైద్యులు తెలిపారు. నిత్యం వాహన కాలుష్యానికి గురవుతూ.. రసాయనిక పరిశ్రమల నుంచి వచ్చే పొగను పీల్చే వారిలో కూడా ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే ముప్పుందని హెచ్చరించారు. లంగ్ క్యాన్సర్ బాధితుల్లో పురుషులు 80 శాతం మంది ఉంటుండగా.. మహిళలు 20 శాతం మంది ఉంటున్నారు. కాగా.. పొగతాగడం మానేసిన తర్వాత శరీరం మళ్లీ సాధారణ స్థితికి రావడానికి దాదాపు 20 సంవత్సరాలు పడుతుందని ఎంఎన్‌జే డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు.




### వారికీ ముప్పే..

ఒక వ్యక్తి ధూమపానానికి బానిసైతే.. ఆ వ్యసనం ఆ వ్యక్తికే కాక, చుట్టుపక్కలున్నవారికి కూడా ప్రమాదకరంగా పరిణమిస్తుంది. సిగరెట్/చుట్ట వంటివి తాగేవారి పక్కనే ఉన్నవారి ఊపిరితితుల్లోకి కూడా ఆ పొగ వెళ్లి (ప్యాసివ్ స్మోకింగ్) వారు కూడా లంగ్ క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉంది. సుదీర్ఘకాలం పాటు ఇలా సెకండ్‌హ్యాండ్/ప్యాసివ్ స్మోకింగ్‌కు గురయ్యేవారిలో 20% నుంచి 30% మంది లంగ్ క్యాన్సర్ బారిన పడుతున్నట్టు వైద్యులు చెబుతున్నారు. ఊపిరితిత్తుల క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించగలిగితే మరణాన్ని నివారించడానికి అవకాశం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. కానీ.. చాలామంది బాధితులు క్యాన్సర్ లక్షణాలను పట్టించుకోకుండా ఆలస్యం చేసి ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారని ఆవేదన వెలిబుచ్చుతున్నారు. ఎడతెగని దగ్గు, ఎలాంటి ప్రయత్నం లేకుండా బరువు తగ్గిపోవడం, విపరీతమైన అలసట వంటి లక్షణాలు ఉన్నప్పుడు.. వైద్యులను సంప్రదించాలని.. కంప్యూటరైజ్డ్ టోమోగ్రఫీ(సీటీ) స్కాన్, బయాప్సీ వంటివాటి ద్వారా ఊపిరి తిత్తుల క్యాన్సర్లను ముందే గుర్తించవచ్చని సూచిస్తున్నారు.

### స్మోకింగ్ మానేసిన 20 నిమిషాల నుంచే..

సిగరెట్ మానేసిన కొద్ది సేపట్నుంచే శరీరం బాగు చేసుకోవడం మొదలుపెడుతుంది.

**20 నిమిషాల్లో:** హృదయ స్పందన వేగం సాధారణ స్థితికి రావడం మొదలవుతుంది. బీపీ తగ్గుతుంది. రక్తప్రసరణ మెరుగవుతుంది.

**8 గంటల్లో:** రక్తంలో ఆక్సిజన్ సాధారణ స్థితికి చేరి.. కార్బన్‌మోనాక్సైడ్ స్థాయులు తగ్గుతాయి.

**48 గంటల్లో:** వాసన, రుచి గ్రహించే సామర్థ్యం మెరుగవుతుంది. శరీరంలో అప్పటిదాకా పేరుకుపోయిన నికోటిన్ బయటకు వెళ్లిపోతుంది.

**72 గంటల్లో:** శ్వాస పీలుస్తున్నప్పుడు హాయిగా ఉంటుంది. ఊపిరితిత్తుల సామర్థ్యం కొంచెం మెరుగుపడుతుంది.

**2-12 వారాల్లో:** రక్త ప్రసరణ గణనీయంగా మెరుగుపడుతుంది. నడిచేటప్పుడు, వ్యాయామం చేసే సమయంలో శ్వాస సమస్యలు రావు.

**3-9 నెలల్లో:** దగ్గు సమస్య తగ్గుతుంది. ఊపిరి బాగా పీల్చుకోగలుగుతాం. ఊపిరితిత్తుల్లో పేరుకుపోయిన కఫం బయటకు వచ్చేస్తుంది.

**ఏడాదికి:** పొగతాగేవారితో పోలిస్తే.. గుండెపోటు ముప్పు సగానికి తగ్గిపోతుంది.

**ఐదేళ్లకు:** స్ట్రోక్ ప్రమాదం.. ధూమపానం చేయనివారితో సమాన స్థాయికి చేరుతుంది.

**పదేళ్లకు:** ఊపిరితిత్తుల క్యాన్సర్ బారిన పడే ముప్పు 50% తగ్గిపోతుంది. ఇతర క్యాన్సర్ల బారిన పడే ముప్పు కూడా గణనీయంగా తగ్గుతుంది.

**పదిహేనేళ్లు:** గుండెజబ్బులు, గుండెపోటు బారిన పడే ముప్పు.. ఎప్పుడూ ధూమపానం చేయనివారితో సమానం అవుతుంది.



విద్యార్థినిని వెనుక కూర్చోబెట్టుకుని సైకిల్ తొక్కుతున్న పొంగులేటి

## విద్య వైద్యానికి పెద్దపీట

గురుకుల విద్యార్థులకు నాణ్యమైన భోజనం: మంత్రి పొంగులేటి

ఖమ్మం జిల్లా కూసుమంచిలో జూనియర్ కళాశాల శంకుస్థాపన

కూసుమంచి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తమ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా కూసుమంచిలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి రూ.5.50 కోట్ల ఖర్చుతో నిర్మించ తలపెట్టిన జూనియర్ కళాశాల పనులకు శంకుస్థాపన చేశారు. పొంగులేటి స్వరాజ్యం, రామచంద్రయ్య ట్రస్టు ఆధ్వర్యంలో హైస్కూల్ విద్యనభ్యసిస్తున్న 80 మంది విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సభలో పొంగులేటి మాట్లాడుతూ.. గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్ చార్జీలు పెంచినట్లు తెలిపారు. పిల్లల్లో నైపుణ్యం పెంపుదలకు స్కిల్ యూనివర్సిటీ నిర్మిస్తున్నట్లు తెలిపారు. విద్యారంగంలో వెనకబడిన పాలేరు నియోజకవర్గాన్ని విద్య పట్ల అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. గత 20 నెలల్లోనే రూ.470 కోట్లు మంజూరు చేశామని, వాటిలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా గురుకులం, రూ.208 కోట్లతో జేఎన్‌టీయూ కళాశాల, రూ.5.5 కోట్లతో జూనియర్ కళాశాల, తిరుమలాయపాలెంలో రూ.2.70కోట్లతో హాస్టల్ మంజూరు చేశామని ఆయన చెప్పారు. ప్రభుత్వానికి ఆర్థికంగా ఇబ్బందులున్నా పేదపిల్లలను ఆణిముత్యాలుగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో కంప్యూటర్ ట్రైనింగ్ ట్యూటర్ల నియామకానికి రూ.3లక్షలు మంజూరు చేశారు. విద్యార్థినులు విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశంతోనే తమ ట్రస్టు ద్వారా సైకిళ్లు అందజేసి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ప్రతియేటా సైకిళ్లు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చిన పొంగులేటి.. ఒక విద్యార్థిని వెనుక కూర్చోబెట్టుకుని సైకిల్ తొక్కి అందరినీ అలరించారు.

## దేవాదాయ శాఖలో ఖాళీల భర్తీకి ఓకే

» 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

హైదరాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ శాఖలో ఏళ్లుగా ఖాళీగా ఉన్న పదవుల భర్తీకి లైన్ క్లియర్ అయింది. ఉన్నతస్థాయిలో కీలకమైన రీజినల్ జాయింట్ కమిషనర్ (ఆర్జేసీ) పోస్టులు రాష్ట్రంలో నాలుగు ఉండగా.. రాష్ట్ర విభజన నుంచి మూడు ఖాళీగా ఉన్నాయి. అలాగే అన్ని స్థాయిల్లోనూ ఏళ్లుగా పదోన్నతుల్లేవు. దీనిపై 'ఆ ఆర్జేసీ పోస్టులెక్కడ?' శీర్షికతో గురువారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై దేవాదాయశాఖ కమిషనర్ వెంకటరావు స్పందించారు. గురువారం ఉన్నతాధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఏళ్లుగా భర్తీకి నోచుకోని ఉన్నతస్థాయి పోస్టుల భర్తీతోపాటు ఇతర స్థాయిల్లోనూ పదోన్నతులు వెంటనే చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. అలాగే వివిధ స్థాయిల్లో ఖాళీగా ఉన్న పదవులు, పదోన్నతులపై చర్చించారు. సాధ్యమైనంత త్వరలో పూర్తి వివరాలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. పదోన్నతుల ప్రక్రియ యుద్ధ ప్రాతిపదికన నిర్వహించాలన్నారు. ఖాళీలు, పదోన్నతులపై త్వరలో ఉద్యోగ సంఘాలతో సమావేశం నిర్వహిస్తామని, పాలన అంశాల్లో అనుభవం కలిగిన రిటైర్డ్ ఉద్యోగులనూ నియమించుకుంటామని వెంకటరావు పేర్కొన్నారు.



*Printed and Published by* **Koganti Venkata Seshagiri Rao** *on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor:* **N.Rahul Kumar.** *Ph. No. (0870) 2100480/84,*
*RNI No:APTEL/2003/9741,* **Managing Director : Vemuri Radha Krishna** *Founder: K.L.N.Prasad.*